87 8+

బి. రామరాజు

2-1-1965

20849

Prof. B. Rama Raju (Rtrd
H. No. 1-8-117/2, Chikkadpally
HYDERABAD - 500 020.

30

20849

మీమాంసాన్యాయదీపము
మహోపన్యాసగ్రంథమాల

ద్వితీయ భాగము

Prof. B. Rama Raju (Rtrd
H. No. 1-8-117/2, Chikkadpally.
HYDERABAD - 500 020.

గ్రంథకర్త:

ఘనా. శే. కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు, ఎం. ఏ.

Revised & Edited by

Dr. NELATURI VENKATARAMANAIAH
(One time Reader in History, University of Madras)

ది.బ్రహ్మశ్రీ పాలపర్తి వెంకటరామయ్య గారి,
జ్ఞాపకార్థం.....
వారి.....

ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ.

ఆదర్శప్రచురణ :
పునర్ముద్రణ
వేయి ప్రతులు
జనవరి, 1964

వెల : రూ. 3-00

ముద్రణ :
గాయత్రీ ప్రెస్,
విజయవాడ.

మహమ్మదీయ మహాయుగము

రెండవ భాగము

విదవప్రకరణము – మోగల్ ప్రభుత్వం

	పేజి
బాబర్	1
బాబర్ స్వభావము	2
హుమాయూన్	3
సూర్‌వంశము	5
రెండవ పానిపత్‌యుద్ధము	6
హుమాయూన్‌యొక్క గుణదోషములు	7
అక్బర్ పూర్వచరిత్ర – రాజ్యారోహణము	8
సూర్‌వంశపు శత్రువుల నోడించుట	9
తన సరదారుల తిరుబాటుల నణచుట	11
అక్బరుచేఁ జయింపఁబడిన రాజ్యములు	13
రాణి దుర్గావతి	15
చరమకాలమందలి విపత్తులు	26
రాజ్య వ్యవస్థ	28
జమాబంది	30
రాజ్యవిభాగములు	31
సైన్య వ్యవస్థ	32
న్యాయవిచారణ, లెక్కలు, జాగరూకత	33
సంస్కరణములు, అక్బరుయొక్క ధర్మమతము	35
మతముల స్థితి	36
మత వివాద సభలు	38
నూతన మత స్థాపన	39
అక్బర్ గుణావగుణములు	41
కొన్ని దుర్గుణములు	43
నౌరోజా ఉర్స్	44

దినచర్య, చిత్రకళాభిరుచి 45
విద్యాభిరుచి, శరీరసామర్థ్యము 46
వైభవము, కొద్దిలో స్వభావవర్ణన 47
మోగల్ రాజ్యమును స్థిరపరచుట 48
అప్పటి యూరోప్ ఖండము 49
అప్పటి జనులసీతి, హిందూజనుల కున్నతోద్యోగములు 50
జహంగీర్ బాదుషాహ 54
జహంగీర్ యొక్క కొమాళ్ళు 54
నూర్‌జహాన్ 55
రాజపుత్రులతో యుద్ధము, అహమ్మద్‌నగరమును గెలుచుట 56
అంతఃకలహములు 57
జహంగీర్ రాజ్యవ్యవస్థ 58
ఇంగ్లీషు రాయబారులు 59
షాహజహాన్ బాదుషాహ, రాజ్యారోహణము 60
ఖాన్‌జహాన్ లోదీ తిరుగుబడుట, దక్షిణరాజ్యముల మీదికి దాడి 61
కందహార్ 63
ఒల్ల్కప్రదేశము, పోర్చుగీజువారిని నణగద్రొక్కుట 64
ముంతాజ్ మహల్ 65
షాహజహాన్ సంతానము 65
గోలకొండ మీదికి దండువెడలుట 68
అన్నదమ్ముల కలహములు, షాహజహాన్ యోగ్యత 68
మందిరములు, తాజ్ మహల్ 70
మయూరాసనము 71
ఔరంగజేబ్, ప్రభుత్వవిభాగము 71
రాజ్యారోహణము 72
పారసీకరాజు నిగ్రహము 73
హిందువులతో వైరము 74
రాజపుత్రులతో యుద్ధము 75
ఛత్రసాల్ రాజుతో యుద్ధము 77

ఆఱవ ప్రకరణము

రాజపుత్రుల శౌర్యాగ్ని

ఉదేపూర్ సిసోదియావంశము 105
బాప్పారావల్ 106
ఖుమాన్ 108
సమరసింహుడు, కరుణదేవి 108
రహూప్ 110
ఏక్ష్మణసింహుడు 110
హమీర్ 114
ఖేతసింగ్, లాఖారాణా 118
మోకల్ రాణా 119
కుంభరాణా 120
రాయమల్లుడు 121
సంగరాణా 122
రత్నసింహుడు, విక్రమాజితుడు 125
బనబీర్, ఉదయసింహుడు 127
ప్రతాపసింహుడు 130
అభయసింగ్ 139
కర్ణుడు 146
జగత్‌సింగ్ 148
రాజసింహుడు 149
జయసింహుడు 159
అమరసింహుడు 159
సంగ్రామసింహుడు, జగత్‌సింగ్ 160
ప్రతాపసింహుని మొదలు హమీరుని వఱకు 161

మహారాష్ట్రులతో యుద్ధము	80
దక్షిణ దిగ్విజయయాత్ర	81
ఔరంగజేబ్ యోగ్యత	82
అతని యాదాయము, బహదూర్‌షాహా	83
శిఖ్ఖు లోకులతో జగడములు	84
జహందర్ షాహ	86
ఫరుక్‌సియర్	86
మహమద్ షాహ	87
దక్షిణ హైద్రాబాదు	87
నాదిర్‌షాహాయొక్క దాడి	89
అహమద్ షాహ	90
రాజ్యము తుత్తునకలగుట	90
రెండవ అలంగీర్	91
షాహ అలమ్	92
వంశావసానము, సింహావలోకనము	93
ప్రభుత్వము, ప్రజాసౌఖ్యము	94
[illegible]ప్పటి బాటలు	96
[illegible]అంచెలు, వర్తకము	97
జనుల నీతి, భక్తి ప్రధానమతముల యభివృద్ధి	98
రామానందుడు, కబీర్, చైతన్యుడు	99
వల్లభస్వామి	100
నానక్, సంస్కృత వాఙ్మయము	101
దేశభాషల యభివృద్ధి	104

ఐదవ ప్రకరణము

మొగల్ ప్రభుత్వము

బాబర్

(1526 - 1530)

ఈతని సంపూర్ణనామము జహీరుద్దీన్ మహమ్మద్ బాబర్. ఈ తఁడు తయమూర్ లంగ్ వద్దనుండి యాఱవ పురుషుఁడు. 1482లో నీ తఁడు జన్మించెను. పండ్రెండు సంవత్సరములవాఁ డైనప్పు డీతని తండ్రి పరలోక గతుఁడైనందున జ్ఞాతులందఱును రాజ్య మపహరించి యీతనిని వెడలఁగొట్టిరి. కొన్నిదినములరణ్యములోఁ గడపి స్వదేశము విడిచి యీతఁడు ఆఫ్గానిస్థానమునకుఁ బోయెను. అచ్చట సైన్యములను గూర్చుకొని కాబూల్ రాజ్యమును సంపాదించెను.

ఆ రాజ్యపు సీమ హిందూదేశము నంటియుండెను. దిల్లీ బాదుషాల యొక్క పౌరుషహీనతను విని మధ్యాసియాలోఁ బోయిన రాజ్యమునకు బదులు హిందూరాజ్యమును సంపాదింపవలయు నని యీతఁడు హిందూ దేశము మీఁదికి రెండుసారులు దండెత్తి వచ్చెను. కాని పరాజితుఁడై తిరిగి వెళ్ళెను. ఎన్ని విఘ్నములు వచ్చినను ధైర్యము విడువక మరల మరల యత్నించుట మోగలుల స్వభావమైనందున బాబర్ 1526 లో హిందూదేశమునకు వచ్చి పానిపత్ రణక్షేత్రములో ఇబ్రాహీంలోదీనిఁ జంపి డిల్లీ సింహాసనము నెక్కెనని యివివరకే వ్రాసియున్నాము.

ఇట్లు దిల్లీపట్టణమును స్వాధీనముచేసికొని బాబర్ రాజపుత్రుల జయించుటకు వెడలెను. అప్పుడు రాజపుత్రస్థానములోని మేవాడ్ రాజ్య మునకు సంగరాణా యధిపతి యైయుండెను. అతఁడు శూరాగ్రేసరుఁడు. మోసములేనిది యీతనిని జయించుట యసంభవమని తలఁచి రాజపుత్ర

సైన్యములో భేదము కల్పించి బాబర్ 1527 లో సంగరాణాను సిక్రీ యుద్ధములో నోడించెను. ఈ సమాచారమంతయు నాటివ ప్రకరణములో వివరముగా వర్ణింపఁబడినది. బాబర్ 1628 లో బుందేల్ ఖండములోని చెందేరిదుర్గమును స్వాధీనము చేసికొనెను. తరువాత నీతఁడు బహార్ ప్రాంతము నాక్రమించుకొనియె. 1530 లో నీతఁడాగ్రా పట్టణములో సమాధిస్థుఁడయ్యెను.

బాబర్ స్వభావము

ఈతఁడు నాలుగైదు సంవత్సరములే రాజ్యముచేసెను. అయినను చరిత్రకారు లీతనిని గొప్పరాజుగా నెంచుచున్నారు. ఈతఁడు చిన్న తనమునందు ననేక సంకటముల ననుభవించి స్వపరాక్రమముచేతనే రాజయ్యెను. అద్భుత రణశూరుఁడనియు, నుత్తమసేనానియనియు నీతఁడు ఖ్యాతిఁచెందెను. ఈతని సైన్యములోని కట్టుదిట్టములు బహు ప్రశంసనీయములు. దాడి వెడలినప్పు డీతఁడు సామాన్యభటునివలె నన్నిపను లును జేయును. ఇతఁడు విద్యాప్రియుఁడు. చక్కఁగఁ గవిత్వముఁ జెప్పును. విద్వాంసులను, రసికులను, కవులను, చిత్రకారులను బిలిపించి గౌరవించును. ఇతఁడు తనయాత్మ చరిత్రను తురుష్కభాషలో వ్రాసియుంచెను. అందువలనఁ జరిత్రాంశములు కొన్ని తెలియును. బాబర్‌కు మొదట మద్యపాన వ్యసనము కలదు. కాని సిక్రీయుద్ధములో సంగరాణాను గెలిచినయెడల మద్యమును ముట్టనని దేవునికి నీతఁడు మ్రొక్కి, విజయుఁడై యప్పటినుండి త్రాగుట మానెను. ఇతనితల్లి మిక్కిలి తెలివికలది. ఆమె తల్లియుఁ బ్రతిభాశాలినిగా నుండెను. వీరిద్దఱియాజ్ఞలో బాబరెప్పుడును మెలఁగుచుండెను. మరణసమయమున నీతని రాజ్యము పశ్చిమమున మధ్యాసియాలోని ఆమూనది మొదలు తూర్పున ఆసాముపటకుఁ బ్రసరించి యుండెను. ఇతని కోర్కె ననుసరించి యితని దేహమును కాబూల్ పట్టణమునకుఁ దీసికొనిపోయి పాఁతివేసిరి.

హుమాయూన్

(1530 - 1540)

బాబరునకు నలుగురుపుత్రు లుండిరి. హుమాయూన్, కామరాన్, హిందాల్, మీర్జా, అని వారిపేళ్ళు. బాబరునకు వారియందటి మీఁద సమాన ప్రీతికలదు. మరణ సమయమున నాతఁడు తన పెద్ద కుమారుఁడగు హుమాయూనును బిలిచి "నీవు రాజువైన తరువాత నీ తమ్ములను ప్రీతితోఁజూడు"మని చెప్పెను. హుమాయూన్ రాజ్యమునకు వచ్చిన తరువాతఁ దండ్రి యాజ్ఞ ననుసరించి తమ్ములను ప్రేమతోఁ జూచుచుండెను. కామరాన్ అనువానికిఁ గాబూల్, పంజాబ్ దేశముల నిచ్చెను. మిగిలిన యిద్దటి తమ్ములకుఁ గూడఁ గొన్ని దేశముల యధికారమిచ్చెను. హుమాయూన్ సుస్వభావమును, బంధు ప్రీతియుఁ గలవాఁడు. కాని రాజుల కుండవలసిన సాహస స్థిరబుద్ధి లాతనికి లేనందున నాతఁడు రాజ్యముఁ గోలుపోవలసినవాఁ డాయెను.

మొదట హుమాయూన్ బుందేల్ ఖండముమీఁదికి దండెత్తిపోయి కలింజర్ దుర్గమును నాక్రమించుకొనియె. మోగలుల ప్రభుత్వ మింకను ఉత్తరహిందూదేశ మంతటను వ్యాపించినదికాదు. లోదీ వంశజులగు కొందఱు ప్రాఁత ఆఫ్గాన్ సర్దారులు మోగలులకు లోఁబడక మరల తమ రాజ్యమును స్థాపించుటకు యత్నించుచుండిరి. అందు షేర్ఖానుఁ డొకఁడు. వాఁడు సూరవంశజుఁడు. వాఁడు కాశీయొద్ద చునార్గడ మను కోటను స్వాధీనము చేసికొని తిరుగఁబడెను. వానిని హుమాయూన్ యుద్ధములో నోడించెను. కాని దయతలఁచి యపరాధము లక్షమించి వాని యధికారము వానికి మరల నొసంగెను. 1534 లో హుమాయూన్ గుజరాత్ దేశముమీఁదికి యుద్ధమునకుఁబోయి యచ్చటి బహాదుర్షహా యను సుల్తానునిఁ బరాభవించి పెక్కు కోటలను, పట్టణములను ఆక్రమించుకొనియెను.

ఉపకారమును మఱచి షేర్ఖానుఁడు మరల 1537 లో హుమాయూనుతో యుద్ధము చేయసాగెను. హుమాయూన్ ఆతనిమీఁదికి సైన్య

ములతో రాగా నాతడు వెనుకకు జరుగుచు రెండుసంవత్సరములు గడపెను. తుదకు 1539 లో బక్సరునొద్ద షేర్ఖానునికిని, హుమాయూను కును యుద్ధము జరిగి యందు హుమాయూన్ పరాభూతుడై గంగానదిలో నీదుచు నావలియొడ్డునకు బోయెను. మరల వారిద్దఱికిని కనోజ్ పట్టణమునొద్ద ఘోరమైన యుద్ధము జరిగినందున హుమాయూన్ పూర్తిగా నోడిపోయి లాహోర్ పట్టణమునకు బాఱిపోయెను. అచ్చట నున్న యాతని తమ్ముడగు కామరాన్ అతనికి జోటిచ్చినవాడు కాడు, అందుచే నాతడు సింధుదేశమునకు బయలుదేఱెను. త్రోవలో హిందాల్ అను తమ్మునియొద్ద గొన్నిదినములుండెను. అచ్చట హిందాలుని గురువగు షేక్.అవీఅగ్బిర్ జామీ యనువానికి హమీదా యను రూపవతి యగు కన్నియకలదు. హుమాయూన్ 1541 లో నామెను వివాహమాడెను. అచ్చట హిందాలు డాతనికి నేమియు సాయము చేయనందున హుమాయూన్ అచ్చటినుండి బయలుదేఱి, త్రోవలో మిక్కిలి బాధపడుచు ఉమర్కోట యనుచోటికి బోయెను. అచ్చటి రాణా ప్రసాద్ అను హిందూ రాజాతనికి నభయమిచ్చి యాతనిని నచ్చట నుంచుకొనియెను. అచ్చట 1542 లో బదునాల్గవ యక్టోబర్ దినమున హమీదాబాణి ప్రసూతయై భాగ్యశాలియగు కొమారునిగనెను. ఆతడు విఖ్యాతిగాంచిన అగ్బర్ బాదుషాహ. పుత్రజన్మమునకు సంతసించి హుమాయూన్ పంచిపెట్టుటకు దనయొద్దనేమియు ధనము లేనందున వెంటదెచ్చిన కస్తూరిని బంచిపెట్టి "యీ కస్తూరి వాసనవలెనే నా పుత్రుని కీర్తియన్నిదిశలను వ్యాపించునుగాత" మని చెప్పెను.

ఉమర్కోటరాజు సహాయముగొని హుమాయూన్ రాజ్యము సాధింప యత్నించెను. కాని విఫలమనోరథుడై హిందూదేశము విడిచి కందహారుకు బోయెను. అచ్చట నాతనితమ్ముడగు మీర్జాఅస్గరీ యనువాడు హుమాయూనుకు సాహాయ్యము చేయక యాతని నెదురించెను. అంతట దన కొమారుని నచ్చటనేవదలి హుమాయూన్ పారసీక దేశమునకు నచ్చటి షాహాయగు తహామస్ప్ అనువానిని సహాయము చేయుమని యడుగుటకుబోయెను. ఇట కామరాన్ అనువాడు అగ్బర్ను తీసికొనిపోయి కాబూల్ పట్టణములో నుంచెను.

హుమాయూన్ పారసీకరాజు సాహాయ్యమునువడసి సైన్యములను వెంటఁ దీసికొనివచ్చి కందహార్ పట్టణమును నాక్రమించుకొని మీర్జా ఆస్కరీ యను తనతమ్మునిఁ జెఱపెట్టెను. అచ్చటనుండి కాబూల్ పట్టణము, నకుఁబోయి కామరాన్ అను తమ్మునిఁ బట్టుకొని -కనులుతీయించెను. (1545). కాబూల్ దేశములో నైదుసంవత్సరములవర కుండి యచ్చటి రాజ్యమును స్థిరపఱచుకొని 1555 లో హిందూదేశము మీఁదికి దండెత్తి వచ్చి సూర్‌వంశజుఁడగు మహమ్మద్‌షాహ అనువాని నోడించి హిందూ దేశసామ్రాజ్యమును మరల సంపాదించెను.

సూర్ వంశము.

హుమాయూన్ దిల్లీరాజ్యమును గోలుపోయి యజ్ఞాతవాసములో నున్న పదియైదు (1540-1555) సంవత్సరములకాలములో దిల్లీపట్టణ మును సూర్‌వంశజులగు మహమ్మదీయు లేలిరి. అందు మొదటివాఁడు షేర్ షాహ యనఁబడు షేర్ ఖానుఁడు. ఈతఁడు హుమాయూనును 1540 లో నోడించి 1545 వఱకు రాజ్యముచేసెను. ఈతఁడు శూరుఁడు, వివేకి, దూరదృష్టిగలవాఁడు. ఇతఁ డైదుసంవత్సరములు మాత్రము రాజ్యముచేసినను, ఆకాలమందును శత్రువులతో నెడతెగకపోరాడవలసిన వాఁడైనను, ప్రజలకు హితప్రదములగు కార్యములనేకములు చేసెను. బంగాళాదేశమునుండి సింధుదేశమువఱకు రెండువేలమైళ్ళ యంతరము గలదు. ఇట్టి రెండువేలమైళ్ళత్రోవలో రెండుమైళ్ళ కొక్కబావి త్రవ్వించి సత్రముఁ గట్టించెను; త్రోవకు రెండువైపుల వృక్షములను వేయించెను; గుఱ్ఱములయంచెలు పెట్టించెను; అనేకములగు నన్న సత్రములనువేయించి బాటసారుల బాధలఁ దొలఁగించెను. హిందూదేశములో రూపాయి యను వెండి నాణెమును ఉపయోగపఱచినవాఁ డీతఁడే. ఈతఁ డల్పాయుస్సు గలవాఁడు కానియెడల నింకను గొప్పకార్యములను జేసియుండును. 1545 లో నీతఁడు కలింజర్ దుర్గమును ముట్టడివేసినపు డకస్మాత్తుగాఁ గాలి చచ్చెను.

షేర్‌షాహ కుమారుఁడగు సలీంషాహ తొమ్మిది సంవత్సరముల

వఱకు (1545-1553) రాజ్యముచేసెను. తండ్రివలె నాతఁడు యుద్ధకుశలుఁడు గాకపోయినను ప్రజాహితాచరణ దక్షుఁడనుటకు సందేహము లేదు. అతని తరువాత నతనికొమారునిఁజంపి యతనిబావమఱఁదియగు మహమ్మద్ షాహ సూర్ అనువాఁడు రాజ్యారూఢుఁ డయ్యెను. హిమూయను హిందూవర్తకుఁడొకఁడతని మంత్రిగానుండెను. ఈ హిమూ శౌర్యము, సాహసము, స్వామిభక్తియను సద్గుణములచే శోభితుఁడై యుండెను. మహమ్మద్ షాహ దుర్వ్యసనాసక్తుఁడై యున్నను హిమూసాయముచేఁ గొంతవఱకు సూర్వంశజులైన యితర రాజులతోఁ బోరాడుచుండెను. మహమ్మద్‌షాహ బావమఱఁదియగు ఇబ్రాహీం ఖానుఁడు దిల్లీ పట్టణమును నాక్రమించుకొనినందున మహమ్మద్‌షాహ చునార్ గడమునకుఁ బోయెను. అహమ్మద్ ఖాన్ సూర్ అనువాఁడు ఇబ్రాహీంఖానుని నోడించి సికందర్‌షాహ అను బిరుదునామమును వహించి దిల్లీపట్టణము నేలసాగెను.

రెండవ పానిపత్ యుద్ధము.

(18-వ జూన్ 1555).

పైని వర్ణించినట్లు సూర్‌వంశపురాజు లొకరితోనొకరు పోరాడు చుండనదియే మంచిసమయముగదాయని హుమాయూన్ పదునైదువేల యశ్వసైనికులను వెంటఁదీసికొని కాబూల్ పట్టణముననుండి బయలు దేఱెను. ఆతనికుమారుఁడగు అక్బర్ గజ్నినుండియు వజీరుఁడగు బహ్రాంఖానుఁడు కందహార్‌నుండియు సైన్యములతోవచ్చి హుమాయూనును పెషావర్‌వద్ద గలిసికొనిరి. వీరిని నెదిరించుటకు సింకదర్ షాహ తార్జక్‌ఖానునిఁ బంపెను. వానిని నక్బర్‌బహ్రాంఖానులు గలిసి యోడించి దిల్లీపట్టణమును సమీపించిరి. తుదుకు సికందర్‌షాహ స్వయముగా నేను బదివేలసైన్యముల వెంటఁదీసికొని యుద్ధమునకు వెడలెను. ఉభయసైన్యములకు పానిపత్ గ్రామసమీపమున ఘోరమైనపోరుజరిగెను. అందు హుమాయూన్, అక్బరు, బహ్రాంఖాన్ ఈ ముగ్గురును స్వయముగా యుద్ధముచేసి తమతమ యుద్ధకౌశలమును జూపిరి. అందులోఁ బదుమూఁడు

సంవత్సరముల వయస్సుగల అక్బరు చూపినశౌర్యమును చరిత్రకారులు విశేషముగా వర్ణించియున్నారు. ఆయుద్ధమునందు సూర్‌షాహా పూర్తిగ నోడిపాఱిపోయెను. హిందూరాజ్య మంతటికిని హుమాయూన్ మరలఁ ప్రభువయ్యెను. ఈ యుద్ధము. క్రీ. శ. 1555-వ సంవత్సరములో 18-వ జూన్ దినమునఁజరిగెను. దీనికి రెండవపానిపత్ యుద్ధమని పేరు. మొదటి పానిపత్‌యుద్ధములో జయించి, బాబర్ విజయుఁడై దిల్లీశ్వరుఁడయ్యెననియుఁ జదువరు లెఱిఁగియున్నారు. ఈ రెండవపానిపత్ యుద్ధముతో గెలిచి హుమాయూన్ జూలైనెలలో దిల్లీశ్వరుఁడయ్యెను. అంతటితో ఆఫ్గానులప్రభుత్వము పూర్తిగఁవోయి మోగల్‌వంశజులు హిందూదేశమునకుఁ బూర్తిగ నధిపతులైరి. కాని రాజ్యసౌఖ్యము ననుభవించుటకు నాతఁడు మిక్కిలికాలము బ్రతికినవాఁడుకాఁడు. సంకటములను ననుభవించినందున బలహీనుఁడై రాజ్యమువచ్చిన యాఱునెలలలోఁ బరలోకగతుఁడయ్యెను. (25 జనవరి 1556) మరణ సమయమునం దాతనికి వయస్సు 51 సంవత్సరములు.

హుమాయూన్ యొక్క గుణదోషములు.

"హుమ్మూమూన్ బాదుషాహ మిక్కిలి సజ్జనుఁడు. పవిత్రాచరణమును సదయాంతఃకరణమును, బంధుపరివారవాత్సల్యమును గలవాఁడు. కాని "అతిసర్వత్ర వర్జయేత్" అను నుపదేశము నెఱుంగనివాఁడగుటచే నాతనిసద్గుణములే యాతనికిఁ బ్రతిబంధకములయ్యెను. సద్గుణాతిరేకమెప్పుడునుదుర్గుణమగునన్న నియమమునఁ ననుసరించి యాతనియందుఁ గలగుణములన్నియు దోషములై యితనికి నందువలన బాధకలిగెను" అని యొకచరిత్రకారుఁడు వ్రాసియున్నాఁడు. తనతమ్ములమీఁద నత్యంతదయ చూపి వారికి స్వతంత్రాధికారమిచ్చినందున గృహకలహములు పెరిఁగి యాతఁడు రాజ్యమునఁ బోఁగొట్టుకొనెను. సజ్జనునికిఁ గావలసినసద్గుణము లీతనియందున్నను రాజునకుఁగావలసిన మనోనిశ్చయ మీతనికిలేదు. అందువలననే యనేకసంకటముల ననుభవించెను. "ఆతఁడు తీవ్రబుద్ధిగలవాఁడు. దృఢనిశ్చయములేమి, విచారశూన్యతలను దుర్గుణములును బొదా

ర్యము, దయ, సౌజన్యములను సద్గుణములను - అతని యందు వాసముచేయుచుండెను. కాని క్రమక్రమముగా సౌందర్య మనునది దుర్వ్యయముగను, సౌజన్యమనునది దుర్బలత్వముగను మాఱి యాతని యొద్ద ముఖస్తుతిచేయువా రనేకులు చేరిరి. ఆతనికి విద్యాభిరుచి యున్నం దున విద్వాంసుల కతఁ డాశ్రయమిచ్చెను. అతఁడును నతనితమ్ముఁడగు హిందాలుఁడును కవిత చెప్పుచుండిరి. గణితజ్యోతిషా స్త్రములను నాతఁ డభ్యసించెను' అని యీతనిగుఱించి యొక గ్రంథకారుఁడు వ్రాసి యున్నాఁడు. తన తండ్రియైన బాబరుయొక్క యాత్మచరిత్ర నీతఁడు మరలవ్రాసి యచ్చటచ్చట నూతనాంశములను జేర్చెను. మొత్తంమీఁద శౌర్యాదిగుణములచే నీతఁడు బాబరునకుఁ దగినకొమారుఁడనియు, సౌందర్యవిద్యా ప్రియత్వములచే నక్బరునకుఁ దగినతండ్రి యనియుఁ జెప్ప వచ్చును.

అక్బర్.


(1556-1605)


పూర్వచరిత్ర-రాజ్యారోహణము.

హిందూదేశములోఁ బ్రభుత్వముచేసిన మోగల్ చక్రవర్తులలో నన్ని విధములను అక్బరు బాదుషాహా శ్రేష్ఠుఁడు. ఇంతియకాదు. లోకములోఁ సర్వశ్రేష్ఠులని విఖ్యాతిఁజెందిన రాజపుంగవులలో నీతఁడొక్కఁడని తప్పక చెప్పవలసియున్నది.


హుమాయూన్ ఉమరు కోటలో నజ్ఞాతవాసమందుండుఁగా 1542లో నక్బరు పుట్టెనని చదువరులిదివఱకే యెఱిఁగియున్నారు. ఒకసంవత్స రము వాఁడైనప్పు డీతఁడు పినతండ్రియగు కామరాన్‌చేతఁ జిక్కెను. హుమాయూనునకును, కామరానునకును యుద్ధము జరిగినకాలమందు గుండుతగిలిఁ యీతఁడీలవలయుననిన యుద్దేశముతో కామరాన్ ఇతనినిఁ గోటగోడమీఁదఁ గూర్చుండఁ బెట్టెను. కాని యదృష్టవశమున నీతనికొక దెబ్బయైనను తగిలినది కాదు. పినతండ్రిచే నీతఁడు పెక్కుసారులు కఠిన కారాగృహమునం దుంపఁబడెను. ఈతనిఁజంపుటకు నీతనిశత్రువులెన్నియో






60
70
80
30
20
10
అరేబియా సముద్రము
బంగాళాఖాతము
ఢిల్లీ
రామేశ్వరము
మహమ్మదీయమత
ప్రచారము(జూపు
ఆసియాఖండము

ကြာဇံလွှဲခြင်း



လွှဲခြင်းဝိုင်း




అక్బరునాటి
మోగల్
సామ్రాజ్యము.
కాబూల్
కాశ్మీర్
లాహోర్
సింధ్
ముల్తాన్
అహమ్మదాబాద్
ఖాందేశ్
బీరార్
అహమ్మద్‌నగర్
బెంగాల్

యుపాయములఁబన్నిరి. కాని వాని నన్నిఁటినిఁ దప్పించుకొని యక్బరు తండ్రినిఁ గలిసికొనెను.

సంకటములలోఁ బెరిఁగినందున అక్బరు చిన్ననాఁడు విద్యాభ్యాసము చేయలేదు. కాని కష్టములలోఁ బుట్టిపెరిఁగినందునఁ గలిగిన యనుభవమే యాతఁడు గొప్ప విద్యగా గ్రహించెను. ఆయనుభవవిద్యయే యతనికి రాజ్యముచేయునప్పుడు మిక్కిలి యుపయోగకారియయ్యెను. హుమాయూన్ వద్ద బహరాంఖానుఁడను స్వామిభక్తిగల సరదారుఁ డొక్కఁడుండెను. ఎన్నికష్టములు వచ్చినను అతఁడు హుమాయూనును విడిచినవాఁడుకాఁడు. ఆబహరాంఖానుఁ డక్బరునకు గురువుగను, పాలనకర్తగను, నుండెను. హుమాయూన్ మరణమొందినప్పు డక్బరాతనియొద్ద లేఁడు. బహరాంఖానుని వెంటఁ బంజాబుమీఁదికి దండెత్తిపోయియుండెను. హుమాయూన్ మరణించిన సమాచారము తెలిసినతోడనే బహరాంఖానుఁ డక్బరునకుఁ బట్టాభిషేకముఁ జేసెను. అప్పు డక్బరు పదమూఁడేండ్లమూడునెలలవాఁడు. అందుచేనాతని మంత్రిగా బహరాంఖానుడే రాజ్యముచేయఁదొడఁగె. అక్బరు రాజ్యమునకు వచ్చినప్పుడు దిల్లీ, ఆగ్రా యను రెండుప్రాంతములు మాత్రము దిల్లీశ్వరునకు లోబడియుండెను. మిగిలిన ప్రాంతములలోని యధికారు లందఱును స్వతంత్రులై యుండిరి. అట్టి చిన్నరాజ్యముగల అక్బరు ఏఁబదిసంవత్సరములలో ఆఫ్గానిస్థాన్ వఁదనుండి ఆసాంవఱకును, దక్షిణమందు అహమ్మద్ నగరమువఱకును వ్యాపించిన గొప్ప రాజ్యమును సంపాదించి యేకచ్ఛత్రముగఁ బరిపాలించెను.

సూర్‌వంశపు శత్రువుల నోడించుట

పానిపత్ యుద్ధములోఁ బూర్తిగఁ బరాజితులైనను సూర్‌వంశపు రాజులకు రాజ్యముమీఁదియాశ పోయినదికాదు. పాఱిపోయిన సూర్ షాహ పఠానుల సైన్యములను జేర్చుకొని పంజాబులో నుండెను. దిల్లీ పట్టణములోఁ గొన్నిదినములు ప్రభుత్వముచేసి యచ్చటినుండి పాఱిపోయిన మహమ్మద్ షాహ సూర్ ఆదిలీయనువాఁడును, వాని హిందూ

మంత్రియైన హిమూ యనువాఁడును దూర్పు ప్రాంతములో సైన్యములతో యుద్ధమునకు సిద్ధముగా నుండిరి. హుమాయూన్ కాలములోఁ గ్రొత్త మోగల్ సరదారులకు జాగీరు లిచ్చినందున ప్రాఁత అఫ్గాన్ సరదారులకుఁ గోపమువచ్చి వారు తిరుగఁబడుటకు సిద్ధముగా నుండిరి. మోగల్ సైన్యములు ముప్పదివేలును, ఆఫ్గాన్ సైన్యము లక్షవఱకును నుండెను. కష్టభూయిష్టమైన యీరాజ్యభారమంతయుఁ బదునాలుగేండ్ల పిల్లవాని మీఁదఁ బడెను.

బహరాంఖానునికి అక్బరు 'ఖానఖానాన్', అనగా రాజాధిరాజు అను బిరుదునొసఁగి యాతనికి సర్వాధికార మిచ్చినను, తా నన్నిసంగతు లను స్వయముగాఁ జూచుచు, బహరాంఖానుని వెంటనుండి రాజ్య పరిపాలన విధమును నేర్చుకొనుచుండెను.

అక్బరు ఖానఖాను లిద్దఱును సైన్యములతోఁ బంజాబునకు దండు వెడలి అంబాలా పట్టణమునొద్ద సికందర్ షాహను నోడించిరి. వా రుత్తరమునకుఁ బోవుటచూచి మహమ్మద్ షాహ తనమంత్రియగు హిమూసాయముఁ దీసికొని పూర్వహిందూదేశమందలి పట్టణముల నాక్రమించుకొనుచు ఆగ్రాపట్టణము మీఁదుగా దిల్లీపట్టణమునకుఁబోయి దానిని స్వాధీనముచేసికొనియె. మంత్రిపుంగవుఁడగు హిమూ విక్రమా జితుఁడను నామమునుధరించి దిల్లీరాజ్యము చేయఁదొడఁగెను. ఈ సమా చారము తెలిసి యక్బరు దిల్లీమీఁదికి వచ్చెను. హిమూ తనసైన్యము లతో నక్బరును వెదిరించెను. 1556 లో 5-వ నవంబరు దినమున నుభయ సైన్యములకును యుద్ధము జరిగి యందు హిమూ చెఱపట్టఁ బడియె. ఈ హిందువును కత్తితో నఱకవలసినదని బహరాంఖానుఁ డక్బరునకు చెప్పెను. కాని యాబాలకుఁ డట్టి క్రూరకర్మముచేయుటకు సంశయింపఁగా బహరాంఖానుఁడే హిమూతలఁ ద్రుంచెను. హిమూ మిక్కిలి పరాక్రమవంతుఁడును, స్వామిభక్తిపరాయణుఁడును అగు హిందూసేనానాయకుఁడు. స్వపరాక్రమముచేతనే దిల్లీశ్వరుని ముఖ్య మంత్రిత్వము వడసెను. ఈతని ప్రభావముచేతనే సూర్వంశజు లింత కాలమువరకు మోగలులతోఁ బోరాడఁగలిగిరి.

ఇట్లు సూర్వంశజులఁ బరాభవించి యక్బరు నిర్భయుఁడై దిల్లీ

పట్టణముఁ బ్రవేశించి తనతండ్రిసింహాసనము నెక్కెను. సింకదరుషాహా శరణు చొచ్చినందున నాతనిక్షమించి యాతని పుత్రునికిఁ దనయొద్ద గొప్పయుద్యోగ మొసఁగెను.

తన సరదారుల తిరుగుబాటుల నణఁచుట (1559 - 1566)

బహరాంఖాన్ :- అక్బరు పదునెనిమిదివత్సరములవాఁ డగు వఱకు రాజ్యసంబంధమైన యధికారమంతయు బహరాంఖానుని చేతుల లోనే యుండెను. కాని పెద్దవాఁ డైనకొలఁదిని అక్బరునకుఁ గొంత కొంత యధికారమిచ్చుటకు మాఱుగా బహరాంఖానుని నిరంకుశత్వమే హెచ్చఁదొడఁగెను. అందుచే నక్బరు రాజ్యాధికారమంతయుఁ దనచేతికిఁ దీసికొని బహరాంఖానుని దొలఁగించెను. అందుపై ఖానుఁడు కోపించి తిరుగఁబడి యుద్ధముచేసెను. అక్బరు సైన్యములు వానిని నోడించి నందున వాఁడు బదుషాను శరణుచొచ్చెను. అందుపై వానిని క్షమించి యక్బరు వానికిఁ తనసభలో నొకయధికార మిచ్చియుంచెను. కాని వాఁ డచ్చట నుండనొల్లక మక్కాకుఁ బోవుటకు వెడలఁగా సూరత్ పట్టణ ములో నాతఁ డొకతురుష్కునిచేఁ జంపఁబడియె. (1561). అతని కొమారుఁడగు మీర్జాఖానుఁ డనువానికి నక్బరు గొప్పయుద్యోగ మొసఁ గెను. అతని తెలివిచూచి కొన్నిదినములకు నాతనికి ఖానఖానాన్ అను బిరుదునుగూడ నిచ్చెను.

ఆదంఖాన్ :— ఈతఁ డక్బరునొద్దనుండిన యొక సరదారుఁడు. మాళ్వాప్రాంతమునకు నధికారిగా నున్న బాజ్ బహాదుర్ అనువాఁడు తిరుగఁబడినంచున వానిని సాధించుటకు ఆదంఖానుఁ డంపఁ బడియె. వానిని సాధించి యాదంఖానుఁడు వాని సొత్తంతయుఁ దీసికొని తన యింటిబొక్కసములోఁ జేర్చుకొనెను. అంతటితో నూరకుండక యాదుష్టుఁడు బాజ్ బహాదుర్ యొక్కభార్య నభిలషింపఁగా నాసాధ్వి యాత్మహత్య చేసికొనియె. ఈ సమాచారము లన్నియుఁదెలిసి యక్బర్

మిగుల గోపించి యాదంఖానుని అధికారభ్రష్టునిఁజేసి వాని ధన మంతయుఁ దీసికొనియెను. అప్పటికిని వాఁడు తనదుర్గుణముల వదల నందున నక్బరుచే జంపింపఁబడియె (1561).

ఖాన్‌జమాన్ :-షీరీఖానుఁ డనుశత్రుఁడు బంగాళాదేశములోను, అయోధ్యా ప్రాంతములోను ప్రజాక్షోభము చేయుచున్నందున వానిమీఁదికి నక్బర్ తన సరదారుఁ డగు ఖాన్ జమాన్ అనువాని నంపెను. ఖోధ పురమువఱకు వచ్చిన శత్రువును పరాభవించి వాఁడు స్వతంత్రుఁ డగు టకు యత్నించెను. వానితో మఱికొందఱు స్వామిద్రోహు లగుసర దారులు కలిసి అయోధ్యాప్రాంతమందు యుద్ధభేరివేసిరి. అందుపై నక్బర్ స్వయముగా వర్షాకాలమునందు నయోధ్యాప్రాంతమునకుఁబోయి రాత్రిసమయమునందు గంగానదిని దాఁటి శత్రువులపై నకస్మాత్తుగాఁ బడి వారిని నోడించెను. ఖాన్ జమాన్ ఆయుద్ధమందుఁ జంపఁబడియె (1566).

మహమ్మద్ హకీం మీర్జా:-ఇతఁడు అక్బర్‌యొక్క సవతి తమ్ముఁడు; కాబూల్‌లో రాజ్యము చేయుచుండెను. కాని యచ్చటనుండి సులేమాన్ అనువానిచే వెడలగొట్టఁబడినందున పంజాబ్ ప్రాంతమును స్వాధీనముచేసికొన యత్నించెను. అందుపై 1566 వ సంవత్సరము నందు నవంబరు నెలలో నక్బర్ పంజాబీదేశమునకుఁ బోయి హకీమును వెడలఁగొట్టెను.

పైని వర్ణింపఁబడినవారు గాక మఱి యనేకులు సరదారులు తిరుగఁబడిరి. అందు ఉజీబక్ సరదారులు ముఖ్యులు. వారి నందఱిని నక్బర్ 1560 మొదలు 1567 వఱకుఁ దనబుద్ధిప్రభావమువలన నణఁగఁ ద్రొక్కెను. ఏపనినైనను నతిశీఘ్రముగాఁ జేయు చుఱుకుదనమును, శత్రువుల క్షమించు నౌదార్యమును అక్బరునందు విశేషముగా నీకాల ములోఁ గాన్పించెను.

అక్బరుచే జయింపఁబడిన రాజ్యములు.

(1561 - 1600)

రాజపుత్ర రాజ్యములు.

(1561 - 1570)

అక్బర్ కాలమువఱకు రాజపుత్రులు తురుష్కులకు లోఁబడిన వారు కారు. మిక్కిలి బలవంతులును, హిందూదేశములోని కొంతభాగమునకు నధిపతులును అగు రాజపుత్రులు వశులైనఁగాని యేసామ్రాజ్యమును హిందూదేశమందు సుస్థిరము కానేరదని తెలిసికొని రాజపుత్రులను సఖ్యసంబంధములచేతను మఱి యన్యోపాయములచేతను స్వాధీనము చేసికొనవలయు నని యక్బర్ నిశ్చయించెను. రాజపుత్రుల రాజ్యములను తీసికొనినందున లాభములేవని తలఁచి వారితో సంబంధబాంధవ్యములు చేయఁదొడఁగెను.

ఇట్లు యుద్ధముచేతఁ గొందఱిని, బాంధవ్యముచేతఁ గొందఱిని వశపఱచుకొనెను. అందు ముఖ్యులైనవారి నీక్రింద వివరించెదను.

జయపూర్ :- 1561 లో నక్బరు రాజపుత్రస్థానమునకుఁ బోయెను. అప్పుడు జయపురాధీశ్వరుఁడగు బిహారీమల్లుఁడు అక్బరునకుఁ దన కూఁతునిచ్చి వివాహముచేసెను. ఇతఁడు మహమ్మదీయులతో సంబంధముచేసిన మొదటి రాజపుత్రుఁడు. అప్పటినుండి జయపూర్ రాజులు అక్బర్ సైన్యములో గొప్పగొప్ప యధికారములు వడసి యనేక యుద్ధములలో శౌర్యముఁజూపి యక్బరునకు ననేకరాజ్యములఁ గెలిచి యిచ్చిరి. బిహారీమల్లుని కొమారుఁడు భగవాన్‌దాసుఁడు. ఆతని కొమారుఁడు మానసింహుఁడు.

జోధపూర్ :- అక్బరు కాలమందు మాల్‌దేవుఁడను రాజు జోధపురములో రాజ్యముచేయుచుండెను. ఇతఁడక్బరు తండ్రియగు హుమాయూనును సంకటసమయమున చెఱపట్టవలయునని యత్నించి

యుండెను. అందుచే నక్బ రాతనిక్రోటయగు మేఢ తాను సాధించెను. అప్పుడు మాల్‌దేవుఁడు అక్బరునకు శరణుచొచ్చెను. ఆతనికిఁ దనసైన్య ములో గొప్ప యధికారమిచ్చి తనసభలోఁ దనకుఁ గుడివైపునఁ గూర్చుండున ట్లేర్పాటు చేసెను.

మేవాడ్:- చితోడ్‌గడముమీఁద రాజ్యముచేయుచున్న మేవాడ్ రాజు రాజపుత్రులలో శ్రేష్ఠుఁడు. ఆతనిని జయించినఁగాని నిజమైన సార్వభౌమత్వము తనకు రాఁజాలదని తలఁచి యక్బరు చితోడ్‌గడము మీఁదికి దండెత్తిపోయెను. అక్బరు చితోడ్‌గడముమీఁదికి రెండుసారులు దండెత్తెననియు, అందు మొదటితడవ నచ్చటి రాణాయగు ఉదయ సింహునిభార్యయైన వీరాబాయిచే నోడింపఁబడి వెడలిపోయెననియు, మరల రెండవసారివచ్చి చితోడ్‌గడమును గెలిచెననియు హిందూ చరిత్ర కారులు వ్రాసియున్నారు. కాని యక్బరు 1567 లో నొక్కసారిమాత్రము చితోడ్‌గడము మీఁదికిఁ బోయినట్టును, అప్పుడే దానిని సాధించినట్టును మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసియున్నారు. ఈ యుద్ధములను గుఱించి నాఱవప్రకరణములోని ఉదయపురచరిత్రలో వివరముగా వ్రాయఁబడియున్నందున నిచ్చట విస్తరింపలేదు.

చితోడ్‌గడము అక్బరునకు స్వాధీనమైనను రాజపుత్రులుమాత్రము స్వాధీనులుకారైరి. ఉదయసింహుఁడు చితోడ్‌నుంచి వెడలి ఉదయపుర మను మఱియొక రాజధానిని స్థాపించెను. ఉదయసింహుని కొమారుఁడైన ప్రతాపసింహునకును, అక్బరునకును జరిగిన యుద్ధప్రసంగముయొక్క వర్ణన నాఱవ ప్రకరణములోఁ జూడనగు.

గడామండలమును జయించుట:- (1564) అక్బరుచే జయింపఁబడిన రాజ్యములలో నిదియొకటి. కాని దీనినిగుఱించి మహమ్మ దీయ చరిత్రకారులును ఇంగ్లీషుగ్రంథకారులును వ్రాసినవారుకారు. అయి నను గడామండల మనురాజ్యమును అప్పుడు దుర్గావతియను శూరవనిత పాలించుచున్నట్టును, ఆమె యక్బరుసేనానితో మిగులశౌర్యముతోఁ బోరాడినట్టును, ఆయుద్ధమునందు నామె గతప్రాణయైనందున నారాజ్య మును అక్బరు స్వాధీనము చేసికొన్నట్టును జబ్బలపురమునొద్ద శిలా

శాసన మొకటి యున్నందున నీసమాచారము నిజమనియే చెప్పవలసి యున్నది. ఈరాణిదుర్గావతిని గుఱించి సౌ-భండారు - అచ్చమాంబగారు బహుశోధనచేసి అబిలాసచ్చరిత్రరత్నమాలలో ప్రాసినయంశము లిచ్చట నుదాహరించుచున్నాము.

రాణిదుర్గావతి.

"పదునాఱవశతాబ్దమున బుందేల్‌ఖండు సంస్థానములో ప్రసిద్ధి కెక్కిన రాజులలో ప్రథముఁడగు చందేల్‌రాజునకు రూపగుణ సంపన్నురాలగు నొకకన్య గలిగెను. ఆమెపేరు దుర్గావతి. ఆమె రూపగుణముల కీర్తి దిగంతముల నిండి, యనేక రాజపుత్రు లామెకొఱకు చందేల్ రాజును ఆశ్రయించుచుండిరి. కాని యారాజపుత్రులు తనకూఁతునకుఁ దగినవారుకారని యెంచి, చందేల్‌రాజు వారికేదోయొకకారణము చెప్పి పంపుచుండెను. ఒకసారి గడామండల సంస్థానాధిపతియగు గోండురాజు దుర్గావతినిఁ దన కిమ్మని యామెతండ్రిని వేఁడెను. ఈగోండురాజు యొక్క శౌర్యసాహసములనుగుఱించి చారులచే వినినదిగావున దుర్గావతియు నాయనయందు బద్ధానురాగయై యుండెను. గోండులు జాతియందును, విద్యయందును, నాగరికతయందును రాజపుత్రులకంటెఁ దక్కువవారు. గోండువా రార్యులుగారు; అనార్యులు. గనుక నిట్టి నీచకులజునికిఁ దమ శ్రేష్ఠవంశపుఁగన్య నిచ్చుటకు చందేల్‌రాజునకు నిష్టములేకపోయెను. కాని యప్పుడు గోండురాజు మిక్కిలి బలవంతుఁడుగా నుండెను. ఈరాజు పాలించెడి గడామండలరాజ్య మంతగా గొప్పది కాకపోయినను, నితఁడు మిక్కిలి బలవంతుఁడై నందున నితనికి ననేక రాజులు సాయముగా నుండిరి. ఇట్టిరాజుతోఁ బోరి గెలుచుట దుర్లభమనియు, దుర్గావతి మనస్సాతనియందుఁ జిక్కినదనియు నెఱిఁగి చందేల్‌రాజు గడామండలేశ్వరునకుఁ దనకన్యకనిచ్చి మహావైభవముతో వివాహముచేసెను.

"వివాహము జరిగినతరువాత నత్తవారింటికి వచ్చునప్పుడు దుర్గావతి తండ్రి రాజ్యమునందున్న బీదసాదల కనేకులకు శాశ్వతజీవనము

లేర్పఱచెను. అందువలన వారంద ఱామెను దమపాలిటి దైవమని భావించి యామె కనేకములైన దీవనలొసంగిరి. ఆమె గడామండలము నకు వచ్చినతరువాత నామెభర్త, రాజ్యవిచారణ మేమియుచేయక, యామెయందే యధికానురాగము కలవాఁడై సదా నర్మదానదీతీరమునను, అచ్చటనున్న యుద్యానవనములయందును విహరించుచు కాలము వ్యర్థపుచ్చుచుండెను. అనేకపర్యాయములు దుర్గావతి రాజ్యమును బాగుగా నేలుఁడని రాజునకు సూచించెను; కాని విషయాసక్తుఁడయిన రాజామాటలను లక్ష్యపెట్టినవాఁడుకాఁడు. అంతఁ గొంతకాలమునకు దుర్గావతీరాణి గర్భవతియయి యొకపుత్రునిఁగనెను. ఆపుత్రునికిఁ బదిసంవత్సరముల ప్రాయము వచ్చినప్పుడు రాజుగా రేదోర్రోగముచేత మృతినొందిరి. అప్పుడు రాజ్యపాలనమంతయు దుర్గావతిమీఁదఁ బడినందున నామె తన కుమారుని సింహాసనాధీశుఁజేసి, యతనిపేరిట రాణిగారు తామే రాజ్యము చేయఁజొచ్చిరి. ఆమె తన పెనిమిటివలెఁగాక, మిగులదక్షతతో, న్యాయముతో, రాజ్యపరిపాలనముఁ జేయుచుఁ బ్రజలను సంతోషపెట్టుచుండెను.

"ఇట్లు తనప్రజలను సుఖపెట్టుచు, పరరాజులతో వైరములేక యెదాఱు సంవత్సరములు రాణిగారు రాజ్యముచేసినతరువాత మొగలాయి రాజైన యక్బరుబాదుషా ఆమెకీర్తివిని, యిట్టిరాజ్యము పరిపాలించెడి రాణి మనకు నంకితురాలుగా నుండవలయునని నిశ్చయించెను; ఇట్లు తలఁచి యక్బరు అసఫ్‌ఖాన్ అనుప్రసిద్ధవీరుని 1564-వ సంవత్సరమున దుర్గావతిరాజ్యముపైకిఁ బంపెను. అక్బరు సకలసద్గుణ సంపన్నుఁడని చరిత్రకారులు చెప్పెదరు. అతనియందు ననేకదుర్గుణము లుండినను, ఇతర యవనప్రభువులతోఁ బోల్చిచూచిన యెడల నతఁడు దేవసమానుఁడే యని చెప్పుటకు సందేహములేదు. కాని యిట్టి మహాత్మునిఁగూడ రాజ్యకాంక్ష వదలినదికాదు. రాణిదుర్గావతి యక్బరునేమి, ఆయన రాజ్యములోని ప్రజలనేమి యెంతమాత్రము బాధపెట్టినదికాదు. వారి జోలికైన నెన్నఁడు పోయినదికాదు. ఇట్టులుండఁగా నాయబలమీఁదికి సైన్యమంపుట మహత్త్వాకాంక్షగాక యేమి? ఇట్లు అసఫ్‌ఖానుశూరుఁడు (అవును. అబలతో యుద్ధమునకుఁ దలపెట్టినవాఁడు శూరుఁడే!) తనపై

దండెత్తి వచ్చుచున్నాఁడన్న మాటవిని, దుర్గావతి భయపడక, మహా ధైర్యముతో యుద్ధమునకు సిద్ధతచేయసాగెను. మహాప్రయత్నముచేసి కొద్దికాలములోనే 500 కరులను, 5000 తురంగములను, గొప్పకాల్బలములను సిద్ధముచేసెను. తాను పురుషవేషముధరించి, ఆయుధములను బుచ్చుకొని, యేనుఁగుపైనెక్కి ప్రత్యక్షదుర్గవలె యుద్ధభూమికి వెడలెను. ఆమెనుజూచి సైనికులకందఱికి నుత్సాహముగలిగి వారిశౌర్య మినుమడియై వారు శత్రుసైన్యముపై నడరి యతిధూర్తులగు యవనసైనికుల ననేకుల రూపుమాపి, మఱునాఁ డాసేనాధిపతిని యమసదనమున కనుపనిశ్చయించిరి. కాని డిల్లీశ్వరునిచే మహావీరుఁడని ప్రఖ్యాతినిఁగాంచిన అసఫ్‌ఖాన్ కొద్దిసైన్యముతో నీమెను జయించుట దుస్తరమని తెలిసికొని, మఱునాఁడింకను సైన్యమునుగూర్చుకొని, తనయొద్దనున్న ఫిరంగీలన్నియు నగ్రభాగమునందుంచి, గోండుసైనికులపై నకస్మాత్తుగావచ్చి, తనసామర్థ్యమంతయును వారిపైఁ జూప వారు చీకాకుపడి, శత్రువులమార్కొనశక్తులు కాకయుండిరి. ఇట్టి దురవస్థఁ జూచి దుర్గావతికుమారుఁడల్పవయస్కుఁడయ్యును, అభిమన్యుకల్పుఁడుగాన, తానుముండై 'వెఱవవల'దని సైనికులకు ధైర్యమిచ్చి, శత్రువులను మార్కొనెను. ఇట్లు కొంతసేపు మహాధైర్యముతోఁ బోరాడి యాబాలశూరుఁడు బాణఘాతముచే మూర్ఛిల్లెను. అప్పుడు సైనికులందఱుఁ జింతాక్రాంతులై యాదుఃఖవార్త నింకొకవైపున తురకలను మర్దించుచున్న దుర్గావతికిఁ దెలియఁజేసిరి. ఆమాటవిని, దుఃఖించుట కదిసమయముకాదనియెంచి, రాణిగారిసుమంత్రైనను జలింపక, పుత్రవాత్సల్యము వాపి, తనసేనాధిపతికి నిట్లు వర్తమానముచేసెను. "ఈసమయము ధైర్యమువదలి దుఃఖించుచుఁగూర్చుండఁ దగినదికాదు. శత్రుహననము మన ముఖ్యకర్తవ్యము. ఈశ్వరేచ్ఛవలన నైనకార్యమునకు వగవఁబనిలేదు. కాన పిల్లవానిని శిబిరమునకుఁ గొనిపోయి తగినయుపచారములు చేయుఁడు. నేనిప్పుడు యుద్ధమును విడిచి వచ్చుటకు వీలులేదు. రణయజ్ఞము సమాప్తముచేసి, ప్రాప్తియున్న మరలఁ జూచెదను." ఈ యనుజ్ఞప్రకారము సైనికులు కార్యమును జరిపిరి.

"యుద్ధమునందుఁ గొంతసేపు వారికి జయమును, కొంతసేపు వీరికి జయమును గలుగుచు, తుద కెవరు గెలుతురో నిశ్చయించుటకు వీలులేకయుండెను. ఇట్లు కొంతసేపు భయపక్షముల సమానముగా యుద్ధముజరిగి,అది హిందువుల స్వాతంత్ర్యనాశనకాలముగాన,తురుష్కులకే యాధిక్యమువచ్చెను. గోండుసైనికులు పోరాడిపోరాడి, యుత్సాహహీనులైరి. గోండులెట్లు ఉత్సాహహీనులైరో, అట్లు మ్లేచ్ఛులబలము హెచ్చుచుఁబోయెను. తమరాజ్యమును గోండుదేశమునందు స్థాపింప వలయునన్న దృఢేచ్ఛగలవారుగనుక 'దీన్‌దీన్' అను రణశబ్దముచ్చరించుచు ఘోరముగా గోండుసైన్యములను దెగటార్చిరి. ఇట్లు భయంకరమైన హననయజ్ఞముజరుగంగ,మూఁడువందల సైనికులతోడ దుర్గావతి రాణీమాత్రము బ్రతికి భయంకరముగాఁ బోరాడుచుండెను. ఆమెను మార్కొనుటకు అసఫ్‌ఖాన్ దుర్గావతియొద్దకి స్వయముగావచ్చెను. కాని యామె రౌద్రమును జూచి భయమంది, దూరముపోయి, అచటనుండి యామెపై బాణవర్షమును గురిపింపఁదొడఁగెను, ఆమె యాబాణముల నన్నిటిని దునిమెను. కాని యందొకబాణము శిరస్సునంబ్రగుచ్చుకొనఁగా నామె మఱింత క్రోధావిష్టమానసయై, ఆబాణమును తానె వెఱికివైచి, మఱింత రౌద్రముతో యుద్ధము చేయసాగెను!! అప్పుడామె శరీరమంతయు రక్తమయమైనసంగతిచూచి, ఆమె డస్సినదని తెలిసికొని, స్వామిభక్తిగల యొక సేవకుఁడామెను సమీపించి యిట్లనియె. "అమ్మా! మీరిఁక యుద్ధమును జేసినందువలన లాభమేమియులేదు. కొద్దికాలములోనే శత్రువులు మిమ్ము చెఱఁబెట్టఁగలరు. వారిచేతులలోఁబడక శీఘ్రముగా నిచ్చటనుండి పలాయనముచేయుటమేలు; దమకొకయిబ్బందిలేక నేనావలకుఁ దీసికొనిపోయెదను." ప్రియసేవకుఁడు పలికిన యావచనములు విని ఆమె చింతించి, శత్రువులు నిజముగా సమీపించుచున్నారని చూచి, పవిత్రమైనదేహము మ్లేచ్ఛులచే నపవిత్రమగు నన్నమాట మాత్రము తలఁపునకు రాఁగా సహింపలేక విషణ్ణవదనయై, తన సేవకునిఁజూచి యిట్లనియె. "ఓరి నీవన్నమాట నిక్కము. ఇదిగో నాచేతనున్న ఖడ్గముంగొని,ఇచ్చటనే నాశిరచ్ఛేదముచేయుము;నేను క్షత్రియ

కన్యను; కాన పగరకువెన్నిచ్చి, చనుట నాకనుచితము. ఈ శరీరమును శత్రు లంటగూడదు. కాన నీవన్యథా విచారముచేయక నాతలఁ దును ముము. అందుచే నేను వీరస్వర్గమును బొందుదును. నాయాజ్ఞవిని నన్ను సంకటమునుండి కాపాడినందున నీకును బుణ్యమే గలుగును; పాపము గలుగనేరదు." ఈ మాటను విన్నతోడనే స్వామిసేవాపరాయణుఁడయిన సేవకుఁడు నిశ్చేష్టితుఁడై యేమియుఁదోఁచక నిలువఁబడెను. కొంతసే పట్లు నిలువఁబడి వాఁడిట్లనియె. "తల్లీ! నావిన్నపమాలకించి, ఈయేనుఁగు నెక్కుఁడి. అతిశీఘ్రముగా మిమ్మును శత్రువుల బారినుండి తప్పించి, యవతలకుఁ గొనిపోవుదును. నేను స్త్రీవధ చేయఁజాలను." అప్పుడారాణి గారు మిక్కిలివిచారించి, మ్లేచ్ఛులుతన్ను సమీపించుటఁగని, తనఖడ్గమునకు మ్రొక్కి దానితోఁ దనంతటఁదానే పొడుచుకొని రణభూమియందే ప్రాణములు విడిచెను!!! రాణిగారిశవము మ్లేచ్ఛులచేఁ బడకుండ నామె సేవకుఁడు భద్రపఱచి, తానును యుద్ధముచేసి యచటనే మృతుఁడయ్యెను! రాణిగారి కుమారుఁడును పరలోకగతుఁడయ్యెను. ఇట్లొక తురక బాదుషాయొక్కరాజ్యలోభముచేత గోండుసంస్థానములోని నిరపరాధులగు జనులందఱు హతులైరి. ఆహా! రాజ్యలోభమెట్టి ఘోరకృత్యములను జేయునో చూడుఁడి.

ఈరణశూరయైన దుర్గావతియొక్క సమాధి జబ్బలపురమువద్ద నున్నది. ఆ సమాధియెద్దనే యీమెగుణవర్ణనాత్మకమైన శిలాశాసనము కలదు. అచ్చటికి వెళ్ళిన బాటసారులందఱును ఆసమాధిని మహాభక్తితోఁ జూచి యీశూరనారినిగుఱించి పూజకభావమును వహించెదరు. పరమ ధార్మికుఁడైన యొక ఇంగ్లీషుబాటసారి దీనినిగురించి యిట్లు వ్రాసి యున్నాఁడు. "దుర్గావతియొక్కసమాధి యీ పర్వతదేశములందు నిర్మింపఁబడినది. అచ్చట రెండుపాషాణస్తంభంబు లున్నవి; వానినిఁ జూడఁగానే వెనుకజరిగిన యుద్ధము మూర్తిమంతముగాఁ గనులయెదుటఁ గానఁబడును. ఆగిరిశిఖరముమీఁద నిప్పటికిని భయంకరమైన రణఘోషము రాత్రిపూట వినవచ్చునని యచ్చటిలోకులు నమ్మెదరు. నిర్జనమయ్యును రమణీయమగు నీస్థలమునకు వచ్చెడిబాటసారులు ప్రేమపూర్వకముగా

రాణీగారిసమాధిని దర్శించెదరు. ఆమె పరాక్రమ శ్రవణముచే విస్మయ చిత్తులై యానందముతో నామెసమాధినిఁ బూజించెదరు. అస్థలమునందుఁ బ్రకాశమానములైన గాజుతునుక లనేకము లున్నవి. ఆగాజుతునుకలే రాణీగారికి బాటసారు లర్పించెదరు. ఈ పూర్వాచారము ననుసరించి, నేను దుర్గావతియొక్క దివ్యగుణములను అభినందించుటకై యొక గాజుతునుక సమాధికి నర్పించితిని." అవును. ఇట్టి యలౌకికశౌర్యమేరికి నభినందనీయము గాకుండును? క్షత్రియులకు నత్యంత శ్రేయస్కరమైన ధర్మమును నాచరించి స్వర్గద్వారమునందుఁ జొచ్చినవారు పురుషులైనను, స్త్రీలైనను సర్వజనవంద్యులే."

1569 లో రతనభోర్ కలింజర్ అను దుర్గములను అక్బర్ సాధించెను. 1570 లో కల్యాణమల్లుఁడను బికానేర్ రాజు అక్బరునకుఁ దన కొమార్తెనిచ్చి వివాహము చేసెను. అక్బర్ రాజపుత్రస్థానములోని పైని వర్ణింపఁబడిన యుద్ధములలోఁ నుండఁగా నాతనికి సిక్రీపట్టణమందుఁ బుత్రుఁడు కలిగెను. సిక్రీలోని షేక్ సలీం అనువాని యనుగ్రహము వలనఁ బుత్రుఁడుపుట్టెనని తలఁచి యాతనికి నక్బర్ సలీం అని పేరు పెట్టెను. 1570 లో నాతనికి మురాద్ అను రెండవకొమారుఁడు కలిగెను. సిక్రీపట్టణములో నిద్దఱుపుత్రులు పుట్టినందునను, తన కెల్లెడలను జయము కలుగుచున్నందునను అక్బర్ సిక్రీయనుచోట ఫతేపూర్ సిక్రీ అను గొప్ప పట్టణమును గట్టించెను. 1572 లో నక్బరునకు మూఁడవకొమారుఁడు కలిగెను. వాని పేరు ధ్యానియల్.

గుజరాథ్:- (1572-1593) —గుజరాత్ దేశము అరాజకమై యుండెను. అనేకులు రాజ్యమునకై యొకరితోనొకరు పోరాడుచు దిల్లీశ్వరుని లక్ష్యముచేయకయుండిరి. అందుచే నక్బర్ 1572-వ సంవత్సరమందు సెప్టెంబర్ నెలలో దిల్లీనుండి బయలుదేరి గుజరాత్ దేశములోని పట్టన్ అనునగరము నొద్ద విడిసెను. అచ్చటి సుల్తానుఁడగు ముజ్ఫర్‌షాహ యక్బరునకు శరణాగతుఁడయ్యెను. అంత అజీజ్‌కోయను వానిని సుబేదారుగా నేర్పఱచి సురత్, భడోచ్, చాంపానేర్ అనుస్థలముల యందునున్న మీర్జావంశజులైన శత్రువులను గెలిచెను. అచ్చటనుండి

వారు పంజాబునకుఁ బాఱిపోఁగా నక్బర్ సైన్యములు వెంటఁదగిలి వారిని సంహరించెను. 1573 లో గుజరాత్ దేశమందుఁ దిరిగి కలవరములు పుట్టఁగా నక్బర్ రెండువేల సైన్యములను ముందుఁబంపి తాను మూఁడు వందల సైనికులతో వెడలి యత్యంత స్వల్పకాలములోఁ బట్టణమును గుజరాత్ దేశపు రాజధానిని జేరెను. అతఁడు తొమ్మిదిదినములలో నాలుగు వందల యేబదిమైళ్ళ ప్రవాసముచేసెను! ఇంత చుఱుకుఁదనముగలరాజును విజయలక్ష్మి వరించుట యాశ్చర్యమా? అహమదాబాదులోనున్న శత్రు సైన్యములకుఁబూర్తిగఁ బరాభవము కలిగెను. అక్బర్ దిల్లీకిఁబోయి గుజరాత్ దేశపు ఆదాయమునుగుఱించి తగినయేర్పాటు చేయుటకు తోడర్ మల్ అను రాజకార్యనిపుణునిఁ బంపెను. ఆతఁ డచ్చటిభూములఁ గొలిపించి వానికి ధరలేర్పఱిచి రాజునకుఁ బ్రజలకు సౌఖ్యము కలుగునట్లు చేసెను.

బంగాళాదేశము:- (1575-1576) దావూద్ ఖానుఁడనువాఁడు బంగాళాదేశము నాక్రమించుకొని దిల్లీశ్వరుని లక్ష్యముచేయకయుండెను. ఇంతియకాదు. అక్బరుతో యుద్ధముచేయుటకు సైన్యములను చేర్చుకొనఁ దొడఁగెను. ఈ సమాచారము తెలిసినతోడనే యక్బర్ వర్షాకాలమైనను వేయినావల సిద్ధపఱిచి సైన్యములతో గంగానదిదాఁటి, బంగాళాదేశము చేరెను. అంత దావూద్ ఖానుఁడు పాఱిపోయెను. మునియంఖాన్, తోడర్ మల్ అనువారినచ్చటనునిచి అక్బర్ తిరిగి తనరాజధానికిఁబోయెను. బంగాళాదేశములో నుంపఁబడిన పైసరదారులు దావూద్ ఖానుతో మూఁడుసారులు యుద్ధముచేసి, వానిని బట్టుకొని చంపివేసిరి. 1575 లో బంగాల్, బహర్, ఓఢ్యా యను మూఁడుప్రాంతములును పూర్తిగా దిల్లీశ్వరునకు స్వాధీనమాయెను. అచ్చట మునియంఖానుఁడు సుబేదారుగా నుంపఁబడియె. వాఁడు కాలధర్మమునొందఁగా రాజామానసింహుడు బంగాళాదేశమునకు సుబేద్దారుఁ డయ్యెను. ఆదేశములో మరలఁ గొన్ని కలవరములు పెట్టెను. కాని యక్బర్ సైన్యములచే 1592 లో నవి యన్నియుఁ బూర్తిగా నణఁపఁబడెను.

కాబూల్ (1579)—క్రీ. శ. 1575-వ సంవత్సరము మొదలు మూఁడు నాలుగేండ్లవఱకు యుద్ధాదులెవ్వియు లేనందున నక్బర్ ప్రజా సుఖకరముగ రాజ్యమేలెను. కాని 1579లో నాతని సవతియన్నయుఁ గాబూల్ దేశమునకు రాజును అగు మహమ్మద్ హకీమ్మనువాఁడు పంజాబ్ మీఁదికి దండెత్తివచ్చి రాజా మానసింహుని నోడించినందున అక్బర్ స్వయముగా వానిమీఁదికి యుద్ధమునకుఁ బోయెను. అంత హకీం కాబూల్ దేశమునకుఁ బాఱిపోయెను. వానిని వెంబడించుటకుఁ దన కొమారుఁడగు మురాద్ అనువానిని నక్బర్ పంపఁగా యుద్ధమందు మురాద్ ఓడింపఁబడియె. దానిమీఁద అక్బర్ స్వయముగా కాబూలునకుఁ బోయి హకీమునోడించి వాఁడుశరణు వేఁడినందున వానికే మరల కాబూల్ దేశపు టధికారము నొసంగెను. కాని వాఁడు మరల తిరుగఁ బడునేమోయని జయపురరాజైన భగవాన్‌దాసుని నచ్చట నునిచివచ్చెను. 1586 లో మహమ్మద్ హకీం కాలధర్మము నొందఁగాఁ గాబూల్ రాజ్య మంతయు సంపూర్తిగ అక్బరునకు సంక్రమించెను.

కాశ్మీరము (1587)—కాశ్మీరమువంటి భూలోకనందన వన మును స్వాధీనముచేసికొనవలయునని యక్బ రెన్నిదినములనుండియో కోరుచుండెను. కాశ్మీరములో ననేకకల్లోలములు కలవని విని యక్బర్ 1586 లోఁ దనసైన్యముల జయపురాధీశుఁడగు భగవాన్‌దాసునివెంట నిచ్చిపంపెను. కాని యందువలన విశేషలాభము కలిగినదికాదు. అచ్చటి త్రోవలు మిక్కిలి చిన్నవిగను, కఠినములైనవిగను, పర్వతారణ్యము లతో నిండినవిగను ఉండెను. దానిచే భగవాన్‌దాసునకు జయము కలిగి నదికాదు. మరుసటిసంవత్సరమున అక్బర్ ఖాశింఖానుఁడనువానిని గాశ్మీ రముమీఁదికిఁబంపఁగా నాతఁడు కాశ్మీరరాజును చెఱపట్టి తీసికొనివచ్చెను. వానికి టహార్ దేశములోఁ గొంతజాగీరిచ్చి యక్బర్ కాశ్మీర దేశమును దనరాజ్యములోఁ జేర్చుకొనెను. 1587 లో అక్బర్ స్వయముగాఁ గాశ్మీర దేశమునకుఁబోయి యచ్చటి రాజ్యాంగవిషయక వ్యవస్థయేర్పఱచి, యచ్చటినుండి కాబూలునకుఁ బోయెను.

అఫ్గానులతో బోరాట (1589) — పెషావర్‌కునావల నున్న యఫ్గానులను జయింపవలయునని యక్బరునకు నిచ్చ వొడ మెను. ఈ యఫ్గానులు యుసఫ్‌జై జాతివారు; హిందూకుశపర్వతము యొక్క గుహలలో గాపురము చేయుచుండిరి. అక్బరుయొక్క బాల్య స్నేహితుడగు జైన్‌ఖాన్ కోకాయును రాజాబీర్‌బల్ (వీరబలుడు) అనువాడును, అఫ్గానులమీదికి యుద్ధమునకుబోయిరి. ఈమోగల సైన్యములు పర్వతప్రదేశములో ప్రవేశించినతోడనే, పర్వతీయులగు అఫ్గాను లాసైన్యములను ముట్టడించి, తిరిగిపెళ్ళుటకు వీలులేకుండ మార్గముల నడగించిరి. రాజా బీర్‌బల్ ఎనిమిదివేలసైన్యములతో యుద్ధ రంగమునందు మడిసెను. ఈ సమాచార మక్బరునకు గాబూలులో నుండగా దెలిసి, రాజ్యకార్యకుశలుడగు బీర్‌బల్‌యొక్క మరణము నకు మిక్కిలి చింతించి వెంటనే లాహోరుపట్టణమునకు వచ్చెను. పెషావర్ కనమలనుండి రాజాతోడర్‌మల్, రాజామాన్‌సింగ్ అనువారలు సైన్యములతో నఫ్గానులమీదికిబోయి కొంతవఱకు జయము స్థాపించిరి. కాని మొత్తముమీద దిల్లీశ్వరుడగు రారాజునకు నీయుద్ధము వలన విశేషలాభము కలిగినదికాదు. అఫ్గానులతో నొకవిధముగ సంధి చేసికొని, యక్బర్ తనసైన్యములఁ బిలిపించుకొనియె. ఈవర్ణన చదివిన యేచదువరికి మొన్న యింగ్లీషువారికిని జాఖాఖేలులకును జరిగినయుద్ధము జ్ఞప్తికి రాకయుండదు?

సింధుదేశము (1592)—అక్బరుచే నేర్పరుపఁబడిన గుజ రాత్ దేశపు సుబేదారుడగు మీర్జా అజీజ్‌కోకా యనువాడు 1589 లో కాతేవాడ్ ప్రదేశములోని జాంనగరపు రాజును జయించుటకు యత్నించి విఫలప్రయత్నుఁడయ్యెను.

మఱుసటిసంవత్సరమునం దాతడు జునాగడ్ అను రాజ్యము నాక్రమించుకొనెను. సింధుదేశములో రాజ్యముచేయుచున్నపారసీకజాతి సరదారు లొకరితోనొకరు పోరాడుటచూచి యక్బరదియే మంచిసమయ మని తలఁచి, యుత్తరపుదిక్కునుండి తనసైన్యములను సింధుదేశము మీఁదికిఁ బంపెను. ఆ సైన్యములతోఁదనసైన్యములనుజేర్చి కోకాయను

వాఁడు సింధుదేశమును 1592 లో జయించెను. శరణనిన జానీ బేగ్ అను పారసీకసరదారునకు నక్బర్ సైన్యములో గొప్పయుద్యోగ మీయఁబడెను.

కందహార్ (1594) — పారసీకరాజుయొక్క సాయమును వడసి హుమాయూన్ కందహార్ రాజ్యమును గెలిచెనని యిదివఱ కాతని చరిత్రలో వ్రాసియున్నాము. ఆ రాజ్యము పారసీకరాజునకు నిచ్చినట్లు మొదట హుమాయూన్ ఒప్పుకొనినను, రాజ్యము దొరికినతరువాత నిచ్చినవాఁడుకాఁడు. అందుచే నాతనికాలములోనే పారసీక రాజారాజ్యము నాక్రమించుకొని 1594 వఱకు ననుభవించెను. ఆసంవత్సరములో అక్బర్ తన సైన్యములనంపి కందహార్ రాజ్యమును స్వాధీనము చేసికొనెను.

ఆ కాలమందు షహఅబ్బాస్ అనువాడు పారసీకమునకు రాజుగా నుండెను. స్వరాజ్యములో నాతనికిఁ బెక్కుపనులుండినందున నాతడు కందహార్ రాజ్యమును మరల సంపాదించుటకు యత్నించినవాఁడు కాఁడు.

కందహార్ స్వాధీనముచేసికొనినప్పటినుండియు నక్బర్ హిందూ దేశమునఁ జక్రవర్తియయ్యెనని చెప్పవచ్చును. సింధునదికిఁ బశ్చిమమున నున్న పూర్వార్జిత రాజ్యమంతయు నాతఁడు వశపఱుచుకొనెను. కాశ్మీరము, బంగాళము, బిహార్, ఓఢ్యా, ఆసాందేశములన్నియు నాతనికిఁ లోఁబడెను. ఉదయపుర రాజుతప్ప మిగిలిన రాజపుత్రరాజు లందఱును, గుజరాత్‌దేశపు నవాబును, అక్బరుయొక్క సార్వభౌమత్వమును నొప్పుకొనిరి. చంద్రగుప్త చక్రవర్తితప్ప నర్మదానదికి నుత్తరమున నింత విశాలరాజ్యమును నేలినరాజులేఁడు. ఇట్లుత్తరమునందలి రాజ్యముల నన్నిటిని లోఁబఱుచుకొని యక్బర్ దక్షిణదేశములోని రాజ్యముల సాధింప సమకట్టెను.

దక్షిణ దేశములను సాధించుటకు యత్నించుట (1595-1600) — ఆకాలమందు దక్షిణదేశములో అహమ్మద్‌నగర్, బీజాపురము, గోలకొండ, ఖాన్‌దేశము అను తురకరాజ్యములు ప్రబలియుండెను. వీనిరాజులందఱును మొదట దిల్లీశ్వరుని సేవకులైన బహమని

రాజులకు సేవకులయినను స్వతంత్రులై డిల్లీశ్వరుని లక్ష్యముచేయక యుండిరి. అందుచే వీరినిలోబఱచుకొనుట యావశ్యకమని రారాజు తలచెను. 1564 లో తాలికోటయుద్ధమునందు విజయనగరరాజుల నోడించి యాదక్షిణములోని సుల్తానులందఱు నొకరాజ్యమును పంచుకొనిరి. 1572 లో అహమ్మద్‌నగర్ నవాబు వరాడ్ (బీరార్) ప్రదేశమును నాక్రమించెను. ఇట్లీ దక్షిణములోని నవాబులు దిన దినము ప్రబలులగుట చూచి, సహింపవోపక, రారాజు తనకొమారుడగు మురాద్ అనువానిని దక్షిణములోనికి బంపెను. కాని శూరవనితయగు చాంద్‌బీబీయను నామె తనయప్రతిమప్రతాపమునుజూపి మోగలులతో సమానముగా బోరాడెను. ఉభయసైన్యములకును లాభములేక యనేక దినములవఱకు యుద్ధము జరిగిన తరువాత వరాడ్‌ప్రాంతము మోగలులకిచ్చి సంధిచేసికొనెను. కాని వరాడ్‌దేశముపై దక్షిణములోని యనేక రాజులు తమహక్కును జూపి, గోదావరీతీరమునంచలి సుపాయను గ్రామమునొద్ద మూడు రోజులు ఘోరముగా బోరాడినందున, నారాజ్యము మోగలులకు వశపడినదికాదు. 1598 లో అబుల్‌ఫజల్ అనువానిని గొంతసైన్యముతో దక్షిణమునకు బంపెను. ఆ సంవత్సరమునందేఅక్బర్ పుత్రుడగు మురాద్ వరాడ్‌దేశములో గాలధర్మము నొందెను. 1599 లో అక్బర్ స్వయముగా అహమ్మద్ నగరముమీదికి దండెత్తివచ్చెను. చాంద్‌బీబీని నెవ్వడో దుష్టుడు చంపివేసినందున నరాజకమై అహమ్మద్ నగరము రాజుచేతికి జిక్కెను (1600 జూలై). కాని అహమ్మద్ నగరరాజ్యము మాత్రము 1637 వఱకు మోగలులకు స్వాధీనముకాలేదు. అక్బర్, ఖాన్‌దేశపుసుల్తానుని గెలిచి యాదేశమంతయును, షోలాపుర్గము మనుచుర్గమును నాక్రమించుకొని, వరాడ్‌ఖాన్ దేశములకు దనపుత్రుడగు డ్యానియల్ అనువానిని నధికారిగను, ఖానఖానాన్ అనువానిని వానికి వజీరుగను నేర్పఱచి తాను బిజాపూర్, గోలకొండనవాబులయొద్దనుండి యప్పనంబులు గైకొని రాజధానికి వెడలిపోయెను.

చరమకాలమందలి విపత్తులు.

(1601-1605)

పుత్రుడైన మురాద్ కాలధర్మము నొందినందున అక్బరునకు మిక్కిలి దుఃఖముకలిగెను. అతడు దక్షిణ దండయాత్రనుండి వచ్చిన తోడనే యతని పెద్దకొమారుడగు సలీం అనువాడు తిరుగబడెను. అతని కప్పటికిముప్పది సంవత్సరములు వయస్సుండెను. మద్యపానము, నల్లమందు తినుట మొదలైన దుర్వ్యసనములచే నతడు దుర్వ్యాధి గలవాడాయెను. అక్బరునకు బ్రాణప్రియుడగు అబుల్ ఫజల్ అను పండితుని నతడు ద్వేషించుచుండెను. అక్బరు దక్షిణమునకు బోవు నపుడు అజ్‌మీర్ ప్రదేశపు టధికారమును, ఉదయపూర్ రాజుతో యుద్ధముచేయు పనియు, యువరాజగు సలీమునకు జెప్పిపోయెను. తండ్రి దక్షిణమునకు బోవుటచూచి యాతడు ప్రయాగకోటలోని బొక్కసమును స్వాధీనముచేసికొని సైన్యములఁ జేర్చుకొని తండ్రికిఁ బ్రతిస్పర్ధియై బాదుషాహబిరుదు వహించెను. ఈ సమాచారము తెలిసి యక్బర్ పుత్రునకు నుపదేశముచేయుచు లేఖల నంపెను. కాని యందు వలన నేమియు లాభముకలిగినది కాదు. ఇంతలో నాసలీం తనతండ్రికి బహిఃప్రాణమగు అబుల్‌ఫజల్‌ను జంపించెను (1602). ఈ సమాచారము తెలిసి యక్బర్ మిక్కిలి చింతాక్రాంతుడై రెండుదినములవఱకు నిద్రాహారము లేఱుగకయుండెను. ఆతని రెండడకొమారుడగు ఖుస్రూ యొక్కతల్లి మానసింహుని చెల్లెలు. ఆమె విషముతిని ప్రాణములు విడిచెను. అప్పటినుండి ఖుస్రూయనువాడు కాలాగ్ని రుద్రుడై యెదుటఁ గాన్పించిన వారినందఱిని బాధపెట్టఁ దొడఁగెను. పెద్దకొమారుడగు సలీమునొద్దకిఁ బోయి యాతనికి బుద్ధిచెప్పవలయునని తలఁచుచుండఁగా అక్బరుతల్లి కాలధర్మము నొందెను. అంత గొంతవఱకు పశ్చాత్తాపము కలిగి సలీం తండ్రియొద్దకు వచ్చెను. దక్షిణమునందున్న అక్బరుయొక్క కొమారుడగు డ్యానియల్ సురాపాన దుర్వ్యసనమువలన 1604 లో లోకాంతరగతుఁడయ్యెను.

ఇట్లెడతెగని విపత్తులు వచ్చినందున నక్బర్ శరీరము చింతచే దినదినము క్షీణింపఁజొచ్చెను. 1605-వ సంవత్సరమందలి సెప్టెంబరే నెలలో అక్బర్ మంచముపట్టెను. అప్పుడు తనతరువాత తనపుత్రులలో రాజ్యముచేయువాఁడెవ్వఁడని నిశ్చయించుట యాతనికి నావశ్యకమయ్యెను. తన పెద్దకొమారుఁడగు సలీం అనువాఁడే రాజ్యమునకు నర్హుఁడని మొదటినుండియు నక్బర్ యొక్క యభిప్రాయముకాని ఖుస్రూ యనువానికి మానసింహుఁడు మేనమామ; అజీజ్ అను మజీయొక సరదారుఁడు పిల్లనిచ్చినమామ; కావునవీరిద్దఱును ఖుస్రూకు రాజ్యము రావలయునని యత్నించుచుండిరి. కాని తన పెద్దకుమారునకే రాజ్యముండవలయునని యక్బర్ గట్టిగాఁ జెప్పినందున వారును సలీం పక్షములోఁ జేరిరి. తుదకుఁ దనయపరాధముల క్షమింపవలయునని చుట్టునుండినవారిని గోరి తనకొమారునకుఁ దగుబోధచేసి 1605-వ సంవత్సరమునందు 13-వ అక్టోబర్ దినమున నామహాచక్రవర్తి ఆగ్రాపట్టణములో దేహమునుచాలించెను. అప్పుడాతనికి నఱువదిమూఁడు సంవత్సరములు వయస్సున్నది. ఆతని పెద్దకుమారుఁడగు సలీం తన ముగ్గురు కొమారులతోఁ గలిసి యక్బర్ ప్రేతమును మోసికొని కోటవెలుపలకుఁ దీసికొనిపోయెను. అచ్చటినుండి నాలుగుమైళ్ళమీఁదనున్న సికంద్రా యనుచోటికిఁ గొందఱు సరదారులు మోసికొనిపోయి సమాధిచేసిరి.

అక్బర్ మరణముతో మోగల్ సామ్రాజ్య నాటకముయొక్క ప్రథమాంకము సమాప్తమయ్యెను. ఆసామ్రాజ్యము అక్బరువలన దృఢపఱుపఁబడి యప్పటినుండి నూటయేఁబది సంవత్సరములవఱకు ననన్యసామాన్యవైభవము ననుభవించెను. ఈ మహాసామ్రాజ్యమును మొగలుల యొద్దనుండి నూటయేఁబది సంవత్సరముల తరువాత వశపఱుకొనిన మహాశక్తి యొకటి యీ యక్బరుకాలముననే యుదయించుట వింతకదా! ఈస్టిండియాకంపెని యనునదియే మహాశక్తి. క్రీ. శ. 1600లో నింగ్లండు దేశమందు హిందూదేశముతో వ్యవహారము చేయుటకు నీస్టిండియాకంపెని యనువ్యవహారసంఘ మొకటి స్థాపింపఁబడియె. ఈయింగ్లీషువర్తకులే హిందూరాజ్యమును సంపాదించిరి. ఆ చరిత్రయంతయు బ్రిటిషు మహాయుగ మనుప్రకరణమునందు సవిస్తరముగా వర్ణింపఁబడును.

రాజ్యవ్యవస్థ

ప్రజాసౌఖ్యమే పరమోద్దేశముగా రాజ్యమును పాలించిన లోక వంద్యులగు చక్రవర్తులలో నక్బర్ అగ్రగణ్యుడనియే చెప్పవలసి యున్నది. అక్బర్ యొక్క రాజ్యతంత్రమును సవిస్తరముగా వర్ణించుచు నాతని మిత్రుడును, విద్వాంసుడును అగు అబుల్‌ఫజల్ అనువాడొకగ్రంథము వ్రాసియుంచినాడు. ఆ గ్రంథమునకు 'ఐనేఅక్బరీ' అని పేరు. అక్బరుయొక్క ఐశ్వర్యమును, ప్రజాప్రీతియు, సాధుస్వభావమును, రాజకార్య కౌశలమును, ప్రయోజకత్వమును నాగ్రంథమువలన దెలియును. 'లోకులయాచార వ్యవహారముల సంస్కరించుట, వ్యవసాయము నభివృద్ధిచేయుట, సైన్యమును నితర రాజ్యాంగములమ సుప్యవస్థితముగానుంచుట, లోకోపయోగకరములైన కార్యములజేసి జనులను సంతుష్టాంతరంగులజేయుట, ఆదాయమును జక్కబరిచి మితవ్యయము చేయుట, యనునవి ప్రజల సౌఖ్యమునకై రాజుచేయవలసిన పనులని యందఱును నొప్పుకొనువిషయము. ఈ సంగతులను మఱువక రాజ్యము చేసినరాజు వైభవశాలియగు ననుటకు సందేహములేదు.' అని యా గ్రంథాదిని వ్రాయబడినది. అక్బరు చరిత్రయంతయు నీ వాక్యములకు లక్ష్యభూతము.

ఈతని రాజ్యములో భూమిపన్నును గుఱించి చేయబడిన నిబంధనల విషయమై ముందు వ్రాయబడును. పన్ను ఒకరిమీద విశేషముగాబడి యొకరిమీద దక్కువపడక యందఱికి సమానముగా నుండునట్లు చేయుట యితని రాజ్యవ్యవస్థలోని యొక విశేషము. ఇతడు వర్షములులేని సంవత్సరములోబన్ను రాబట్టుకొనవలదని శాసించెను. పూర్వమునుండిజరుగుచు లోకులకు బాధకరముగానున్న చిల్లరపన్నులనేకములు తీసివేసెను. వరకములో మోసము లేకుండ తూనికలను కొలతలను సిద్ధపఱిచెను. అంతకుబూర్వము రాజకీయాధికారులకు ప్రజలయొద్దనుండి కొన్ని బహుమతులు దొరకుచుండెను. వానినాపి యధికారులకు వెలజీతముల నిర్ణయించెను. అందుచే ప్రజలకు గలుగు బాధలు తొలగెను. రాజ్యములోని యొక్కొకయధికారిచేయవలసిన పను

లన్నియు స్పష్టముగ నిర్ణయింపఁబడినంపున వారి స్వేచ్ఛాచార మడు గంపెను. అధికారులను గుఱించి యక్కడచేఁ జేయఁబడిన నిబంధనలు కొన్ని యిచ్చట నుదాహరించుచున్నాను.

సుబేదార్:- ఇతఁడు ప్రాంతాధికారి. ప్రస్తుతపుగవర్నర్ వంటివాఁడు. ఇతఁ డీక్రిందినియమముల ననుసరించి యధికారము చేయవలయును. ప్రజాసౌఖ్యమునకై ఏశేషజాగరూకుఁడై యుండవలయును; దీర్ఘాలోచనచేయక యెవరికిని దేహాంతశిక్ష విధింపఁజాచు; వ్యాజ్యమునకై వచ్చినవారికి నాలస్యము చేయక తీర్పుచెప్పవలెను; విపన్నావస్థలో నుండువాఁడు చెప్పుసంగతులన్నియు వినవలెను; వానిని శిక్షింపఁజాదు; బాటసాయలకు బాధలేకుండ ప్రోవలు రక్షింపవలయును; పాటుపడు కాఁపుదానిస్నేహితుఁడీతఁడని జనులు తలఁచునట్లు సుబేదారుఁడు నడచుకొన వలయును.

క్వాజీ (న్యాయాధీశుఁడు):-ఇతఁడు లోభపక్షపాతము లనఁబడు దుర్గుణములను కలలోనైనఁ దలఁపఁగూడదు. అపరాధమన్న నెద్దియో, నిరపరాధమన్న నెద్దియో చక్కఁగ నెఱిఁగి తన యాచరణ పరిశుద్ధముగా నుంచుకొనవలయును.

కొత్వాల్:- ఇతఁడు గ్రామసంరక్షణచేయు నధికారి. ప్రస్తుతపు పోలీస్ సూపరింటెండెంట్ వంటివాఁడు. ఇతఁడు పవిత్రాచరణమును, సత్యప్రవర్తనమును గలిగియుండవలెను; నిరుద్యోగులగు సోమరులకు నేదియైన పనికల్పింపవలెను; తక్కినజనులపుగల నాజెయములు బొక్కసమునకు నిచ్చు వానియొద్దనుండి తక్కువపడిన మొత్తము మాత్రము తీసికొనవలెను; ఎక్కువ తీసికొనఁగూడదు; లోకులు మద్యపానము చేయకుండుటకుఁ దగినయేర్పాటులు చేయవలెను; కాని యట్లు చేయునపుడు రహస్యస్థలములలో లోకు లేఁచేయుచున్నది కనుఁగొనుటకు విశేషముగా యత్నింపఁగూడదు; సహగమనము చేయనొల్లని స్త్రీని సహగమనము చేయుటకు నామెబంధువులు బలవంతపెట్టకుండఁ గాపాడవలయును.

పన్ను రాబట్టు నధికారులు:- తాము కాపులకు నాప్తుల మని యెప్పుడును జ్ఞాపక ముంచుకొనవలయును. కాపులను స్వయ ముగాఁజూచి మాటాడవలయును. ఇతరులమాటలు విని వ్యవహారము చేయఁగూడదు. కాపులకు వలయునపుడు గొంతధన మప్పిచ్చి పీలు వెంటఁ గ్రమక్రమముగా రాఁబట్టుకొనవలయును. ఏర్పడిన 'పన్నుకంటె నెక్కుడు తీసికొనఁగూడదు. పన్ను రాఁబట్టుకొనుటకుఁ బ్రజలను బాధిం పఁగూడదు.

జమాబంది.

జమాబంది యనఁగాఁ బ్రజలయొద్దనుండి రావలసిన పన్నుయొక్క మొత్తమును నిర్ణయించుట. ప్రజాహితమునకై యక్బరుచేఁ జేయఁబడిన పనులలో జమాబంది పద్ధతి ముఖ్యమైనది. ఇది యింతవఱకును గొప్ప విద్వాంసులచేఁ గొనియాడఁ బడుచున్నది. ప్రస్తుతపు రాజ్యకర్తలకుఁ గూడనిచి కొంతవరకు మార్గదర్శకమయ్యెను. రాజా తోడర్ మల్ అను అక్బరుయొక్క హిందూ మంత్రీశ్వరుఁడీపద్ధతి నేర్పఱిచెను. రాజా తోడర్ మల్లుఁడు జమాబందిపని సూర్వంశజుఁడగు షీర్ షహయొద్ద నేర్చుకొనెను. భూమివిషయమై యక్బరుచేఁ జేయఁబడిన సంస్కరణము లన్నియు షీర్ షహచేఁ బ్రారంభింపఁబడి యుండెను. ఆపద్ధతులను జక్కఁగఁదెలిసిన తోడర్ మల్లుఁడు అక్బరునకుఁ బ్రాణప్రియుఁడై యుండెను. ఈతోడర్‌మల్లును గుఱించి అబుల్ ఫజల్ అనుగ్రంథకాఁడిట్లు వ్రాసియున్నాఁడు. 'సత్యప్రియత్వము, సత్ప్రవర్తనము, ధైర్య సాహసములు, ఒక్కొక్కపనిని జక్కఁగ నెఱుఁగుట, తనయధికారము లోని పనులన్నియుఁ గ్రమముగ నడచు నట్లేర్పాటుచేయు చాతుర్యము అనుసద్గుణములయందు తోడర్ మల్లును మించినవాఁడు మఱి యొకఁడుం డడు. భూమి పన్నువిషయమై అక్బర్ రాజ్యములోఁ జేయఁబడిన ప్రశంసనీయములైన పద్ధతులను గుఱించి తోడర్‌మల్లునే ప్రశంసింప వలసియున్నది. తోడర్‌మల్ మొదట రాజ్యములోని భూమియంతయుఁ గొలిపించెను. అనఁగా 'సర్వే' చేయించెను. తరువాత భూములయొక్క

యోగ్యతనుబట్టి యుత్తమ, మధ్యమ, కనిష్ఠ భూములనియెడు తరగతు లేర్పఱచెను. ఒక్కొక్క పొలమునొక్క పందొమ్మిది సంవత్సరముల యాదాయమునుబట్టి యాభూమిపన్ను నిర్ణయింపఁబడెను. ఆదాయములోని మూఁడవభాగము పన్నుగ విధింపఁబడియె. షేర్‌షహాచే విధింపఁబడిన పన్నింతకంటెఁ దక్కువ యనుటకు సందేహములేదు. కాని అక్బర్ రాజ్యములో నేలపన్నుతప్పఁ దక్కినపన్నులన్నియు విడిచిపెట్టఁబడియె. అధికారులకు నిచ్చుచున్న బహుమతు లీయవలదని యతఁడు శాసించెను. ఇజారా పద్ధతివలన నిజారాదారులు ధనవంతులగుటయు, రైతులు దరిద్రులగుటయుఁ గని యాపద్ధతిని మాన్పి రైతులయొద్దనుండి పన్ను తానే రాఁబట్టుకొనఁజొచ్చెను. అక్బర్ రాజ్యములో రైతే భూస్వామిగనుండెను. రైతు పన్నిచ్చుచున్నంతవఱకు వానిని భూమినుండి వెడలఁగొట్టుటకు నెవ్వరికిని నధికారము లేకయుండెను. భూమిని గొలుచుట, తరగతు లేర్పఱుచుట, పన్ను నిర్ణయించుట, ప్రతిగ్రామములోని రైతుల యొక్కయు వారీయవలసిన పన్నుయొక్కయు లెక్కలు క్రమముగా నుంచుట మొదలైన జమాబందికి సంబంధించిన యంశములన్నియు నిప్పటికి రాజ్యకర్తలగు నింగ్లీషువారు అక్బర్ యొద్దనుండియే నేర్చుకొనిరి.

రాజ్యవిభాగములు.

అప్పటి రాజ్యములోని గొప్ప విభాగములకు సుబాలనియు నందలి యధికారులకు సుబేదారులనియు పేళ్ళు. అప్పటి సుబా లిప్పటి ప్రైసిడెన్సీలవంటివి; అప్పటిసుబేదారు లిప్పటిగవర్నర్ల వంటివారు. అక్బర్ రాజ్య మీ క్రింది పదునాఱు సుబాలుగా విభజింపఁబడి యుండెను. 1. కాబూల్, 2. లాహోర్, 3. ముల్తాన్, 4. సింధ్ (టట్టా), 5. గుజరాధ్, 6. మాల్వా, 7. అజ్‌మీర్, 8. దిల్లీ, 9. ఆగ్రా, 10. అలహాబాద్ (ప్రయాగ), 11. ఔధ్ (అయోధ్యా), 12. బహార్, 13. బంగాల్, 14. వరాడ్ (బీరార్), 15. ఖాన్‌దేశ్, 16. అహమ్మద్‌నగర్. ఓడ్యా, కాశ్మీరము లను రెండుసుబాలు వెనుకనుండి రాజ్యములోఁ జేర్పఁబడెను. ఈ ప్రదేశములందలి సుబేదారులు సైనిక సంబంధమైనట్టియు, ప్రజాపరి

పాలన సంబంధ మైనట్టియు, జమాబంది సంబంధ మైనట్టియు సర్వాధికారములు కలిగియుండిరి. అన్నిసుబాల యాదాయము కలిసి బదునాలుగు కోట్ల రూపాయలు వచ్చుచుండెను.

సైన్య వ్యవస్థ.

అక్బరుయొక్క సైన్యవ్యవస్థయు మిక్కిలి ప్రశంసనీయముగా నుండెను. ఆసైన్యములో నైదువేలకంటె నెక్కుడు సైన్యమునకు నధిపతి యగువానికి 'అమీర్' అనియు, నైదువేలకంటె తక్కువ సైన్యమునకు నధిపతి యగువానికి 'మన్‌సబ్‌దార్' అనియు బిరుదునామము లుండెను. అమీర్, మన్‌సబ్‌దారులు కలిసి 415గు రుండిరి. అందు 51 మంది హిందువు లుండిరి. వీరుగాక చిన్నచిన్నయధికారులనేకులుండిరి. ఇట్టి వారి సంఖ్య 1400 వఱకుండెను. రాజపుత్రుఁడగు సలీం పదివేల సైన్యములకు నధిపతియగు అమీరుగను, రెండవకొమారుఁడగు మురాద్ ఎనిమిదివేలకును, మూఁడవ కొమారుఁడగు డ్యానియల్ ఏడువేలకును అధికారులై యుండిరి. రాజపుత్రులకుఁ దప్ప సాధారణముగా నితరులకు నైదువేలకంటె నెక్కుడుసైన్యముల మీఁది యధికారము దొరుకుట లేదు. సలీం పుత్రుఁడైన ఖుస్రూయనువానికి నైదువేల సైన్యాధికారమీయఁబడెను. మన్‌సబ్‌దారునకు నెలకు నూటయేఁబది మొదలేడువందల రూపాయల వఱకును, అమీరులకు నంతకంటె నెక్కుడుగను జీతము లుండెను. అమీర్, మన్‌సబ్‌దారుల పేళ్ళన్నియు ఐనే అక్బరీ గ్రంథములో వివరముగా నీయఁబడియున్నవి. వానిని జూడఁగా హిందూదేశములోని మహమ్మదీయులకంటె తురక, పారసీక, అరబ్బీదేశముల లోని మహమ్మదీయులెక్కుడుగౌరవింపఁబడుచుండిరని కాన్పించుచున్నది.

ఈ యధికారుల చేతిక్రిందనున్న సైన్యముల కర్చునిమిత్తమై వీరికి జాగీరులొసంగు పద్ధతి పూర్వమునుండి యుండెను. కాని యందువలనఁ బ్రజలకు బాధ కలుగుచుండెను. అధికారులిష్టమువచ్చినంత ధనమును ప్రజలయొద్దనుండి రాఁబట్టుకొనుటయే గాని తగినంత సైన్యమును నుంపకపోయిరి. అందుచే నక్బరాపద్ధతినిమార్చి యధికారులకు

రొక్కమొసఁగుచు వచ్చెను. రొక్కమిచ్చుటకుఁ బూర్వ మాయధికారి యొద్ద నియమిత సైనికులు కలరా లేరాయని నిశ్చయపఱుచుకొనుచుండెను. ప్రతిసైనికుని ముఖచర్యను గనఁబఱుచు పట్టికయొకటి వ్రాయించి యుంచ వలయునని నియమించెను. గుఱ్ఱములసంఖ్య తగ్గఁగూడదనియు, గుఱ్ఱములు మాఱుపడఁగూడదనియు వానిపై రాజముద్రతోఁ గాల్చుచుండిరి. ప్రతి యధికారియుఁ దనసైన్యములోని పశువులవివరమును, నితర వస్తువుల వివరమును చూపు పట్టిక యొకటి యుంచవలయునని అక్బర్ శాసించెను. ప్రతి మన్‌సబ్‌దారుని యొద్దను తుపాకిబంట్లకంటె రెండింతలు కాల్బలమును, వారికంటె రెండింతలు గుఱ్ఱపుసైనికులును మిగిలినవారు విల్లనంబులు గలవారుగను నుండిరి. అక్బరుయొక్క సైన్యమంతయుఁ గలిసి యింతయుండెనని చెప్పుటకు వీలులేదు. అయినను ఆతనియొద్ద రెండులక్షలసైన్య ముండెనని కొంద ఱూహించి యున్నారు.

అక్బర్ సైన్యములో మోగల్ సైన్యమనియు, రజపుత్ సైన్యమనియు ముఖ్యవిభాగములు రెండు. అందు పైనిపర్ణింపఁబడిన రొక్కపు పద్ధతి మోగల్ సైన్యములను గుఱించినది. రజపుత్ సైన్యమనఁగా రాజపుత్రుల సైన్యమని యర్థము. వారికిమాత్రము పూర్వమువలెనే జాగీరులీయఁబడుచుండెను. ఈ జాగీరులువంశపరంపరగా జరుగుచుండెను. మొదట రాజపుత్రులుబాదుషాసైన్యములో నుండుటకు నిష్టపడినవారుకారు. కాని వారిని అక్బర్ అమీరులతో సమానముగాఁ జూచినందున వారు దిల్లీశ్వరునిసేవ నంగీకరించిరి. అక్బర్ రాజపుత్రుల యెడ మిక్కిలి గౌరవభావమును కలిగియున్నందున వారును స్వామిభక్తితో నాతనికొఱకనేక యుద్ధములు చేసి యనేకరాజ్యముల గెలిచియిచ్చిరి.

న్యాయవిచారణ.

న్యాయవిచారణచేయుటకు మీర్ ఆదిల్, కాజీ అనునిద్ద ఱధికారులుండిరి. అందు ధర్మనిర్ణయము (Point of Law) చేయుట కాజీయొక్కపని. కలహాంశములను (Facts) నిర్ణయించి తీర్పుచెప్పుమని మీర్ ఆదిల్ అనువానికి మనుధర్మశాస్త్రమును, మహమ్మదీయధర్మశాస్త్రము

లను అనుసరించి యక్బర్ తన శిక్షాస్మృతి నేర్పఱచెను. ఏనాదివాండ్రను వశపఱచుకొని ప్రస్తుతపు పోలీసువారుచేయు గ్రామసంరక్షణవిషయమైన పని వాండ్రచే జేయించెను. కొత్వాలనువాఁడు వారిమీఁది యధికారి. పల్లెల లోని వ్యవహారములన్నియు గ్రామస్థులే చక్కఁబఱుచు కొనుచుండిరి.

లెక్కలు

తనరాజ్యములోని యాదాయవ్యయములయొక్క వివరము చక్కఁగఁ దెలియుటకును, అధికారుల్ ధన మపహరింపకుండుటకును, తన రాజ్యంలోని యన్నికచేరీలలోను లెక్కలశాఖ యొకటి నిర్మించెను. ఈ శాఖవారు దినదినము లెక్కలును, నెలలెక్కలును, మూడునెలల లెక్కలును ఆయా కాలములందుఁ బాసి పంపుచుండిరి. తన బొక్కసము లోని రత్నములు మొదలైన వెలగలవస్తువుల గుర్తులతోఁ బట్టిక వ్రాయించి వానివెల నిర్ణయించెను. మత్స్యపుహారములను గట్టించి, ముడి యొద్ద ముద్రలువేయించెను. నాణెములు చేయుటకై టంకశాలఁ గట్టిం చెను. నాణెముల లోహములో మోసములేకుండ బహుజాగరూకతతో స్వయముగాఁ జూచుచుండెను. ఈ నాణె మింతమందము ఇంతవెడల్పు కలిగి యుండవలయునని యతిసూక్ష్మనియమము లేర్పఱిచెను.

జాగరూకత

తన్ను సంబంధించిన పనులన్నియు మిక్కిలి - జాగరూకతతోఁ జేయుచు, నక్బర్ వానిని గుఱించి యతిసూక్ష్మ నియమములను జేసెను. ఏనుఁగును, గుఱములు మొదలగు వానియాహారమును గుఱించియు, నాతఁడు విచారించుచుండెను. ఏనుఁగులకు నాహారము సరియైనది మావటి వాండ్రు పెట్టనందున నవిచిక్కుటచూచి, యేయే యాహారలోపమున నేనుఁ గెంతెంత చిక్కునో కనుఁగొని, యట్టియేనుఁగులను పదునాఱు పఱమూలుగా విభజించెను. అందువలననే యాతనిసూక్ష్మబుద్ధి సంతతజాగ రూకతయు వెల్లడి యగుచున్నవి. యక్బర్ తన భోజనపానాదులను గుఱించి మిక్కిలి జాగ్రత్తతో వర్తించుచుండెను.

సంస్కరణములు

అక్బరుచేసిన సంస్కరణములలో మొట్టమొదటిది పక్షపాతము లేక మతభేదమునెంచక తనప్రజలనందఱిని సమానముగాఁ జూచుట. అంచలకుఁ దూర్వము హిందువులకు విధింపఁబడిన 'జజియా' పన్ను తీసివేసెను. సహగమనమును మాన్పెను. హిందువులలోని యతిబాల్య వివాహమును మాన్పుటకు యత్నించెను. పరమతము నెడల మహమ్మదీయులకుంగలదురభిమానము నిషేధించెను. హిందూమహమ్మదీయపారసీకాది మతములఁ బరిశీలించి నూతన మతమొకటి స్థాపించెను. స్త్రీపున ర్వివాహమును అభివృద్ధిచేయవలయు నని యత్నించెను.

అక్బరుయొక్క ధర్మమతము

మొదట నక్బరునకు మహమ్మదీయమతమునందు కొంత విశ్వాసము కలదు. కొమారుఁడు కలుగవలయునని యాతఁడు అజీమీర్ పట్టణములోని పీరుకుమొక్క, మొక్క చెల్లించుటకు రెండువందలమైళ్ళు నడచివెళ్ళెను. కాని 1574లో అబుల్ ఫజల్ అనువానితో స్నేహము కుదిరినప్పటినుండియు నాతనికి మహమ్మదీయమతమునందు నౌదాసీన్యము కలిగెను. పారసీకవర్షారంభమునందు నౌరోజాయను నుత్సవముచేయఁబడును. అట్లు చేయుట మహమ్మదీయగురువులకు ధర్మవిరుద్ధమని తోఁచినను, అక్బరు ఆయుత్సవములను జేయుచునేయుండెను. ఏడుపారములును ఏడువర్ణముల దుస్తుల ధరించి, యక్బరు సప్తగ్రహములను బూజించుచుండెను. ఆతఁడు తన రాజపుత్రవంశపురాణులతోఁగూడి యజ్ఞములను నితర హిందూధర్మవిధులను జేయుచుండెను.

ఆ కాలమందలి మతగురువులకు ఉల్మా లనిపేరు. రాజసభలో వారికి మిక్కిలి గౌరవ ముండెను. రాజ్యములోని మతసంశయము లన్నిటినిఁ దీర్చువారు వీరే యైనందున తమమతమును నంగీకరింపని జనులను వీరు మిక్కిలిబాధపెట్టుచుండిరి. బాదుషాహా మతాభిమానము వదలి పరమతముల ననుసరించుట చూచి వారికి మిక్కిలికోపము వచ్చెను. కాని

వారుచేయు నక్రమములఁజూచి వారియెడ రాజునకును, ప్రజలకును తిరస్కారభావము కలిగెను.

అప్పుడు హిందూదేశమందలి మహమ్మదీయులలో షియా, సునీ, సూఫీ అను మూఁడుపథము లుండెను. ఒక పక్షమువారు మఱియొకపథము వారితోఁ బోరాడుచుండిరి. మనవారు కొంద ఱిప్పుడు వీరభోగవసంత రాయఁడు పుట్టునని తలఁచినట్లు అప్పటి మహమ్మదీయులు మతోద్ధారకుఁ డొక్కఁడు పుట్టునని ప్రతిదినమును ఎదురుచూచుచుండిరి. వీరుగాక పశ్చిమసముద్రమున నున్న పోర్చుగీజ్ రాజ్యమైన గోవాపట్టణములో రోమన్ క్యాథలిక్ క్రైస్తవ మతగురువులు తమమతమును బోధింప సాగిరి. ఉత్తరహిందూదేశమున గురునానక్ అనువాఁడును కబీర్ అను వాడును రామకృష్ణులిద్దఱును ఒక్కటియేయని ప్రతిపాదించు నూతన పథముల నేర్పఱిచిరి.

మతములస్థితి

పైని వర్ణింపబడినట్లుండఁగా షేక్‌ముబారిక్ అను మహమ్మదీయుఁడు మత సంస్కరణము బోధింపసాగెను. అతఁడు మొదట సునీపథములోని వాఁడు. ఉత్తరహిందూదేశమంతయుఁ దిరిగి యనేక గురువులయొద్ద విద్యాధ్యయనముచేసి ప్రాణముగల జ్ఞానభాండారమని బిరుదువహించెను. కొన్నిదినములకు సునీపథమును విడిచి షియాపథ మును స్వీకరించి యాగ్రాపట్టణముకో రాజువలనఁ గొంతసహాయము వడసి కాపురముండెను. అచ్చట నధ్యాపకుని పనిచేయుచుండెను. ఇతనికి 1547 లో అబుల్‌ఫైజీ యను పెద్ద కొమారుఁడును 1551 లో అబుల్ ఫజల్ అను చిన్నకొమారుఁడును పుట్టిరి. ఇతఁడు సంస్కరణాభిలాషి యగుటచే ధర్మగురువు లితనిని పతితుఁడనియెంచి బాధలుపెట్టసాగిరి. ఇందుచే నితఁడచ్చటనుండి పాఱిపోయెను. ఇతనికుమారులు మాత్ర మాగ్రాలోనే యుండిరి. వారప్రతిమవిద్వాంసులై యప్పటిజనులకు నెంతయు వంద్యులైరి. పెద్దవాఁడగు ఫైజీ సూఫీపథములోని విఖ్యాతకవియు, నీశ్వరభక్తుఁడును అయ్యెను. ఎల్లప్పుడునేదియో యోచించుచునే యుండును. ఒకప్పుడు పుష్పసుల సువాసనాసౌందర్యములందు నిమ

గ్నుఁడై చక్కని కవిత చెప్పుచుండును; మఱియొకప్పుడు భక్తిపురస్సరమైన యీశ్వరస్తవము చేయుచుండును. అతనిచే రచింపఁబడిన పద్యము లక్బరు చెవినిఁబడఁగా నాకవినిఁ బిలిపించుకొని యాబాదుషాహ తన యొద్ద నుంచుకొనెను (1568). అప్పుడు ముబారిక్ తనకుమారుల యొద్దికి వచ్చెను.

ముబారిక్‌యొక్క రెండవకుమారుఁడగుఅబుల్‌ఫజల్ అప్రతిమ విద్వాంసుఁడు. అనుపమేయ లౌకికవ్యవహారదక్షుఁడు. బాదుషాహకును ఇతనికిని స్నేహముకలిగి యది మిక్కిలి దృఢమయ్యెను. ఇతని యుపదేశమువలననే యక్బరునకు సకలమతములయందు సమానభావముకలిగెను. మోగల్ చరిత్రయను నభోమండలమునందు అక్బర్, అబుల్‌ఫజల్ అను వాఱిద్దఱును సూర్యచంద్రులవంటివారు. ఆకాలమునందలి యితరపండితులకంటె వీరిరువురను దూరదృష్టియు, నౌదార్యమును, పరమతసహిష్ణుతయు, తత్త్వజ్ఞానమును గలిగియుండిరి.

అబుల్‌ఫజల్‌కును, అక్బరునకును స్నేహముకలిగినప్పుడు బాదుషాహయొక ధర్మసంకటములో మునిఁగియుండెను. ఆగ్రాపట్టణములోని సునీమతస్థులగు న్యాయాధీశులనేకజనులకు షియాపథమును స్వీకరించినందులకై దేహాంతశిక్ష విధించియుండిరి. ఆశిక్ష ననుసరించి వారిని వధింపుమని అక్బర్ బాదుషాహను బీడింపసాగిరి. ఈధర్మాధికారులందఱును మతగురువులైనందున వారిమాటతీసివేయుటకు బాదుషాహ భయపడుచుండెను. కాని యన్యమతమును స్వీకరించినందులకై జనులను వధించుట దోషమని తలఁచుచుండెను. ఇట్లక్బరేమిచేయుటకును దోఁపకయుండఁగాఁ దనతండ్రికి శత్రువులను ఉల్మాలను సాధించి వారియధీకారము రూపుమాపుట కది మంచిసమయముకదా యని తలఁచెను. కాని వ్యవహారచతురుఁడగుటచే నొకయుక్తిని బన్నెను. బాదుషాహ యెదుట నుల్మాలందఱును దమతమపాండిత్యములను గనఁబఱుచుచు ధర్మవిషయమై తమకుఁగల మతభేదములను గుఱించి వాదవివాదములు జరుగునట్లేర్పాటుచేసెను.

మతవివాదసభలు

ఈసభలు జరుగుటకై యక్బర్ 1576 లో ఫతేపూర్ సిక్రీపట్టణమునందు భవ్యమైన మందిరమొక్కటి కట్టించెను. అందుఁ బ్రతిగురువారమునాఁడును ఉల్మాలందఱును తమతమ మతములఁ బ్రతిపాలించుచుండిరి. ఆవాదములలోఁ బ్రశ్నలడుగు నధికారము అబుల్ ఫజల్‌కును, తీర్పుచెప్పు నధికారమక్బరునకును నుండెను. వాదవివాదసభలోనికిఁ గ్రమక్రమముగా నన్య మతస్థులును రాసాగిరి. ఆసభ చతుశ్శాలలుగా విభజింపఁబడి, యొకొక్కశాలలో నొకొక్కమతమువారు గూర్చుండుచుండిరి. ఇతరజనులును వచ్చి యుపన్యాసముల వినుచుండిరి. ప్రశ్నలడిగి యబుల్ ఫజల్ వాదమునుప్రారభించును. బాదుషాహా గాంభీర్యముతో వాదమంతయు వినుఁ జక్కఁగ సంభాషించినవారినిఁ గొనియాడుచు బహుమతు లొసంగుచుండెను. సునీ, షియా, సూఫీయనుమహమ్మదీయ మతస్థులును బ్రాహ్మణ, బౌద్ధ, క్రైస్తవ, యహూది, పారసీక మతగురువులును తమతమ మతాధిక్యతను ప్రతిపాలింపసాగిరి. ప్రతివాఁడును భయమునువిడిచి స్పష్టముగ తనయభిప్రాయములఁ దెలుపుచుండెను. ఒకొక్కపర్యాయము వాదవివాదముచేయువారు బిగ్గరగా నఱచి యొకరినొకరు తిట్టుకొని యల్లరిచేయుచుండిరి.

కొన్నిదినములవఱకు వాదవివాదములు జరిగినతరువాత మహమ్మదీయ మతాధికారులకు నొక రెండుగ్రంథములలోని యంశములుతప్ప మఱేమియుఁదెలియదని అక్బరునకుఁ దెలిసెను. ఆ మతాధికారులలోను మతవిషయమై యైకమత్యములేదని యాతఁడు కనుఁగొనెను. అందుచే నాతనికి వారియందుఁగల శ్రద్ధ తప్పెను. అంతకుబూర్వము మతవిషయమై యుల్మాలందఱును గలిసిచెప్పినయంశము నందఱును నొప్పుకొనుచుండిరి. ఇఁకమీఁద వారిలో వానికి మతభేదము కలిగినప్పుడు బాదుషాహచేయుదీర్పు వారొప్పుకొనవలయునని యక్బర్ నియమించెను. వారందులకు మొదట నొప్పుకొనకపోయిరి. కాని విధిలేకతుదకు నొప్పుకొనుచు కాగితముమీఁద సంతకములుచేసిరి (1579). ఇట్లు మతవాదవివాదములు ప్రారంభించిన నాలుగు సంవత్సరములలో మహమ్మదీయ

ధర్మగురువుల యధికారమంతయు లోపించి యబుల్ ఫజల్ కోశ్రేకొన సాగెను. క్రమక్రమముగా మహమ్మదీయమతమునందలి శ్రద్ధపోయి కొన్నిదినములవఱకు క్రైస్తవమతమునందు నభిమానము కలిగెను. గోవాపట్టణమునుండి క్రైస్తవమతగురువులు వచ్చి ఏసుతనికిఁ బెబిలు గ్రంథము బోధించిరి. దాని నాతఁడు శ్రద్ధతోఁజదివెను; వారిని గౌర వించెను; వారికి భజనమందిర మొకటి కట్టి యిచ్చెను. కాని క్రైస్తవ దీక్షనుమాత్రము స్వీకరించినవాఁడుకాఁడు. ఇట్లన్నిమతములను పరిశో ధించి సకలమతసారమగు నొక నూతనమతమును స్థాపించెను.

నూ త న మ త స్థా ప న

కొన్నిరాజకారణములవలన నక్బర్ 1582 లో ఆగ్రాపట్టణమును వదలి లాహోర్‌పట్టణమును రాజధానిగాఁ జేసికొనెను. అంతకుఁ బూర్వమే యొక నూతన మతమునుస్థాపించెను. ఆమతమునకు 'దీనే ఇలాహి'యని పేరుపెట్టెను. సృష్టిలోని చమత్కారములను జూచి సృష్టి కర్తయొక్క మహాత్మ్యమును గనుఁగొన వలయు ననిన సిద్ధాంతము ననుసరించి యీనూతన మతమేర్పఱుపఁబడియె. లాహోరు పట్టణము నకుఁ బోయినతరువాత, నక్బరు మహమ్మదీయమతమును బహిరంగ ముగా వదలి, నూతనమతమును లోకులకు బోధచేయసాగెను. అందుచే మహమ్మదీయు లాతనిని ద్వేషింపసాగిరి. అతఁడనేకములగు మసీదులను గుట్టపుశాలలుగా మార్చెను. హిందువులమీఁదిజిజియాపన్ను తీసివేసెను. రాజసభలో జాతినిబట్టిగాని మతమునుబట్టిగాని, యదివఱకు సరదారులలో నుండినభేదము మాన్పెను. ప్రాతఃకాల, మధ్యాహ్న, సాయాహ్నములను, త్రికాలములయందు సూర్యోపాసన చేయుచుండెను. సంవత్సరమున కొకసారి నూతనాగ్నిని ప్రేల్చిపూజించెను. ఈ నూతన మతమునకు నక్బరే యాచార్యుఁడయ్యెను. అంతకుఁ బూర్వము రాజమందిరములో జరుగు చున్న మహమ్మదీయ మతసంబంధమైన యుత్సవముల నాపివేసెను. పారశీకశకమును. ఉత్సవములును తనరాజ్యములోఁ ప్రారంభిం చెను. గోహత్య, గోమాంసభక్ష్యముల వర్జించెను. గడ్డముపెంచుట,

పినతండ్రికొమార్తెను వివాహమాడుట మొదలగు మహమ్మదీయుల యాచారముల నిషేధించెను. 1583లో తిలకముధరింపఁ దొడఁగెను. నూతన మతమును స్వీకరించిన వారికి 'అల్లాహోఅక్బర్' అనుమంత్రమును బోధించుచుండెను. ఈవాక్యములోని అక్బర్ శబ్దమునకు రెండర్థములు గలవు. అక్బరనఁగా గొప్పవాఁడని యర్థము; అక్బరనఁగా బాదుషాహా పేరు. కావున.నావాక్యమునకు 'ఈశ్వరుఁడు గొప్పవాఁడు' 'అక్బరే ఈశ్వరుఁడు'.అని రెండర్థము లగుచుండెను. క్రొత్తగా నక్బరుచే నేర్ప ఱుపఁబడిన మతమును స్వీకరించినవారి పేళ్ళ అబుల్ ఫజల్ వ్రాసియుంచినాఁడు. అందు బీరబల్ ..అనుహిందూమంత్రియొక్క పేరు కానవచ్చుచున్నది.ఈనూతనమతస్థాపనమునకు బీరబలుఁడే బాదుషాహను ప్రోత్సాహపఱిచెను. ఇతని బోధవలననే యక్బరునకు సూర్యోపాసనయందు శ్రద్ధ కుదిరెను. పొలములోని పైరులు, తోఁటలలోని ఫలవృక్షములును, సకల ప్రాణికోటికి జీవనాధారమైన ప్రకాశమును, సూర్యునివలననే మనకుఁ గలుగుచున్నందున నాతఁడీశ్వరాంశమని యితఁడు బాదుషాహకు బోధించెను. అగ్నియగ్ని, జలము, ధేనువు, వృక్షములు మొదలగువానియందు నీశ్వరాంశమున్నదని యాతని సిద్ధాంతము.

ఇట్లక్బరు నూతనమతమును స్థాపించి యందులకుఁ దాను మతగురువైనను, తన మతమును స్వీకరింపుఁడని జనులను బాధపెట్టినవాఁడు కాఁడు. పరమత సహిష్ణుతయే పరమధర్మ మని యాతని తాత్పర్యము. 'ధర్మ మతములనుగుఱించి జనులను బాధపెట్టినందున లాభములేదు. బాధ కలిగినంతవఱకు జనులు తమ మతముల దాఁచియుంచెదరు. బలవంతపఱిచినందున లోకుల నిజమైన యభిప్రాయము మాఱనేరదు' అని యబుల్ ఫజల్ వ్రాసెను. ఇది యక్బర్ మతము.

పరమత సహిష్ణుతలోను, ఇతరవిషయములలోను అక్బరును అశోకచక్రవర్తితోఁ బోల్చవచ్చును. తండ్రిపోయినపుడుభయులును శత్రువులతోఁ బోరాడుచుఁ బంజాబులో నుండిరి. తరువాత రాజ్యములోని కల్లోలములనణఁచి, రాజ్యము విస్తారముచేయుటకు నుభయులకును గొంతకాలము పట్టెను. నర్మదానదికి నుత్తరమందున్న హిందూదేశ

మంతయు నుభయులకును బూర్తిగ స్వాధీన మయ్యెను. పరమత, సహిష్ణుత, తామే శ్రేష్ఠుల మనుకొనిన మత గురువుల గర్వమడఁచుట, యనేక మతముల పండితుల వాద వివాదముల ఁజూచుట మాంసాహారమును వర్జించుట యను విషయము లీ యుభయ చక్రవర్తులకును సమానముగాఁ జెల్లును. అక్బరు యొక్క పరమత సహిష్ణుతను గుఱించి యాంగ్ల కవివరుడగు టెనిసన్ ఇట్లు వ్రాసియున్నాఁడు. 'పర మతస్థులను బాధపెట్టుట మాని, సకల మతములను సమానభావముతోఁ జూచి యక్బర్ మన ట్యూడర్ వంశపు రాజులకు సిగ్గువచ్చునట్లు చేసెను.'

అక్బర్ గుణావగుణములు.

మొత్తముమీఁద నీ బాదుషాహ యప్రతిమరాజు అని చెప్పుటకు సందేహములేదు. ఈతనియందు ననేక విశేష గుణము లుండెను. 'వినవలె నెవ్వరు చెప్పిన, విని నంతనె తమక పడక వివరింపవలెన్. విని కని వివరము తెలిసిన, మనుజుఁడె పో నీతిపరుఁడు మహిలో వేమా॥' యను పదములోని తత్వము నీ బాదుషా చక్కఁగ నెఱిఁగి యుండెను. ఒకరి యనుమతి ననుసరించి పోవుట రాజులలో నుండు సాధారణ దుర్గుణము. అది యీతనియందు లేదు.

బాణ సంధానమునం దీతఁడు నిపుణుడు. ఖడ్గముతోఁ బోరాడుటయందుఁ బారీణుడుఁ. ఈతనికి 'సంగ్రామ' మను కత్తిగలదు. దానితో నీఁతడు వేలకొలఁది శత్రువులను సంహరించెను.

అక్బరునకుఁ జిన్ననాఁడు విద్యనేర్పనందున సింహాసనారూఢుఁడగు సమయమున నాతనికిఁ జదువుటయు, వ్రాయుటయు రాదు. తరువాత నాతడు విద్యనేర్చెను. అనేక గురువులయొద్ద ననేక శాస్త్రముల నభ్యసించెను. దేశ చరిత్రలు చదువుటయందు నతనికి మిక్కిలి యభిలాషగలదు. ప్రతి పుస్తకమును మొదటినుండి తుదవఱకుఁ జదువును. ప్రతి దినమును ఒక విద్వాంసుఁ డాతనికిఁ పుస్తకములఁ జదివి వినిపించును. దిన మే పుటవరకుఁ జదువునో యాపుటము మీఁద బాదుషాహ తేదీ వేసియుంచును. కొన్ని గ్రంథము లాతఁడు మరలమరలఁ జదువును.

ప్రజలకు న్యాయము కలుగఁజేయవలయు నని యాతఁ డెల్ల ప్పుడును తత్పరుఁడై యుండును. తానున్న గ్రామములోని గొప్ప వ్యాజ్యములన్నియుఁ దానే విచారించును. రాజు సమ్మతిలేనిది కఠిన శిక్షలు ప్రజలకు విధింపఁగూడదని యాతని శాసనము. మూఁడు పర్యాయములు బాదుషాహు తనసమ్మతిని గనఁబఱుపనిది యెవ్వరికిని దేహాంతశిక్ష విధింపఁ బడుటకు వీలులేక యుండెను. ప్రతిదినమును ఒక్కసారి రాజసభ జరుగును. అందు నక్బర్ తన ప్రజల మొఱలాల కించును; వారొసఁగిన కట్నములను కానుకలను స్వీకరించును. ఇట్టి సమయములయందు నాతఁడు సింహాసనము మీఁద గూర్చుండక ప్రక్క నిలచి యుండును. జనసామాన్యమును అతఁడు మిక్కిలి ప్రేమతో జూచును. గొప్పవారగు సరదారులు మాత్రమాతనికి భయ పడుచుందురు. అతని యంతఃకరణమునందుఁ గాఠిన్య మృదుత్వము లను విరుద్ధ గుణములు నివసించి యుండెను.

రాజ్య వ్యవహారమునకు సంబంధించిన యనేక విద్యల నక్బర్ నేర్చియుండెను. తుపాకులు, ఫిరంగులు మొదలైన యుద్ధసాధనము లఁజేయుట యెఱింగి కోటయొక్క యావరణములో ఫిరంగులఁ జేయు కర్మశాల యొకటి స్థాపించి, తన కనుల యెదుట నాపనులఁ జేయించు చుండెను. అచ్చటఁ జేయబడిన ప్రతి ఫిరంగికిని నొకపేరు పెట్టెను.

పౌరుషసూచకములగు కుస్తీపట్లు, కసరత్, వేఁట మొదలైనయాటల యెడ బాదుషాహకు విశేషప్రీతిగలదు. వేఁటనిమిత్తమై యనేకములైన గుఱ్ఱములను, ఏనుఁగులను, లొట్టిపిట్టలను పెంచి వానికి నావశ్యకమైన విద్యల నేర్పెను. ఆ మృగముల నన్నింటికి వేర్వేఱు పేళ్లు పెట్టి యా పేళ్ళతో వానిని గుర్తించుచుండెను. చిఱుతపులులకుఁగూడ వేఁటా డుట నేర్పఁబడియుండెను.

అక్బర్ రాత్రిసమయములందు మూఁడు గంటల కాలము మాత్రము శయనించును. పగలు కొద్దికాలము నిద్రపోవును. మిగిలిన కాల మంతయు రాజ్యకార్యమునందునో, విద్వద్గోష్ఠి యందునో కడపుచుండును.

తానుచేసిన ప్రతి కార్యమును వ్రాసియుంచుటకు నక్బర్ కొందఱు లేఖకుల నేర్పఱచెను. ఈ లేఖకులకు బాదషాహీత వారీఖు లని పేరు. పెద్ద పెద్ద పట్టణములలోను, ఇతర గ్రామములలోను జరుగు వర్తమానములఁ దెలుపుటకుఁ గొంద ఱధికారుల నియమిం చెను. రాజమందిరములో నొక గంట కట్టి దాని గొలుసు చివర వీధిలో నుండునట్లేర్పాటు చేసెను. బాదుషాహాయొద్ద మొఱ పెట్టు కొనఁ దలఁచినవాఁడు దానిని లాగినఁ జాలును. బాదుషాహ ప్రత్యక్ష మగుచుండెను.

అక్బరునకు మిక్కిలి శోధకబుద్ధి కలదు. యెంతయో ధనము వ్యయముచేసి యాతఁడు గంగానదియొక్క యుగమమును కనుఁ గొనెను. మానవునికి నీశ్వర భక్తి జన్మతఃస్వాభావికముగాఁ బుట్టునని కొందఱును, చుట్టునున్న తలిదండ్రులు మొదలయినవారు నేర్పినందున మానవునికి నీశ్వరభావము పుట్టును గాని యది స్వాభా విక ముకాదని కొందఱును వాదించుటఁ జూచి, నిజముఁ గనుఁ గొను నిమిత్తమై యిద్దఱు బాలురను పుట్టినప్పటినుండియు నే కాంత మందుంచి వారికి నాహారము మాత్రము పెట్టించుచు, మనుష్య సంసర్గము లేకుండఁ బెంచెను. కాని తుదకు నా శిశువులు మూగ వారైనందున నేమియుఁ గనుఁ గొనుటకు వీలులేకపోయెను.

కొన్ని దుర్గుణములు

చరిత్ర కారులకుఁ బక్షపాతముతోఁ బనిలేదు. ఉన్నది యున్నట్లు వ్రాయుట వారిపని కావున నీమహా పురుషుని యందుఁగల దుర్గుణముల ' గొన్నింటి నిచ్చటఁ బేర్కొన వలసి యున్నది. ఒకప్పుడీ బాదుషాహ క్రూరస్వభావమును గనఁబఱుచు చుండెను. తన సేవకుల చిన్న చిన్న పనులలోఁ జొరఁ బడినను వారి కనేకపర్యాయములు దేహాంతశిక్ష విధించెను. మతాం తరమును స్వీకరించిన తరువాత మహమ్మదీయులను మిక్కిలి నిష్ఠుర భావముతోఁ జూచుచుండెను. చితోడ్‌గడమును స్వాధీనముచేసి కొనిన తరువాత నచ్చటనున్న నిరపరాధులగు స్త్రీ వృద్ధాదులను గూడ నణఁకించెను. రాజ్యమునకు వచ్చిన తరువాతఁ బదునెనిమిదవ

యేట రెండువేలజనుల శిరస్సులఁద్రుంచి యొకగుట్టగాఁ బేర్పించెను. కాని యివి యన్నియుఁ బూర్వవయస్సులోఁ జేసినపనులు. అబుల్ ఫజల్‌తో స్నేహము కుదిరిన, తరువాతఁ గ్రమక్రమముగా నాతని స్వభావము మాఱెను. ఈ విషయమందును మన మీ చక్రవర్తిని అశోక చక్రవర్తితోఁ బోల్చవచ్చును.

అక్బర్ బాదుషాహయందు మఱియొక దుర్గుణముండెను. ఆతఁడు కొంతవఱకు నిషయలంపటుఁడనవచ్చును. ఆతనికి ననేక భార్యలు కలరు. పదునొకండ్రకంటె నధిక భార్యలుండిరని చరిత్రల వలనఁ దెలియుచున్నది. అయినను నాతడు పరస్త్రీల నభిలషించు చుండెనని యీ క్రింది కథానకమువలనఁ దెలియుచున్నది.

నౌరోజూ ఉర్సు

అక్బర్ సకలజనులకును, దనకును మనోరంజనము గలుగుటకై ప్రతిసంవత్సరము తన నగరమునందుఁ గొన్నిదినములు గొప్ప యుత్సవములు జరుపుచుండెను. ఆ యుత్సవము తుదిదినమునం దచట సర్వము స్త్రీమయముగానే చేయఁబడుచుండెను. ఆ స్త్రీ ప్రపంచములో ఆడువారును, పాడువారును, అమ్మువారును, కొను వారును, ఇతరమైన యుత్సవములఁ జేయువారును, చూచువారును అందఱు స్త్రీలే! ఆ దినము పురుషులకు ఆ యుత్సవము జరుగుచున్న స్థలమునకు వెళ్ళుటకు ననుజ్ఞ లేకయుండెను. కాన నాఁటిదినము బాదుషాహయొక్క యంతఃపురమునందలి స్త్రీలును, ఇతర రాజ పత్నులును ఆ యుత్సవమునందు నిరాతంకముగాఁ దిరుగుచుండిరి. అచటికిఁ బురుషులెవ్వరును రాకుండ కట్టుదిట్టములు చేయఁబడినను అక్బరుమాత్రము స్త్రీవేషమున నచట నితరుల కెఱుఁగ రాకుండు నటు సంచరించుచుండెను.

"ఆ యుత్సవమునకు నొక సంవత్సరము పృథివీరాజు భార్య వచ్చెను. కాని యా యుత్సవమువలన నామె కెంతమాత్రము సం తోషము కలుగలేదు. ప్రచ్ఛన్నవేషముతో నుండిన బాదుషాహా యత్యంతరూపవతియగు నా మగువనుగని మిగుల మోహితుఁడై, యామెమఱలి వెళ్ళుమార్గమున నామెరాకనిరీక్షించుచుండెను. ఇంతలో

నా సాధ్వీమణి మఱలి తన నగరునకుఁ జనుటకై బాదుషాహా కాచుకొని యుండిన మార్గమునఁ బోవఁదొడఁగెను. అట్లు వచ్చు సుందరిని నకస్మాత్తుగా నా ఢిల్లీశ్వరుఁ డరికట్టెను. తన్ను నరికట్టినవాఁడు అక్బరనియు, దురుద్దేశముతో నాతఁడట్లు చేసెననియు నా కాంత తెలిసికొనెను. అంతనామె తనవలెనే యితరస్త్రీల నెందరినో కపట స్త్రీ వేషధారియగు బాదుషాహ చెఱుప యత్నించి యుండునని తలఁచి క్రోధావేశ పరవశురాలయి మిగుల రోషముతోఁ గన్నుల నిప్పులురాల తన గుప్తఖడ్గమును చేతధరించి మిగుల ధైర్యముతో "పవిత్రమగు క్షత్రియ వంశమును కలంకమయము చేయఁదలంచిన దుష్టుని బారినుండి నా పాతివ్రత్యమును సంరక్షించుకొని యా ద్రోహిని నాచేతి ఖడ్గమునకుఁ బలి యియ్యగలను" అని పలికెను. ఇట్లు గంభీరస్వరముతోఁ బలికిన ధైర్యవతి పలుకులువిని బాదుషాహా కొంతవడి చిత్రప్రతిమవలె చేష్టలుదక్కి నిలువఁబడి, తదనంతర మాతఁడు విజ్ఞానవంతుఁడగు ప్రభువగుటచేఁ దన యజ్ఞానమునకు సిగ్గుపడి, యా కాంతకు నమస్కరించెను. నాఁటినుండియు బాదుషాహ పశ్చాత్తాపపరుఁడై యామెను తన సహోదరిగా నెంచుచుండెను".

ఇట్టి దోషములు కొన్ని యున్నను అక్బరునందె సద్గుణములు విశేషముగా నుండుటవలన 'ఏకోహిదోషో గుణసన్నిపాతే, నిమజ్జతీందోఃకిరణేష్వి వాంకఃʼ అను కాళిదాసోక్తి ననుసరించి యాతనిని మహాపురుషుఁడని చెప్పవలసియున్నది.

దినచర్య

రాజభవనమునకు వెనుకభాగమున నొకగవాక్షముండెను. ప్రతిదినము ప్రాతఃకాలమున బాదుషాహ యాగవాక్షము నొద్దికివచ్చి సూర్యునిఁబూజించును. అప్పుడక్బరును పూజించుటకై యసంఖ్యజనులు గూడుదురు. ఆ పూజావిధానము పూర్తియైన రెండుమూఁడుగంటలతరువాత బాదుషాహ యా గవాక్షమునొద్దికి వచ్చి క్రింద జరుగుచున్న కుస్తీపట్లను, సైన్యముల వ్యూహరచనాకౌశలమును పరీక్షించును. మధ్యాహ్నము రాజసభకుఁ బోవును. అచ్చట సింహాసనముపై నెక్కి

న్యాయవిచారణ చేయును. ఆ సభయందే పరదేశములనుండి వచ్చిన రాయబారులను, తన మాండలిక రాజులను, సరదారులను గౌరవించును. సాయంకాలమందు రహస్యమందిరములో నాప్తసచివులతోడ మంతనము చేయును. ఈరహస్యమందిరమునకు ఘుషాల్ ఖానా యని పేరు. ఆవశ్యకములైన రాజవిషయములు చర్చకు లేనప్పుడు ఇతర విషయములను చర్చించును.

చిత్రకళాభిరుచి

చిత్తరువులు వ్రాయు విద్యనుగుఱించి యక్బరునకు మార్మిక జ్ఞానము కలదు. చిత్రకారుల ననేకులరావించి గౌరవించి యావిద్యను అభివృద్ధి పఱిచెను. వారమున కొక్కసారి చిత్రకారులు తాము వ్రాసిన పటములను బాదుషాహ యొద్దికిఁ బంపుదురు, వానియోగ్యత ననుసరించి యాతఁడు వారికిఁ బహుమతులొసంగును. అతని యాస్థానమునందు విఖ్యాతిఁజెందిన చిత్రకారులు పదునెనిమిదిమంది యుండిరి. పుస్తకముల శోభను, ఉపయోగంబును నభివృద్ధిచేయు నాచారము నక్బరుచేఁ బ్రారంభింపఁబడియె. తనరాజసభలోని ప్రఖ్యాత పురుషుల పటములఁ దీయించి యొక పుస్తకముగాఁ గట్టించెను. "పరమేశ్వరుని నెఱుంగు విశేష సామర్థ్యము చిత్రకారులకుఁ గలదు. ఒకానొక మనుష్యుని ప్రతిమ వ్రాసి యందు జీవముఁబోయు సామర్థ్యము తనకు లేదనియు, ఈశ్వరునకు మాత్రము గలదనియుఁ జిత్రకారుఁడు చక్కఁగ నెఱుంగును. అందుచే నీశ్వరుని సామర్థ్య మాతనికి బాగుగఁ దెలియును" అని యక్బర్ వ్రాసియున్నాఁడు. సంగీత విద్యయందుఁ గూడ నాతఁడు ప్రవీణుఁడు.

విద్యాభిరుచి

అక్బర్ ప్రతిదినమును గ్రంథములు చదివించి వినుచుండె నని వెనుక వ్రాసియున్నాము. అట్లాతఁ డరబ్బీ పారసీక భాషలలోని గ్రంథములన్నియుఁ జదివె నని చెప్పినను జెప్పవచ్చును. ఎట్టి కఠిన గ్రంథమునైనను అన్వయించి యర్థము చెప్ప గలిగినట్టి సాహిత్య జ్ఞాన మాతనికి నాభాషలలోఁ గలిగెను. అనేక సంస్కృత గ్రంథము

లను పండితులచేఁ బారసీకభాషలలోనికి భాషాంతరీకరింపఁ జేసెను. బదావూనీ యనుపండితుడు రామాయణ మహాభారతములను అక్బరు కొఱకు బారసీ భాషలో వ్రాసెను. అక్బరు నొద్ద గ్రంథసంగ్రహము కూడ విశేషముగా నుండెను. ఫైజీ యను పండితునియొద్ద 8600 గ్రంథములుండెను. అక్బరునొద్ద నంతకంటె నెక్కుడు గ్రంథము లుండె నఁట! అక్బరు నాస్థానమునందు ననేక పండితులును కవులును ఉండిరి. అందు అబుల్ ఫైజి, అబుల్ ఫజల్, బదావూనీ యను వారు ముఖ్యులు. అతనిసభలో 38 మంది షేక్ అను సాధువులు, 69 మంది విద్వాంసులగు పండితులును, 15 మంది వైద్యులును, 153 మంది కవులును నుండిరి.

శరీరసామర్థ్యము

అక్బర్ మిక్కిలి పొడుగువాఁడును గాఁడు, మిక్కిలి పొట్టి వాఁడునుగాఁడు. విశాలమైన వక్షస్థ్సలమును, దీర్ఘబాహువులును గలవాఁడు. మిక్కిలి శరీర సామర్థ్యమును, ధైర్య సాహసములును గలిగియుండెను. మావటివానిని జంపి పాటిపోవు నేనుఁగుమీఁద చంగు మనియెగిరి కూర్చుండి దానిని వశపఱచుకొనును.

వైభవము

మిక్కిలి విశాలమైన రాజ్యమునకు నధిపతియై యందులకు దగినట్లు అక్బర్ మహావైభవమును అనుభవించెను. అతడు రాజ్యములోఁ దిరుగు సమయమున నాతని వెంట నుండు శిబిరమును జూచిన యెడల నది గదలుచున్న యొక మహాపట్టణమువలెఁ గాన్పించును. అక్బరుయొక్క వైభవమును జూచి గోవానుండి వచ్చిన క్రైస్తవ మత గురువు లచ్చెరు వొందిరి. అతడు లాహోరు పట్టణమునకుఁ బోవునపు డతనివెంట నైదువేలయేనుఁగు లుండెను. అయేనుఁగుల ఫాలభాగమునకు నినుముతోఁ జేయబడిన పలకలను, తొండమునకు కత్తులును, దంతమునకు చిన్న కత్తులును కట్టఁబడి యుండెను. ఒక్కొక్క యేనుఁగుమీద నలుగురు చాపధారులుగాని

తుపాకీవాండ్రుగాని కూర్చుండి యుండిరి. గోవా వాండ్రిట్టి వైభవమును జూచి దిగ్భ్రమఁజెందిరి.

కొద్ది లోపస్వభావవర్ణన

మొత్తముమీఁద విచారించి చూడఁగా ప్రజాహితముకై పాటుపడిన నృపశ్రేష్ఠులలో నక్బరొక్కఁడనుటకు సందేహములేదు. అందరి యంతఃకరణములను ఆకర్షించుకొనుటకు బాదుషా రేయం బగలు యత్నించు చుండును. ఎన్ని సంకటములు వచ్చినను మనస్సు చలింపనీయక యెప్పుడును సంతోషవృత్తి కలిగియుండును. పరమేశ్వరునికి నిష్టమగు సత్ప్రవర్తనయే కలిగియుండును. తత్వజ్ఞాన విషయమైన గహన విచారములో నెల్లప్పుడును మగ్నుఁడై యుండును. ఎవ్వఁడు వచ్చి యేమి మొఱ పెట్టుకొనినను సావధాన చిత్తుఁడై వినును. కోపము వచ్చినప్పుడు తగనిపనులను చేయఁడు. అతఁడనేకశారీరక మానసిక నిబంధనలను వీర్పఱచుకొనెను. లోకులు తన్ను ఆక్షేపింపఁగూడదని తనబాహ్యాచరణమును గుఱించి అతడు మిక్కిలి దక్షుఁడై యుండెను. ఎట్టిజాతి మతములు గలవారినైనను జూచి పరిహసింపడు. చేయఁదలఁచిన పనిని పూర్తిగఁ జేయునేకాని సగముచేసి విడువఁడు. మరల మరల నీశ్వరధ్యానముఁజేసి తన ప్రవర్తనము పరిశుద్ధముగ నున్నదో లేదో పరీక్షించుకొనును. అందఱు జనులకు సుఖము కలుగఁజేయవలయునని కోరుచుండును. కావున విశేషముగా దేహాంత శిక్షలు విధింపఁడు. ప్రతిదినము రెండుసారులు సకలజనులకుఁ గాన్పించును. నడిమి వా రెవ్వరు నక్కఱలేకయే లోకుల కష్టనిష్ఠూరముల వినును. లోకులను సంతుష్టులఁజేయుట తన సుఖమునకు ముఖ్యసాధనమని యెంచును; అని ఐనెఅక్బరీ అనుగ్రంథములో అబుల్ ఫజల్ వ్రాసి యుంచినాఁడు.

మోగల్ రాజ్యమును స్థిరపఱచుట

అక్బరుచేసిన మహాకార్యములలో రాజ్యమునందుఁగల భిన్న జాతుల వారినందఱినిఁ జేర్చుకొని వీలయినంతవఱకు వారికి నైక్యమును, రాజ్యమునందు నభిమానము గలుగఁజేసి మోగలరాజ్యము

నకు స్థైర్యముగలుగఁజేయుట ముఖ్యమైనది. మోగలులు, ఆఫ్‌గా
నులు, రాజపుత్రులు మొదలయిన వీరుల నందఱిని జేర్చి మహావైభ
వోన్నతులచే శోభిల్లు మోగలసామ్రాజ్యమును స్థాపించెను. అం
తకుఁ బూర్వపు మహమ్మదీయ రాజ్యములన్నియు క్షణజీవితములు
కలవి. ప్రజలకు బోధకలుగఁజేయునవి. ప్రజాహితమునందె లక్ష్యము
గల యీ సామ్రాజ్య మట్టిదికాదు. మతవిషయిక స్వాతంత్ర్యమును
పూర్తిగఁగలిగి ప్రజలు నిర్భయులై తమతమ కార్యములను నెఱవేర్చు
కొనుచుండిరి. అందుచే దేశమభివృద్ధి కాఁ దొడఁగెను. కలా
కౌశలములు బాగుపడెను. వర్తక మభివృద్ధి యయ్యెను. అక్బర్
కుమారుడును, మనుమడును అగు జహాంగీర్ షాజహానుల ప్రభుత్వ
కాలమందు నీ సామ్రాజ్య వైభవము విశేషముగా హెచ్చెను. ఇట్లు
లోకులను బాధపెట్టు క్షణభంగురమైన రాజ్యపద్ధతిని మాన్పి లోక
క్షేమైక దక్షత గల సుస్థిర సామ్రాజ్యమును స్థాపించిన యామహాను
భావుని నెంతకొనియాడినను తక్కువయే.

ఈ నూతన రాజ్యస్థాపనములో నాతఁడు ముఖ్యముగా రాజ
పుత్రులసహాయమును నమ్మియుండెను. వారి సహాయములేనిది యీ
దేశములో సుస్థిర రాజ్యమును బడయుట యసంభవమని యెఱిఁగి
వారితో స్నేహముచేసెను. ఏఁబది రాజపుత్రరాజులాతనికి నెప్పుడును
సహాయము చేయుచుండిరి. ఇట్లు హిందువులతో స్నేహమును, వారిని
గౌరవించుటయు, హిందూమహమ్మదీయులయెడ భేదము లేక పక్ష
పాతముచేయక యందఱిని సమానముగాఁ జూచుటయు నిచ్చట
రాజ్యముచేయఁదలఁచిన వారికుండవలసిన గుణమని యాబాదుషా
సోదాహరణ పూర్వకముగాఁ జూపెను.

అప్పటి యూరోప్ ఖండము

అక్బర్ హిందూదేశములో రాజ్యముచేయుచున్నపు డింగ్లం
డులో రాజ్యముచేయు రాణిపేరు ఎలిజాబేత్. ఈమె 1558 మొదలు
1603 వఱకు రాజ్యముచేసెను. ఇంగ్లండ్ దేశములోను, యూరప్ ఖం

డమ్ములోని యితర దేశములలోను ఆకాలమందు పరమత ద్వేషము విశేషముగా నుండెను. క్యాథలిక్ పంథమువారును, ప్రొటెస్టెంట్ పంథమువారను, ఎవరికి వీలయినప్పుడు వా రితర మతస్థులను జంపు చుండిరి. 1572 లో సెంటుబార్థోలోమి సంహారము జరిగెను. 1600లో రోము పట్టణమందు బ్రూనోయను వానిని గాల్చిరి. లూథర్, కెప్లర్, మొదలయిన గొప్ప విద్వాంసులకుగూడ భూత ప్రేతములమీఁదను, మంత్రములమీఁదను శేతబొళ్ళమీఁదను నమ్మికయుండెను. ఈ విషయమై విచారించినను అప్పటి హిందూదేశము యూరోప్ దేశము కంటె శ్రేష్ఠమైన దనుటకు సందేహములేదు. అప్పటి యూరోప్ ఖండములోని రాజ్యవ్యవస్థను రాజులయొక్క ప్రజాహితతత్పరతను గురించి విచారించిన యెడల అక్బర్ రాజ్యమునకంటె హీనముగనే యుండెనని చెప్పవలసి యున్నది. ఫ్రాన్సు దేశములోని ప్రజలు మిక్కిలి దరిద్రులైయుండిరి. ఇంగ్లండులోని ప్రజలుగూడ అక్బరు యొక్క ప్రజలకంటె నెక్కుడు సుఖముగలవారై యున్నట్లు కాన రాదు. తనరాజ్యములోని యనేకములైన పన్నులఁదీసివేసియు నైతు లకు నప్పిచ్చియు వలయునప్పుడు ధాన్య మొసంగియు నక్బరు ప్రజల రక్షించుచుండెను. ఈప్రజావాత్సల్య మెక్కడ? యూరోపు దేశములోని రాజులకును ప్రజలకును గల కలహము లెక్కడ?

అప్పటి జనుల నీతి

అబుల్ ఫజల్ తన యద్వితీయచరిత్ర గ్రంథమగు ఐనెయక్బరీలో నాకాల మందలి హిందువులను గుఱించి యిట్లు వ్రాసి యున్నాఁడు. "మొత్తముమీఁద హిందూజనులు స్వధర్మనిరతులు, స్నేహపాత్రులు, విద్యార్జనరతులు, న్యాయప్రియులు, కృతజ్ఞులు, సత్యవాదులు, స్నేహయోగ్యులు, విశ్వాసపాత్రులు" అనుటకు సందేహము లేదు. పరకీయులను వారు మన్ననతోఁ జూతురు. కార్యనిర్వహణమందు మిక్కిలి దక్షతఁ గలిగియుందురు. ఇతరుల వ్యవహారములో జోక్యము కలుగఁజేసికొనరు. యుద్ధములోనుండి పాఱిపోవుట యనేమియో వాఱెఱుంగరు. ఈశ్వరుని కొఱకు మతము కొఱకు దేహము నర్పించుటకు వెనుదీయరు.

హిందూజనుల కున్నతోద్యోగములు

అక్బరుకాలములో నేమి యితర మోగలచక్రవర్తుల కాలము లలో నేమి హిందూ మహమ్మదీయులని విభేదముచేయక రాజకీయ విషయిక మహోన్నతోద్యోగములుకూడ హిందువుల కీయఁబడు చుండెను. గ్రామకరణీకము మొదలు మంత్రిత్వము, ప్రాంతాధి పత్యము అనఁగా గవర్నరుపని, సైన్యాధిపత్యము మొదలయిన సకల రాజకీయోద్యోగములును హిందువుల కీయఁబడుచుండెను. క్రింది యుద్యోగములు మాత్రము హిందువులకిచ్చి పైతరగతిగల యుద్యో గము లన్నియు మహమ్మదీయులకు నీయవలయు నని నిబంధన లేదు. అందుచే నక్బరు కాలములో నెండటో హిందువులు ప్రాంతాధి కారులు గాను, సైన్యాధీశులుగను, మంత్రులుగను ఉండి విఖ్యాతిఁ జెందిరి. అట్టివారిలో ముఖ్యులయిన వారినీక్రింద సంగ్రహముగా వర్ణించెదను.

రాజా బీర్‌బల్:—ఇతఁడు బ్రాహ్మణుడు. కొందరు చరిత్ర కారు లీతని విషయమై వ్రాయునపుడు రాజా బీర్‌బల్‌సింగ్ అని వ్రాసి, యితఁడు క్షత్రియుడని సూచించినారు. కాని యది పొరపా టయి యుండును. ఈ మంత్రిపుంగవుఁడు సంగీత సాహిత్య కవిత్వము లలో నసమానప్రజ్ఞ గలవాడు; ఔదార్యమునకై పొగడ్తగన్న మహా దాత. అక్బరున కీతనియందు నెక్కుడు ప్రీతియు గౌరవమును గలిగి యుండెను. తెనుఁగు దేశమునందు మర్యాద రామన్నను గుఱించి కవులు చెప్పుకొనినట్లు, ఇతని వ్యవహార చతురత, న్యాయవిచక్షణత, మొదలయిన సద్గుణములను దెలుపు అక్బర్ బీర్‌బల్ వినోదకథ లనేక ములు నేఁటికిని జెప్పుకొనియెదరు. ఇతండు కొంతసేనకు నధి పతిగా నుండెను. 1586లో నితనిని ఇసుఫ్‌జై అఫ్‌గానులమీఁది కంపగా నితఁడు వారితో ఘోరముగాఁబోరి యెనిమిదివేల సైనికు లతో వీరస్వర్గమునకుఁ బోయెను. ఈ మహాపురుషుని చరిత్ర మన కింతకంకెఁ దెలియదు.

రాజా తోడర్‌మల్ :— ఇతఁడక్బరు మంత్రులలో ముఖ్యుఁడుగా నుండెను. రాజ్యములోని యాదాయవ్యయముల నియమన మీతని స్వాధీనములో నుండెను. అనఁగా నిప్పటి ఫైనాన్స్ మినిష్టర్ వంటివాఁడు. వెనుక వర్ణింపఁబడిన జమాబంది పద్ధతిని నేర్పఱిచినవాఁ డీతఁడే. అందువలన నేఁటివఱకును మనదేశములో నున్న భూసంబంధమైన యమరకపు పద్ధతుల కీతఁడే మూల పురుషుడని చెప్పవలసియున్నది. కావుననె యసామాన్య రాజకార్య నివుణుఁడని ఇప్పటివఱకును జనులు పొగడుచున్నారు. జమాబంది (Land Revenue System), ఆదాయవ్యయము (Finance), నాణెములు (Currency) అను విషయముల కన్నిటికిని అతఁడధిపతిగా నుండెను. ఈతని సత్యసంధత్వ మత్యంతవర్ణనీయమని అబుల్ ఫజల్ వ్రాసియుంచిన వాక్యమిదివఱకె యుదాహరింపబడినది. ఈ సుగుణములతోఁబాటు ఇతనియందు నసామాన్య శౌర్యముకూడ గలదు. ఇతఁడును మానసింహునిగలిసి ఖైబరుకనుమలో అఫ్‌గానుల నోడించెను. ఇతఁడు 1589లో 10 వ నవంబరు దినమునఁ గీర్తిశేషు డయ్యెను. ఈ వర్తమాన మక్బరునకుఁ గాబూల్ దేశములోనుండఁగాఁ దెలిసి యతఁడు మిగులఁ జింతించెను.

తోడర్‌మల్ కాయస్థ జాతివాఁడుగాఁ గానవచ్చెదిని. ఇతనికి స్వమతమునందు నధికప్రీతియు నిష్ఠయు గలిగియుండెను; స్నాన సంధ్యాదేవతార్చనాదికములు శ్రద్ధతోఁ బ్రతిదినమును తప్పక చేయును. ఒకప్పుడీతఁ డక్బరుతోఁ బంజాబు దేశమునకు తొందరగాఁ బోవుచుఁ దన దేవతార్చన పెట్టెను మఱచెను. అందువలన నా పెట్టె వచ్చువఱకును భుజించినవాఁడు కాఁడు!

రాజా భగవాన్‌దాస్ :— ఇతఁ డంబర్ రాజ్యమునకు రాజు. ఈ రాజ్యమునే ప్రస్తుతము జయపూర్ అనియెదరు. ఇది రాజపుత్రస్థానములో నున్నది. ఇతఁడు పంజాబు దేశమునకు సుబేదారుగా నియమింపఁబడెను. 1589లో నితఁడు లాహోర్ పట్టణమందు మృతినొందెను. ఇతఁడు బుద్ధిశాలి, శూరుడు, స్వామికార్య

తత్పరుడు. కావున నితని మరణమువలన రాజు మిక్కిలి చింతాక్రాంతుడయ్యెను.

రాజా మానసింగ్ :—ఈ శూరాగ్రేసరుడు జయపురాధీశుడగు భగవాన్‌దాసుని తమ్ముని కొమారుడు, దత్తపుత్రుడు. ఆక్బరున కితడు కుడిభుజముగానుండెను. అక్బరునకుఁ ప్రాప్తమైన రాజ్యములోని సగము రాజ్యమీతఁడు సంపాదించినాఁడనిన అతిశయోక్తి కానేరదు. అందుచే రాజసభయందు నితకిఁగల గౌరవ మితర సరదారులలో నెవ్వరికిని లేకయుండెను. ఇతఁడును తోడర్‌మల్లుఁడును కలిసి అఫ్‌గానులను ఓడించిరని యిదివఱకే ప్రాసియున్నాము. అక్బర్ నూతన మతమును స్వీకరింపఁగాఁ గాబూల్ దేశస్థులు తిరుగఁబడిరి. వారిని అణఁచుటకు మానసింగ్ సుబేదారుగా నఫ్‌గాన్ దేశమునకుఁ బంపఁబడియె. ఇతఁడును, ఇతని రాజపుత్ర సైనికులును అఫ్‌గానులను ఓడించి వారిని వశపఱచుకొనిరి. కొన్ని దినముల తరువాత నఫ్‌గానువారు మొఱపెట్టుకొనఁగా మానసింహుడు బంగాళా దేశమునకు సుబేదారుగాఁ బంపఁబడెను. అచ్చట నితఁడు 1589 మొదలు 1604 వఱకుఁ బ్రభుత్వముచేసి యెంతయో ఖ్యాతివడసెను. ఇతని ప్రభుత్వమును చరిత్రకారు లెంతయు గొనియాడియున్నారు. కాని యచ్చట అఫ్‌గాని జాతివారి ప్రాముఖ్యముండెను. వారు హిందూద్వేషులు. అందుచే వారికిని మానసింహునకును వైరము కలిగినందున నతఁడు బంగాళా దేశముమీఁది తన యధికారమును మానుకొనెను. కాని మానసింహుని యోగ్యతయు, నతఁడు తనకొనర్చిన మహోపకారమును దలంచి యక్బర్ అతనికి నేడువేల మన్‌సబ్ ఒసఁగెను. ఇట్టి మన్‌సబ్‌కు 'అమీరీ' అను పేరును, ఆ యధికారము కలవానికి 'అమీర్' అను బిరుదును గలదు. చక్రవర్తి వంశజులు కానివారికి ఐదువేల మన్‌సబుకంటె నెక్కుడు మన్‌సబ్ ఈయఁగూడదని యదివఱకు నియమముండెను. కాని మానసింహుని విషయమై గల గౌరవాధిక్యతవలన అక్బర్ పై నియమమును బాటింపక యాతనికి నేడువేల మనసబిచ్చెను. ఇట్లక్బర్ కాలములో యోగ్యతగల హిందువులకు నత్యుచ్చ రాజకీ

యోద్యోగము లీయబడుచుండెను. * ఈ మానసింహుడు జయపుర రాజ్యమును 1589 మొదలు 1615 వఱకు నేలెను. అక్బర్ పోయిన తరువాత నితఁడు పదేండ్లవరకు బ్రతికియుండెను.

జహాంగీర్ బాదుషాహ

(1605 - 1627).

అక్బర్ కాలధర్మమునొందిన తరువాత అతని పెద్దకుమారుడగు సలీం అనువాఁడు జహాంగీర్ అను బిరుదువహించి సింహాసనము నెక్కెను. జహాంగీర్ అను శబ్దమునకు జగజ్జేత యనియర్థము. జహాంగీర్ పరాక్రమవంతుఁడనుటకు సందేహములేదు. కాని తండ్రి సద్గుణము లేమియు నతనికిఁ బట్టుపడినవి కావు. మొదటి నతఁడు ప్రజల కుపయోగకరములగు కొన్ని పనులు చేసినందున నతఁడు ప్రజాపాలనదక్షుఁడగునని యందఱనుకొనిరి. కాని క్రమక్రమముగా బాదుషాహ విషయాసక్తుఁడును మద్యపానరక్తుఁడు నయినందున వారి యాశలన్నియు నిరాశలయ్యెను. ఈ బాదుషాహచే వ్రాసియుంపఁబడిన దినచర్య గ్రంథమును జూడఁగా నితఁడు మిక్కిలి బుద్ధి వైభవశాలి యని చెప్పక తప్పదు. కాని పైని బేర్కొనఁబడిన దుర్గుణములచే నీతని బుద్ధివిశేషము వికసించినదికాదు. అక్బరుచే నేర్పాటుచేయఁబడిన రాజ్యపద్ధతి ననుసరించియే యీతఁడు నిఱువది రెండు సంవత్సరములు రాజ్యము చేసెను. ఇతని ప్రభుత్వకాలమంతయు నీతని పుత్రుల తిరుగఁబాటులతోను, వారి పరస్పర కలహములతోను, నూర్‌జహాన్ అను స్త్రీయొక్క ప్రీతికథలతోడను నిండియున్నది.

జహాంగీర్ యొక్క కొమాళ్ళు

జహాంగీర్‌నకు ఖుస్రూ, పర్విజ్, ఖురం. షహన్యా అను నలుగురు పుత్రులుండిరి. అందు ఖుస్రూ అనువాఁడు సద్గుణవంతుఁడు.

---

* It is thus evident that Hindoos of rank now (at the time of Akbar) shared the highest offices with the Moghuls ;—Meadows Taylor.

అక్బరున కీతని యందు మిక్కిలి ప్రేమ. అందుచే మొదటినుండియు నితనికిని నితనితండ్రి యగు జహాంగీరునకును పడదయ్యె. అందుచే జహాంగీర్ రాజ్యమునకు వచ్చిన కొద్దిదినములకే ఖుస్రూ తండ్రి మీఁద దిరుగఁబడెను. కాని యందు నాతఁ డోడి తండ్రిచేతికిఁ జిక్కెను. అప్పటినుండి యాతఁడు చెఱసాలలో నుండెను. దక్షిణ దేశములోని యుద్ధమునకై యితఁడు దక్షిణ దేశమునకుఁ పంపఁబడి యచ్చటనే చంపఁబడెను. ఖురం అనువాఁడే ముందు షాహజహాన్ అను బిరుదుతో బాదుషాహ యయ్యెను. ఇతఁడు రాజపుత్ర కన్యకకుఁ బుట్టినవాఁడు. మిక్కిలి రాజ్యాభిలాష కల వాఁడై 1623 లోఁ దండ్రిమీఁదఁ ధిరుగఁబడి బంగాళాఖాతమును జయించి మహాబత్ ఖానుఁడనువానిచే నోడింపఁబడి పాఱిపోయి తండ్రి మరణమువఱకు నచ్చటిచ్చట నజ్ఞాతవాసములో డాఁగియుండెను. ఇతనికి ఉదయపూర్ రాజులు సహాయులైయుండిరి. అజ్ఞాత వాసములో నుండఁగా నాతఁడు కొన్నిదినము లుదయపురిలోను, కొన్నిదినములు దక్షిణదేశములోను నివసించి యుండెను. పర్వేజ్ అనువాఁడు మద్యపానాసక్తుడు; ఖురముచే జయింపబడియె. ఇట్లు పుత్రులవలన జహాంగీరున కేమియు సౌఖ్యము లేకపోయెను.

నూర్ జహాన్

(1585 - 1645)

జహాంగీర్ బాదుషాహ రాజ్యముచేసె ననిన్రాయుటకంటె నతని పట్టపురాణియగు నూర్‌జహాన్ బేగమే ప్రభుత్వముచేసె ననిన్రాయుట మేలు. ఈమె తండ్రి పారశీక దేశస్థుఁడు. స్వదేశమునందు జీవనాధారము లేనందున నతఁడక్బరు కాలములో డిల్లీపట్టణమునకు వచ్చెను. అచ్చటఁ డన కౌశల్యముచే నతఁడు బాదుషాహయొద్ద నుద్యోగము సంపాదించెను. అతిరూపవతియగు నతని కుమార్తెను రాజపుత్రుడగు సలీం వివాహ మాడఁదలఁచెను. కాని యక్బరు తనకు నిష్టము లేనందున నామెను నింకొక సరదారునకిచ్చి వివాహముచేసి గొప్ప యుద్యోగమొసఁగి, వారిని బంగాళాదేశమునకుఁ బంపెను. జహాంగీర్ రాజ్యమునకు వచ్చినతోడనే నూర్‌జహానుయొక్క

భర్తను జంపించి యామెను రాజభవనములోనికిఁ దీసికొనివచ్చెను. నాలు గైదుసంవత్సరములవఱి కామె బాదుషాహానువివాహమాడుటకు సమ్మతించినది కాదు. తుదకు 1611 లో నామెను వివాహమాడెను. అప్పటినుండి రాజ్యపాలనమంతయు నామెయే చేయుచుండెను. జహాంగీర్ ఆమెకు నూర్‌జహాన్ అను పేరుపెట్టి యామె యాజ్ఞకు లోఁబడి యుండెను. నూర్‌జహాన్ అనఁగా జగత్ప్రకాశమని యర్థము. నూర్ జహాన్ తనకు లభించిన యధికారమును దుర్వినియోగ పఱిచినది కాదు. బాదుషాహయెడ మిక్కిలి ప్రేమగలిగి యాతని క్షాగుబోతుతనము మాన్పుట కెంతయుఁ బ్రయత్నించెను. రాజ భవనములోని యన్ని సంగతులను స్వయముగా గనుఁగొనుచుండును. ఆమె బోధవలననే బాదుషాహ యనేక దుర్గుణముల మానెను. అక్బరువలె గొలుసుకట్టఁబడిన యొక గంట రాజమందిరములోనుంచి, యాగొలుసును వెలుపలనుండి కదలించినవారి మొఱ స్వయముగా వినుచుండెను. ఆమె యనాథ బాలుర ననేకులఁబెంచెను. జహాంగీర్ ప్రభుత్వముయొక్క చివరకాలమునమాత్ర మామె రాజ్యములోఁ గొన్ని కల్లోలములఁ బుట్టించెను.

రాజపుత్రులతో యుద్ధము
(1613–1614)

జహాంగీర్ తన కొమార్తె నుదయపురరాజుల మీఁదికిఁ బంపి యాతనిని వశపఱచుకొనెను. ఈ వృత్తాంత మంతయు నుదయపుర చరిత్రములో వివరముగా వర్ణింపఁ బడును.

అహమ్మద్ నగరమును గెలుచుట

అక్బర్ కాలములో నాతఁడహమ్మద్ నగరమును వశపఱుచుకొని యచ్చట ఖానఖానాన్ అనువానిని సుబేదారుగా నుంచెను. కాని మ్మాలిక్‌ంబర్ అనువాఁడు మరల అహమ్మద్ నగరమును గెలిచి మోగలుల వెడలఁగొట్టెను. అందుచే జహాంగీర్ తనకుమారుఁడైన ఖుర్రం అనువానిని దక్షిణదేశము జయించుటకై పంపెను (1616). బాదుషాహ స్వయముగాఁ గొంతవఱకుఁబోయి మాండవ గడము

నొద్ద విడిసియుండెను. ఖురం తన శౌర్యమును జూపి మాలికంబరును పరాభవించి అహమ్మద్ నగరమును స్వాధీనముచేసికొనెను. అతఁడు మాండవగడమునకుఁ బోయి తండ్రికి నమస్కరింపఁగా నతఁడు తన కుమారుని మిక్కిలి గౌరవించి యతనికి జహాంగీర్ అను బిరుదు నొసంగెను.

ఇట్లు అహమ్మద్ నగరమును స్వాధీనముచేసికొనినను అది మిక్కిలి దినములు దక్కినది కాదు. షాహజహాన్ వెడలిపోయిన తోడనే మాలికాంబర్ మరల మోగలసైన్యముల నోడించెను. అందుచే 1620 లో మరల షాహజహాన్ దక్షిణమునకు వచ్చెను. ఈ సారి యాతఁడు తన యన్నయగు ఖుస్రూను తనవెంటఁ దీసికొనివచ్చి చంపించెను. మాలికాంబరును కొంతవఱకు గెలిచి రాజ్యము కొంత సాధించెను. కాని యంతలో నుత్తరదేశమునకు వెడలవలసి వచ్చి నందున దక్షిణ దిగ్విజయమును మాని వెడలిపోయెను (1623).

అంతఃకలహములు

నూర్ జహానునకు అసఫ్‌ఖానుఁడనుతమ్ముఁడు కలడు. అతని కొమార్తెయగు ముంతాజ్ మహల్ అను నామెను ఖురంకు అనఁగా షాహజహానునకు నిచ్చి యుండిరి. కాఫున ఖురంకు రాజ్యము రావల యునని అసఫ్‌ఖానుఁడు యత్నించు చుండెను. నూర్‌జహానునకు మొదటి పెనిమిటివలన నొకకూతురు కలదు. ఆమెను ఖుస్రూకిచ్చి వివాహము చేయవలయునని నూర్‌జహాన్ యత్నించెను. కాని యంతకుఁబూర్వమే వివాహమైన యాయేకపత్నీనిరతుఁడు నూర్ జహాన్ కూఁతురును వివాహమాడుటకు నొప్పుకొనలేదు. అందుపై నైదవరాజపుత్రుఁడగు షహర్ యార్ అనువానికిఁ కూఁతునిచ్చి నూర్ జహాన్ వానికే రాజ్యము రావలయునని యత్నింపసాగెను. మహా బత్‌ఖానుఁడను సైన్యాధీశుఁడు మొదట నూర్‌జహానుకు ననుకూలుఁడైనను, వెనుక ప్రతికూలుఁడైఁ యతనిని జహాంగీర్ అగౌరవపఱచినందున 1626 లో యుద్ధముచేసి జహాంగీర్ నూర్‌జహానుల చెఱపట్టెను. నూర్‌జహాను తెలివి వలన వారుభ

యులును చెఱ విడిపించుకొని మహాబత్ఖానుని నాశమొం దింపవలయునని దక్షిణములోనున్న షాహజహాన్ మీఁదికి యుద్ధమునకుఁ బంపిరి. కాని షాహజహాన్ మహాబత్ఖాను లొక్క కైరి. 1627 లో బాదుషాహ దేహారోగ్యము నిఱు త్తమై కాశ్మీరము నకుఁ బోయి యచ్చటనే పరలోకగతుఁడయ్యెను. అంత షాహజహాన్ దక్షిణమునుండి పరుగెత్తుకొనివచ్చి బాదుషాహ యయ్యెను. నూర్ జహాన్ యొక్క యధికార మంతయు నంతటితో సమాప్తినొందెను.

జహాంగీర్ రాజ్యవ్యవస్థ

మొత్తముమీఁద జహాంగీర్ ప్రభుత్వము ప్రజలకు సుఖప్రదమే యయ్యెను. మదిరాసక్తుఁడు కానప్పుడెన్నియో మంచిపనులఁజేయును. విద్యలను విద్వాంసులను గౌరవించెను. మతమునుగుఱించి యెవరినిబాధ పెట్టినవాఁడుకాఁడు. ఇతనికి సమకాలీనుఁడగు నింగ్లండురాజు పేరు రెండవజేమ్సు . అతనికంటె జహాంగీర్ నూఱురెట్లు మంచి వాఁడను టకు సందేహములేదు. మధ్యవర్తులతో సంబంధములేక ప్రజల మొఱ లాలకించుటకు నాతఁడొక న్యాయ శృంఖల యను బంగా రపు గొలుసు చేయించెను. అది యఱువది యడుగులు పొడుగును. అరువది బంగారపు గంటలును గలిగియుండెను. దాని యొకచివర బాదుషాహ కూర్చుండు స్థలమునకును, రెండవది వీధిలోను గట్టఁ బడియుండెను. సృష్టి సౌందర్యముఁజూచి యితఁడు మిగుల నానం దించుచుండును. వేఁటాడుటలో నీతఁడు ప్రవీణుఁడు. ప్రొఫెసర్ డాసన్ అనువాఁడీతని గుఱించి యిట్లు వ్రాసియున్నాడు. "ఇతని స్వీయచరిత్రమును బట్టి చూడ నితఁడసామాన్య పురుషుఁడని చెప్ప వలెను. ఇతఁడు తన దోషములను, దుర్గుణములను స్పష్టముగ నొప్పుకొని యున్నాఁడు. ఇతని స్వీయచరిత్రమును జదివినయెడలఁ జదువరులకు నితని యోగ్యతను గుఱించియు, బుద్ధివిశేషంబును గుఱించియు మంచి యభిప్రాయము కలుగకమానదు. రత్నములు, పుష్పములు, కళాకౌశల్యములు మొదలగు వానిని గుఱించి యితని కెక్కుడుప్రీతి. ఇతఁడు మృగయావినోదమునందుఁ బ్రవీణుడు. మద్య

మును సేవింపనపుడితఁడు తన యౌదార్యమును న్యాయప్రియతను బాగుగఁ గ నఁబఱుచుచుండెను. కాని రాజ్యాధిష్ఠుఁడగుటకుఁ బూర్వము మదిరాసక్తుడై యనేక క్రూరకృత్యములఁ జేసెననుటకు సందేహములేదు.' మొత్తముమీఁద నితఁడు మిక్కిలి యోగ్యుఁడ య్యును ప్రాగుడెక్కుడగుటచే నయోగ్యుఁడయ్యెనని చెప్పవలసి యున్నది.

ఇంగ్లీషు రాయబారులు

వర్తకము చేయవలయుననిన యుద్దేశముతో నీ బాదుషాహ ప్రభుత్వకాలములోనే ఇంగ్లీషువారీ దేశములోఁ బ్రథమమున గాలు పెట్టిరి. 1608 లో కాప్టన్ హ్యాంకిన్స్ అను నింగ్లీషువాఁడు సూరత్ పట్టణమునకు నోడపై వచ్చి యచ్చటనుండి జహాంగీర్ రాజధానియగు ఆగ్రా పట్టణమునకుఁ బోయి రెండు మూఁడు సంవత్సరములవఱకు నచ్చటనుండి బాదుషాహను నచ్చటి యితర సరదారులను నాశ్రయించి వారికి బహుమతులను పేరట లంచము లొసఁగి యింగ్లీషు వారీ దేశ ములో వర్తకము చేసికొనుటకు సెల వొసంగవలయునని కోరెను. కాని యప్పు డెవ్వఁడో దూరదృష్టిగల భవిష్యద్వేత్త 'ఇంగ్లీషువారికి నిప్పుడు చోటిచ్చినయెడల వారు త్వరలోనే మన రాజ్యమును హరిం చెదరు' అని చెప్పెనఁట! అందుచే నా యింగ్లీషువాఁడు విఫలమనో రథుఁడై 1611 లో వెడలిపోయెను. అతఁడు మోగల్ ప్రభువులయొక్క వైభవమునుగుఱించి యింగ్లండునకు వ్రాసిన సమాచారములం జదివి వా రాశ్చర్యచకితులైరి. అప్పు డింగ్లండ్, స్కాట్లండ్ దేశములలోని పన్ను కోటి రూపాయలకంటె నెక్కుడులేదు. ఫ్రాన్స్ దేశపు రాజైన పరాక్రమశాలియగు పదునాల్గవ లుయి యనువాని యాదాయము అయిదుకోట్లను మించకుండెను. అందుచే జహాంగీరు నాదాయ మిఱు వదికోట్లకంటె నెక్కుడు కలదని విని యూరోపుదేశస్థులు జహాంగీరును దేవేంద్రునిగాఁ దలఁచిరి. జహాంగీరు దినదినము 8000 వేల రూపా యలు వెచ్చించును; ఇఱువదికోట్లాతని బొక్కసములో నెప్పుడును నిలిచియుండును. గుఱ్ఱములు, ఏనుఁగులు, లోట్టిపిట్టలు, లేళ్ళు, గానము

చేయు పక్షులు మొదలైనవి చూతనియొద్ద నిన్నిగలవని లెక్కించుటకు శక్యముగాదు; క్షణములో నిఱువదిమైదువేల సైన్యము వచ్చి నిలుచును; ఎనిమిదిరోజుల వ్యవధి యిచ్చినయెడల మూఁడులక్షల సైన్యము యుద్ధమునకు సిద్ధమగును.' అనిన వర్ణనలు విని యింగ్లండు దేశములోని జను లాశ్చర్యమగ్నమానసులై హిందూదేశమును నందనవనముగా భావించి యచ్చటి ధనమును వర్తకముచే నార్జింప నుపాయముల యోచింపసాగిరి.

1615 లో సర్ టూమస్ రో యను రాయబారి యింగ్లండు దేశమునుండి సూరత్‌పట్టణమునకు వచ్చెను. అతఁడు జేమ్సురాజు నొద్దనుండి బాదుషాహకు నొక యుత్తరము తెచ్చెను. అతఁడును ట్యాప్టన్ హ్యాంకిన్సవలెనే యాగ్రాపట్టణమునకుఁ బోయి యచ్చటి బాదుషాహకును, ఇతర సరదారులకును, కట్నములు, కానుకలు, లంచములు నిచ్చి యింగ్లీషువారిని నీ దేశములోనికిఁ జొరఁబెట్టవలెనని యత్నించెను. కాని యాతని కోర్కె ఫలించినదికాదు. ఈ యింగ్లీషు రాయబారు లిద్దఱును హిందూదేశములోఁ దాము చూచిన విశేషము లన్నియు సవిస్తరముగా వ్రాసియుంచినారు. అవి చదువఁగ నెంతయు నింపుగనుండును.

షాహజహాక్ బాదుషాహ

(1628-1658)

రాజ్యారోహణము

1628 వ సంవత్సరము నందు 26 వ జనేవరి దినమున షాహజహాన్ సింహాసనము నెక్కెను. అతఁడాగ్రాపట్టణమునకు వచ్చువఱకు నతని మామయగు ఆసఫ్‌ఖానుఁడు నూర్‌జహాన్ మొదలయిన పరపక్షీయులఁ జెఱఁబెట్టెను. ఇతఁడు తన తమ్ముఁడగు షహర్యారుతోఁ బోరి యాతని నోడించి యాతనిని మటియొక యన్న కుమారుల నిద్దఱినిఁ జంపెను.

ఈ బాదుషాహ మిక్కిలి వైభవమును, సౌఖ్యమును అనుభవించెను. రాజ్యారోహణ సమయమునందు నితఁడు కోటి యేఁబది

లక్షల రూపాయలు వెచ్చించి గొప్ప యుత్సవము చేసెను. మక్కా, మదీనాలలోని దేవాలయములకు లక్షల కొలఁది వెల గల కానుక లంపెను. అందు గోలకొండనుండి తేఁబడిన రత్న మొకటి యుండెను. దాని వెల లక్ష యేఁబదివేల రూపాయలు.

షాహజహాన్ముప్పది సంవత్సరముల వఱకు రాజ్యము చేసెను. అం దాంధ్యంత కాలము క్రూర కర్మములతోను యుద్ధములతోను నిండి యున్నది. మధ్యకాలము సుఖముగానే కడచెను. రాజ్యము సంపాదించుటకు నతఁడు యుద్ధము చేసి యనేక జాతులఁ జంపెను. తుద కాతని పుత్రు లాతనితో యుద్ధము చేసి రాజ్యముఁ దీసికొనిరి.

రాజ్యా రూఢుఁ డైన తోడనే షాహజహాన్ తన మామయైన ఆసఫ్‌ఖానునకు సాదుల్లా ఖానుఁ డను వానికిని మంత్రిత్వ పదవు లొసఁగెను. సేవకుల జీతము నభివృద్ధి చేసెను. మిత్రుల కనేకులకు నాశ్రయ మిచ్చెను. ఆసఫ్‌ఖానుఁడు రాజ్యకుశలుఁడని విఖ్యాతిఁ జెందిన మంత్రి పుంగవుఁడు. అతడు పోయిన తరువాత సాదుల్లా ఖానుఁడు ముఖ్య మంత్రి యయ్యెను. ఇతఁడు మొదట హిందువుగా నుండి మహమ్మదీయ మతము నవలంబించెను. మహాబత్‌ఖాన్ అను వాఁడు సేనాని యయ్యెను.

ఖాన్‌జహన్‌లోదీ తిరుగఁబాటు

(1628-1629)

షాహబహాన్ బాదుషాయైన తోడనే ఉజ్ బక్ అను జనులు కాబూల్ దేశము మీఁదికి నెత్తివచ్చిరి. వీరసింహుఁడను రాజ పుత్రుఁడు బుందేల్ ఖండములోఁ దిరుగఁబడెను. వారిని బాదు షాహ సైన్యములు వెంటనే యోడించెను. కాని వీనికంటె భయ ప్రదమైన తిరుగుఁబాటు 1628 లో నొకటి జరిగెను. ఖాన్ జహాన్ లోదీ యనువాఁడు జహాంగీర్ ప్రభుత్వకాలములో మిక్కిలి ప్రసిద్ధి కెక్కిన సేనా ధీశుఁడు. షాహజహాన్ బాదుషాహ యతనిని అగౌరవ పఱిచినందున నతఁడు రెండువేల సైన్యములతో దక్షిణమునకుఁ బోయి మలి కంబరుతోఁ గలిసి బాదుషాహమీఁదఁ దిరుగఁబడెను.

అంత షాహజహాన్ భీతిఁజెంది స్వయముగా సైన్యముల వెంటఁదీసి కొని దక్షిణమునకుఁ బోయి లోదీని నోడించెను. వాఁడు కలింజర్ యుద్ధములో శూరునివలెఁ బోరాడి వీరస్వర్గమునకుఁ బోయెను.

దక్షిణరాజ్యముల మీఁదికి దాడి.

(1629 - 1637)

లోదీనిఁ బరాభవించి షాహజహాన్ వెంటనే దిల్లీ కిఁబోయి వాఁడు కాఁడు. దక్షిణములో అహమ్మద్ నగర్, బిజాపూర్, గోల కొండ రాజ్యములను గెలువవలయు ననియతఁడు దక్షిణమునందే యుండెను. 1629, 1630 సంవత్సరములలో దక్షిణదేశమందు గొప్ప కఱవు వచ్చినందున నతఁడు విశేషదేశము జయింపలేదు. 1630లో దౌలతాబాద్ దుర్గము నాక్రమించు కొనెను. గోలకొండ నవాబు కప్పము కట్టుటకు నొప్పుకొనియె. 1632 లో మహాబత్ ఖానునకు దక్షిణములోని సర్వాధికారమిచ్చి బాదుషాహ ఢిల్లీ కి వెడలిపోయెను. మహాబత్ ఖానుఁడు అహమ్మద్ నగర సైన్యములనోడించి, పట్టణ మును స్వాధీనము చేసికొనిఁ నవాబును చెఱపట్టి గ్వాలేర్ పట్టణ మునకుఁ బంపెను. మఱియొక యుద్ధములో మహాబత్ఖానుఁడును, సుజాయను రాజ పుత్రుఁడును పరాజితులై బర్హాణా పురమునకు బాఱిపోయిరి. అచ్చటనుండి బాదుషాహయొక్క యాజ్ఞనుసరించి వారు దిల్లీకి వెళ్ళిరి. అంత నహమ్మద్ నగర రాజ్యమును నుద్ధరించుట కిదియే మంచి సమయమని తలఁచి షాహాజీ భోఁసలా యను మరాఠా సరదారుడుఁ సైన్యములఁ జేర్చుకొని యహమ్మద్ నగర రాజును స్వతంత్రుని జేసెను. అందుచే 1635 లో బాదుషాహ స్వయముగా మరల దక్షిణమునకు వచ్చెను. తన సైన్యములను రెండు భాగములుగా విభజించి యొక్క భాగమును విజాపురము మీఁదికి బంపెను. అచ్చట రణదుల్లాఖానుఁడును సైన్యాధీశుడు మోగల సైన్యముతో ఘోరముగాఁ బోరాడెను. కాని తుదకు వారితో సంధి చేసుకొనెను. అట్లే షాహాజీ సైన్యములు నోడిపోయి నందున మహమ్మద్ నగరరాజ్య మంత మొంది మోగల్ రాజ్య ములోఁ గలిసిపోయెను.

కందహార్

జహాంగీర్ ప్రభుత్వ కాలమందుఁ గందహార్ రాజ్యమును పారసీకులు స్వాధీనము చేసికొని యుండిరి. షాహజహాన్ ప్రభుత్వములో నచ్చటి దుర్గాధీశునకు లంచమిచ్చి మోగలు లా దుర్గమును మరల స్వాధీనము చేసికొనిరి. మర్దాన్ ఖానుఁడను పేరుగల యాదుర్గాధీశుఁడటు తరువాత హిందూ దేశములో గొప్పయుద్యోగములఁ జేసెను. దిల్లీ పట్టణమునకు జలమునిచ్చెడి కాలువ నాతఁడు త్రవ్వించెను. దాని కిప్పటికిని ఆలీమార్దాన్ కాలువ యని పేరు. 1648 లో పారసీకులు కందహార్ దేశమును మరల స్వాధీనము చేసికొనిరి. దానిని సాధింపవలయునని 1649 లో రాజపుత్రుండగు ఔరంగజేబును, 1653 లో రాజపుత్రుఁడగు దారా యనువాఁడును, ఘోరముగాఁ బోరిరి. కాని విఫల మనోరథులై కందహారునకు నొక చరమ నమస్కారముచేసి హిందూదేశమునకు వెడలి రావలసిన వారైరి.

బల్ఖ్ ప్రదేశము

ఇది ఆఫ్గాని స్థానములోని యొకభాగము. అది బాబర్ ప్రభుత్వములోనిది. అటుతరువాత నచ్చటి యధికారు లప్పుడప్పుడు స్వతంత్రు లగుచుండిరి. జహాంగీర్ ప్రభుత్వ సమయమందు నది నజర్ మహమ్మదనువానిచే నాక్రమింపఁబడియె. 1644 లో బల్ఖ్ మీఁదికి ఆలీమర్దాన్ ఖానుఁడు షాహజహానుచేఁ బంపఁబడియె. అతనికి సహాయము చేయుటకై ఉదయపూర్ రాణాయగు జగత్సింహుఁడు పదునాలుగువేల సైన్యములతో బల్ఖ్ దేశమునకుఁబోయి రాజపుత్ర శౌర్యమును అఫ్గానులమీఁద జూపెను. రాజపుత్రులతో మురాద్ ఔరంగజేబులుగూడ నా దేశమునకుఁబోయి యుద్ధములుచేసి శత్రుల నోడించిరి. గాని యచ్చటి యరణ్యములలో వారి సైన్యములకు మిక్కిలి బాధ కలిగెను. అనేక సైనికులు మడిసిరి, ధన మపరిమితముగా వెచ్చింపఁబడెను. అందుచే నచ్చట నుండుట సాధ్యము కాదని బల్ఖ్ ప్రదేశము నజర్ మహమ్మదుకే యిచ్చివేసి ఔరంగ్

జేబ్ తిరిగివచ్చెను. త్రోవలో హిందూకుశ పర్వతము మీఁదనుండు అడవి జనులు మోగలుల సైన్యమును మిక్కిలి బాధపెట్టిరి (1647.)

పోర్చుగీజువారిని నణఁగఁ ద్రొక్కుట

యూరప్ దేశమువారిని తన రాజ్యములోనికి రానిచ్చుట తప్పని యీ బాదుషాహ యభిప్రాయమై యుండెను. క్రైస్తవులయెడ నితకిని సహాయకలదు. ఇతనిభార్య యగు ముంతాజ్ మహల్ అను నామె కూఁతుఁ లిద్దఱిని మతగురువులు క్రైస్తవులుగా మార్చినందున నామె క్రైస్తవులను మిక్కిలి ద్వేషించుచుండెను. ఇదియుఁగాక షాహజహాన్ బాదుషాకు పోర్చుగీజువారిమీఁదఁ గోపము వచ్చుటకు మఱియొక కారణము కలిగెను. చిత్తగావ్ అను గ్రామములోని సముద్రపుదొంగలు బంగాళాఖాతములోని రాదారియోడలను దోఁచుకొనుచుండిరి. అట్లు వారు దోఁచుకొనకుండఁ బోర్చుగీజువారు చేయవలసినదనియు, నందులకుఁ బ్రతిఫలముగాఁ బోర్చుగీజువారు హుగ్లీలో వర్తకవ్యాపారకులు పెట్టుకొనుటకు గిడ్డంగి కట్టుకొనవచ్చుననియు జహాంగీర్ కాలములో నేర్పాటు జరిగెను. ఆ ప్రకారమున వారు గిడ్డంగి మాత్రము కట్టుకొనిరి. కాని సముద్రపుదొంగలను అణఁచుటకుమాఱుగా వారితో స్నేహముచేసి, వారికి దోఁపిడివలనవచ్చు లాభములో భాగమును దీసికొనుచుండిరి. ఇంతియ కాదు. ఆ సముద్రపుదొంగ లోడలలోని జనులను పట్టుకొని బానిసలుగా నమ్ముచుండిరి. హుగ్లీ రేవులోని పోర్చుగీజువా రట్టి బానిసలను కొనుచు నితరదేశములకుఁ దీసికొనిపోయి మాఱుబేరములకు నమ్ముచుండిరి. పరదేశవర్తకులయొక్క యిట్టి దుష్కృత్యములను జూచి యే రాజూరకుండును? 1632 లో షాహజహాన్ తన సైన్యములను హుగ్లీ మీఁదికిఁబంపి యచ్చట పోర్చుగీజువారి నందఱిని చెఱపట్టి వారి సొత్తంతయు దోఁచుకొని, వారిని నాగ్రాపట్టణమునకుఁ దెప్పించెను. వారిలోని సుందరులైన తరుణస్త్రీలను తన రాణివాసములో నుంచుకొని యితరస్త్రీలను దన సరదారులకుఁ బంచిపెట్టెను. పిల్లవాం ద్రందఱికి మహమ్మదీయదీక్ష నిప్పించెను. పెద్దవారిలో ననేకులఁ జంపించెను. కొందఱు మహమ్మ

దీయులై ప్రాణములు రక్షించుకొనిరి. ఇట్లు హుగ్లీలోని పోర్చు గీజువా రందఱును నాశముచెందినను చిత్తగావ్‌లోని పోర్చుగీజువారు మాత్రము సముద్రపుదొంగలపని చేయుచుండిరి. ఔరంగ్‌జేబ్ ప్రభుత్వ సమయములో బంగాళాదేశమునుండి పోర్చుగీజువారు వ్యూర్తిగ వెడలఁ గొట్టఁబడిరి.

ముంతాజ్ మహల్.

ఈమె నూర్ జహాన్ యొక్క యన్నయగు ఆసఫ్‌ఖానుని కూతురు. నూర్‌జహాన్‌వలెనే మొదట మఱియొక పురుషునికి భార్యయైయుండి పిదప బాదుషాహకు భార్య యయ్యెను. ఈమెకు మొదటిపేరు అర్జుమంద్‌బాను. నూర్‌జహాన్‌యొక్క తెలివి చక్కఁదనమును, తండ్రియగు ఆసఫ్‌ఖానుని తారతమ్యజ్ఞానము వ్యవహార కుశలత సత్యప్రియత లామెకుఁ బట్టువడియుండెను. అనేక సద్గుణములు కలది యగుటచే నామె స్త్రీరత్నమని పేరువడసెను. తన భర్త యొక్క దృష్టి పరస్త్రీయందుఁ బడకుండ నామె యిరువది సంవత్సరముల వఱకుఁ గాపురముచేసి 1631లోఁ గాలధర్మము నొందెను. మరణసమయమందు నామె తన పెనిమిటి మఱల వివాహము చేసికొనఁగూడదనియు, లోకులకుఁ దన పేరెప్పటికిని జ్ఞాపకముండునట్లు తగిన నొక కార్యము చేయవలసినదనియుఁ బతినిఁ గోరెను. పత్నీవ్రతుఁడగు నా బాదుషాహ మఱల వివాహము చేసికొనలేదు. ఆమె గోరికొఱకు అనన్యసామాన్యమైన తాజ్‌మహల్ అను మందిరమును గట్టించెను.

షాహజహాన్ సంతానము

ఈ బాదుషాహకు ముంతాజ్ మహల్ వలనఁ బదునాల్గురు సంతానము కలిగెను. అందు నెనిమిదిమంది చిన్ననాటనే గతించిరి. ఆఱుగురు మాత్రము పెద్దవారైరి. అందు నలుగురు పుత్రులు. ఇద్దరు పుత్రికలు. వారి పేళ్లును జనన మరణ సంవత్సరములును ఈ క్రింద నిచ్చుచున్నాము.

పుత్రులు

పేళ్ళు.	జన్మము.	మరణము.
దారా.	1615.	1656.
సుజా.	1616.	1660.
ఔరంగజేబ్.	1618.	1707.
మురాద్.	1614.	1660.

పుత్రికలు

జహాన్ ఆరా.	1614.	1681.
రోషఆరా.	1617.	1671

రాజపుత్రులలోఁ బెద్దవాఁడగు దారా ధర్మశాస్త్ర మందును, తత్వజ్ఞానమునందును పారంగతుడు. అతడౌదార్యసాహసములు గలవాడు; పాశ్చాత్య శాస్త్రములఁగూడ నభ్యసించెను! అనేక సంస్కృత గ్రంథములను బారసీక భాషలోనికి మార్పించెను. అతనికి మహమ్మదీయమతమునందు నసూయగలదు. ఫ్రెంచ్‌ఫాద్రీ యొకఁడును హిందూ సాధువొకఁడును అతనికి గురువులు. ఈ సద్గుణములతోఁబాటు అతనియందుఁ గొన్ని దుర్గుణములు వాసము చేయుచుండెను. అతడు స్తుతిప్రియుడు, గర్వము గలవాడు, అతని మనసులో నేమాటయు దాఁగుటలేదు.

రెండవ కొమారుడగు సుజా శూరుడు, కార్యనిర్వహణచతురుఁడు, కాని యితరులను నమ్మడు. దిల్లీపట్టణములోఁ దనచారుల నుంచి యచ్చటి సమాచారము లెప్పుడును గనుఁగొనుచుండెను. యశోవంతసింహుఁడు మొదలైన ప్రబలహిందూరాజులతో స్నేహము సంపాదించెను. పారసీకరాజుతో ప్రత్యుత్తరములు జరుపుచుండెను. ఇన్నిగుణములను బాడుచేయు నుత్తర దుర్గుణ మొకటి యాతనియందుండెను. అతఁడు ఇంద్రియనిగ్రహ మెంతమాత్రము నెఱుఁగఁడు; ఎల్లప్పుడును విషయాధీనుఁడై యుండును.

మూఁడవపుత్రుడు ఔరంగ్‌జేబ్. అందఱికంటె నితఁడు వ్యవహార చతురుఁడు, ఇంగితజ్ఞుఁడు, దూరదృష్టి కలవాడు. అసత్య కపట

ముల నాశ్రయించి యెంత కఠిన కార్యములనైన సాధించుటకు సమ
ర్థుఁడు. తన యన్నదమ్ముల నందఱిఁ జంపి రాజ్యము నాక్రమించు
కొనఁబలయునని మొదటినుండి యితని మనసులో నున్నను దానిని
నెఱిబుచ్చక భూషణముల ధరించుట మాని విరాగివలె నుండి సంసార
మసారమనియు రాజ్యము దుఃఖహేతువనియుఁ బలుకుచు గురాన్
గ్రంథము నెప్పుడును బఠించుచుండెను.

నాలుగవ పుత్రుడగు మురాద్ ధైర్యసాహసములం దసమా
న్యుఁడు. కాని వట్టి మూర్ఖుఁడు. ఇతని ధైర్యమునకుఁ దోడు వివేక
ముండినయెడల నితఁడద్వితీయపురుషుఁడై యుండుననుటకు సందే
హము లేదు.

ఈ నలుగురు పుత్రులలోని యొక్కొకని గుణధర్మ మొక్కొక
శబ్దములో జెప్పవలయునన్న మొదటివాడు గర్విష్ఠుఁడు; రెండవ
వాఁడు విషయలంపటుఁడు; మూఁడవవాఁడు కపటి; నాల్గవవాఁడు
మూర్ఖుడు అని చెప్పినఁ జాలును.

షాహజహానుని పెద్దబిడ్డపేరు జహాన్‌ఆరా. ఈ మాటకు జగ
ద్భూషణమని యర్థము. ఆమె సుస్వరూపము, ఆనందవృత్తియుఁ
గల యువతి. ఆమెయెడ దండ్రికి మిక్కిలి యనురాగము గలదు.
రాజ్యవిషయమైన యంశములనుగూడ నామెతోఁజెప్పి యామెయభి
ప్రాయమును దీసికొనుచుండెను. అందుచే రాజ్యమునందంతటను
ఆమెకు విశేషగౌరవము కలుగుచుండెను. ఆమెకు దారా యను
తమ్మునియెడ మిక్కిలి ప్రేమ కలదు. ఆమె జీవిత కాలమంతయు
నవివాహితగానుండి తండ్రి కష్టకాలములోఁగూడ నాతనికి సేవచేయు
చుండెను.

రెండవ కూఁతురగు రౌషన్‌ఆరా తన యక్కను దారాను
ద్వేషించుచు ఔరంగ్‌జేబ్ మీఁదఁ బ్రేమ గలిగియుండెను. ఈమె
సుస్వరూపవతి కాదు. ఈమెకు రాజ్యములోగౌరవమును లేదు. కాని
యీమె రాజభవనములో జరుగు రహస్య సమాచారములన్నియు
ఔరంగ్‌జేబ్‌నకుఁ దెలుపుచుండెను.

షాహజహాన్ ప్రభుత్వముయొక్క యుత్తర భాగమంతయు నాతని పుత్రుల కలహములతో నిండియున్నది. బాదుషాహ ముసలి వాఁడైనకొలదిని అతని పెద్దకుమారుఁడగు దారా చేతులలో రాజ్య తంత్రమును విడిచిపెట్టెను. పెద్దకుమారునిమాత్రము తనయొద్దనుంచి కొని సుజాను బంగాళాదేశమునకును, ఔరంగ్‌జేబ్‌ను దక్షిణదేశమునకును, మురాదునుగుజరాత్ దేశమునకును సుబేదారులుగాఁబంపెను. వీరందఱును తమతమ యధికారము క్రిందిదేశములలోని యాదాయమంతయుఁ దామే వెచ్చించుచుఁ దక్కిన తోఁబుట్టువులఁజంపి తాము బాదుషాహలు కావలయునని యనేకోపాయములఁ బన్నఁజొచ్చిరి.

గోలకొండమీఁదికి దండువెడలుట

మీర్ జుమ్లా యను పారసీక దేశస్థుఁడు మొదట దిల్లీ శ్వరుని యొద్ద నుద్యోగము చేసి, దారాయొక్క కోపమునకు బాత్రుఁడై, గోలకొండకు వెడలిపోయెను. అచ్చటి నవాబుయొక్క అనుగ్రహము సంపాదించి గొప్ప యుద్యోగములో ప్రవేశించెను. కాని యచ్చటను రాజరోషమునకుఁ బాత్రుఁడైనందున స్వామిద్రోహియై యా దేశము మీఁదికి దండెత్తి రావలసినదని యౌరంగ్‌జేబునకు వ్రాసెను. అంత నాతఁడు నిష్కారణముగను, అకస్మాత్తుగను గోలకొండమీఁదికి యుద్ధమునకు వచ్చెను. మోగల్ సైన్యములతోఁ బోరాడుటకుఁ దగిన సైన్యములులేనందున గుతుబ్‌షాహ యాతనితో సంధి చేసెను.

అన్నదమ్ముల కలహములు

1657లో షాహజహానునకు రుగ్మత సంభవించెను. అంత నాతని పుత్రులలోఁ గలహములు ప్రారంభమయ్యెను. అతఁడు బ్రతికి యుండఁగనే చచ్చినాఁడని వదంతిచేసి, దక్షిణములోనున్న ఔరంగ్‌జేబ్ నీకే రాజ్యమిచ్చెదనని మురాద్ అను తమ్మునిని గలుపుకొని మీర్ జుమ్లాను వెంటఁదీసికొని యాగ్రామీఁదికి యుద్ధమునకుఁ బోయెను. తండ్రి బ్రతికియున్నాడనియు నాగ్రా పట్టణముమీఁదికి రావలదనియు దారా యెన్నిసారులు వర్తమానములంపినను వినక వారిద్దఱు ఆగ్రాపట్టణమునకు వచ్చి దారా సైన్యములను బరాభ

వించి,షాహజహానును చెఱబెట్టిరి. దారాసుజాలు పాఱిపోయి యచ్చటచ్చట లోకాంతరగతులైరి. మురాదును మోసముచే జంపి, యౌరంగ్‌జేబ్ త్వాసు బాదుషాహ యయ్యెను. షాహజహాన్ చెఱసాలలో నెనిమిది సంవత్సరముల వఱకుండి 1666 లో మరణము చెందెను.

షాహజహాన్ యోగ్యత

ఈ బాదుషాహను గురించి యూరోపియన్ బాటసారు లనేకులు వ్రాసియున్నారు. ఇతడు రసికుడు. రాజవిలాసములలో నెల్లప్పుడును నిమగ్నుడై యుండెను. ఇతని యాదాయము ముప్పది కోట్లను మించియుండెను. ఇతనియొద్ద సాదుల్లాఖాన్ ఆల్లామీయనువాడు వజీరుడుగా నుండెను. అతడు మహమ్మదీయ దీక్షవహించిన హిందువు. అతడు స్వామికార్య నిర్వహణ పౌరీణుడు. అతనిని జూచి యితరులు నేర్చుకొనపలయు నని యౌరంగ్‌జేబ్ కూడ వ్రాసియున్నాడు. షాహజహాన్ కాలములో వ్యవసాయము విశేషముగా నభివృద్ధిజెంది ప్రజలు మిక్కిలి సుఖపడుచుండిరి. రాజా బహారీమల్లుడీతని రాజ్యమును గుఱించి యిట్లు వ్రాసియున్నాడు. "షాహజహాన్ ప్రభుత్వకాలమందు సస్యాభివృద్ధి నెక్కుడుగానయ్యెను. ఏ ప్రదేశమునకు నక్బర్ కాలములో మూడులక్ష లాదాయముండెనో యా ప్రదేశమునకే యిప్పుడు పదిలక్షల యాదాయము వచ్చుచున్నది. రాజ్య విస్తీర్ణ మెక్కుడుగా నున్నను కలహములు విశేషముగా లేవు. న్యాయవిచారణకు వారములో నొక్కదినము చాలును. బుధవారము నాడు న్యాయవిచారణ జరుగును. ఆదినమునందైనను నిరువది వ్యాజ్యములకంటె నెక్కుడుండవు." ట్యావర్నియర్ అను గ్రంథకారుడీతని రాజ్యపాలనను గుఱించి యిట్లు వ్రాసియున్నాడు. "షాహజహాన్ తన ప్రజలను రాజువలె బరిపాలింపడు; తండ్రివలె బరిపాలించును. తండ్రి తన పుత్రులను ప్రేమించినట్లాతడు ప్రజలను ప్రేమించును... ఇతర మహమ్మదీయరాజులవలె ప్రజలపై నసత్యారోపణములు చేయడు. ధనవంతుల యైశ్వర్యముపై గన్ను వేయడు. అందుచే ప్రజలందఱును భయములేక యుందురు'.

ఈ బాదుషాహ మితవ్యయశీలుఁడు. అందుచే నీతనియొద్ద చరమదశలో నిఱువదినాలుగుకోట్ల రూపాయలు నిలువయుండెను. పట్టణములలోని ప్రజలును పల్లెలలోని ప్రజలును ధనధాన్యవంతులై సౌఖ్యముల ననుభవించు చుండిరి.

ఇంతమంచిరాజును నతని పుత్రుడగు ఔరంగజేబు పదచ్యుతునిఁ జేసి చెఱసాలనుంపఁగాఁ జూచి ప్రజలెట్లుసహించిరో తెలియకున్నది. ఎన్నియో వందల సంవత్సరములనుండి పరతంత్రులై ప్రజలకు రాజకీయ వ్యవహారములతో సంబంధము లేనివారైనందున నెవ్వఁడు రాజైన మనకేమియని యూరకుండిరి కాఁబోలును.

మందిరములు

కోట్లకొలఁది ధనము వెచ్చించి లోకైక సుందరములైన దివ్య భవనములనుగట్టించినందున నీబాదుషాహయొక్క కీర్తి యజరామరమయ్యెను. ఇతఁడు ఆగ్రా దిల్లీ పట్టణములను మరలఁ జక్కగఁ గట్టించెను. దిల్లీ పట్టణమునొద్ద నొక సుందరమైన పట్టణమును గట్టించి దానికి షాహజహానాబాద్ అని పేరు పెట్టెను. అది ప్రస్తుతము దిల్లీ పట్టణములోని యొక పేటగా నున్నది.

దిల్లీ పట్టణములో నితఁడు ఒక రాజప్రాసాదమును, దివాన్ ఇఖాస్ అను మయసభయు, ఢిల్లీలో జుమ్మామసీదు అనునదియు, ఆగ్రాపట్టణములో మోతీమసీద్ అనునదియు, గోట్లకొలఁది ధనము వెచ్చించి కట్టించెను.

తాజ్ మహల్

కాని యితఁడాగ్రాపట్టణములో ముంతాజ్ మహల్ అను తనభార్య జ్ఞాపకార్థమై కట్టించిన తాజ్ మహల్ అను దివ్యమందిరము లోకములోని యద్వితీయ భవనమని రెండువందల యేఁబది సంవత్సరముల నుండియు జగద్విఖ్యాతిఁ జెందియున్నది.| దీని యప్రతిమ సౌందర్యముతోఁ బోల్పఁదగిన మందిరము మఱియొకటి భూతలమున లేదని యింగ్లీషు, ఫ్రెంచి మొదలైన యన్యదేశస్థులుగూడ నొప్పుకొనిరి. ఈ మందిరము కట్టుటకు మూడుకోట్ల రూపాయలు వెచ్చింపఁబడియె;

ఇఱువదివేలజను లిఱువదిరెండు సంవత్సరములవఱకుఁ బనిసేయు చుండిరి. ఆకాలమునందు నీదేశములో శిల్పకళ యెంత యభివృద్ధి చెందియుండెనో, చూచుట కీ మందిరము చాలును.

మయూరాసనము

ఈబాదుషాహ యాఱుకోట్ల రూపాయలు వెచ్చించి తాను కూర్చుండుటకై మయూరాసనమును జేయించెను.

ఔరంగ్‌జేబ్

(1658-1707)

విశాలమైన రాజ్యమును, మహోన్నత వైభవమును, నిరంకుశ ప్రభుత్వమును అనుభవించిన మోగల్ చక్రవర్తులలో నీతఁడు కడపటివాఁడు. విద్వాంసుఁడును, ప్రజ్ఞావంతుఁడును, ధైర్యశాలియు నయినప్పటికిని గపటాచరణమును, పరమతద్వేషమును గలవాఁడగుటచే నలువదితొమ్మిది సంవత్సరములు రాజ్యముచేసి తుదకు విఫల మనోరథుఁడై పశ్చాత్తాపముతో దేహమును విడిచెను. ఈతని ప్రభుత్వ వర్ణనమంతయు నితని కపటాచరణముతోడను, అందువలన నితనికిఁ గలిగిన పరాభవముతోడను నిండియున్నది.

ప్రభుత్వ విభాగము

ఈ బాదుషాహయొక్క ప్రభుత్వ కాలమును ముఖ్యముగా మూఁడు భాగములుగా విభజింపవచ్చును. మొదటి విభాగము 1658 మొదలు 1664 వఱకు. ఈ కాలములో దన శత్రువుల సంహరించి నిర్భయుఁడై నూతనరాజ్యపద్ధతినిఁ బ్రారంభించెను. రెండవ భాగము 1665 మొదలు 1681 వఱకు. ఈ కాలములో నాతఁడు కాశ్మీరదేశము, డిల్లీ, కాబూల్ మొదలయిన స్థలములలోఁ గాపుర ముండి మహమ్మదీయమతమును అభివృద్ధిచేయ యత్నించెను. కాని యాతని ప్రయత్నములు కొనసాగినవికావు. మూఁడవ భాగము 1682 మొదలు 1707-వఱకు. ఈకాలమంతయు నాతఁడు శత్రురాజ్య

ముల గెలుచుటకై దక్షిణదేశములోఁ గాలము గడపెను. తుదకు భగ్న మనోరథుఁడై దక్షిణదేశమందే మరణము చెందెను. ఆయా ప్రభుత్వ విభాగములు గొలఁదిగా వర్ణింపఁబడును.

రాజ్యారోహణము

రాజ్యమునకువచ్చిన రెండవ సంవత్సరము (1659)లో దన యన్నయైన దారా నోడించి, పట్టణములోఁ ద్రిప్పి యగౌరవ పఱిచి చంపించెను. 1660లో రెండవయన్నయగు సుజాను నోడించి యారాకాన్ దేశమునకుఁ బాఱఁదోలెను. అచ్చటనే వాడు మడిసెను. 1661లోఁ దమ్ముఁడగు మురాదును జెరసాలలో జంపించెను. తనకు సహాయముచేసి రాజ్యమును సాధించిన మీర్ జుమ్లా యనువానిని నమ్మిక, యాతనిని ఆసాందేశమునకుఁ బంపెను. అత డచ్చటఁ దిరుగఁబడునేమోయని యాతని కుమారునిఁ దనయొద్ద నుంచు కొనెను. ఆసాందేశపునీరు పడనందున మీర్‌కాసీ మచ్చటనే కాల ధర్మము నొందెను. ఇట్లు భయపడవలసిన శత్రువులందఱును ఇహ లోకమును త్యజించిరి. ఔరంగ్‌జేబ్ కొంతవఱకు నిర్భయుఁడయ్యెను. కొంతవఱ కనుటకుఁ గారణమే మన నాతని తండ్రియగు షాహా జహాను బ్రతికియుండుపఱకు నాతఁడు పూర్తిగ నిర్భయుఁ డెట్లగును?

1664 లో నౌరంగజేబు వ్యాధిగ్రస్తుఁడయ్యెను. శరీరము నిమ్మళించిన తరువాత గాలిమార్పుటకై యాతఁడు కాశ్మీరమునకుఁబోవ నిశ్చయించెను. ఇంతలో షాహఅబ్బాస్ అను పారసీకరాజునొద్ద నుండి 'షాహాజహానును చెఱలోనుండి విడిచి యతనికి రాజ్య మీయ వలసినది. లేనియెడల మేము దండెత్తి రాఁగల'మని వర్తమానము వచ్చెను. అంత నా దుష్టుఁడా సంకటములోనుండి తప్పించుకొనుటకు దండ్రినిఁ జంపివేయ నిశ్చయించెను. తండ్రికిఁ బెట్టుమని యాగ్రాలోని రాజవైద్యునకు విషము పంపెను. కాని యా వైద్యుఁడట్టి క్రూరకృత్యముఁ జేయలేక తానే యావిషమును భక్షించి ప్రాణములు విడిచెను.1666లోని డిశెంబరునెలలో షాహాజహాన్ నశ్వర దేహమును

వదలెను! అతని మరణకారణము తెలియదు. కాని యౌరంగజేబ్ అత నిని చంపించెనని వదంతి కలదు.

తండ్రి మరణముతో నౌరంగజేబ్ భయరహితుడై యతనిని తాజ్ మహలులోఁ బెట్టించి యతని యౌర్ధ్వ దేహిక క్రియలు ఘన ముగఁ జేసెను.

పారసీకరాజు నిగ్రహము

ఔరంగ్ జేబ్ కాశ్మీర దేశములోఁ బదునెనిమిదినెలలు వసి కుండి శరీరారోగ్యము పూర్తిగఁ గలిగి తన రాజధానికిఁ దిరిగి వచ్చెను. అతడు కాశ్మీరమునకుఁ బోవునపుడు సైన్యమును వెంటఁ దీసికొని పోవుటవిని, యతఁడు పారశీక దేశముమీఁదికి దండెత్తి వచ్చు నేమో యని తలచి, పారశీకపురాజు యుద్ధమునకు సిద్ధమై యుండెను. ఆ సమాచారము తెలిసి యతని కోపమును జల్లార్చుటకై ఔరంగ్ జేబ్ గొన్ని బహుమతుల వెంటనిచ్చి యొక రాయబారినిఁ బంపెను. పారసీక రాజు బహుమతులనుదీసికొనక యారాయబారిని నగౌరవించి, యొక సేవకునిచే నతని గడ్డములాగించి, శక్తిగలదేని కాబూల్ మీఁదికి యుద్ధమునకు రావలసినదని చెప్పిపంపివేసెను. ఈ వార్తదీసికొని యారాయబారి తిరిగి రాఁగా ఔరంగ్ జేబ్ పార సీక రాజుతో నీవు సభలోనే యేల చంపలేదని కోపగించి చంపెను. పారసీక రాజుతో యుద్ధముచేయుట కష్టమని భయపడినవాఁ డయ్యును మీఁదికి మాత్రము యుద్ధసన్నాహము చేసెను. ఇంతలో నతని యదృష్టవశమునఁ బారసీకరాజు కాలధర్మము నొందెను.

పారసీకరాజు పోయిన తరువాత 1667 లో ఔరంగ్ జేబ్ తన సైన్యములను కాబూల్ మీఁదికి బంపెను. కాని యందువలన లాభము కలిగినది గాదు. 1672 లో ఆఫ్ గానులు తిరుగఁబడిరి. ఒక మోసగాఁడు తాను ఔరంగ్ జేబ్ అన్నయగు సుజాననిచెప్పి యచ్చటి వారినందఱిని జేర్చుకొని ఆఫ్ గనుల రాజయ్యెను. ఆ వార్తవిని ఔరంగ్ జేబ్ స్వయముగాఁ గాబూల్ మీఁదికి దండెత్తిపోయెను. కాని యఫ్ గాను లాతనికి స్వాధీనపడినవారు కారు. తుదకుఁ గాసీం

ఖానుఁడను తన సరదారుని నచ్చటనుంచి తాను వెడలి వచ్చెను. ఆ సరదారుడు మోసము చేసి యఫ్‌గాను లందఱిని సంహరించి యా దేశమును స్వాధీనము చేసికొనెను.

హిందువులతో వైరము

1666లో ఔరంగ్‌జేబునకుఁ గల భయములన్నియుఁ బోయి రాజ్యము సుస్థిరమయ్యెను. అందుచే హిందువులనందఱిని మహమ్మదీయులఁ జేయవలయునని బాదుషాహకుఁ జిన్ననాఁటినుండి గల కోర్కెఁ దీర్చుకొనుటకు మంచి సమయము వచ్చెను. అందుచే హిందూమతధ్వంసము చేయుటకు నాతడు సమకట్టెను. 1669లోఁ గాశీపట్టణములోని బ్రాహ్మణులు తమ మతము మహమ్మదీయులకుఁ గూడ బోధించుచున్నారని విని యాతఁడచ్చటి హిందూ మతాధ్యక్షునికి ముట్టుచున్న వర్షాశనముల నాపివేసి, తనరాజ్యములోని హిందూ పాఠశాలలను, మఠములను, దేవాలయములను విధ్వంసము చేయ వలసినదని తన యధికారులకు నాజ్ఞాపించెను. కాశీ, మథుర మొదలైన క్షేత్రములలోని దేవాలయములఁ బడఁగొట్టించి యందలి ప్రతిమల నాగ్రాపట్టణమునకుఁ దెప్పించి మసీదుల పునాదులలో వేయించెను. హిందువులు పండుగలు చేసికొనగూడదనియు యాత్ర లకు పోఁగూడదనియు నిర్బంధపెట్టసాగెను. అందుచేఁ ప్రజ లందఱును భయభీతులై బాదుషాహమీఁద దిరుగఁబడుటకు యత్నించుచుండిరి. దిల్లీ పట్టణములో నఁతడు లేనప్పుడు హిందు వులు తిరుగఁబడుచుండిరి. ఒకప్పుడు తనకు మంత్రప్రభావము కలదని చెప్పెడి యొకస్త్రీ జనులను జేర్చుకొని బాదుషాహను బదచ్యుతునిఁ జేయుటకు సిద్ధమాయెను. కాని యామె తరువాత నోడింపబడియె.

దిల్లీపట్టణమునొద్ద నార్నోల్ గ్రామములో సత్నామీ లను గోసాయి లుండిరి. వారు సత్త్వవృత్తి ప్రధానులైనను పరులు వారిని బాధించిన యెడల రుద్రావతారమును దాల్చువారు. 1676 లో గ్రామములోని కొత్వాల్ వారిని బాధపెట్టినందున వారు యుద్ధ సన్నాహులైరి. బాదుషాహయొక్క సైన్యమును నోడించి వారు

నార్నోల్ గ్రామమును స్వాధీనము చేసికొనిరి. అంత బ్రచండ సైన్యముఁ దెచ్చి ఔరంగ్‌జేబ్ వారి నందటిని సంహరించెను.

హిందువులను మిక్కిలి బాధ పెట్టువలయుననియు, నగౌరవింప వలయు ననియు జిజియాయను జుట్టుపన్ను హిందువు లీయవలయు నని విధించెను. లక్షల కొలఁది జను లిది యన్యాయమని మొట్ట పెట్టుకొనిరి. శుక్రవారము నాఁతఁడు మసీదునకుఁ బోవునపుడు వారంద ఱాతనిని నడ్డగించి మనవిచేసికొనిరి. కాని యా మదాంధుఁడు వారిని నేనుఁగులతోఁ ద్రొక్కించెను. ఇట్లు హిందూ ప్రజలను లెక్కలేని బాధలు పెట్టుచున్నందున హిందూరాజు లందఱు నతనికి శత్రువు లైరి. ఉత్తరమున రాజపుత్రులును, మధ్య హిందూదేశము నందు బుందేలులును, దక్షిణదేశమందు మహారాష్ట్రులును స్వతంత్రులై యతనితో ఘోరముగా బోరసాగిరి. ఆ చరిత్ర మిం క్రింద వివరముగా నీయఁబడును.

రాజపుత్రులతో యుద్ధము

ఆ కాలమందు రాజపుత్రస్థానములో బహు పరాక్రమవంతులగు రాజులు రాజ్యము చేయుచుండిరి. వారితో నౌరంగ్‌జేబ్ స్నేహము చేసియున్నయెడల నతనికి నెంతయో లాభము కలిగియుండును. కాని యా స్వమతావేశాంధుడు రాజపుత్రుల మతము నగౌరవించి వారినందటిని దనకు శత్రువులఁ జేసికొని తన రాజ్యమునకు మోసము తెచ్చుకొనెను. అప్పుడుదయపురములో రాజసింహుడను రాణా రాజ్యము చేయుచుండెను. అతఁడు హిందువులను బాధ పెట్టుట తప్పని యొక యుత్తరము వ్రాసెను. అది స్వదేశ స్వమతాభిమానములచే నిండియున్నది. ఆ యుత్తరము వ్రాసినందువలనను మఱికొన్ని కారణములవలనను, రాజసింహునకును ఔరంగ్‌జేబునకును ప్రబలమైన వైరము తటస్థించెను.

మార్వాడ్ దేశపురాజగు యశవంతసింహుఁడు రాజకార్యనిమిత్తమై కాబూల్ దేశమునకుఁ బోయియుండెను. అతను లేని కాలమందాతని శూరపుత్రుఁడగు పృథుసింహుఁడు రాజ్యము చేయుచుం

డెను. ఔరంగ్‌జేబ్ ఒక్కసారి పృథుసింహునిఁ బిలిపించి గౌరవించి తొడుగుకొనుటకు విషవస్త్రములనిచ్చి యాతనిఁ జంపెను. పుత్రశోక ముచే యశవంతసింహుఁడు కాబూల్ దేశములోనే కాలధర్మము నొందెను (1678). యశోవంతసింహుని భార్య శిశువులగు తన యిద్దఱు పుత్రులతోడఁ గాబూల్ దేశమునుండి తిరిగివచ్చునప్పుడు ఔరంగ్‌జేబ్ సైన్యము లామెను నడ్డగించెను. కాని యా శూర వనిత వారిని నోడించి తన రాఠోడ్ సైన్యములతో దిల్లీ పట్టణము చేరెను. అచ్చటు నామె పుత్రులను బాదుషాహ చెఱఁబెట్టెను. దుర్గా దాసుఁడను యశమంతసింహుని శూరసరదారుఁడు వారిని విడిపించి జోధపురమునకుఁ బంపెను. అచ్చట నామె తన జ్యేష్ఠపుత్రుఁడగు అజితసింహుని రాజ్యారూఢునిఁజేసి ఉదయపురిరాజైన రాజసింహు నితోఁగలిసి ఔరంగ్‌జేబుతో యుద్ధముఁ జేయసాగెను.

పౌరుషముగల రాజపుత్రులందఱును దనపై దిరుగఁబడుటఁ జూచి యౌరంగ్‌జేబ్ వారిని సాధించుటకై యుద్ధసన్నాహ మపరిమితముగాఁ జేసెను. ఆ సన్నాహమును జూచి యాతఁడు లోక మంతయు జయించునా యేమని లోకులు తలచిరి. కాని సైన్య బాహుళ్యమువలన బాదుషాహకు విశేషలాభము కలిగినదికాదు. నాలుగుసంవత్సరములవఱ కాతఁడును అతనిపుత్రులును రాజపుత్రులతోఁ బోరాడి యెన్నియో యుద్ధములలోఁ బరాజితులయి రాజపుత్రులకు ననుకూలములైన వరములిచ్చి వారితో సంధి చేసికొనిరి. సంధిలోని యంశములు (1) ఔరంగ్‌జేబు స్వాధీనతలోఁ నున్న రాజపుత్రుల రాజ్యమంతయు వారికి నిచ్చివేయవలయును. (2) మతవిషయములో నతఁడు జోక్యము కలుగఁజేసికొనఁగూడదు; జిజియాపన్ను రాజపుత్రుల నడుగఁగూడదు. (3) యశవంతసింహుని రాజ్యమంతయు నతని కొమారునకు నిచ్చివేయవలయును. (4) రాజపుత్రులు పూర్వమువలెనే బాదుషాహకు సంబంధించిన పనులు చేయుచుండవలయును. ఇంతటితో రాజపుత్రుల యుద్ధము ముగిసెను. ఔరంగ్‌జేబు బలము క్రుంగెను,

ఛత్రసాల్ రాజ్యస్థాపన

మధ్యహిందూస్థానములో బుందేల్‌ఖండమను దేశ మొకటి కలదు. అచ్చటివారిని బుందేలు లనియెదరు. అచ్చట చంపతరాయ్ అనువాడు షాహజహాన్ కాలమందు రాజ్యము చేయుచుండెను. అక్బర్ కాలములో బుందేలులు మోగలులకు సామంతులైరి. బుందేల్ ఖండములోని రాజులందఱిని జేర్చుకొని చంపతరాయ్ స్వతంత్రుడగుటకు యత్నించెను. షాహజహాన్ బాకీఖాన్ అనువానిని చంపతరాయ్ మీదికి బంపగా నా శూరాగ్రేసరుడా తురుష్కుని బరాభవించెను. ఆ యుద్ధములో చంపతరాయుని కుమారుడగు సత్యావాహనుడనువాడు వీరస్వర్గము జెందెను. చంపతరాయుని నెటులైన సాధింపవలయునని షాహజహాన్ అనేక యుక్తులఁ బన్నెను గాని యతని కోర్కె సిద్ధించినది కాదు. అందుపై గోసోద్దీపుతుడై షాహజహాన్ ఆగ్రానుండి మహబత్‌ఖానుని, దక్షిణమునుండి ఖాన్ జహానుని, ప్రయాగనుండి అబ్దుల్లా యనువానిని నొక్కపెట్టిన నాక్షత్రియావతంసునిమీదికి పంపెను. కాని మరాటావారివలెనే బుందేలులును పర్వతముల నాశ్రయించి మోగలుల సైన్యములను మిక్కిలి బాధపెట్టి పెక్కుసారులోడించిరి. అహమహమికగల మహమ్మదీయ శూరాగ్రేసరు లంధ్రులను యుద్ధములోఁబడిరి. దానిచే చంపతరాయునకు కుంచ్ పరగణా జాగీరుగనిచ్చి తనయొద్ది సరదారులలో నొక గొప్ప యధికారమిచ్చి యాతనతో సంధిచేసుకొనెను. తరువాత చంపతరాయుఁడు రాజ్యము సంపాదించు విషయమై ఔరంగ్‌జేబునకును, దారాకును జరిగిన యుద్ధములో ఔరంగ్‌జేబ్ పక్షమునఁ బోరాడి యతనికి జయము కలిగించెను. కాని మిత్రద్రోహియగు ఔరంగ్‌జేబ్ తనకు రాజ్యము వచ్చినతరువాత చంపతరాయుని నగౌరవించినందున నతఁడు తన రాజ్యమునకుఁబోయి ఔరంగ్‌జేబుతోఁ బోరాడుటకై సైన్యములఁ జేర్చుచుండెను. 1664లో నా శూరాగ్రేసరుఁడు శత్రువులతో బోరాడుచుఁ బ్రాణములఁ ద్యజించి జన్మసాఫల్యము గాంచెను. ఇతని కొమారుఁడు ఛత్రసాల మహారాజు,

ఆకాలములోని పశ్చిమ హిందూదేశమందలి మహారాష్ట్రుల చరిత్రకును, మధ్యహిందూదేశమందలి బుందేలుల చరిత్రకును గొంత సామ్యము కలదు. ఇద్దరును స్వదేశ స్వాతంత్ర్యమునకై పడరాని యిడుములు పడుచుండిరి. ఛత్రసాలుని తండ్రియైన చంపతరాయుని శివాజీతండ్రియైన శహాజీతో బోల్చవచ్చును. వారి కుమారులగు ఛత్రసాల్ శివాజీలు బుందేల మహారాష్ట్రులను స్వతంత్రులఁజేసి మోగల్ ప్రభుత్వమును ధిక్కరించిరి. ఈ ఛత్రసాలుఁడు 1650 లో జన్మించెను. శివాజీవలెనే యితని చిన్నతనమంతయుఁ గష్టములో గడచెను. రామాయణమహాభారతాది కథలను విన్నందున నితనికి స్వదేశ స్వమతాభిమానములు గలిగెను. తండ్రిపోయినతరువాత నితఁడు తన దేశమునకుఁగల పారతంత్ర్యమును బోఁగొట్టుటకుఁ గృతసంకల్పుఁడై సైన్య సన్నాహము చేయఁదొడఁగెను. ఆ కాలమునందే మహారాష్ట్ర దేశమును బారతంత్ర్యమునుండి విడిపించుటకు శ్రీ శివాజీచేఁ జేయఁబడుచున్న ప్రయత్నములను నిని యామహామహుని దర్శింప గోరెను. స్వదేశోద్ధారణమునకై యవతరించిన యీ యద్వితీయ పురుషు లిద్దఱును భీమానదియొడ్డున గలిసికొనిరి. ఛత్రసాలుని యుత్సాహమును, స్వదేశప్రీతియుఁజూచి శివాజీ మిక్కిలి సంతసించి తన మధుర వాక్కులతో స్వాతంత్ర్య ప్రీతియు యవనసంహార నిశ్చయమును మమ్మాటికి మఱవవలదని బోధించి తన కత్తి యతనికి బహుమతిగా నొసఁగి స్వదేశోద్యమమునకు నాతనిఁ బురికొల్పెను. ఆకాలమందలి వాషింగ్టన్ (Washington) విల్లియం ఆఫ్ ఆరెంజు (William of Orange) లనఁదగు నీ స్వదేశభక్తుల సమాగమ ప్రసంగమును భూషణకవి మిగుల రసవంతముగా వర్ణించియున్నాడు.

తరువాత ఛత్రసాలుఁడు స్వరాజ్యమును స్థాపించెను. ఔరంగ్‌జేబ్ ఫిదాయీఖాన్ అనువానిని ఛత్రసాలునిమీఁదికిఁ బంపెను. ప్రప్రథమమునే బుందేలు లాతురుష్కునిఁ బూర్తిగఁ బరాభవించిరి. అంత ఛత్రసాలుని నందఱుఁ గొనియాడసాగిరి. అంతకుఁ బూర్వము తురుష్కులతోఁ గలిసియున్న బుందేలులుకూడవచ్చి ఛత్రసాలునికి సహాయము చేయసాగిరి. అతఁడు బాదుషాహ యొక్క రాజ్యమును

గొల్లకొట్టి పర్వతదుర్గముల నాక్రమించుకొనసాగెను. క్రమక్రమముగా నతని రాజ్యము కొలఁదికాలములోనే మిక్కిలి యభివృద్ధి చెందెను; ఇదియంతయు సహింపనోపక ఔరంగ్‌జేబ్ రణదుల్లాఖానునిఁ బ్రచండసైన్యమిచ్చి బుందేల్ ఖండము మీఁదికిఁ బంపెను. ఉభయ సైన్యములకు గడకోట యనుచోట ఘోరమైన పోరు జరిగి మహమ్మదీయు లోడిపోయిరి. రణదుల్లాఖానుడు కాళ్ళకు బుద్ధిచెప్పి బ్రతికిపోయెను. ఈ పరాభవమునకై బాదుషాహా యెంతయుఁ జింతించెను. ఛత్రసాలుడు దిల్లీ మీదికి దండెత్తివచ్చునేమో యని భయపడి బాదుషాహా మరల సైన్యములిచ్చి తుహవ్వర్‌ఖానునిఁ బంపెను. ఈ సరదారుఁడు శూరుఁడు, యుక్తిమంతుడు. కాని శూరాగ్రేసరులైన బుందేలుల యెదుట నితని నక్కజిత్తులు పనికి వచ్చినవికాపు. ఇతఁడును యుద్ధములో నోడిపాఱిపోయెను. ఈ సంతత విజయములచే ఛత్రసాలుని కీర్తియు, వైభవమును నలు దెసలఁ బ్రసరించెను. ఆతఁడు బుందేల్ ఖండమంతయు సాధించి యచ్చట నిరంకుశ ప్రభుత్వము చేయసాగెను. అతనికి సామంతులగు తురుష్క ప్రభువు లనేకులు చౌతాయీయను నాల్గవవంతు పన్నీయ సాగిరి.

అంత షేక్ అన్వర్‌ఖానుఁ డనువాడు దిల్లీనుండి ఛత్రసాలు మీఁదికి దండెత్తివచ్చెను. కాని ఛత్రపాలునిచేఁ జెరపట్టుబడి యతనికి శరణుఁచొచ్చి లక్ష యిరువదివేల రూపాయ లాతనికి దండుగ యిచ్చి విముక్తుఁడయ్యెను. బాదుషాహా నిండుసభలో నాఖానుని నిందించి యతని బిరుదు లన్నియు నధికారములన్నియుఁ దీసివేసెను. ఛత్రసాలుని గర్వమడంచు వీరుఁ డొక్కఁడైనఁ దనసభలో లేఁడుగదాయని ఔరంగ్‌జేబ్ నిరాశతోఁ బలుకఁగా మీర్జా సదరుద్దీన్ అనువాఁడు తానాపనిచేసెదనని కంకణము గట్టుకొనెను. అతని కెన్నియో కపటోపాయముల నేర్పి బాదుషాహా యుద్ధమునకుఁ బంపెను. కాని వాఁడును ఛత్రసాలుని శౌర్యమునకుఁ దాళలేక చేతులాడించుకొనుచుఁ దిరిగివచ్చెను. ఇట్లనేక మహమ్మదీయయోధులఁ బంపినను కార్యము కానందున తుదకు ఔరంగ్‌జేబ్ ఛత్రసాలునితో స్నేహపూర్వకమైన

సంధి చేసికొనెను. ఇట్లు మహమ్మదీయుల వెడలఁగొట్టి స్వరాజ్య స్థాపనము చేయునపుడు ఛత్రసాలునకు నాతని గురువగు శ్రీ ప్రాణ నాథప్రభు వనుసాధువు తనబోధలచే బ్రోత్సాహము కలిగించుచుం డెను. 1707లో ఔరంగ్‌జేబ్ మరణము నొందినతరువాత నతని కుమారుఁడును ఛత్రసాలుని స్వాతంత్ర్య మొప్పుకొని యతనివలన ననేక పర్యాయములు సైన్యసహాయ్యము వడసెను. అటుతరువాత నీ ఛత్ర సాలుని ప్రేరేపణవలననే మహారాష్ట్రులు బుందేల్ ఖండములో బ్రవే శించిరి. ఆ సమాచారము మహారాష్ట్రుల చరిత్రములో సవిస్తర ముగా వ్రాయబడును. ఛత్రసాలుడు 1650లో జన్మించి 1726లోఁ గీర్తిశేషుఁడయ్యెను.

మహారాష్ట్రులతో యుద్ధము

దక్షిణములో నున్న బిజాపూర్, అహమ్మద్‌నగర్ రాజ్యము లను సాధింప వలయునని ఔరంగ్‌జేబ్ తలఁచుచుండగా నచట మటియొక ప్రబలరాజ్య ముదయించెను. మహారాష్ట్ర దేశములో 1627 వ సంవత్సరమునందు శ్రీ శివాజీయను నవతారపురుషుఁడొకఁ డుదయించెను. అతఁడు స్వరాజ్య స్థాపనైకతత్పరుఁడై బిజాపూర్ రాజులతోడను మోగలుల తోడను బోరాడఁ జొచ్చెను. మోగ లులతో నతఁడు పెక్కు మారులు పోరాడి వారిని నోడించెను. 1665 లో నతఁడు ఔరంగ్‌జేబ్‌తో సంధిజేసుకొని యాతనిఁజూడ 1666 లో దిల్లీ పట్టణమునకుఁ బోయెను. అచ్చట మోసముచేసి యౌరంగ్ జేబ్ శివాజీని చెఱఁబెట్టెను. కాని యతడా చెఱఁదప్పించుకొని సుఖముగా రాజ్యమునకు వచ్చిచేరెను. 1667 లో ఔరంగ్‌జేబ్ శివాజీకి ననుకూలమైన సంధిచేసికొనవలసిన వాఁడాయెను. 1677 లో శివాజీ మోగలు సైన్యములఁ బూర్తిగ నోడించెను. 1674 లో శివాజీపూర్తిగ స్వతంత్రుఁడై పట్టాభిషేకముచేసుకొనెను. ఇట్లు శివాజీ మోగలుల రాజ్యములోని యనేక ప్రదేశములను స్వాధీనము చేసి కొని 1680 లోఁ గీర్తిశేషుఁడయ్యెను. తరువాత నాతని కుమారుడగు సంభాజీ మహారాష్ట్రులకు రాజయ్యెను. మూఁడవ భాగమందు

శివాజీ చరిత్ర సవిస్తరముగ వర్ణింపఁబడును. చరిత్ర సందర్భను సారముగ నిచ్చట సూక్ష్మముగా వ్రాయఁ బడినది.

దక్షిణ దిగ్విజయ యాత్ర
(1683-1707)

రాజ్యమునకు రాకపూర్వము ఔరంగ్‌జేబ్ దక్షిణములో నుబే దారుగానుండి అహమ్మద్‌నగరరాజ్యమును గెలిచెను. గోలకొండవారి యొద్దనుండి కప్పము తీసుకొనెను. అప్పుడే బీజాపుర గోలకొండ రాజ్యముల గెలిచి మోగల్ సామ్రాజ్యములోఁ గలిపివేయవలయు నని నిశ్చయించెను. కాని యప్పుడు రాజ్యాభిలాషచే నుత్తరహిం దూదేశమునకు వెడలి పోయెను. ప్రస్తుత మారెండు రాజ్యము లను గ్రొత్తగా మహారాష్ట్రులచే నాక్రమింపఁబడిన రాజ్యమును సాధింప వలయునని బాదుషాహ 1683 లో దిల్లీనుండి బయలుదేరి దక్షిణమునకు వచ్చెను. అప్పుడాతని వెంటనున్న సముద్రమువంటి సైన్యమును గ్రంథకారులనేకు లాశ్చర్యకరముగా వర్ణించియు న్నారు. బాదుషాహ వెంట నలువదివేల గుఱ్ఱపు రౌతులును, లక్ష కాల్బలమును, ఏఁబదివేల లొట్టిపిట్టలును, మూఁడు వేల యేనుఁ గులు నుండెను. కొందఱు మూఁడులక్షల గుఱ్ఱపురౌతులును, నాలుగు లక్షల కాల్బలములును ఉండెనని వ్రాసియున్నారు. ఈ సైన్యము విడిది ముప్పది మైళ్ళ విస్తారము కలిగియుండెను, అందు రెండు వందల యేఁబది సంత లుండెనట. ఈ సైన్యసముద్రమును దీసి కొని బాదుషాహ దక్షిణమునకు 1683 లో వచ్చి మరల దిల్లీ పట్టణ మునకుఁ బోలేదు. 1707 వ సంత్సరములో అహమ్మద్‌నగర పట్టణ ములో మృతి జెందువఱకు దక్షిణదేశమందే యుండెను.

పరస్పర కలహముతో దక్షిణ దిశకు వచ్చియున్న బీజాపుర రాజ్యమును 1686 లోను, గోలకొండ రాజ్యమును 1687 లోను జయించెను. 1689 లో మహారాష్ట్రుల రాజైన సంభాజీనిఁ జెఱపట్టి కండ్లుతీసి బాధపెట్టి చంపించెను. అప్పటినుండి 1701 వ సంవత్స రమువఱకు మహారాష్ట్రులతోఁ బోరాడుచు వారి దుర్గము లనేక

ములఁ దీసికొనెను. కాని 1702 – మొదలు 1705 – వ సంవత్సరము వఱకు మహారాష్ట్రవీరులు విజృంభించి పోయిన దుర్గముల నన్నిటిని మరల సాధించిరి. తుదకుఁ దా నిఱువదియైదు సంవత్సరముల వఱకు దక్షిణమునం దుండినను ఏమియు లాభము కలుగలేదని చూచి తన మనోరథములన్నియు వ్యర్థమవుటకుఁ జింతించి తనతప్పులను దిద్దు కొనుటకు సమయము లేదని తలఁచి చింతాక్రాంతుఁడును, నిరాశా మగ్నుఁడును, బశ్చాత్తప్తుడును, భయాక్రాంతుఁడును అగు నాముదు సలి బాదుషాహ 1707 – వ సంవత్సరములో అహమ్మద్ నగర్ పట్ట ణమునందుఁ గాలధర్మము నొందెను.

ఔరంగ్‌జేబ్ యోగ్యత

ఈ బాదుషాహ సద్గుణ దుర్గుణ పుంజముల మిశ్రణముచేఁ జేయఁబడెను. ఇతనియందలి సద్గుణములను గొంతవఱకుఁ గనుఁ గొందము. ఇతఁడు గొప్ప విద్వాంసుఁడు. ఏయేవిద్యలు రాజపుత్రులు నేర్చుట యావశ్యకమో యావిద్యలను గుఱించి యీతఁడు తన గురు వునకు వ్రాసిన యుత్తరమువలనఁ దెలియఁగలదు. అరబ్బీ పారసీక భాషలలో నీతఁడు పండితుఁడు. ఇతఁడు తన పుత్రికలకుఁ గూడ విద్య నేర్పెను. ఒకపుత్రిక యరబ్బీ పారసీక భాషలఁ జక్కఁగ నెఱిఁగి యుండెను. మఱియొక కూఁతునకు కురాన్ గ్రంథమంతయు ముఖ గతమై యుండెను. ఇతనియందుఁగల రెండవసద్గుణ మింద్రియ నిగ్ర హము. ఇతఁడెన్నఁడును మద్యపానము చేయలేదు. మహమ్మదీయు లెవ్వరును తనరాజ్యములో మద్యపానము చేయఁగూడదని శాసిం చెను. అట్లు చేయువారి కాలుసేతులు ఖండించునట్లు ఆజ్ఞాపించెను. అట్లే తనరాజ్యములోని గాయనవాద నాదులు నాపివేసెను. నాచ్ అనఁబడు నృత్యవిద్యను నెవ్వరభ్యసింపఁగూడదని విధించినందున ననేక వారకాంతలకు నుపవాసము సంభవించెను. వారినందఱిని వివాహము చేసికొనుఁడని యాజ్ఞాపించెను. మతవిషయము తప్ప మఱియే విష యమైన వ్యాజ్యములు వచ్చినప్పుడును క్రమమైన తీర్పు చెప్పును. ప్రజలను బాధపెట్టిన యధికారులను గఠినముగా శిక్షించెను. ఇవి యితనియందలి సద్గుణములు.

ఇక దుర్గుణములను జూడఁబోయినయెడల నవి యసంఖ్యములు కలవు. కపటు మీతనియందలి మొదటి దుర్గుణము. మనో వాక్కాయకర్మములఁ ద్రివిధముగానుంచుట యీతని స్వభావ విశేషము. రాజ్యతృష్ణ, రాక్షసవృత్తి. క్రూరస్వభావమీతని భ్రాతృ పితృ మిత్ర హత్యలవలననే నిదితము. కృతజ్ఞత యనుమాట యీత నికిఁ గలలోనైనఁ దెలియదు. తనకు సాహాయ్యముచేసిన మీర్ జుమ్లా, యశోవంత్ సింగ్, చంపతరాయ్ మొదలయిన వారి విషయమ్మై యితఁడుచేసిన యపకార మాసురప్రకృతులకుఁదగినది. ఇతని దుర్గుణములలో హిందూమతద్వేష మనునది మిక్కిలి గొప్పది. అందు వలన నితనికి దేశములోని శూరులందఱును శత్రువులైరి. రాజ్యమంతయు శిథిలమై యితనితరువాతఁ దుత్తునియలైపోయెను.

అతని యాదాయము

భూమిపన్నువలన నీతనికి 43కోట్ల రూపాయలును, తక్కిన పన్నులవలన 57కోట్ల రూపాయలును మొత్తముమీఁద 90 కోట్లు యాదాయముండెను. ఆదాయమునకుఁ దగినట్లు వ్యయమును విశేషముగా నున్నందున ఔరంగజేబు మరణ సమయమందు బొక్కసములోఁ బదమూఁడులక్షల కంటె నెక్కుడు ధనములేదు.

ఔరంగజేబు రమారమి యేఁబది సంవత్సరముల వఱకు రాజ్యము చేసినందునను, రాజకార్య కుశలుఁడైనందుననను, అతని యొద్ద శిష్యత్వముచేసి రాజ్య వ్యవహారములలో నారి తేఱినవారనేకు లుండిరి. అయోధ్య నవాబుల మూలపురుషుడగు సాదత్ ఖాన్, హైదరాబాద్ నవాబులకు మూలపురుషుఁడగు నిజాం ఉల్ములుక్, బంగాల్ సుబేదారులకుఁ గూటస్థుఁడగు మర్షిద్‌కులీ ఖాన్, దక్షిణ దేశములోఁ బ్రసిద్ధి వహించిన దావుద్‌ఖాన్ పన్నీ మొదలయిన తురుష్కరాజ్య కార్యధురంధరులనేకులు ఔరంగ జేబు వద్దనే రాజనీతి నేర్చుకొనిరి. వీరు ముందుకాలములో ననేక రాజకీయ వ్యవహారములఁ జేసిరి.

బహదుర్ షాహ

1707–1712

ఔరంగజేబ్ మరణముఁజెందినపు డాతని పెద్దకుమారుడగు ముఅజ్జమ్ అనువాఁడు కాబూల్ దేశములోను, అజీమనువాఁడు తండ్రియొద్ద నహమ్మద్ నగరములోను, మూఁడవవాఁడగు కామ్‌బక్ష్ విజాపురములోను నుండిరి. అందుఁ బ్రతివాడును రాజ్యపదమునకై యత్నింప సాగెను. సైన్యాధీశుఁడగు జుల్‌ఫికర్‌ఖాన్ అజీమునకు సహాయుఁడుగా నుండెను. వారిద్దఱును సైన్యములతో ఢిల్లీమీఁదికిఁ బోవసాగిరి. ఈ సమాచారము తెలిసి కాబూల్ దేశమునుండి ముఅజ్జమ్ సైన్యములతో వచ్చెను. వానికి రాజపుత్రులు సహాయులైరి. ఆగ్రాపట్టణము నొద్ద నన్నదమ్ములకు యుద్ధమై యందు అజీమ్ చంపఁబడెను. ముఅజ్జమ్ బహదుర్‌షాహ యనుపేరుతో బాదుసాహాయయ్యెను. తరువాత దక్షిణమునకుఁబోయి హైద్రాబాదు నొద్ద యుద్ధములో కాంబక్షును జంపి నిర్విచారుండయ్యెను. మరాటీ వారి రాజగు శాహూ ఔరంగజేబుయొక్క చెఱలో నుండఁగా నతనిని విడిచి, యాతనిరాజ్య మాతనికిచ్చి తనకు సహాయునిగాఁ జేసుకొనియెను. దావూద్‌ఖాన్ పన్నియను వానిని దక్షిణదేశపు సుబేదారుగా నేర్పరచుకొని జుల్ఫికర్‌ఖానుని తనసభలో నుంచుకొనెను.

శిఖ్కు లోకులతో జగడములు

ఈబాదుషాహ కాలములోజరిగిన ముఖ్యచారిత్రాంశము శిఖ్కులతోఁ బోరాడుట. శిఖ్కుల యుత్పత్తిని గుఱించి యిచ్చటఁ గొంత వ్రాయవలసి యున్నది.

హిందువులును మహమ్మదీయులును పంజాబు దేశములో మూఁడు నాలుగువందలయేండ్ల వఱకును గలిసియున్నందున వారియా చారవిచారములలోఁ గొంతవఱకుసామ్యముకలిగెను. హిందూమహమ్మదీయ సాధుపురుషులు గూడ నీ యుభయుల యైకమత్యమునే బోధింపసాగిరి. ఇట్టి విఖ్యాత సాధు వొకఁడు 1469 లో నుదయించెను. అతని పేరు నానక్. హిందూ మహమ్మదీయ మతములలో

నుండి కొన్ని సిద్ధాంతములనుదీసికొని యీతడు నూతన మతమును స్థాంపించెను. దానికే సిఖ్ మతమని పేరు. సీఖులనఁగా శిష్యులని యర్థము. మత విషయములో దురాగ్రహము పనికి రాదనియు, మనస్ఫూర్తిగా నెవ్వఁడారాధన చేసినను అయ్యారాధన ఈశ్వరు నందఁగలదనియు ఈ నూతన మతములోని సిద్ధాంతములు. క్రమ క్రమముగా నీ మత మభివృద్ధిపొందెను. వీరి మతగ్రంథమునకు 'గ్రంథసాహెబ్' అనిపేరు. అది పంజాబీ (గురుముఖీ) భాషలో వ్రాయబడి యున్నది. నానక్ తరువాత నేర్పడిన ముగ్గురు గురు వులు సాధువృత్తి గలవారు. వారిని మోగల చక్రవర్తులు గౌరవించు చుండిరి. వారికిఁ గొన్ని జాగీరులును నొసఁగిరి. నాల్గవ గురువు వద్దనుండియు నీ మతాధికారులు సాధు వృత్తిని విడిచి రాజవృత్తిని నవలంబించిరి. అనేక రక్షక భటులను వెంటనుంచుకొనసాగిరి. అందుచే మోగల చక్రవర్తులకును వారికిని వైరము వచ్చెను. ఎని మిదవ గురువగు తెగ్‌బహాద్దరను వానిని డిల్లీకిఁ బిలిపించి యౌరంగ్ జేబ్ చంపించెను. అందుచే సిఖ్కులు తిరుగఁబడిరి. తొమ్మిదవ గురు వగు గురుగోవింద్ అనువాఁడు యుద్ధముచేసి యోడి యరణ్యము లోనికిఁ బారిపోయను. అచ్చటనే యతఁడు 1708 లోఁ జంపఁ బడెను.

అప్పటినుండి సిఖ్కులు తమ సౌమ్యవృత్తిని వదలి యుద్ధ ప్రియులయిరి. బందా యనువానిని దమ గురువుగాఁ జేసుకొని వారు మతయుద్ధములను జేయసాగిరి. మోగలులపైఁ దిరుగఁబడి మసీదు లను ధ్వంసం చేసిరి. పట్టణములను గాల్చివేసిరి; ఈ సమాచారము లన్నియు ముఖ్యముగ సర్‌హింద్ అనుచోట జరిగెను. అప్పుడు బహా దుర్ షాహ వారిమీఁదికి దండెత్తెను. అతని సైన్యము లనేకులగు సిఖ్కుల నరికివేసెను. బందా యనువానిని బట్టుకొని ధిల్లీకిఁ దీసు కొని వచ్చి బాధలుపెట్టి చంపిరి. అప్పటినుండి సిఖ్కులు ముప్పది సంవత్సరములవర కూరకుండిరి. తరువాతఁ గ్రమక్రమముగా వారికి దేశాభిమానము కలిగి వారిలో ననేక రాజ్యము లుద్భవించెను.

తుదకు రణజిత్‌సింగను మహావీరుఁడు వారినందరిని నేకచ్ఛత్రము క్రిందికిఁ దెచ్చిన కథాభాగము బ్రిటిషు ప్రభుత్వ వర్ణనలో వివరముగ వర్ణింపబడును.

బహదుర్ షాహనుగురించి విశేషము వ్రాయవలసినది లేదు. అతనికి సాహస ధైర్యములులేవు. కాని యాతఁడు కొంతవరకు సువిచారము కలవాడును, మిత్రప్రియుండును అని చెప్పవలెను. రాజ్యమునకు వచ్చునప్పుడే యాతఁడు వృద్ధుడు. కావున నైదు సంవత్సరములు రాజ్యముచేసి యతడు 1712 లోఁ గాలధర్మము నొందెను.

జహాందర్ షాహ.

(1712)

ఇతఁడు బహదుర్ షాహ పెద్దకొమారుఁడు. జుల్‌ఫికర్ ఖానుని సహాయమువలన రాజ్యారూఢుఁడయ్యెను. ఇతఁడు క్రూరుడును దుర్వ్యసనాసక్తుఁడును అయినందునఁ దన సరదారుల నందరిని నగౌరవించెను. అందుచే నితని తమ్మునికుమారుఁడగు పరుఖ్‌సియర్ అనువాడు బంగాళమునుండి దిల్లీ పట్టణమునకుఁ బోయి జహాందరును, జుల్‌ఫికర్‌ను జంపి తాను రాజయ్యెను.

ఫరుఖ్ సియర్

(1713-1719)

బహార్ ప్రాంతమునకు నధికారియగు సయ్యద్ హుసేనల్లీ, ప్రయాగ ప్రదేశమునకు నధికారియగు సయ్యద్ అబ్దుల్లా యను సరదారు లన్నదమ్ములు. వీరి సహాయమువలననే యీ బాదుషాహకు రాజ్యము ప్రాప్తించెను. అందుచే నతఁడు అబ్దుల్లా యనువానికిఁదన ముఖ్యమంత్రిత్వమును, హుసేనల్లీకి సైన్యాధిపత్యము నొసంగెను. అందుచే నీసయ్యద్ సోదరులిద్దరును సర్వాధికారము కలవారలయి, బాదుషాహనుగూడ లక్ష్యము చేయరైరి. వారిని నాశము చేయవలయునని బాదుషాహ యత్నించెను. కాని యాతని యుపాయములన్నియు నాతనికే చెఱుపుచేసెను. రాజపుత్రులందఱును నైకమత్య

ముకలవారలై మోగలుల యధికారమును ధిక్కరించివేసిరి. ఈస్టు ఇండియా కంపెనీకి బంగాళాదేశములో నీ బాదూషాహ కొన్ని పలములిచ్చెను. ఇంతలో సయ్యద్ సోదరులకును ఇతనికీ మిక్కిలి వైరము కలిగెను. వారి బాధ తప్పించుకొనుటకై వారిలో నొక్క డగు హుసేనల్లీ యనువానిని దక్షిణదేశమునకు సుబేదారుగా బంపెను. కాని వాడచ్చట మరాటావారితో స్నేహముచేసి వారి సైన్యములను, బాలాజీ విశ్వనాథ్ అను పేష్వాను వెంటదీసికొని దిల్లీ పట్టణముమీదికిబోయి తన యధికారమును మరల స్థాపించెను (1717). ఇట్లు మరల బూర్ణాధికారము కలవారలై 1719 లో ఫరుఖ్ సియరును జంపించి యారు నెలలలో నిద్దరు రాజపుత్రుల సింహాస నస్థులఁ జేసిరి. కాని వారే కారణమువలననో మృతులైరి. తుదకు మహమ్మద్ షాహయనువానిని బాదుషా చేసిరి. కావున నీసయ్యద్ సోదరులకు 'రాజనిర్మాత్' (King makers) అని పేరు వచ్చెను. ఫరుఖ్ సియర్ వ్యసనాసక్తుడు, నీచుడు. క్షీణించు చున్నట్టి రాజ్య మును బాగుచేసుకొను సామర్థ్య మీతనియందు లేదు.

మహమ్మద్ షాహా.

(1719 - 1748)

ఇతడు రాజ్యమునకు వచ్చిన కొలదికాలములోనే సయ్యద్ సోదరుల నోడించి, చంపించెను. ఇతడు రాజ్యకార్యకుశలుడు కాడు. రాజ్య వ్యవహారములయందు నితనికి లక్ష్యమే లేకయుం డెను. ఎప్పుడును విలాసమగ్నుడై యుండును. ఇతని కాలమునందే మోగల్ సామ్రాజ్యము తునకలు తునకలుగా విభాగమగుటకుఁ బ్రారంభమైనది.

దక్షిణ హైద్రాబాద్.

దక్షిణములో నిజామ్ ఉల్ముల్క్ అనువాడు స్వతంత్ర రాజ్య మును స్థాపించెను. ఇతడు ఔరంగజేబు శిక్షలో బెరిగిన యోధ.

రాజకార్య కుశలుఁడు. ఇతని మొదటిపేరు కమరుద్దీన్ ఖాన్. ఇతనికి ఔరంగజేబ్, చింకిలిజ్ ఖాన్ అను బిరుదు నిచ్చెను. జుల్ఫికర్ ఖాను నితోఁ బోరాడునెడ సయ్యద్ సోదరుల కీతఁడు సహాయము చేసినందున వారీతనికి ఆసఫ్‌జాహ, నిజాం ఉల్‌ముల్క్ అను బిరుదుల నొసఁగిరి. నిజాం అను-నామమె యితని వంశజుల కిప్పటికిని జరుగుచున్నది. మోగల్ సామ్రాజ్యముయొక్క యవసానదశలో నిజాం ఉల్ముల్‌క్ వంటి చతురుఁడును, దూరదృష్టి కలవాడును, రాజకార్య కుశలుఁడును మరియొకఁడు లేడు. మోగల్ రాజ్యము పడిపోకుండఁగ నుండుటకు నితఁడు కొంత యత్నించెను. కాని యందువలన ముసలి దైన మోగలరాజ్యమునకు నేమియు లాభము లేదని యెరిఁగి, వీల యిన యెడల నాత్మలాభమైనఁ జేసికొనవలయునని తలఁచి యితఁడు దక్షిణదేశమునకు సుబేదారుగా పచ్చెను. ఇతనిని జంపవలెనని బాదుషా యత్నించెను. కాని యది సిద్ధించినది కాదు. నిజామ్ఉల్ముల్‌లుక్ 1724 వ సంవత్సరము మొదలు హైద్రాబాద్‌లో దిల్లీశ్వరుని లక్ష్యముచేయక స్వతంత్రుఁడై రాజ్యము చేయసాగెను. మాళవా, గుజరాత్ దేశములను గూడ స్వాధీనము చేసికొనవలయునని యత్నించెను. కాని యితని కో ర్కె ఫలించినది కాదు. నిజామునకు మరాటావారు ప్రబలప్రతిస్పర్ధులైరి. వారు ప్రబలులై హిందూదేశ మంతయు నాక్రమించుకొనియెదరని దూరదృష్టి కలవాడగుటచేఁ గను గొని యితడు మొదటినుండియు మరాటావారిని నడఁప యత్నించెను. కావున, పూనా పెష్వాలకును, హైద్రాబాద్ నిజామునకును ఎడతెగని వైరము కలిగెను. ఆ కథాభాగమంతయు మహారాష్ట్రుల చరిత్రలో వివరముగా వర్ణింపఁబడును. నిజాం ఉల్ముల్‌లుక్ 104 సంవత్సరముల వయస్సువాఁడగు వరకు బ్రతికి 1748 లోఁ గాలధర్మము నొందెను.

గుజరాత్, మాళవ వర్హాడ్ ప్రదేశముల గెలిచి మరాటావారు దిల్లీ మీఁదికిఁ బోయిరి. వారితోఁ బోరాడు సామర్థ్యము లేనందున బాదుషా వారడిగిన వరములన్నియు వారికిచ్చి వారినిఁ బంపివేసెను.

నాదిర్ షాహయొక్క దాడి

మోగల రాజ్యము మీఁదికి విపత్తులపై విపత్తులు రాఁజొ చ్చెను. అందుఁ బారసీక రాజగు నాదీర్‌షాహయొక్క దాడి యను నది పిడుగువంటిది. నాదిర్ షాహ స్వపరాక్రమముచే వనరాజ్యసీమ నభివృద్ధి పటిచి 1732 లో దిల్లీ మీఁదికి నపరిమిత సైన్యములతో దండెత్తి వచ్చెను. అతఁడు ఢిల్లీశ్వరుడైన మహమ్మదు షాహను పరాభవించిచెఱఁబెట్టి రాజప్రసాదములోఁబ్రవేశించియుండెనుఁగొన్ని దినములతరువాత డిల్లీ లోనికొందఱుమూర్ఖులు నాదిర్‌షాహను జంపి తిమని యసత్యపువదంతి వేసిరి. అందుమీఁద ఢిల్లి పట్టణములోనిజనులు నాదిర్‌షాహ యొక్కజనులను జంపసాగిరి. ఈ సమాచారము తెలిసి నాదిర్ షాహ డిల్లీ లోని జనులందఱిని సఱికవలసినదని తనసైనికు లకు నాజ్ఞయిచ్చెను. యుగ్రుడైఅంత డిల్లీ పట్టణములో జరిగిన చిత్రవధ ప్రకారము వినినయెడల నెట్టిక్రూర కర్మునికైన శరీరముగగుర్వొడు వక మానదు. పీనుఁగుల గుట్టలతోను నెత్తురు సెలయేళ్ళతోను డిల్లి పట్టణము నిండెను. ముప్పదివేలకంటె నెక్కుడు జనులు చంపఁ బడిరి! తుదకు బాదుషాయగు మహమ్మదుషాహ చేతులు జోడించి కనులు నీరు దెచ్చుకొని యాచిత్రవధను నాపుఁమని నాదిర్‌షాహను వేడెను. అందుపై హిందూదేశపు చక్రవర్తి ప్రార్థన నంగీకరించితి మని యాతఁడు డిల్లి పట్టణ వాసులవధ మాన్పెను. రెండు నెలలవఱకు నాదిర్‌షాహ డిల్లి పట్టణమును దోఁచుకొనుచుండెను. ఆ లోభియగు నాదిర్ షాహ. బాదుషాహ మొదలు బీదవాని నందఱివఱకు దోఁచు కొనెను. ఇట్లుదోచుకొనిన ధనము వెల తొమ్మిది కోట్లని కొందఱును, ముప్పదికోట్లనికొందఱును వ్రాసియున్నారు ! డిల్లి సామ్రాజ్యమునకు భూషణా స్పదములగు మయూరాసనమును, కోహినూర్ వజ్రమును ఆతఁడు తీసికొనిపోయెను. పారసీకమునకుఁ బోయిన తరువాత నతడు 1742 లోఁ జంపఁబడెను.

అదృష్ట హీనుడగు మహమ్మదుషాహ 1748 లో గాలధర్మము నొందెను.

అహమ్మద్ షాహా

(1748–1754)

ఇతఁడు మహమ్మదుషాహా కుమారుడు. చుట్టును శత్రువు లుద్భవించినను శ్రద్ధ వహింపక విషయమగ్నుఁడై యున్నందునఁ దన రాజ్యమును నాశము చేసికొనెను. ఈతని రాజ్యకాలమందు అఫ్ గానిస్థానపు రాజయిన అహమ్మదు షాహ అబ్దాలీ యనువాఁడు హిందూదేశంమీఁదికి రెండుసార్లు దండెత్తి వచ్చెను. ఈ అహమ్మదుషాహ నాదిర్ షాహయొద్ద నుద్యోగములో నుండెను. నాదిర్ షాహ గతించిన తరువాత నితఁడఫ్గానిస్థానములో స్వతంత్రరాజ్యమునుఁ స్థాపించెను. ఇతఁడు హిందూదేశంమీఁదికి 1748 లో నెత్తి వచ్చెను. ఇతనిని సర్హిందువద్ద అహమదుషాహ యోడించెను. ఈతఁడు 1751 లో మరల వచ్చెను. అప్పుడు బాదుషాహ యితనికి లాహోర్ ముల్తాన్ ప్రదేశమునిచ్చి యితనిని సాగనంపెను. సఫ్దర్ జంగ్, నిజాం ఉల్ముల్క్ యొక్క మనుమఁడగు గాజీ ఉద్దీనునకును గలహాములు ముదిరి యందు బాదుషాహ యాహుతి యయ్యెను. గాజీఉద్దీన్ అనువాఁడు 1754 లో బాదుషాహను జంపి యతని పుత్రునికి అలమ్గీరని పేరుపెట్టి యతని సింహాసనాధీశునిఁ జేసెను.

రాజ్యము తుత్తునక లగుట

మహమ్మదుషాహా కాలంలోనే సింధునదికిఁ బశ్చిమమున నున్న హిందూరాజ్యమంతయు నాదిర్షాహ తీసుకొనెను. రాజపుత్రులదివఱకే స్వతంత్రులైరి. దక్షిణములోని హైద్రాబాదు అదివఱకే చీలిపోయెను.

బంగాళాప్రాంతమును 1702 మొదలు 1726 వఱకు ముర్షిదు ఖులీఖానుఁడు సుబేదారుఁడుగాఁ బాలించి కీర్తిఁగాంచెను. అటు తరువాత నాతని యల్లుఁడగు సుజాఖానుఁ డనువాఁడు 1739 వరకు నా దేశమును బాలించెను. తరువాత మహమ్మదుషాహా బంగాళా సుబేదారుగా అలీవర్ధిఖానునిఁ బంపెను. ఈ అలీవర్ధిఖానుఁడు ముందు

ఇంగ్లీషువారి విషయమై విఖ్యాతుఁడయ్యెను. ఆచరిత్రభాగ మింగ్లీషు మహా యుగములో వివరముగావర్ణింపబడును. ఈ యలీవర్ధిఖానుఁడు 1756 వరకు బంగాళాదేశమును స్వతంత్రరాజుగాఁ బాలించెను. తరువాత సుఁజుద్దౌలా నవాబయ్యెను. ఆ కథాభాగమంతయు నిచ్చట ప్రాయుట యనావశ్యకము.

బంగాళాదేశమువలెనే అయోధ్యప్రదేశముగూడ స్వతంత్రమయ్యెను. 1739 వఱకు సాదత్ ఖాన్ అనువాఁడు అచ్చట సుబేదారుగా నుండెను. తరువాత నతనికొమారుఁడగు సబ్‌దర్‌జంగ్ సుబేదారుపనిఁ జేసెను. అతఁడును అతనివంశములోని కొందఱు పురుషులును దిల్లీశ్వరులకు వజీరులుగా నుండిరి. 1754 నుండి అయోధ్యప్రాంతములోని సుబేదారులు దిల్లీశ్వరులను లక్ష్యముచేయక స్వతంత్రప్రభువులైరి.

రెండవ అలంగీర్

(1754 - 1765).

ఈ బాదుషాహ పేరునకు మాత్రము చక్రవర్తిగానుండెను. రాజ్యసూత్రము లన్నియు గాజీఉద్దీన్ అనువాని చేతిలో నున్నందున బాదుషాహకును. అతనికిని వైరము సంభవించెను. గాజీఉద్దీనుకు సహాయముచేయు నిమిత్తమయి మరాటూవారువచ్చి దిల్లీపట్టణములోఁ బీఠము పెట్టిరి. బాదుషాహను తమచేతిలో నుంచుకొని రాజ్యమంతయుఁ దామే చేయసాగిరి. ఇట్లు దిల్లీలో రెండు పక్షములయ్యెను. ఒకటి గాజీఉద్దీన్ మరియు మరాటాలు కలిసినది; రెండవది రోహిలాలు అహమ్మదుషాహ అబ్దాలీ, ఇతరులగు తురకల్తును గలిసినది. అబ్దాలీ యనువాఁడు 1757లో పంజాబుమీదికి దండెత్తివచ్చెను. వాఁడు దిల్లీ, మథురా పట్టణములను దోఁచుకొని వేలకొలఁది జనులను సంహరించి వెడలిపోయెను. మరాటూవారు పంజాబుదేశమును స్వాధీనముచేసికొనిరి. అందుచే అబ్దాలీ 1759లో హిందూదేశములోనికి వచ్చెను. 1761 లో మరాటూవారికిని అబ్దాలికిని పానిపత్‌పద్ద ఘోరమైన యుద్ధము జరిగి యందు మరాటూవారోడిపోయిరి, ఈ సమాచారము మహారాష్ట్రుల చరిత్రలో సవిస్తర

ముగా వర్ణింపఁబడును. ఈ యుద్ధకల్లోలములోనే రెండవ అలమ్‌గీర్ బాదుషా చంపఁబడెను.

షాహ ఆలమ్

(1761 – 1806)

డిల్లీ పట్టణములోఁ బైన వర్ణింపఁబడిన కల్లోలములు జరుగు చుండఁగా ఆలమ్‌గీరు బాదుషా కొమారుఁ డొకఁడు బంగాళాదేశమునకుఁ బాఱిపోయి యింగ్లీషు వారి నాశ్రయించి యుండెను. తండ్రి చంపఁబడెనని వినిన తోడనే యతఁడు బంగాళా దేశములోనే షాహ ఆలమ్ బిరుదు వహించి పట్టాభిషిక్తుఁడయ్యెను. ఒక వైపు ఇంగ్లీషువారు; మరియొకవైపు మరాటావారు, ఇంకొకవైపు అయోధ్య నవాబు, ఇట్లిముగ్గురా బాదుషాను తమయాజ్ఞలో నుంచుకొనవలయునని యత్నించు చుండిరి. ఇందెవరు తన్ను డిల్లీపట్టణము చేర్చెదరో వారి యాజ్ఞలోనుండెదనని యాతం డొప్పు కొనెను. మరాటా వారాతని డిల్లీకి దీసికొని పోయిరి (1770).

ఆ కాలమునందు డిల్లీ పట్టణములో నసంఖ్య కల్లోలములు జరుగు చుండెను. ఇష్టము వచ్చినవాఁడు నలుగురు జనులను జేర్చుకొని తిరుగఁబడుటు సహజమైయుండెను. డిల్లీ పట్టణములో రోహీలా వాండ్ర ప్రాబల్య మెక్కు డయ్యెను. వీండ్రు ఆఫ్‌గన్ దేశస్థులు. వీండ్రు బాబర్‌కు సహాయులుగ నుండినందున వీరి కతఁడు గంగకు దూర్పునను, హిమాలయమునకు దక్షిణమునను గొంత ప్రదేశమిచ్చి యుండెను. దానికే రోహిల్ ఖండమనిపేరు. వీండ్రు బాదుషాహ యొక్క సైన్యములో నుద్యోగము చేయుచుండిరి. వీరిలో నజీబ్ ఖానుండను వాఁడిరువది సంవత్సరముల వఱకును డిల్లీ వ్యవహారములలోఁ ప్రముఖుఁడై యుండెను. అహమ్మదు షాహ అబ్దాలీని హిందూదేశమునకుఁ బిలిపించి మరాటావారిని పానిపత్ యుద్ధములోఁ బరాభవించిన వాఁడితఁడే. 1770 లోఁ గాలధర్మము నొందఁగా నితని కుమారుఁడగు జాబెతఖాన్ డిల్లీలోని వ్యవహారముఁ జూచుచుండెను. ఈ తని కుమారుఁడైన గులాం కాదరను వాఁడు బాదుషాహ మీఁద

దిరుగఁబడి డిల్లీపట్టణములోఁ జేయరాని ఘోరకృత్యములఁ జేసెను బాదుషాహను, అతని కుటుంబములోని జనులను కాళ్ళతోఁదన్ని' కొఱడా దెబ్బలు కొట్టి, వృద్ధుడైన యాబాదుషాహ యొక్క కనులు దీయించెను. సింహాసనమును తన్ని యగౌరవపఱచెను. తుదకు బాదుషాహ మరాటా వీరుఁడగు మహాదజీశిందె యనువానిసాయము దీసికొని గులాంకాదరుని బట్టుకొని చంపించెను. 1803 లో మరాటా వారికిని ఇంగ్లీషువారికిని యుద్ధము జరిగెను. ఇంగ్లీషువారు విజయులై డిల్లీపట్టణమును స్వాధీనము చేసుకొనిరి. బాదుషాహకుఁ గట్టుడి చేసి యతని రాజ్యమంతయుఁ దీసికొనిరి. ఇట్లు మోగలు సామ్రాజ్య మస్తమించెను. సజ్జనుడును, పాపభీరుఁడును అగు షాహ ఆలమ్ 92 సంవత్సరముల వఱకుఁ బ్రతికి 1806 లో గాలధర్మము నొందెను.

వంశావ సానము

షాహ ఆలము కొమారుఁడైన అక్బర్ ఇంగ్లీషువారి యొద్ద నుండి కట్టడి రూకలు తీసుకొనుచు బాదుషాహ యను పేరుమాత్రము ధరించుచు 1837 లోఁ గాలధర్మము నొందెను. ఇతనికొమారుఁడు మహమ్మద్ బహదుర్ షాహ. ఇతఁడు 1857 వఱకును ఇంగ్లీషువారి యొద్దనుండి కట్టడి పైకమును దీసికొనుచుండెను. కాని 1857 లో హిందూదేశమం దుద్భవించిన సిపాయిల తిరుగుఁబాటులో నితండు చేరెను. అందువలన డిల్లీ యుద్ధములో నితని కొమారులను, ఇతని మనుమలను జంపి యితనిని జెఱబట్టి, యింగ్లీషువారు బర్మాదేశమునకుఁ దీసికొనిపోయి యుంచిరి. ఇతఁడచ్చటనే మృతినొందెను. అంత మోగలు చక్రవర్తుల వంశ మంతరించెను.

సింహావలోకనము

సింహావలోకనమనగాఁ వెనుకకుఁ దిరిగిచూచుట. మోగల సామ్రాజ్యము లోని చక్రవర్తుల జీవితాంశము లిదివఱకు వర్ణింపఁబడినవి. కాని, దేశ చరిత్రయనఁగా రాజుల జీవితములు మాత్రము కాదు. అప్పటి జనుల స్థితిగతులును విద్యా విభవములును గనుఁగొను

టయు నావశ్యకము. కావున మనము కొంచెం సింహావలోకనము చేసి పదునాఱవ, పదునేడవ, పదునెనిమిదవ శతాబ్దములలోని జనుల స్థితి గనుగొందము. అప్పటి జనసామాన్యపు స్థితిని గనుగొనుటకు నాయా శతాబ్దములలో నీ దేశమునకు వచ్చిన పరదేశీయులు అయిన బాటసారుల వ్రాతలు ముఖ్యాధారములు. తెరీ, డిలాలేల్, ట్యావర్నియల్, థివెనాట్, ఫ్రాయర్, హ్యామిల్టన్, మనుకి మొదలయిన పాశ్చాత్య ప్రవాసు లనేకు లీదేశమునకు వచ్చిరి. వారు వ్రాసియుంచిన ప్రవాస వర్ణన లప్పటి దేశస్థితిని తెలుపును.

ప్రభుత్వము

మోగలరాజులు మొత్తముమీద నిరంకుశులనియె చెప్పవలసి యున్నది. కాని యూరోపుఖండములోగ ప్రభువులు నిరంకుశులుగా ను డినపుడు ప్రజలకుగ గలుగుచుండినంతబాధ యీ దేశములోని ప్రజలకుగ గలుగలేదు. ఒక్క ఔరంగ్‌జేబు తప్ప మిగిలిన చక్రవర్తు లందఱును ప్రజలకుగ బూర్తిగా మత స్వాతంత్ర్యమొసగిరి. ఇదియుగాక యెంత నిరంకుశుడైనను బాదుషాహ మంత్రులను ధిక్కరించు నట్టి స్వేచ్ఛాచారము కలవాడు కాడు. హిందూప్రజలకు బాధకలుగక సౌఖ్యమే కలుగుటకు మఱియొక కారణము కలదు. ప్రభుత్వము మహమ్మదీయులదియైనను హిందువులనేకులు గొప్ప గొప్ప రాజకీయోద్యోగములలో నుండిరి. ప్రస్తుతపు గవర్నరుతో సమానమైన సుబేదారువంటి యుద్యోగములును, సైన్యాధిపత్యములునుగ ముఖ్య మంత్రిత్వములును హిందూ మహమ్మదీయ పక్షపాతములేకుండా హిందువుల కీయబడెను. రాజా తోడర్‌మల్, రాజా మాన్‌సింగ్, రాజా జయసింగ్, రాజా రామ్‌సింగ్ మొదలైన హిందూ సరదారులనేకులు మోగలు ప్రభుత్వములో ఘనత వహించిరి. కావున హిందూ ప్రజలకు బాధకలుగుటకుగ కారణము లేకపోయెను.

ప్రజాసౌఖ్యము

మోగలు ప్రభుత్వకాలంలోగ ప్రజలయొద్దనుండి రాజులు రాబట్టుకొను పన్ను విశేషబాధాకరముగా లేకయుండెను. కొంద

టింగ్లీషు గ్రంథకారు లప్పటిపన్ను లిప్పటిపన్నులకంటె నెక్కుడు బాధాకరముగ నుండెనని వ్రాసియున్నారు. కాని యవి నిరాధార ములగు నూహలు. అప్పటి ధనధాన్య సమృద్ధియు, ప్రజాసౌఖ్యమును జూడఁగాఁ బ్రజలు బహుస్వల్పమైన పన్నులిచ్చుచున్నట్లు కానవచ్చు చున్నది. 1615 మొదలు 1618 వర కీదేశమందున్న రెవరెండ్ టేరి యనువాని వ్రాఁతలను బట్టిచూడఁగా నప్పుడు దేశములో ధనధాన్య సమృద్ధియు ప్రజా సౌఖ్యమునకుఁ గావలసిన వస్తువుల నన్నిటిని దేశమునందే నిర్మించు సామర్థ్యమును, తృప్తియు, ధనమును దేశము నుండి వెలుపలకుఁ బోకుండుటకు నిబంధనలును, సత్యసంధత్వమును ఈదేశమునందు విపులముగ నుండెనని కానవచ్చెడిది. పదునెనిమి దవ శతాబ్ది మధ్యమున బంగాళాదేశములో నెచ్చటఁజూచినఁ గాలు వలున్నందున దేశమంతయు సమృద్ధిగానుండెను. కాలువ నీటితోఁ ప్రజలన్ని పంటలను బండించుచుండిరి. చెఱకుతోటలును, పట్టువురుగు చెట్లను విశేషముగాఁ బ్రజలువేయుచుండిరి. అచ్చటిభూమియు సుక్షేత్ర మైనందునఁ గొద్ది కష్టముతో మంచి పంటలు పండుచుండెను. అచ్చట పైసకు శేరు చొప్పున బియ్యమిచ్చుచుండిరి. ఇతర ధాన్య ములును, కూరగాయలును, పండ్లును అపరిమితముగ నుండెను. పాలు మాంసద్రవ్యములు మొదలైనవన్నియు బహుస్వల్పమైన వెలకు దొరకును. 1763 మొదలు 1767 వరకు నీదేశమందున్న నీబరనువాఁ "డీదేశస్థులు రోమములు లేక యారోగ్యస్థితిలో నుండి బహుకాలము బ్రతికెదరు" అని వ్రాసియున్నాఁడు. ఇట్టి వర్ణన లనేకములు గలవు. వానినిబట్టిచూడ నప్పటి ప్రజలు సౌఖ్యము ననుభవించుచుండిరనియే చెప్పవలసియున్నది. ఒకవేళ కొంద టింగ్లీషు గ్రంథకారులు వ్రాసిన ట్లప్పటి పన్నులు కొంచమధికముగా నుండెనని యెంచినను ఆ ధన మంతయు దేశములోనే నిలిచియుండి యీ దేశస్థులలోనే యొకరి వద్దనుండి మఱియొకరి వద్దకుఁ దిరుగుచున్నందునఁ బ్రజలకు దారి ద్ర్యావస్థ అంతగా పట్టుకుండెను గాఁబోలు. దేశములోని ధనము పర దేశములకుఁ బోఁగూడదని యప్పటి రాజులు కట్టుదిట్టములు చేసి యుంచిరఁట. అట్లీదేశములోని పైకమును. దీసికొనిపోవుట యొక

యపరాధముగా నెంచఁబడుచుండెను. అందుచే దేశములోని ప్రజలు దిన దినాభివృద్ధిఁ జెందిరని తోఁచుచున్నది. మొత్తము మీఁద మోగలు ప్రభుత్వములోని ప్రజ లాకాలపు యూరోపు దేశములోని ప్రజలకంటె నే విషయములోను దక్కువవారు గారని చెప్పవచ్చును.

అప్పటి బాటలు

పదునేడవ పదునెనిమిదవ శతాబ్దములలో సైన్యములు నడచుటకును, వర్తకపు సరకులు పోవుటకును మార్గములుండెను. ఆకాలములోని యూరోపుదేశమందలి బాటులను వీనితోఁ బోల్చిచూచిన యెడల హిందూదేశములోని బాటులు నూఱుమడుంగులు మంచివని చెప్పక తప్పదు. ఆ కాలమందు విశేషముగా వాడుకలోనున్న బాటలలో నీక్రిందివి కొన్ని : (1) కాబూల్, లాహోర్, ఆగ్రా, అలహాబాద్, ఢాకా, (డెక్కా) యీ పట్టణములను గలుపునది; (2) ఆగ్రా, అహమదాబాద్, సూరతులను కలుపునది; (3) ఆగ్రా బర్హాంపూర్, గోలకొండ, మచిలీపట్టణములను కలుపునది; (4) ఢిల్లీ, మథురా, ఆగ్రా, వాలేర్, బర్హాంపూర్, అజంటా, ఔరంగాబాద్, పూనా పట్టణములను కలుపునది. జను లీమార్గములందు బండ్లమీఁదగాని, గుఱ్ఱములమీఁదఁగాని, ప్రవాసము చేయుచుండిరి, ధనవంతులు మేనాలలోఁ బోవుచుండిరి. వర్తకపు సరకు లెడ్లమీఁదఁ దీసికొని పోఁబడుచుండెను. ధాన్య మొకదేశమునుండి మఱియొక దేశమునకు లంబాడీవాఁడ్రు ఎద్దులమీఁదఁ జేర్చుచుండిరి. ఒక్కొక్క లంబాడీవానియొద్దఁ బదివేల యెడ్లుండెను. త్రోవలలోఁ జోరభయముండెను గాని మొత్తముమీఁద ఫ్రాన్సు, ఇటలీ దేశములోని ప్రవాసమునకంటె హిందూదేశములో నాకాలమందు ప్రవాసముచేయుట యెక్కుడు వీలుగను, సుఖకరముగను నుండెనని, 1641 మొదలు 1668 వఱకు నీ దేశములో వర్తకము కొరకు సంచారముచేసిన జాన్ బాప్టిస్టా ట్యావర్నియర్ అనువాఁడు వ్రాసియున్నాఁడు. ఖంబాయత్ వద్దనుండి భడోచ్ వఱకు నుండు ప్రదేశములో దిరాసియా అను

జనులుండిరి. వారి రాజు బాటసారులయొద్దనుండి మనుష్యుల కొక యరరూపాయి తీసికొనును. అట్లు పన్నిచ్చినవారి సొత్తేమయినను బోయినయెడల వాఁడిచ్చుకొనును. వీలైనంతవరకు వారిసొత్తే సంపాదించిపెట్టును. సూరత్ పట్టణమునుండి యాగ్రాకుఁ బోవు లంబాడీలయొద్దనుండి మనుష్యునకుఁ బదిరూపాయలు చొప్పున పన్నురాబట్టుకొని, వారికి విందుచేసి తన సరిహద్దువరకు గుట్టువుస్వారుల వెంటనిచ్చి పంపునట.

అంచెలు

మోగలు ప్రభుత్వములోని యన్నిస్థలముల నుండియు ఎప్పటి వర్తమానము లప్పుడు తెలియుటకై యంచలపద్ధతి యేర్పరుపఁబడెను. సాధారణముగా మనుష్యులయంచలమీఁద నుత్తరములు పోవుచుండెను. మిక్కిలి శీఘ్రముగాఁ బోవలసినవి యొంటెలయంచెలమీఁదఁ బోవుచుండెను. ప్రభుత్వపు వారి యంచెలు గాక వర్తకుల యంచెలు కూడఁ గలవు. ఒకప్పుడు ప్రభుత్వము వారికి దెలియుటకుఁ బూర్వమే యనేక సమాచారములు వర్తకులకుఁ దెలియుచుండెను.

వర్తకము

దేశములోను నితరదేశములతోను వర్తకము విశేషముగా జరుగుచుండెను. అన్నివిధములైన ధాన్యములు, ప్రత్తి, నల్లమందు, ఊర్ణము, పట్టు మొదలైనవి యప్పటి వర్తక విషయమైన సరకులు. పట్టుబట్టలు, ఊర్ణవస్త్రములు, నూలుబట్టలు నేయుటలో హిందూదేశ వాసులకు నప్రతిమ ప్రజ్ఞ కలిగియుండెను. అట్టి ప్రజ్ఞ యాకాలమందలి యితరదేశ జనులకు లేదని చెప్పినను జెప్పవచ్చును. కాశ్మీరశాలువులు, ఢాకా మల్లుబట్టలు, బందరు టద్దకపు చీర్లు, బనారస్ పట్టు బట్టలు మొదలైన సరకులు కోట్లకొలఁది ప్రతిసంవత్సరము యూరోపు దేశమునకుఁ బోవుచు నాధనమంతయు హిందూదేశమునకు వచ్చుచుండెను. ఇట్లు ధనము దేశములోనికి వచ్చుటయేకాని

పరదేశమునకుఁ బోవుట లేనందున దేశము ధనసంపన్న మగుచుండె ననుటకు సందేహము లేదు.

జనుల నీతి

అప్పటి జనులు విశ్వాసపాత్రులనియు, అల్పసంతుష్టులనియు, సత్యప్రియు లనియు గ్రంథకారులు వ్రాసియున్నారు. ఒట్టు పెట్టు కొనుటకుఁగాని, ప్రమాణములు చేయుటకుఁగాని యప్పటి వారికి నిష్టము లేదు. వ్యాజ్యమునకై న్యాయస్థానమునకుఁ బోవు హిందువు 'ఆవుతోడు నిజము చెప్పుచున్నాను. అసత్య మాడిన యెడల నాకు గోమాంసము భక్షించిన దోషము వచ్చుగాత' యని యొట్టు పెట్టు కొనవలెను. అందుచే హిందువులు వ్యాజ్యమునకుఁ బోవుటయే మానిరి.

అప్పటి గుజరాథ్ దేశములోని వారికి నిప్పటివలెనే భూతదయ కలదు. అహమ్మదాబాద్ ఖంబాయత్ పట్టణములలోఁ బశువునకై వైద్యశాలలుండెను. నిరాశ్రితములును. రోగగ్రస్తములు నయిన పశువుల నిమిత్తమై యొక పాంజర్‌పోల్ అనుస్థలము కట్టుఁబడి యుండెను. ఖంబాయత్‌లోని ధనవంతులైన వర్తకులందఱును బాదుషాహకుఁ గొంత ధనమిచ్చి యాపట్టణములో గోవధ జరుగకుండ నేర్పాటు చేసికొనిరి. అచ్చట గోవధ చేయువారికి దేహాంత శిక్ష విధింపఁబడుచుండెను.

భక్తిప్రధాన మతముల యభివృద్ధి

పదునాల్గవ శతాబ్దము మొదలు పదునెనిమిదవ శతాబ్ధాంతము వఱకు నీ దేశమందు భక్తిప్రధానములైన వైష్ణవసంప్రదాయము లనేకములు పుట్టినవి. తురుష్కులొక్కవైపు హిందూమతోచ్ఛేదము చేయుటకు యత్నించు చుండిన కాలములోనే హిందూమత వృక్షమునకు నూతన పల్లవములు పుట్టి యభివృద్ధిఁ జెందుట మిక్కిలి యాశ్చర్యకరము. అందువలన నెంతబలవంతుఁడైనను ఈ

దేశమునందలి ప్రజాశక్తిని నణఁచి వేయలేఁడని స్పష్టపడుచున్నది. మహమ్మదీయ కాలములోఁ బుట్టినమూతన వైష్ణవ సిద్ధాంతములను, వానిని స్థాపించినవారిని గురించియుఁ గొలఁదిగా నిచ్చట వ్రాయుచున్నాము.

రామానందుడు

ఇతఁడు పదుమూఁడవ శతాబ్దాంతముననో పదునాల్గవ శతాబ్దాంతముననో యుండెను. ఇతఁడు రామానుజ శిష్యపరంపరలో నైదవవాఁడఁట. రామ భక్తియే ప్రధానమనియు, జాతిభేదముతో సంబంధము లేదనియు జనులకు బోధించెను ఇతని ద్వాదశశిష్యులలో నొకఁడు సాలెవాఁడు, ఒకఁడు మంగలవాఁడు, ఒకఁడు మాదిగవాఁడు. ఇట్లనేక జాతుల వారుండిరి.

కబీర్

(1380 - 1420)

ఇతఁడు రామానంద శిష్యులలో నొక్కఁడు. తురకయయ్యును రామభక్తి గలవాఁడు. రామ్ రహీములకు భేదము లేదని చెప్పి హిందూ మహమ్మదీయ మతములను నొక్కటిచేయ నితఁడు యత్నించెను. ఇతఁడు గొప్పకవి. హిందీభాషలో నితఁడు చెప్పినపద్యములనేకములు కలవు. అవి భక్తిరసముతోడను, అర్థగాంభీర్యముతోడను నిండియున్నవి. నిర్లోభత్వముచేతను, సత్యవృత్తి ప్రాధాన్యముచేతను నితఁడసామాన్య భగవద్భక్తుఁడని ఖ్యాతిఁజెందెను. ఇతని సంప్రదాయములోఁ జాతి భేదమును విగ్రహారాధనయు లేవు. ఈ సంప్రదాయ మిప్పటికి ఉత్తర హిందూస్థానములో నున్నది. కాశీలో కబీర్ మఠమొకటి కలదు. ఇతని శిష్యులుచేసిన కవిత్వము లనేకములు కలవు.

చైతన్యుడు

(1486 - 1527)

ఇతఁడు బంగాళా దేశమందలి నవద్వీప (నడియ) గ్రామము లోని యొక బ్రాహ్మణుని కుమారుఁడు. ఇతఁడు 1486 లో జన్మిం చెను. ఇతఁడు వల్లభాచార్యుని కుమార్తెను వివాహ మాడెనఁట. ఇరువది నాలుగుసంవత్సరముల వాఁడైనతోడనే సంసారమునుద్యజించి భక్తి మార్గములోఁజేరి జనులకు విష్ణుభక్తిని బోధింప సాగెను. చైత న్యుఁడును, నతని శిష్యులును, సంస్కృతములోను బంగాళీ భాష లోను వ్రాసిన గ్రంథము లనేకములు కలవు. బంగాళాదేశమువారా గ్రంథములను విశేషముగా గౌరవించెదరు. ఇతడు 1527 లోఁ గాలధ ర్మమునొందెను. ఇతనిని ఓడ్రబంగాళా దేశములలో విష్ణుమూర్తియవ తారమని పూజించెదరు. ఇతని సంప్రదాయము స్వీకరించిన వారికి గోసాయిలని పేరు. బంగాళా దేశములో నట్టివారి సంఖ్య ప్రస్తుత కాలమునందు నిరువదియైదు వేలను మించియున్నది. ఈతని సంప్ర దాయములో స్త్రీలను గూడ చేర్చుకొనియెదరు. అట్టి స్త్రీలు సాధా రణముగ విద్య నేర్చియుందురు. ఘోషాపద్ధతి కఠినముగాఁ బాటింపఁ బడు బంగాళా దేశములో నాఁడు క్రైస్తవ బోధకురాండ్రు వచ్చు టకుఁ బూర్వము చైతన్య సంప్రదాయములోని స్త్రీలే రాణివాసము లోని స్త్రీలకు విద్య నేర్పుచుండిరి. వల్లభాచార్యులవారితో సంబం ధము కలిగియున్నందున ఈతఁడాంధ్రుఁడని తోచుఁ చున్నది.

వల్లభస్వామి

(1478 - 1530)

ఇతఁడు వెలనాఁటి యాంధ్ర బ్రాహ్మణుడు. కృష్ణపూజయే ప్రధానముగాఁగల శుద్ధాద్వైతమను వైష్ణవ సంప్రదాయమును గుజరాత్ దేశములో స్థాపించి యందుకు ముఖ్యగురువయ్యెను. అందుచే నీతనిని వల్లభాచార్యులనియెదరు. కృష్ణపూజయు, గురు

భక్తియు నీ సంప్రదాయములోఁ బ్రధాన విషయములు. వల్లభ మతము గృహస్థ మతము. ప్రస్తుత మామతస్థు లందఱును వల్లభా చార్యులవారి సంతతివారు. వివాహాదుల నిమిత్తమై మాత్ర మాంధ్ర దేశమునకు వచ్చుచుండెదరు. వల్లభాచార్యుల మతమునకు శుద్ధా ద్వైతమని పేరున్నను అతఁడు శంకరాచార్యులకుఁ బ్రబలశత్రుఁడు.

నానక్

ఇతఁడు పంజాబుదేశమందు 1469 లో హిందూ మహమ్మదీయ మతములకు సమన్వయముచేసి యొక మతమును స్థాపించెను. ఇతనినిగురించియు నీతని మతమును గుఱించియు నిదివఱకుఁ గొంత వ్రాసియున్నాము. కావునఁ బ్రస్తుతము విస్తరముగా వ్రాయుట యనావశ్యకము.

పైని వర్ణింపఁ బడినవారు గాక ఉత్తర హిందూస్థానమందును బంగాళా మహారాష్ట్ర దేశములలోను ఘనతఁ జెందిన సాధుపుం గవు లనేకు లుద్భవించి భక్తియే ప్రధానమని బోధించి జాతి భేద ములు పాటింపఁ గూడదని యెఱిఁగించి సంఘ సంస్కరణమునకు దారిచూపించిరి. ఇంతియకాదు. దేశ భాషలలో గ్రంథములు రచిం చిన గాని, జనసామాన్యమునకుఁ దెలియ నేరదని తలఁచి దేశభాష లలో రసవంతము లైన కావ్యములను నిర్మించిరి. వాని వివరము ముందు చెప్పఁబడును.

సంస్కృత వాఙ్మయము

మహమ్మదీయ ప్రభుత్వకాలములో సంస్కృత భాషకురాజా శ్రయము లేకపోయినను ఆ కాలమందు ననేక విషయములమీఁద సంస్కృత గ్రంథములు నిర్మింపఁబడెను. విక్రమాంక దేవచరిత్ర కర్తయైన బిల్హణుఁడు, సప్తశతీకారుఁడైన గోవర్ధనుఁడు, 'కావ్య ప్రకాశ' మను సాహిత్య గ్రంథమును రచించిన మమ్మటుఁడు, మొద లైన వారు మహమ్మదీయ ప్రభుత్వము యొక్క ప్రథమ దినముల

లోని వారని చెప్పవచ్చును. అప్పయ్య దీక్షితులవారును, జగన్నాథ పండిత రాయ బిరుదాంకిత కవియును పదునేడవ శతాబ్దములోని వారు. అప్పయ్య దీక్షితులవారు ద్రావిడులు. జగన్నాథ పండితుల వా రాంధ్రులు. అప్పయ్య దీక్షితులవారు మిగుల విద్వాంసులని ప్రఖ్యాతిఁజెంది యనేక రాజసభలలో వాదములు చేసి బహుమతు లును, బిరుదులును వడసిరి. ఇతఁడు వైష్ణవులకుఁ బ్రబల ప్రతిస్పర్థి యైన శైవుఁడు. ఇతఁడు న్యాయవేదాంతా లంకారాది విషయముల మీఁద నెనుబది నాలుగు గ్రంథములు వ్రాసెనఁట. అందు అలంకార విషయిక చిత్రమీమాంసా కువలయానంద గ్రంథములును, వేదాంత విషయముపై వృత్తివార్తిక సిద్ధాంతలేశ గ్రంథములును విఖ్యాతిఁ జెందియున్నవి. ఇవిగాక నీతనిచే రచియింపఁబడిన శివార్చన చంద్రిక, శివతత్త్వ వివేకము, శివమణి దీపిక మొదలైన శైవగ్రంథములును, నామసంగ్రహ శబ్దప్రకాశము అను కోశములును, మధ్వమతకుఠార రామానుజ మత విధ్వంసము లను ఖండన గ్రంథములును విశేషఖ్యాతిఁ జెందియున్నవి. ఈతఁడు చిదంబరములో లింగైక్యమును జెందెను. జగన్నాథ పండితుఁడు వేఁగినాటి తెలుఁగు బ్రాహ్మణుఁడైనను దిల్లీ శ్వరుని యాసానమునందుఁ బండితరాయ బిరుదము వడసి యుత్తర హిందూదేశమునందే ప్రఖ్యాతిఁ జెందెను. ఇతఁడు విద్వాంసుఁడును, కవియునై యున్నాఁడు. ఇతని కవిత్వములో రసము లొల్కుచుం డును. గంగాలహరీ, భామినీవిలాసము లను నీతని కావ్యములు జగ ద్వంద్యములు. ఇతఁడు సాహిత్యశాస్త్రములో రసగంగాధరమను గ్రంథరాజమును నిర్మించెను. అది యాశాస్త్ర విషయమై గొప్ప ప్రమాణముగా నెంచఁబడు గ్రంథము.

పదునాఱవ పదునేడవ శతాబ్దములలో వ్యాకరణ శాస్త్ర సంబంధమై మిక్కిలి కృషి జరిగెను. భట్టోజీ దీక్షిత నాగోజీభట్టు లను పండితు లిద్దఱీశాస్త్రమును విశేషముగా నభివృద్ధి పఱచిరి. పాణి నీయ వ్యాకరణము విద్యార్థులకు సుబోధకరమగునట్లు భట్టోజీదీక్షి తుల వారు సిద్ధాంత కౌముది యను గ్రంథమును రచించెను. అది బాలావబోధమునకై యత్యుపయోగకరమైన గ్రంథమగుటచే వెం

టనే విద్వన్మాన్య మయ్యెను. సంస్కృత వ్యాకరణము నేర్చుకొనఁ దలచిన వారిప్పటికిని మొదట నీ గ్రంథమునే జదివెదరు. ఈ గ్రంథముగాక "ప్రౌఢమనోరమా", "వైయ్యాకరణభూషణ", 'శబ్దకౌస్తుభ", ములను మూఁడు గ్రంథములను వ్యాకరణ విషయములైన వానినే రచించెను. నాగోజీభట్టు వ్యాకరణశాస్త్రము మీద 'భాష్య ప్రతీపోద్యోత" మను ముప్పదివేల గ్రంథములను, సిద్ధాంతకౌముదీ టీకా రూపమైన 'లఘుశబ్దేందు శేఖర", "బృహచ్ఛబ్దేందుశేఖర"ము లను గ్రంథములను, మఱికొన్ని గ్రంథములను రచించెను. ఇతనిచే రచియింపఁబడిన ధర్మశాస్త్ర విషయక గ్రంథములును గొన్ని గలవు.

రాజాశ్రయము లేనందున మనజ్యోతిషము మహ్మదీయమహా యుగములో నభివృద్ధి చెందినదికాదు. కాని యీ శాస్త్రమును గురించి పదునేడవ పదునెనిమిదవ శతాబ్దములలో జయపురాధీశ్వరుడైన జయసింహుఁడను వాఁడు చేసిన పరిశ్రమ మిచ్చట నుదాహరించుట యావశ్యకము. ఇతఁడు హిందూయవన యూరోపియన్ జ్యోతిశ్శాస్త్రముల నభ్యసించి యందలి లెక్కల ననుసరించి వేసిన గ్రహగణితము దృక్ప్రత్యయమునకు రానందున, గ్రహగతులను వీక్షింపవలయునని జయపురము, దిల్లీ, కాశీ, మథుర, ఉజ్జయినీ పట్టణములలో నక్షత్రశాలలు కట్టించెను. వీనికే వేధశాలలనిపేరు. జయప్రకాశము, యంత్రసమ్రాట్; చిత్తి యంత్రము, వృత్తషష్ఠాంశము మొదలగు నూతన యంత్రములు నిర్మించి గ్రహగతుల నిరీక్షించుటకు ననేక జోతిష్కుల నేర్పఱిచి, తొమ్మిది సంవత్సరముల వఱకు గ్రహవీక్షణముచేసి గ్రహగతులను కనుఁగొను నూతననియమములను గనిపెట్టెను. ఆ కాలమునందు యూరోపు దేశములోని జ్యోతిష్కులు గ్రహ గతిస్థితుల నెంత సూక్ష్మముగాఁ గనుఁగొనుచుండిరో, యంతకంటె నితఁడధిక సూక్ష్మత సాధించెనని చెప్పినను నితని యోగ్యత చదువరులకుఁ దెలియఁగలదు. యూక్లిడ్‌కృతమైన రేఖాగణితములోని పదునైదుగ్రంథముల నితఁడు సంస్కృతములో వ్రాయించెను. ఇతఁడు 1699 లో రాజ్యమునకు వచ్చి 1743 లో గాలధర్మము నొందెను.

దేశభాషల యభివృద్ధి

మహమ్మదీయ ప్రభుత్వకాలములో హిందీ, బంగాలీ, మరాటీ, తెలుఁగు మొదలైన దేశభాషలలో ననేక రసవంతములయిన కావ్యము లుద్భవించెను. హిందీభాషలోఁ బదునారవ శతాబ్దమునందు తులసీదాస్ అనుభక్తుఁడు రామాయణము రచించెను, ఈ గ్రంథము తుల్సీరామాయణ మనుపేర మిక్కిలి విఖ్యాతిఁ జెందియున్నది. వేల కొలఁది హిందుస్థానీజనులు దీని నెప్పుడును భక్తితోఁ బాడుచుండెదరు. ఇతఁ డీగ్రంథమును 1575 లోఁ బ్రారంభించెను. ఈ కవి 1624 లోఁ గాలధర్మము నొందెను. పదునారవ శతాబ్దములో సూర్దాస్, నాభాజీ, కేశవదాస్ మొదలైన కవులు జన్మించిరి. పదునేడవ శతాబ్దములో బిహారీలాల్ అను కవి సత్ సహాయ్ అను గ్రంథమును రచించెను. ఈ కవులందరును భక్తులు. ఈశ్వర భక్తిచే గ్రంథరచన చేసిరిగాని రాజాశ్రయమువలనఁ గాదు. ఇందుచేతనే హిందీ, బంగాలీ, మరాటీ మొదలైన గ్రంథములలో భక్తిరసమే ప్రధానము. శృంగారరస మంతగా నుండదు. ఇదియే యా కావ్యములకును ఆంధ్రకావ్యములకునుగల భేదము.

మహమ్మదీయ మహా యుగము

ఆరవ అధ్యాయము

రాజపుత్రుల శౌర్యాగ్ని

రాజపుత్రస్థానమందు జయపురము, యోధపురము, ఉదయపురము, బికానేర్, జనల్‌మీర్ మొదలయిన సంస్థానము లనేకములు గలవు. ఈ సంస్థానాధీశ్వరులందఱును పౌరుషమే జీవితముగా గల శూరాగ్రేసరులు. కావున నీ రాజ్యముయొక్క చరిత్రలు భారతములోని యుద్ధపంచకము వంటివి. వాటి నన్నిటిని నిచ్చట వర్ణించుటకు వీలులేదు. గౌరవముచేతను, పౌరుషముచేతను, కులముయొక్క ఘనతచేతను రాజపుత్తరాజ్యము లన్నిటికిని నాయకరత్నంబు నాఁదగు ఉదేపూర్ అనఁబడు ఉదయపుర రాజ్యముయొక్క చరిత్ర యిచ్చట వ్రాసినఁజాలును.

ఉదేపూర్ సిసోదీయావంశము

అనన్యసామాన్యక్షాత్రతేజంబుతో వెలుంగునట్టి కథానకంబులతోడను, పౌరుషప్రధానంబులగు అద్వితీయ వీరచరిత్రంబులతోడను, స్వదేశ స్వమత స్వగౌరవములను రక్షించుకొనుటకై పూలచెండ్లవలె దమ శిరఃప్రకరంబుల రణక్షేత్రమున నర్పించిన వీరవర నామసహస్రంబుతోడను, శరణనిన దీర్ఘదుర్మార్గ శత్రునినైన రక్షించెడి యౌదార్యప్రసంగములతోడను, వేయిసంవత్సరముల కాలమువఱకు సందులేకుండ నిండియున్న యీ మేవాడ్ దేశపు చరిత్ర పూర్తిగ వ్రాయుటకు వేయిపుటలయినను చాలునని తోపఁదు. అందుకు మేమా చరితమంతయు నేఁబది, యఱువది పుటలలో ముగింప యత్నించుటయొక సాహసంబే అయినను ఇచ్చట నీచరిత్ర హిందూదేశచరిత్రయొక్క భాగముగా వ్రాయఁబడుచున్నందున నిది యింతకంటె విస్తరముగ వ్రాయుటకు వీలులేదు.

ఉదేపుర్ అను పేరు 'ఉదయపుర' శబ్దము యొక్క యప భ్రంశము. ఉదేపూర్ పట్టణము రాజధానిగాఁగల దేశమునకు మేవాడ్ రాజ్యమని పేరు. మేవాడనగా మధ్యదేశము. ఈ రాజ్యమునకు మొదట చితోడ్‌గడము ముఖ్యపట్టణముగా నుండెను. తరువాత రాజ ధాని ఉదేపురమునకు మార్పఁబడియె. అందఱు రాజపుత్రులలోను మేవాడ్ వఁశము మిక్కిలి పురాతన మైనదియు, శ్రేష్ఠమైనదియు నయియున్నది. అచ్చటి రాజులు సిసోరియా వంశపు రాజపుత్రులు (రాజ పుత్రులు) సూర్యవంశజులు. అయోధ్యాధి పతియగు శ్రీరామ చంద్రుని వంశపువార మని యీ రాజులు చెప్పుకొనియెదరు. మొట్ట మొదట వీరు పంజాబులోని లాహోరు పట్టణమున రాజ్యముచేయు చుండిరి. అప్పుడు వీరి వంశమునకు 'గెహలోట్' వంశమని పేరు. ఆ వంశజుఁడగు కనకసేనుఁడను రాజు క్రీ. శ. రెండవ శతాబ్దమధ్య మున లాహోరులో రాజ్యము చేయుచుండెను. ఈతఁడు శ్రీరా మని యొద్దనుండి యఱువది మూఁడవ పురుషుఁడఁట. ఈతఁడు సౌరాష్ట్ర దేశముపై దండెత్తిపోయి యచ్చటి పార్‌మార్ వంశపు రాజుల నోడించి యచ్చట వీసనగరమను పట్టణమును క్రీ. శ. 144 ప్రాంతమున స్థాపించెను. ఈ కనకసేనుని వంశజులే వల్ల భీపురమును రాజధానిగాఁ జేసికొని వల్లభిశకమును ప్రారంభించిరి. ఈ వల్లభీ పురము ప్రస్తుతపు భావనగర్ వద్దనుండెను. ఈ వంశమునందే శిలా దిత్యుండను రాజు ఉద్భవించి గజ్నిలో రాజ్యముచేసెను. అతఁడు మ్లేచ్ఛులచేఁ జంపఁబడెనఁట. తరువాత ఈ గెహలోట్ వంశజులు ఈడర్ అనుచోటఁ గొన్ని తరములవరకు రాజ్యము చేసిరి. గ్రహా దిత్యుఁడను రాజును భిల్లులు చంపివేసిరి. ఇట్లు చంపఁబడిన గ్రహా దిత్యునకు 'బాపు'అను అల్పవయస్కుఁడగుపుత్రుఁడుండెను. ఈ"బాపు" అనువాఁడు "బాప్పారావల్" అను బిరుదుతో మేవాడ్ రాజులకు మూలపురుషుఁడయ్యెను.

బాప్పారావల్

తండ్రి మరణసమయమున మూఁడేండ్ల వయసుగల "బాపు"ను ఒకానొక బ్రాహ్మణుఁడు పెంచి పెద్దవానిఁ జేసెను. ఈ పిల్లవాఁడు

క్రమముగ నభివృద్ధిఁ జెంది, యప్పుడు చితోడులో రాజ్యము చేయు చున్న ప్రమార్ రాజునొద్ద నుద్యోగము సంపాదించెను. తనశౌర్యాది గుణముల వలన నారాజు యొక్క యనుగ్రహమునకుఁ బాత్రుఁడై యొక గ్రామమును బహుమతిగఁబడసెను. ఈతఁడు క్రమముగఁ దన సైన్యములను నభివృద్ధి పఱచుకొని, తన యజమానునినే యోడించి, చితోడ్‌గడమునఁ గ్రొత్తరాజ్యమును స్థాపించి, ఉదేపూర్ రాజులకు వంశకర్తయయ్యెను. ఈ సమాచారము క్రీ. శ. 208 లో జరిగెనని కొందఱును, క్రీ. శ. 728 లోజరిగెనని కొందరును వ్రాసియున్నారు. ఈ 'బాప్పా' శ్రీరామచంద్రుని యొద్దనుండి యేఁబదవ తరమువాఁడు.

ఈ రాజు మిక్కిలి పరాక్రమ వంతుఁడు. ఈతని కాలములోఁ దురుష్కుల యొక గొప్పసేన చితోడ్‌పై దండెత్తివచ్చెను. ఆసేనను ఈతఁడోడించి పాఱిదోలుటయేగాక, యనేక దేశములపై దండు వెడలి, గజ్నీవఱకుఁ బోయి, యచ్చట రాజ్యము చేయుచున్న సేలిమ్ అను వాని నోడించి, గజ్నీపట్టణమును స్వాధీన పఱుచుకొని, సేలిమ్ యొక్క కూఁతుని వివాహమాడెను. గజ్నీ పట్టణము పూర్వము క్షత్రియులదియేయనియు, దానిని నడుమ తురుష్కులు స్వాధీన పరుచుకొనుట యక్రమమనియుఁ దలచి స్వదేశ స్వమతముల యభిమానముచేఁ బ్రేరితుఁడై యీతఁడు గజ్నీవరకు దండెత్తెనని హిందూ చరిత్రకారులు వ్రాసియున్నారు.

ఉదేపూరు వద్ద వీకలింగజీ యను శివుని దేవాలయముకలదు. ఆ దేవుని యనుగ్రహము వలననే తన కింత వైభవము వచ్చెనని నమ్మి బాప్పారావల్ ఆదేవునియందు మిక్కిలి భక్తి విశ్వాసములు కలవాడయ్యెను. ఇప్పటికిని "వీకలింగజీ" స్వామియే ఉదేపూర్ రాజు లకుఁ గులదేవత. ఈ దేవునిదే సకలరాజ్యమనియు, అతనికిఁ దాము మంత్రుల మనియు నీ రాజులు చెప్పుచుండెదరు.

బాప్పా నూరు సంవత్సరములవరకు బ్రతికెనఁట. అతనికి నూటముప్పదిగురు పుత్రులుండిరఁట. అందుఁ దొంబదియెనిమిదిమంది హిందువులును, ముప్పదియిరువురు మహమ్మదీయులును ఉండిరి. ఈతఁడు ఇరాన్ (పారశీకము), తురాన్, ఇస్పహాన్, కందహార్,

కాశ్మీరము మొదలయిన యనేకదేశములకుఁబోయి యచ్చటి రాజు లను; సేనానులను నోడించి యచ్చటచ్చట ననేక స్త్రీల వివాహ మాడినందున నీతనికి నింత సంతానము కలిగెనని గ్రంథకారులు వ్రాసియున్నారు. ఈతని హిందూపుత్రులకు 'సూర్యవంశపు అగ్ని పాసకు' లనియు, మహమ్మదీయపుత్రులకు 'నౌషేర్యపఠాను'లనియు బేళ్ళు కలిగెను.

ఖుమాన్.

(క్రీ. శ. 836)

బాప్పారావల్ తరువాత ముగ్గురురాజులు రాజ్యముచేసిరి. వారును శౌర్యధైర్యాది గుణమండితులయినను, వీరి తరువాత రాజ్య మునకు వచ్చిన అయిదవరాజగు ఖుమాన్ అనువాఁడు మహమ్మదీ యులను పరాభవించుటచే మిక్కిలి విఖ్యాతుఁడయ్యెను. ఈతఁడు క్రీ. శ. 836 లో రాజ్యారూఢుఁడయినట్లు కానవచ్చెడిని. 'ఖుమాన్ రాసా' యనుగ్రంథమునందు నీతని చరిత్ర వర్ణింపఁబడినది. ఈతఁడు మహమ్మదీయులతో నిరువదినాలుగు పర్యాయములు పోరాడి వారిని నోడించెను! ఆకాలమునను త్తర హిందూదేశమునందు ననేక క్షత్రియ రాజు లుండిరనియు, వారికందరికిఁ గొంతవరకు స్నేహమును, ఐక మత్యమును గలిగియుండెననియుఁ గానవచ్చుచున్నది. ఎందుకన నీ ఖుమాన్‌రాజునకు సాయమువచ్చిన రాజుల పట్టికలో నలువది కంటె నెక్కుడు రాజులపేళ్ళున్నవి. ఇట్టి యైకమత్యత వలననే యప్పుడు వారు తమయొక్క ప్రాభవమును కాపాడఁ గలిగిరి! హా! ఈ యైకమత్యమే స్థానేశ్వరమందు పృథ్వీరాయఁడు మహమ్మదు ఘోరితోఁ బోరాడునపుడు లేకపోయెఁ గదా? అప్పుడే యిట్టి యైక మత్యముండినయెడల నీ హిందూదేశ చరిత్ర మనమింకొక విధమున వ్రాసియుందుము కదా?

సమరసింహుఁడు

(క్రీ. శ. 1150 – 1193).

ఈతఁడు బాప్పారావల్ వద్దనుండి పదునేడవ పురుషుఁడు. రాజపుత్ర చరిత్రకారు లీతనిని 'సామరసీ' యనియొదరు, 'సామరసీ'

యనునది 'సమరసింహ' శబ్దభవము. ఈతఁడు తన పేరునకుఁదగి నట్లు శూరుఁడు, బలాఢ్యుఁడు, బుద్ధిమంతుఁడు. దిల్లీశ్వరుఁడగు పృథ్వీ రాయని చెల్లెలయిన పృథాదేవి ఈతని భార్య. అందుచే నతనికిని, దిల్లీశ్వరునికిని మిక్కిలి స్నేహము కలిగియుండెను. ఈతని సహా యము వలననే పృథ్వీరాయఁడనేక శత్రువుల జయించెను. తుదకీ వీరుఁడును ఈతని పెద్దకుమారుఁడగు కళ్యాణరాయఁడును మాతృ దేశముయొక్క రక్షణార్థమై పృథ్వీరాయనికిఁ దోడుపోయి క్రీ. శ. 1193 లో స్థానేశ్వరయుద్ధమందుఁ గాలధర్మము నొందిరి.

కరుణదేవి.

సమరసింహునకుఁ గరుణదేవియను మరియొకభార్యయుండెను. ఈమెకు సమరసింహునివలన నొక కుమారుఁడుండెను. అతని పేరు కర్ణుఁడు. జ్యేష్ఠ కుమారుఁడు తండ్రితోఁగూడ యుద్ధములో మడిసి నందున ఈకర్ణుని రాజ్యాభిషిక్తునిఁజేసి వాఁడు చిన్నవాడగుటచే వీర పత్నియగు కరుణదేవి స్వయముగ రాజ్యముచేయఁ దొడఁగెను. ఈమె రాజ్యము చేయుచుండఁగా మహమ్మదీయు లారాజ్యభారము నకు మిగులబాధ కలుగఁజేయుచుండిరి. ఈ శూరవనిత రాజ్యభారము నంతను వహించినది గనుక, సైన్యములను బోగుచేసుకొని తాను స్వయముగా నశ్వారోహత్వమును వహించి అంభోర్ అను గ్రామము నొద్ద మహమ్మద్ ఘోరీయొక్క సైన్యాధీశుఁడగు కుతుబుద్దీన్ అను వానిని బూర్తిగ నోడించెను! స్త్రీయయ్యును, భారతయుద్ధమునందు వలె క్షత్రియరాజు లందఱును స్థానేశ్వర యుద్ధమునందు మడిసిన కొలఁది కాలములోనే యీ శూరవనిత తన కొలఁది సైనికులతో కుతుబుద్దీన్ వంటి మహాశూరుని నోడించుట చూడఁగా, మన రాజ పుత్రులు తమ స్త్రీలను రాణీవాసములో నుంచక యుద్ధములలో వారి సైన్యములను రానిచ్చి, వారి సాహాయ్యముఁగూడఁ గొనియుం డిన నీదేశము మహమ్మదీయులపాలుగాక యుండునేమో యని తర్కింపవలసియున్నది. ఈమె కుమారుఁడు కర్ణుడు పెద్దవాఁడయి రాజ్యము చేసెను,

రహూప్

(క్రీ. శ. 1201 - 1239)

కర్ణుని తరువాత రహూప్ అనువాడు మేవాడ్ రాజయ్యెను. ఈతఁడు సమరసింహుని తమ్ముని మనుమఁడు. ఈతఁడు కర్ణుని దొహి త్రుని నోడించి యీ రాజ్యము సంపాదించెను. శమ్సుద్దీన్ అను మ్లేచ్ఛుఁ డీతనిమీఁదికిఁ బోరాటమునకు రాఁగ నాతని నోడించి యాతని మద మడంచెను! ఈ మ్లేచ్ఛునకు దేశద్రోహియగు మోకల్ పరిహార్ అను హిందూరాజు సాయము చేసినందున వానిపై నలిగి రహూప్‌రాజు వాని రాజ్యము నాక్రమించుకొని వానికిఁగల 'రాణా' యను పదవిని తాను ధరించెను. అప్పటినుండి మేవాడ్ రాజులు తమ కదివరకున్న బిరుదులను విశేషముగా వాడక 'రాణా' పదమునే వాడుచున్నారు.

ఈరాజు మరణానంతరము లక్ష్మణసింహుఁడను వాఁడు రాజగు వఱకుఁ దొమ్మండ్రు రాజులయిరి. అందు నార్గురు చితోడ్‌లోను, ముగ్గురు గయలోను సంగ్రామమున హతులయిరి. ఆ కాలమున గయాక్షేత్రముపై మహమ్మదీయులు దండెత్తి వచ్చినప్పుడెల్లను, దానిని రక్షించుటకై చితోడ్‌గడము నుండి రాజులు వెళ్ళుచుండిరి.

లక్ష్మణసింహుఁడు.

(క్రీ. శ. 1235 - 1303).

ఈ వంశములోని యిరువది తొమ్మిదవవాఁడగు లక్ష్మణ సింహుఁడు క్రీ. శ. 1275 లో రాజ్యారూఢుఁడయ్యెను. అల్లాఉద్దీన్ అను దిల్లీ శ్వరుఁ డీతనికి సమ కాలీనుఁడు. ఈ మ్లేచ్ఛరాజు చితోడ్ మీఁదికి దండెత్తివచ్చి దానిని ముట్టడించెను. లక్ష్మణసింహుని పిన తండ్రియగు భీమసింగునకుఁ బద్మినియను భార్యకలదు. ఈమె సింహళద్వీపపు రాజగు హమ్మీరసింగుయొక్క కూఁతురు. సౌందర్య మందును, సద్గుణములందును పద్మినీదేవితోఁ బోల్పఁదగిన స్త్రీ యప్పుడు రాజపుత్రస్థానమందు లేదని యీమె విఖ్యాతిఁ జెంది యుండెను. ఇట్టి సాధ్విని జెఱపట్టుకొని పోవలయుననిన దురుద్దేశ

ముతో నల్లాఉద్దీన్ అను దిల్లీశ్వరుఁడు చితోడ్ దుర్గమును ముట్టడించి విడిసెను: 'పద్మినీదేవిని తనకిచ్చివేసినయెడలఁ తాను రాజపుత్రులకు నెట్టి బాధయుఁ గలుగకుండ లేచి వెడలెద' నని యా దుర్మార్గుఁడు పట్టుపట్టెను. కాని తమ స్త్రీల పాతివ్రత్యము రక్షించుట కంటె నధికగౌరవాస్పదమైన పౌరుషకృత్యము రాజపుత్రులకు వేరొకటి లేనందున రాజపుత్రులందరును మహాశౌర్యముతోఁ బోరాడసాగిరి; అందుచే నెన్ని దినములు కష్టపడినను మ్లేచ్ఛునకుఁ జితోడ్ గడము స్వాధీనము కాదయ్యె. అందుకు విసివి 'పద్మినిని నా కొక్కసారి చూపినఁజాలును. నేను వెడలిపోయెదను' అని యా నరాధముఁడు రాజపుత్రులకుఁ దెల్పెను. అందుపైఁ 'బ్రత్యక్షముగఁ బద్మిని దర్శనము నీ కగుట కలలోనివార్త. నిలువుటద్దములోని యామె ప్రతిబింబము వలయునెడ నీవు చూడవచ్చు'నని రాజపుత్రు లాతనికి దెల్పఁగా నా కామాంధుఁడందులకు నొప్పుకొని, చితోడ్‌గడము మీఁదికివచ్చి యద్దములోఁ బద్మినీదేవి ప్రతిబింబమును జూచెను. రాజపుత్రు లత్యంత నీతిమంతులుగాన నట్లు నమ్మి తమ యింటికి వచ్చిన దుష్టశత్రువునువధింపరైరి. అట్లువధించియున్నయెడల చితోడ్ దుర్గముమీఁది యేష్యసంకటములన్నియు నంతటితో సమాప్తిఁ జెందియుండును. కాని రాజపుత్రులు తమయసమాన పౌరుషముతోఁబాటుఁ ఆడినమాటతప్పకుండుట, శరణాగతత్రాణబిరుదము, తమకెంతనష్టము వచ్చినను నమ్మినవానిని ద్రోహము చేయకుండుట మొదలయిన యత్యుచ్చనేతి తత్వములను బ్రాణములతోఁ బాటు చూచుచుండిరనియు, అందుచే వీరనేక పర్యాయములు మహమ్మదీయులచే మోసపుచ్చఁబడియుఁ బ్రసంగము వచ్చినపుడు ఆమోసమునే మహమ్మదీయుల యెడఁ బ్రయోగింపక చిక్కిన పట్టును వదలుచు వచ్చినందున వీరు తురుష్కులకంటె నధిక శూరులయినను అనేక యుద్ధములలో నోడి రాజ్యమును పోఁగొట్టుకొనవలసిన వారయిరనియు ముందు కథానకము వలనఁ జదువరులు చూడఁగలరు.

అల్లాఉద్దీన్ కొండదిగి వెళ్లునపుడు మోసమెరుఁగని భీమసింగు చాలాదూరమువరకు నాతని సాగనంపఁబోయెను. కొండ

మోదినుండి మిక్కిలి దవ్వరిగిన పిదప నచ్చట నదివరకే డాగి యున్న మ్లేచ్ఛ సైనికులు భీమసింగును చెరపట్టి తమ శిబిరమునకుఁ గొంపోయిరి. 'పద్మిని నిచ్చినఁగాని భీమసింగును విడువ' మని అల్లాఉద్దీన్ చితోడ్‌గడము లోనివారికిఁ దెలియఁ జేసెను! చూచి తిరా యాతని నీతికిని, రాజపుత్రుల నీతికిని గల తారతమ్యము ! సైని వర్ణింపఁబడినట్లు భీమసింగు శత్రువుల చేతులలోఁజిక్కి నందున నాతనిని నిడిపించుటకు రాజపుత్రు లొకయుక్తి బన్నిరి. "మీరు చితోడ్ ముట్టడిలేపి యొకవైపు మీ సైన్యమంతయు విడియునట్లు చేసిన యెడలఁ బద్మినీ దేవిని మీయొద్దకుఁ బంపెదము. కాని యా మెయోగ్యతకుఁ దగినట్లు ఆమెను మీ శిబిరమునకుఁ బంపుటకు ననేక రాజస్త్రీలు మేనాలలోను, పల్లకులలోను వచ్చెదరు; కావున వారి రాణివాసమునకు భంగములేకుండ నేర్పాటు చేయవలయును" అని అల్లాఉద్దీనుకు వర్తమాన మంపిరి. అందుపైనా కాముకుఁడు దుర్గము చుట్టునున్న సైన్యమునులేపి యొకచోటఁబద్మిని రాకకై యెదురు చూచుచుండెను. అంతఁ జెరతో మూయఁబడిన యేడువందల మేనాలును, పల్లకీలును చితోడ్ నుండి బయలుదేరి దిల్లీశ్వరుని శిబిరమునకువచ్చి, వారికై విడిగా నేర్పరుపఁబడిన రాణివాసపు గుడారమునందు దిగెను. అంత వెంటవచ్చిన వారి కోర్కెననుసరించి పద్మినితో నొక్కసారి మాటాడివచ్చుటకు భీమసింగునకు సెలవీయఁబడెను. ఆతఁడు పద్మిని యున్నదనిన గుడారమునకుఁ బోయి, పద్మినిని వీడొక్కని తిరిగి వెళ్ళుచున్నారన్న రజపూత్ స్త్రీల యొక పల్లకీలో గూర్చుండి చితోడ్‌గడమునకుఁ బోయెను. భీమసింగింత యాలస్యమేలచేసెనని అల్లాఉద్దీన్ మనుష్యులను బంపి విచారింపగా, రజపూడ్ స్త్రీల గుడారములో నొక్కయాఁడుదియు లేక యేడువందల రాజపుత్ర వీరులు మేనాలలోనుండి వెలువడి విచ్చుకత్తులతోఁ దురుష్కుల నణుకసాగిరి. చితోడ్‌నుండి వచ్చిన పల్లకీలలో రాజపుత్రులు నటించినట్లు రాజస్త్రీలు లేరు; ఒక్కొక్క మేనాలో నొక్కొక్క రాజపుత్ర భటుడు కూర్చుండి వచ్చెనని చదువరులు కనుఁగొనియెదరు. భీమసింగుని విడిపించుటకును, అల్లాఉద్దీనును

మోసపుచ్చుటకు, పద్మిని మొదలయిన రాజస్త్రీల మానమును రక్షించుటకును ఇది రాజపుత్రులు పన్నిన యుక్తి.

ఇట్లు చేయఁబడిన మోసమును తెలిసికొని మ్లేచ్ఛులు మిగుల కోపోద్దీపితులై రాజపుత్ర వీరులను తరుముకొని కోటవరకు వచ్చిరి. ఈ యుద్ధమునందు చితోడ్‌లోని విఖ్యాత శూరులనేకులు మడసిరి. అయినను కోట మ్లేచ్ఛులకు, జిక్కినదికాదు. తుదకుఁ బ్రాణము విసివి అల్లాఉద్దీన్ ముట్టడిలేపి వెడలిపోయెను.

కాని అల్లాఉద్దీన్ మరల క్రీ. శ. 1303 లో చితోడ్‌గడము మీఁదికి దండెత్తి వచ్చెను. ఈతడవ అసంఖ్య రాజపుత్రులు తమ దేహముల స్వదేశరక్షణార్థమై యర్పించిరి. లక్ష్మణసింహుని పండ్రెండుగురు పుత్రులలోఁ బదునొకండుగురు యుద్ధమందు హతులయి క్షాత్రధర్మమును ప్రతిపాలించిరి. ఇట్లువీరులందరు మడియుటచే రాజపుత్రులకుఁ బరాజయంబును, మ్లేచ్ఛులకు జయంబును గల్గుట నిశ్చయమని యందఱికిని దెలిసెను. అంతఁ దాము బ్రతికి యుండఁగఁ దమకోటయుఁ దాము మడిసిన తరువాతఁ దమ స్త్రీలును శత్రువుల చేతఁ బడకుండ 'జోహార్' చేయ నిశ్చయించిరి. 'జోహార్' అనగాఁ దమకుఁ దప్పక పరాజయము కలుగునని తెలిసినప్పుడు, తమ స్త్రీ జనములు శత్రువులచేతఁజిక్కి వారిచే మానభంగముఁ జెందకుండ వారిని మొదట సంహరించుటయు, పిదప మగవారందఱును ఒక్క పట్టున శత్రువులపైఁ బడిపోరాడి మడియుటయు. ఇట్లు నిశ్చయించిన పిదపఁ జితోడ్‌లోని యొకానొక గుహలో నగ్నిపేర్పించి యందు నందరు రాజపత్నులను, రాజ కన్యలును, రాజస్నుషలును, సరదారుల భార్యలును, సైనికుల భార్యలును, మేవాడ్ భూషణమగు పద్మినీ దేవియుఁబ్రవేశించి, యందఱును మడిసిరి ! పిదపలక్ష్మణ సింగ్ భీమసింగ్ మొదలయిన వీరులందఱును నిర్భీతులయి శత్రు సైన్యములోనికి జొచ్చి యసంఖ్యవీరులఁ ద్రుంచి తాము హతులైరి.

ఇట్లు ఎటు చూచినను అగ్నితోడను, శవములతోడను నిండి భయానకమై నిర్మానుష్యమైన యా కోట మ్లేచ్ఛులకు స్వాధీనమయ్యెను. అల్లాఉద్దీనువంటి మానవరూప మహారాక్షసునకుఁగూడ

ఆ కోటను జూచి మనసునకుఁ గొంచెము వ్యసనము కలిగెను! వాఁడ చ్చటఁ గొన్ని దినము లుండి హిందూ దేవాలయములను బడఁ గొట్టించి మసీదులు కట్టించి, మాలవ దేవుఁడను వానిని ఆచ్చట నధికారిగా నేర్పఱచి వెడలిపోయెను.

హమీర్

(క్రీ. శ. 1313 - 1365)

పైని వర్ణింపఁబడిన జోహారులో మేవాడ్‌రాజకుల మెల్ల నశించెనని చదువరులు చూచియున్నారు. కానితన పుత్రులలోఁ బదు నొకండుగురు యుద్ధము మడసిన పిదప లక్ష్మణ సింహుడు తనవంశ మంతరించి పోకుండఁగఁ దన రెండవకుమారుఁడగుఁ ఆజయ్యసిం హుని సురక్షితమైన స్థలమునకు బంపివేసెను. ఈతఁడుగాక, యీ తని యన్నయు లక్ష్మణసింహుని పెద్దకుమారుఁడును అగు ఊర్ సింహుని కుమారుఁడగు హమీరుఁడను వాఁడు తాత ముత్తవల యింటఁ బెరుఁగు చుండెను. ఇట్లీవంశజులగు పురుష లిద్దరు జీవించి యుండిరి. అందు జయసింహుని చితోడ్‌గడములోనుండి సురక్షిత స్థలమునకుఁ బంపునప్పుడు "జీవితకాలమువఱకు నీవు రాజ్యముచేసి పిదప దేశము కొఱకు బ్రాణములఁ ద్యజించిన నీ యన్నయగు ఊర్ సింహుని గౌరవార్థమై యాతని కుమారునకుఁ బట్టము కట్టుము" అని లక్ష్మణ సింహుఁ డాజ్ఞాపించెను.

చితోడ్‌లోని మొదటి జోహార్ జరిగిన తరువాత రాజ్య మంతయుఁ దురుష్కుల పాలయినందున నజయ్యసింహుఁడు కేల్ వాడ్ అనుచోట నజ్ఞాత వాసమునందుండ వలసిన వాఁడాయెను. కేల్‌వాడ్ అనుస్థల మారావలీ పర్వతముల కనుమలలో నున్నది. అచ్చట నాతఁడు సజ్జనసింగ్, అను తనకుమారునితోడను, హమీర్ అను తన యన్న కుమారునితోడను కొంతకాలము గడపెను. ఒకనాఁ టచ్చటి యొక భిల్లునితో నాతనికిఁబోరాటమురాఁగా నాతఁడు వాని పైన ముగ్గురు కుమారులను బంపఁగా హమీరుఁడు వాని తలఁ ద్రుంచి పినతండ్రికిఁ దెచ్చియిచ్చెను. అంత నజయ్యసింహుఁడు మెచ్చుకొని తనతండ్రి యాజ్ఞను దలఁచి, యీభిల్లుని శిరమ్ములోని

రక్తబిందువులతో హమీరునకు బొట్టుపెట్టి, ముందు రాజ్యాధికారను తనపుత్రులకు లేదనియు, ఆ యధికారము హమీరునదియే యనియు స్థిరపరిచెను. అజయ్యసింహు జీవితకాలములోనే యాతని రెండవ కుమారుడు మృతినొందెను. బ్రతికియున్న తన పెద్దకుమారుడగు సజ్జన సింహుడు రాజ్యము కొఱకు హమీరునితో బోరాడునేమో యని యాతడు మేవాడ్ దేశమును విడిచి వెళ్ళునట్లు ఆజ్ఞాపించెను. పితృభక్తుడును, సజ్జనుడు నగు నా సజ్జన సింహుడు మేవాడ్ దేశము వదలి దక్షిణమునకుఁ బోయి మహారాష్ట్ర దేశమందుఁ గాఁపురముండెను. ఈ సజ్జన సింహుని వంశమందే మహారాష్ట్ర రాజ్యసంస్థాపనకును, క్షత్రియ కులావతంసుడును నగు శ్రీ శివాజీ జన్మించెనని చదువరులు 'మహారాష్ట్రోదయము' అను ఐదవ భాగములోఁ జూడఁగలరు.

ఇట్లు అజయ్య సింహుని తరువాత హమీరుఁడే రాజ్యమున కధిపతియయ్యెను. కాని రాజ్యము మాత్రము లేదయ్యెను! అందుచేత రాజ్యమును, వైభవమును సంపాదించుటకై హమీరుఁడు యత్నింప సాగెను. మహారాష్ట్ర రాజ్యము సంపాదించుటకు శ్రీ శివాజి ముందు ఎట్లు చేసెనో యట్లే హమీరుఁడు తురుష్క రాజులను బాధపెట్ట సాగెను. అతఁ డైదువేలభిల్లులను సైనికులుగాఁ జేర్చుకొని మహమ్మదీయ రాజ్యములను దోఁచుకొనుచు దొరకిన ధనమంతయు కేల్వాడ్‌కుఁ దెచ్చుచుండెను. కేల్వాడ్ అనుస్థలము పర్వతారణ్య ప్రదేశములలో నుండుట వలన శత్రువులకు సాధ్యముకాకానిదిగ నుండుటయే గాక భిల్లసైనికులకుఁ గావలసిన భోజనసామాగ్రియు, ఘాసేంధనాదులును విపులముగ దొరకుచుండెను. అచ్చటినుండి సింగము వలెఁ వెడలి యనేక పట్టణముల పైఁబడి రాజ్యానిస్వాధీన పరుచుకొనుచుఁ ద్వరలోనే హమీరుఁడు చితోడ్‌గడమొకప్పటి లిన రాజ్యమంతయు సంపాదించెను.

అప్పుడు చితోడ్‌గడము ఢిల్లీశ్వరుఁడగు మ్లేచ్ఛునికి సేవకుఁడైన మాలవ దేవుని స్వాధీనములోనుండెనని చదువరులెరుంగుదురు. ఈ మాలవదేవుడుఁ రాజవృత్తవంశపువాఁడే. అతఁడు తనబాల విధవ

యగు కూఁతును, ఆమె బాల విధవయని తెలియనీయక, హమీరున కిచ్చి వివాహము చేసెను. వివాహానంతర మీ సమాచారము హమీరునకుఁ దెలిసినను ఆమె సద్గుణములకు మెచ్చి యామెను విడువక జన్మమంతయుఁ దన సహధర్మచారిణిగఁ గైకొనియె ! వీరి ద్దరికి ఖేతసింగుఁడను కుమారుఁడు కలిగెను,

మాలవ దేవుఁడును అతని సైనికులును మతియొక పనిమీఁద నెచ్చటికో వెడలినప్పుడు హమీరుఁడును, ఆతని భార్యయుఁ జిత్తోడ్ మీఁది యితరసైనికులను వశపరుచుకొని యాదుర్గమును నాక్ర మించిరి. ఇట్లు హమీరూఁడు సిసోదియా వంశమునొక్క పోయిన రాజధానిని, రాజ్యమును, వైభవమును మరల సంపాదించెను. (క్రీ. శ. 1313)

మాలవదేవున కీ సంగతి తెలిసి యీ యంశమును తనయజ మానునికిఁ దెల్పుటకై యాతఁడు డిల్లీకి బోయెను. అప్పటిచ్చట మహమూద్ ఖిల్జీ యనువాఁడు రాజ్యము చేయుచుండెను. వాఁడు హమీరును శిక్షించుటకై యొక పెద్ద సైన్యమును దీసికొని వెడలెను. కాని యిటు హమీరుఁడు చితోడ్ రాజ్యమునకు వచ్చెనని తెలియఁగనే హిందూ రాజుల కందఱికిని అపరిమితానందము కలిగి వారాతని సాహాయ్యమునకు వచ్చిరి. తురుష్క రాజ్యము నడుగంటి క్రొక్కఁ దలచిన హిందువు లందఱికిని ప్రాణములు వచ్చెను. అందుచే హమీరుని సైన్యము మిక్కిలి బలపడెను. తుదకు హమీర మహమూద్ ఖిల్జీ లకు చంబళానది యొడ్డున సింగోలీయను గ్రామమునొద్ద ఘోర సంగ్రామమై యందు మ్లేచ్ఛుఁడు పరాభూతు డయి హమీరుని చేతజిక్కెను. వాఁడు మూఁడు నెలలవరకుఁజితోడ్ గడమునకుఁ బెరసాలలోనుండి తుదకు హమీరునకు అజమీర్, రణథంబోర్, నాగోర్, సుయీసోపూర్, ఆనుప్రాంతములును, ఏఁబది లక్షల రూపాయిలును, నూఱు యేనుగులును ఇచ్చి బంధవిముక్తు డయ్యెను. ఇంతియగాక "ఇఁక ముందెన్నఁడును నేను మేవాడ్ రాజ్యము మీఁదికిఁగాని యితర రాజపుత్రుల రాజ్యము మీఁదికిగాని దండెత్తి రాఁగలవాఁడను గాను; ఇతరు లెవరయిన మీమీ

దికి దండెత్తి వచ్చిన యెడలనేను మీకుఁ సాహాయ్యము చేయగల వాడను' అని యాతురుష్కునిచే హమీరుఁ డొప్పించుకొనియె.

మాలవ రాజునకు రణభీర్, బనబీర్ అనుపుత్రు లిద్దరుండిరి. వీరిద్దఱును హమీరునకు బావమఱఁదులు అనఁగా భార్యతోఁబుట్టిన వారు. వారిద్దరును మహమూద్ ఖిల్ జీతోఁ గలసి హమీరునితోఁ బోరాడిరి. అందు రణభీరుఁడు హతుండయ్యెను; బనబీరుఁడు పట్టు వడియె. వానిని బంధవిముక్తునిఁ జేసి వానికిఁ గొంత జాగీరొసంగి "నీకునాకుఁ గల బంధుత్వ మటుంచినను , నేను నీవు ఒక్క మతము గలవారము, జాతిగలవారము, ఈ జాత్యభిమానమును, మతాభి మానమును మఱువకుము. నీవు మహమ్మదీయులతోఁ గలసి యప కీర్తి వడయకుము' అనిబోధించెను.

ఇట్లు మహమ్మదీయ రాజులకుఁ బ్రబల ప్రతిస్పర్ధియైనందున హమీరుఁడు తన నందరు క్షత్రియ రాజులకు నొక దివ్యపురుషుడుగ నుండెను. ఆతనితో స్నేహంచేయుటయు, నాతనికి మాండలికులుగా నుండుటయు భూషణాస్పదముగ నెంచఁబడియె. బుందీ, గ్వాలేర్, చందెరీ, రాయ్‌సహన్, సిక్రీ, కాల్పీ, అబూ మొదలయిన సంస్థానా ధీశ్వరు లాతనిని నాయకునిగా గ్రహించిరి. జయపూర్, జోధ పూర్, సంస్థానా ధీశ్వరులు సంతోషముతో నాతనికి సామంతు లయిరి. ఇట్లు హిందువులలో గొంతవరకు నైకమత్యము గలిగి వారు కొంచెము తలయెత్త సాగిరి.

మహమ్మదీయులు వచ్చుటకుఁ బూర్వము మేవాడ్ రాజ్యపు సీమ మిక్కిలి విస్తృతముగ నుండెను. కాని రెండు వందల సంవ త్సరముల నుండి యది తగ్గుచుఁబోయి మిక్కిలి చిన్నది యయ్యె. కావునఁ బూర్వ రాజ్యమంతయు మరల సంపాదించుటకు హమీరుడు పూనుకొనెను. ఆతనికిఁ గాలముకూడ ననుకూలించెను. హిందువు లందరును ఆతనికి ననుకూలురుగా నుండిరి. ఢిల్లీ రాజ్యమున నైఖిల్ జీ, లోదీ, సూర్ అను ముగ్గురు తురుష్క కుటుంబములవారు పరస్పర కలహములలో మునింగిరి. ఈ సమయము తగినదిగదాయని హమీరుఁడు విజయయాత్రలకు వెడలుచుండెను. ఆతని సైన్య

ములు డిల్లీ సౌరాష్ట్రములవరకును మార్వాడలోని నాగోరువరకును బోయి జయము సంపాదించి యపారధనమును దెచ్చెను. మేవాడ్‌లో నాకాలమందు గట్టబడిన భవ్యములైన సుందర మందిరములే యప్పుడు వారు తెచ్చిన యపార సంపత్తిని వెల్లడిచేయుచున్నవి. ఇట్లు పోయిన రాజ్యమంతయు సంపాదించి, కలాకౌశలములను రాజ్యమందభివృద్ధిచేసి, మేవాడ్ ప్రజలదివఱకుఁ దురుష్కులచేఁ బడిన బాధలకును, అనుభవించిన దారిద్ర్యమునకును దెట్టించిన సుఖమును సంపత్తియుఁ బ్రజల కొసఁగి, వృద్ధుఁడగువఱకు రాజ్యము చేసి యీ మహాపరాక్రమవంతుఁడు తన కుమారునకు విపులైశ్వర్యమును ప్రబల రాజ్యమును అప్పగించి క్రీ. శ. 1365 లోఁ గీర్తిశేషుండయ్యెను. ఈతని నామ మిదివఱకును రాజపుత్రస్థానములో మిక్కిలి గౌరవింపఁ బడుచున్నది. హిందూదేశచరిత్రలో నితఁడు శివాజి, కృష్ణదేవరాయలు, ప్రతాప్‌సింగ్, రాజసింగ్ మొదలయిన మహాశూరులతోఁ బోల్పఁదగినవాఁడు.

ఖేతసింగ్

(క్రీ. శ. 1365 – 1383)

హమీరుని కుమారుఁడు ఖేతసింహుఁడనబడు క్షేత్రసింహుఁడు. ఈతఁడును తండ్రివలెనే పరాక్రమవంతుఁ డనియుఁ బ్రజాహిత చింతనుఁడనియుఁ బేరువడసెను. ఈతఁడు శత్రువుల నోడించి మాండల్‌గడము మొదలగు ప్రాంతములను దన రాజ్యములోఁ గలుపు కొనెను; మఱియు బాకరోల్‌వద్ద హుమాయూన్ బాదుషాహను ఓడించెను. ఈతఁడు పదునెనిమిది సంవత్సరములు రాజ్యముచేసి యొకానొక రాజపుత్రరాజువలన మోసముచేఁ జంపఁబడియెను.

లాఖారాణా

(1383 – 1398)

ఖేత్‌సింగుని తరువాత నాతని కొమారుఁడగు లాఖారాణా రాజయ్యెను. ఈతనికి లక్ష్మణసింహుఁడని నామాంతరము. ఈతఁడు తన తండ్రి తాతలవలెనే క్షాత్రతేజము కలవాఁడును, ఉత్కృష్ట రాజ్య

పద్ధతి నెఱిఁగినవాఁడును, ప్రజా క్షేమైక నిరతుండును అయి ఖ్యాతి వహించెను. ఈతఁడు మేవాడలోని పర్వతదుర్గములను స్వాధీన పఱుచుకొని, అనావశ్యక మగువానిని నాశముచేయించి, వలయు వానిని బాగుగఁ గట్టించెను; మహమ్మద్‌లోడీ యను డిల్లీశ్వరుని నోడించెను. కాని సంతత యుద్ధములవలనఁ బ్రజలకు మిక్కిలి నష్ట మని తలఁచి, తన దేశమును, ప్రజలును ధనవంతులయి సౌఖ్యపడు నట్లు కలాకౌశల్యముల నభివృద్ధిచేసెను. అనఁగా స్వదేశి యనఁబడు ఉద్యమమువలన దేశమును బాగుపఱిచెను. దేశమునం దేమేమి గనులుకలవో కనుఁగొని దొరకిన వెండిగనులలోని ధన మంతయు రాజ్యరక్షణార్థమై తోఁటలు కట్టించుటలోను ప్రజల సౌకర్యార్థమై చెఱువులు, బావులు, హాదులు నిర్మించుటలోను, అనేక కళల నభివృద్ధి చేయుటలోను వెచ్చించి 'దేశహిత చింతకుఁ' డను సార్థక బిరుదము వహించెను. ఈ నృపతి వెనుక అల్లాఉద్దీనుచేఁ బాడు చేయఁబడిన, చితోడ్‌మీఁది మందిరముల నన్నింటిని మరలఁగట్టించెను. ఈతఁడు కట్టించిన విశ్వకర్మ మందిరమును, రాజుభవనములోని కొంత భాగమును నిప్పటికిని మంచిస్థితిలోనుండి, యీ కాలపువైభవమునకు ద్యోతకములుగా నున్నవి.

మోకల్ రాణా

(1368 – 1419)

మార్‌వాడ్ దేశపు రాజయిన రణమల్లుని కన్యను లాఖారాణా కిచ్చియుండిరి. ఈ వివాహమునకుఁ బూర్వము లాఖారాణాకు మొదటి భార్యవలన చోండా యసిన వాడుక పేరుగల చంద్రసింహు డను పెద్దకొడుకుండెను. జ్యేష్ఠ పుత్రుఁడగుటచే రాజ్యమునకు నధి పతి యైనను, ఈ చోండాయను సత్పుత్రుఁడు, మహాభారతములోని భీష్మాచార్యుల చరిత్ర ననుసరించి, తండ్రికోర్కె ప్రకారము, తనకు రాజ్యముపైఁగల హక్కునువదలుకొని తన సవతి తల్లికుమారుఁడగు మోకల్ రాణాను రాజుగా నేర్పరిచి యాతని బాల్యమునందు రాజ్య మును అతని మంత్రిగఁ బాలించి, యాతఁడు పెద్ద వాడయినతోడనే యాతనికి నొప్పగించెను.

ఈ మోకల్‌రాణా క్రీ.శ. 1398 లో రాజ్యపరిపాలనము చేయ దొడగెను. ఈ సంవత్సరము హిందూదేశచరిత్రము మరియొక సంగ తిని గుఱించి ప్రఖ్యాతిఁ జెందియున్నది. మోగల్ బాదుషాహా యగు తైమూర్ లంగ్ అనువాఁడు ఈ యేఁటనే హిందూదేశముపై దండెత్తి వచ్చెను. కాని యాతఁడు మేవాడ్ జోలికిఁబోలేదు. దిల్లీ శ్వరుఁడీతని రాజ్యముపై దండెత్తిరాఁగా నీతఁడెదురేగి రాయపూర్ అను గ్రామము నొద్ద నాతని నోడించెను. అచ్చటినుండి తిరిగివచ్చు నెడ సాంభర్ ప్రాంతమును జయించెను. ఈ ప్రాంతములో సాంభర్ చెరువు కలదు: అందు నుప్పుపండును. అందుచే నీతనికి నాదాయ మెక్కువయ్యెను. లాఖారాణాచేఁ ప్రారంభింప బడిన రాజమందిర మును ఈతఁడు పూర్తిచేయించుటయే కాక చతుర్భుజుని దేవాలయ మొకటి కట్టించెను. ఇది మిక్కిలి చక్కని దేవాలయము. మోకల్ రాణా తన పినతండ్రిచేఁ జంపఁబడియె. మోకల్‌రాణాకే ముకుల్ రాణా యని మారుపేరు.

కుంభరాణా

(1419 - 1469)

మోకలుని కుమారుఁడు కుంభరాణా. ఈతడు రాజ్యమునకు రాఁగానే తనతండ్రిని జంపినవారితో బోరి వారికిఁ దగినశిక్ష విధిం చెను. ఈ రాజు అనన్య సామాన్య పౌరుషుఁడనియు, రాజ్యకార్య ధురంధరుఁడనియుఁ జరిత్రకారులు వ్రాసియున్నారు. అదివఱకు జితోడ్ దుర్గముపై రాజ్యము చేసిన మహనీయ రాజపుంగవులలో గల సద్గుణములన్నియు నీతని యందు నేకీభవించి యుండెను. చుట్టు పట్టున నున్న మ్లేచ్ఛుల ననేక పర్యాయముల నోడించెను. మాళవా, గుజరాత్ దేశములలోని తురక సుల్తానులు తమ యసంఖ్య సైన్యములతో క్రీ. శ. 1440 లో నీతని మీఁదికి యుద్ధమునకు వచ్చిరి. అప్పుడు కుంభరాణా తన యొక్క లక్ష సిబ్బందితోడను, పదునాలుగు వందల యేనుగుల తోడను తనరాజ్యపు పొలిమేర యొద్ద మాళవ దేశపు మైదానములో వారిని నెదిరించి యోడించెను. మాళవరాజగు మహమూదను వానిని చెఱపట్టి చితోడ్ గడము

మీఁద నాఱు నెలలుంచి, మిక్కిలి గౌరవించి వానికి వానిరాజ్యము తిరిగి యిచ్చెను ! ఈ యనుపమేయమైన క్షాత్రధర్మాను పాలనము నుగురించియు, ఔదార్యమును గురించియు మహమ్మదీయ చరిత్ర కారుఁడగు అబూఫౌజల్ అనువాఁడు కుంభరాణాను నెంతయో కొనియాడి యున్నాడు ! ఈ విజయమును సూచించు జయస్తంభ మొకటి మేవపాట్ నగరమం దీరాజు వేయించెను.

ఈయద్వితీయుఁడగు కుంభుఁడు తనరాజ్యసంరక్షణకై ముప్పది రెండు దుర్గములఁ గ్రొత్తగ నిర్మించెను. అందు నీతని పేరిటఁ గట్ట బడిన కుంభేర్ దుర్గము శత్రువుల కభేద్యమై యుండెను. ఈతఁడు అబూపర్వతము మీఁద కుంభోశ్యామ మను హిందూదేవాలయ మును ఋషభమందిర మను జైనమందిరమును గట్టించెను.

ఈ రాజు స్వయముగ విద్వాంసుడు. గీతగోవింద కావ్యము నకు నొక టీక వ్రాసెను. ఈతఁడు చక్కని కవిత్వ శక్తికలవాఁడు.

ఈతని భార్య పేరు మీరాబాయి. ఈమె మిక్కిలి విఖ్యాతి చెందిన భగవద్భక్తురాలు. భక్తవిజయము, భక్తమాల, బాట్ వారి కవిత్వములు మొదలయిన వానిలో నీమె మహిమలు విశేషముగా వర్ణింపఁబడినవి. ఈమె గొప్ప కవయిత్రి.

కుంభరాణా యేఁబది సంవత్సరములవఱకు మహావైభవముతో రాజ్యము చేసి తుదకుఁ తనకుమారుడగు ఉదయసింగుచేఁ జంప బడియె.

రాయమల్లుఁడు
(1474 – 1509)

పితృహంతకుఁడగు ఉదయసింగు రాజ్యమునకు వచ్చెను. కాని యాతఁడు కులకలంకుఁడగుటచే రాజపుత్రులందఱును అతనిపైఁదిరుగఁ బడి యాతని తమ్ముని రాజుగ నంగీకరించి యాతనితోఁ బోరాడ సాగిరి. ఉదయసింగుఁ డయిదుసంవత్సరముల వరకుండి ఈ పోరా టములోనే పీడుగుపడి మృతుఁడయ్యెను. తరువాత రాయమల్లుఁడు చితోడ్ సింహాసనముపైఁ గూర్చుండెను.

రాయమల్లుఁడు మిక్కిలి శూరుఁడు. ఈతని యన్నయుఁ బిత్రు హంతకుఁడును అగు ఉదయసింగునకు నిద్దరు పుత్రులుండిరి. వారిద్ద రును తమ తండ్రి రాజ్యము తమ కిప్పింపవలసినదని డిల్లీశ్వరుని నాశ్రయించిరి. అందుపైఁ గొంతసైన్యముతో డిల్లీశ్వరుఁడు యుద్ధము నకు వచ్చెను. కాని రాజపుత్రులందరును రాయమల్లునకే సహాయు లయిరి. ఈయుభయసైన్యములకును నాధద్వారము నొద్ధఘూసాయను చోటఁ బోరు ఘోరముగా జరిగెను. ఉదయసింహుని కుమారు లిద్ద రును సింహములవలెఁ బోరాడి రాయమల్లుని సేనలోని యనేక వీరుల సంహరించిరి. కాని తుదకు వారును వారికి సహాయుఁడై వచ్చిన డిల్లీశ్వరుడును ఓడిపోయి పలాయితులైరి. ఇట్లు తన యన్న కుమారులు రాజ్యమునకై తనతోఁ బోరాడి పరాభూతులయినను, రాయమల్లుడు సజ్జను డగుటచే వారిని బిలిపించి బుద్ధిచెప్పి కొన్ని గ్రామము లిచ్చెను.

మాలవదేశపు సుల్తాన్ అగు ఘియాసుద్దీన్ ఖిల్‌జీ అనువానిని ఈ రాజు సంపూర్తిగా నోడించెను. ఈతని కుమారుడగు పృథ్వీరాజు గుజరాత్ దేశపు సుల్తానగు ముజఫర్‌షాహ యనువానిని జెఱఁబెట్టి యప్పనంబులు పుచ్చుకొని వదలిపెట్టెను.

ఈరాజు గొప్పవైభవ మనుభవించినను, ఇతని ముగ్గురు కుమా రులలో ననేక కలహములు కలిగినందున జరమదశయం దితనికి సౌఖ్యము లేకపోయెను. కోపముచే నితడు తన ముగ్గురుపుత్రులను ఇంటినుండి వెడలగొట్టెను. అందు జయమల్ల పృథ్వీరాయ లను వారిద్దరు తండ్రి బ్రతికియుండగనే చనిపోయిరి. ఆ దుఃఖముతో రాయమల్లుడు క్రీ. శ. 1509 లో గీ_తశేషుఁడయ్యెను.

సంగరాణా

(1509 – 1530)

తండ్రి జీవితకాలమున నీతఁ డజ్ఞాతవాసములోనుండి, తండ్రి మరణానంతరము రాజ్యారూఢుఁడయ్యెను. ఈతని కాలములోనే మేవాడ్ రాజ్యముయొక్క వైభవము పరమావధి జెందెను. ఈతడు బహు శూరుడగుటచే దిల్లీశ్వరునితోడను, మాళవదేశపు నవాబు

తోడను పదునెనిమిది పర్యాయములు యుద్ధములు చేసి వారిని నోడించెను. ఒకానొక యుద్ధములో నాతడు దిల్లీశ్వరుని కుమారుని జెరపట్టుకొని చితోడ్‌కు దీసికొనిపోయెను. ఈరాజు నాజ్ఞలో నెనుబదివేల స్వారులును ఏడుగురు గొప్పరాజులును, తొమ్మిదిమంది రావులును, నూటనలుగురు ఠాకూర్, రావత్ అనుసరదారులును, అయిదువందల యేనుగులును మెలంగుచుండెను! మేవాడ్ రాజ్యపు సీమ మిక్కిలిపెద్దదియై యిక గొన్ని దినములకు సంగరాణా చక్రవర్తియై మరల హిందూసామ్రాజ్య ముదయించు చిహ్నములు గానబడుచుండెను. కాని యా చిన్నెలు విఫలంబులయ్యె. ఆకాలమున ట్టార్టరీదేశమునుండి బాబరనువాడు హిందూదేశమునకు వచ్చెను. ఇతడు డిల్లీని స్వాధీన పరచుకొనిన తరువాత సంగరాణాపైకి దండు వెడలెను. ఫత్తెపూర్ సిక్రీయనుచోట సంగరాణాను బాబర్ ఓడించె ననిచరిత్రకారులు వ్రాయుదురేగాని యా పరాభవమునకు గల కారణమును చెప్పరు. ఆ యుద్ధమునందును సంగరాణాకు జయము కలుగవలసినదే. సంగరాణామీదికి బాబరు క్రీ. శ. 1528 వ సంవ త్సరమున శ్రావణమాసములో నాగ్రామీదుగా సిక్రీమార్గమున బయలుదేరి ముందు బదునైదువందలస్వారులను బంపెను. వారంద రిని రాజపుత్రులు చెండాడిరి. అందుపై ముందుకు వచ్చుటకు భయ పడి తానున్నచోటికి రాజపుత్రులువచ్చి తన్ను నిబ్బంది పెట్టకుండా జుట్టు కందకము ద్రవ్వుకొని, సంగరాణాను గెలిచినయెడల నిది యిచ్చెదను, అది యిచ్చెదను అని దేవునికి మ్రొక్కులు మ్రొక్కుచు బాబర్ కాలము వేచియుండెను. ఈ యంశములు బాబరు స్వయ ముగా వ్రాసియుంచినాడు. పిదప మిత్రభేదము, స్వామిద్రోహము వలన గార్యము సాధింప నిశ్చయించెను. ఇట్లు భయసైన్యములును యుద్ధమునకు గాలుత్రవ్వుచున్నపుడు సంధినిమిత్తమై వీరి రాయ బారులు వారియొద్దకును, వారి రాయబారులు వీరియొద్దకును దిరుగు చుండిరి. అందు సిసౌదీయను తురవజాతీయ రాయసీన్ ప్రాంతపు రాజు సంగరాణాయొద్దనుండి బాబరువద్దకు రాయబారిగా బంప బడెను. కాని యా మ్లేచ్ఛుడీతని కేమేమియో యాశలు చూపి

చీలదీసెను. ఈదేశద్రోహి సంగరాణాకు నావలి సమాచారమేమియు జెప్పక, యిచ్చటి గుట్టంతయు దురుష్కులకు జెప్పి బాబరు తమ మీది కప్పుడే రాడని కొంతవరకు నశ్రద్ధతో రాజపుత్రు లున్న సమయమున, బాబరు వారిపైకి వచ్చునట్లు చేసెను. ఇంతియకాదు. క్రీ. శ. 1528 లోని 16 వ మార్చి దినమున నుభయ సైన్యములకు బోరు ఘోరముకాగా నీ దేశఘ్నుడగు మహాపాపి బహిరంగముగా మ్లేచ్ఛసైన్యములతో గలిసి రాజపుత్రులతో బోరెను. ఇట్లు యుద్ధ సమయమునందు మోసమును, ద్రోహమును కలిగినందున రాజపుత్రులకు బరాభవము కలిగె. మహమ్మదీయులకు రాజ్యము వచ్చెను. అనగా నీయుద్ధమునందును హిందువులే తమ రాజ్యమును తాము గెలిచి పరరాజులకు నప్పగించిరి! ఈ యుద్ధములో ననేక క్షత్రియులు వెనుదీయక ఘోరముగ బోరాడి రణశయ్యపై శాశ్వత నిద్ర జెందిరి. డొంగర్ పురాధీశుడగు ఉదయసింగ్ రావల్ తన రెండువందల సహచరులతో మడిసెను! సాళుంబ్రాధిపుడగు రత్నాకూర్ తన మూడువందల చోండావతులనబడు సరదారులతో గూడి హతుడయ్యెను! మార్వాడ్ రాజపుత్రుడగు రాయమల్ల రాథోడ్ మేరత్ వారగు ఖేతసీరత్నా యనువారును, సోన్‌గడ్ రాజగు రావ్ రామదాస్, ఝూల్‌వాడ్ రాజగు జోఝూగోకుల్‌దాస్ ప్రమార్, ఛవాన్ వంశీయులయిన చంద్రబాన్ మాణికచందు లనువారును నశించిరి. ఈ క్షత్రియ వీరాగ్రేసరుల పవిత్రనామములు మన కందరికిని సంస్మరణీయములు!

సంగరాణాకు నెన్నియో గాయములుతగిలి యాతడు వ్యాకులుడయ్యెను. అత డీపరాజయమువలన మిక్కిలి చింతాక్రాంతుడై మ్లేచ్ఛుని జయింపక చితోడ్‌గడమునాదికిబోనని ప్రతిజ్ఞపట్టి మేవాడ్ దేశపు పర్వతప్రాంతములలోనే వాసము చేసెను. ఈతడు మరికొన్ని సంవత్సరములు బ్రతికియుండిన యెడల దనప్రతిజ్ఞ పూర్తిచేసియుండు ననుటకు సందేహములేదు. కాని యితడు పై సిక్రీయుద్ధమైన రెండు సంవత్సరములలో బరలోక గతుండయ్యెను. సిక్రీయుద్ధము 1528 లో జరిగెను, ఈతడు 1530 లో మృతుడయ్యెను. మరణసమయమందు

ఇతడు బాబరును గెలువకయే తాను దేహము విడువవలసి వచ్చినం దులకు జింతింపగా నొద్దనున్న మంత్రులు మీకోర్కె మేము తీర్చెద మని చెప్పిరి. అందుపై నీతడు శాంతచిత్తముతో ప్రాణముల విడిచెను.

ఈ సంగరాజు మిక్కిలిబలము, గౌరవర్ణము, విశాలనేత్రములు కలవాడు తన యన్నతో బోరాడుచుండ నీతని యొకకన్నుపోయెను. డిల్లీ బాదుషాహాయరు లోదీతో బోరాడునపు నీతనియొక చేయి పోయెను. మరియొక యుద్ధమునందు గుండుతగిలి యీతని కాళ్ళకు నపాయము గలిగెను. ఇవిగాక యీతనికి యుద్ధములో నెనుబది గాయములు తగిలిన మచ్చలుండెను. సచ్ఛీరున కివియన్నియు భూషణములు కదా!

రత్నసింహుడు
(1530 – 1535)

సంగరాణా మరణానంతర మాతని కుమారుఁడగు రత్న సింహుఁడు రాజయ్యెను. తండ్రివలెనే ఈతనియందును శౌర్యపరాక్ర మాది గుణములు వాసము చేయుచుండెను. సమరభూమియే తనకు వాసస్థానమని యెంచి చితోడ్ మహాద్వార మెప్పుడును మూయ కుండఁగ నాజ్ఞాపించెను. మ్లేచ్ఛుల గర్వ మణఁపక కోటలో సౌఖ్య మనుభవింపనని నిశ్చయించెను. అందువలననే సిక్రీ యుద్ధములోఁ గలిగిన జయము బాబరునకు విశేషముగా లాభకరముకాదు. తండ్రి యొక్క సంపూర్ణ రాజ్యము రత్నసింహుని స్వాధీనములోనేయుండెను. కాని యీ రాజు అయిదు సంవత్సరములుమాత్రము రాజ్యముచేసి స్త్రీవిషయక మాత్సర్య దోషజన్యమైన ద్వంద్వయుద్ధములోఁ దన మిత్రుఁడగు బుందీరాజుచేతనె చంపఁబడియె.

విక్రమాజితుఁడు
(1535)

విక్రమాజితుఁడు రత్నసింహుని తమ్ముఁడు. ఈతఁడు మూర్ఖుఁడు; తెలివిలేనివాఁడు. రాజ్యవ్యవస్థయందు నెంతమాత్రము శ్రద్ధలేనివాఁ డయి తన వైభవమును చెడఁగొట్టుకొనియె. ఈ సమాచార్యమంతయుఁ

దెలిసి గుజరాత్ దేశపు నవాబగు బహదూర్‌శాహ చితోడ్‌గడము మీఁదికిఁ దండెత్తి వచ్చెను. వారిని యీ రాజు చితోడ్‌కుఁ గొంత దూరమున నెదిరించెను. కాని యీతని సైన్యములో వ్యవస్థలేదయ్యె; పదాతులుతప్ప విశేషముగా స్వారులు లేరైరి. అటు తురుష్కుల యొద్ద ఫిరంగులును, పోర్చుగీజ్ అధికారులును ఉండిరి; సైన్య మంతయు కవాత్ (drill) నేర్చియుండెను! మందోడ్ ఠాకుర్ అనఁగా, జోధ్‌పురము రాజధానిగాఁగల మార్‌వాడ్ దేశపురాజు మహమ్మదీయులకె సహాయము చేసెను. అందుచే మహమ్మదీయు లకు జయము కలిగెను. రాజు చితోడ్‌మీఁదికిఁ బోవలసినవాఁ డాయెను. మ్లేచ్ఛులు కోటును ముట్టడించిరి. ఈ వార్త తెలియఁగనే యనేక రజపూత్ రాజులు చితోడ్‌గడమును రక్షించుటకు వచ్చిరి. మేవాడ్ రాజ్యమునందు నభిమానముగల క్షత్రియు లందరు మహా శౌర్యముతో బోరాడిరి. విక్రమాజితుని తల్లియైన జవాహిర్‌బాయి యను వీరవనిత, పురుష వేషము వేసికొని, గుర్రమునెక్కి ఘోర ముగా బోరి వీరస్వర్గమునకు బోయెను. ఇట్లు రాజపుత్రులెంత పరాక్రమము జూపినను వారికి జయముకలుగలేదు. మ్లేచ్ఛులయొద్ద నున్న ఫిరంగుల సహాయము వలనను, గోడకు సొరంగములు చేసి యందు దుపాకి మందు నింపి దానికి నిప్పంటించి నందునను కోట గోడలు పడిపోయెను. ఇట్లిక తమకు జయము కలుగుట యబద్ధమని తెలిసిన తోడనే రాజపుత్రులు చితోడ్ గడముపై రెండవజోహారు చేసిరి! పదుమూడు వేల రాజపుత్రస్త్రీ లగ్నిప్రవేశించిరి.! పురు షులు శత్రువులపై నొక్క పెట్టున పడి హతులైరి. మొత్తము మీఁద నీజోహారులో ముప్పదిరెండువేల రాజపుత్రజనము మడి సెను!!! ఇది చితోడ్ గడముమీఁద రెండవ జోహారు. ఈ మహా సత్రములో నుండి రాజయిన విక్రమాజితుడును, ఆతని తమ్ముఁడైన ఉదయసింగుడును తప్పించుకొని వెలువడిరి,

బహదురుషాహకు నిర్మానుష్యమును; ప్రేతభూయిష్ఠమును అగు కోట స్వాధీన పడెను. కాని యాకోట యతనికి బెక్కుదిన ములు దక్కినదికాదు, సంగరాణాను ఓడించి నప్పటికిని బాబరు

గుణజ్ఞుడగుటచే సంగరాణా యెడ గౌరవముకలిగియుండెను. ఈయం శమును అతడు తన దినచర్య గ్రంథములో వ్రాసియుంచెను. అతని కుమారుండగు హుమాయూన్‌కును మేవాడ్ రాజులయెడ వారిపౌరు షమును బట్టి మిక్కిలి పూజ్యభావము కలిగి యుండెను. అందుపై నాతడు సైన్యమును దీసుకొని చితోడుకు సహాయము చేయుటకై వచ్చెను. కాని యాతడు వచ్చువరకే జోహర్ పూర్తియై, బహా దుర్ శాహచే గోట యాక్రమింపబడియె. బహాదురుశాహ కోటలో బదునైదు దినములు మాత్రముండెను. ఇంతలో హుమాయూన్ వచ్చి వానిని తరిమివేసి విక్రమాజితుని మరల సింహాసనాధిష్ఠితుఁ జేసెను. అఁతటితోనైన విక్రమాజితునకు బుద్ధిరాలేదు. వాని మౌర్ఖ్యమునకు విసివి, సరదారులు వానిపై దిరుగబడి వానిని సంహరించిరి.

బనబీర్

సంగరాణా యొక్క యన్నయైన పృథ్వీరాజు దాసీపుత్రుఁడీ బనబీరుడు. విక్రమాజితుని తమ్ముడఁగు ఉదయసింహుడు రాజ్యమునకుఁ గర్తయై యున్నందున నాతఁడు పెద్దవాడగు వఱకు నీబన బీరుఁడు రాజ్యము చేయునట్లు సరదారు లేర్పాటు చేసిరి. కాని బన బీరునకు రాజ్య కాంక్ష యధికమై యాతఁడు శిశువైన యుదయసీంహుని జంపింప యత్నము చేసెను. కాని తలిదండ్రులు లేని యాపిల్ల వానిని బెంచుచున్న పన్నా దాయి యను సాధ్వీలామలకు నివర్తమానము తెలిసి, యామె యాశిశువు స్థలములోఁ దనకుమారుని బరుండ బెట్టి యారాజును మఱియొక స్థలమునకు గొంపోయి రక్షించెను. అచ్చట నాతడు పెద్దవాడయి యితరరాజుల సాహాయ్యము గొని క్రీ. శ. 1542 లో బనబీరుని వెడలగొట్టి తనరాజ్యమును సంపాదించెను.

ఉదయసింహుడు

(1542– 1572)

ఉదయసింహుడు రాజ్యారూఢుడయిన సంవత్సరమునకే రాజ కోటలో నొక మహాపురుషుడుదయించెను. అతడు తరువాత

హిందూదేశమునను జక్రవర్తియయ్యెను. ఈతడువిఖ్యాతుడగు అగ్బర్ చక్రవర్తియని వేఱుగఁ జెప్పవలయునా ?

అక్బర్ డిల్లీపట్టణమును స్వాధీనపఱుచుకొని రాజపుత్రులంద ఱిని జయింప బయలుదేఱి క్రీ. శ. 1567 లోఁ జితోడ్‌పై యుద్ధమునకు వచ్చెను. ఈ సమాచారము తెలిసినతోడనే తన సామంతులను సరదారులను బిలిపించి యొక సభకూర్చి రాబోవుచున్న మొగలాయి దండయాత్ర నెట్లెదుర్కొనుట యుక్తమో యోచించి సలహా చెప్పు డని యడిగెను. అప్పుడు వారందరేకగ్రీవముగా చితోడ్‌ను శత్రువ శముగాక సంరక్షించుట సుకరముగాదనియు మహారాణాగారు పట్టి ణము గాపాడుటకు తగు సైన్యము నచట నిలిపి శత్రుదుర్గమైన యారావళి పర్వతమునకు రాణివాసముతో బ్రవాసము పోవుట యుక్తమని యేకగ్రీవముగ బల్కిరి. వారి సలహా ననుసరించి యుదేసింగుడు చితోడ్ సంరక్షణమును ఖేదనూర్ జయమల్లునకును కేశవాధీశుడగు పట్టాకును నొప్పజెప్పి స్వయమారావళీ ప్రాంతము నకు బోయెను. అనేక రాజపుత్రరాజులు జీవితాశల ద్యజించి ఘోర ముగ బోరిరి. జయమల్లుడును, పట్టాయు చేసిన యుద్ధమునుజూచి అక్బరుగూడ మిగుల నాశ్చర్యముజెంది వారికి 'మూర్తీభవించిన సంగ్రామదేవత'లని నామమిడెను. వీరు గుండుతగిలి హతులైరి. వీరి యద్వితీయ పౌరుషమునకై తనకు వారియెడ గలిగిన గౌరవమును సూచించుటకై అక్బరు వారిప్రతిమలను జేయించి తన రాజభవన మందుంచెను, ఇందు జయమల్లునితో గలసి యనేక స్త్రీలు యుద్ధ రంగమున బోరాడుచుండిరని అక్బరు వ్రాసియున్నాడు.

'సూరజ్ దరవాజా' (సూర్యద్వారము) అను ద్వారమువద్ద సాహిదాస్ బోండాయను నాయకుడు ఘోరముగా బోరాడి వీర శయనముచేరెను. తరువాత సైన్యాధిపత్యము, పైబేర్కొనబడిన పట్టాయనువానికి వచ్చెను. ఆతడు పదునాఱు సంవత్సరములవాడు; అతనితండ్రి యప్పుడే మృత్యుడయ్యెను. ఈ కారణములచే నాతడు గత ధైర్యుడగు నేమోయని, శూరపత్నియు. శూరమాతయునగు నాతనితల్లి కుమారుని యొద్దకువచ్చి, 'నాయనా ! చింతపడకుము.

చితోడ్ సంరక్షణార్థమై మనవంశము నిర్వంశమైనను చింతలేదు ధైర్యముతో యుద్ధముచేయుము' అని ధైర్యము చెప్పి, యంతటితో నాగక తనకోడలును, దానును ఖడ్గపాణులై యుద్ధము చేయసాగిరి.

ఇట్లు రాజపుత్రులెంత పట్టుదలతోబోరినను వారిని జయలక్ష్మి వరింపదయ్యె. రాజపుత్రులు మూడవతడవ చితోడ్‌గడముపై జోహార్ చేసి కోట తలుపులు తెఱచి శత్రువులపైబడి హతులైరి. కోట యక్బరు స్వాధీనమయ్యెను. కాని యీతడవ యిందు ననేక జనులుండిరి. చితోడ్‌లో ప్రవేశించి యక్బరు అందలి జనులను పశువుల వలె నటికించెను. అతని రాజ్యకాంక్షయను ఆకలికి ముప్పదివేల జనులు బలియైరి. ఇంతియకాదు. రాజవంశజులయిన తొమ్మిదిమంది రాణులు, అయిదుగురు రాచకన్నియలు, ఇద్దరు శిశువులు, సరదారుల భార్యలు రాణాయొక్క యితరా ప్తబంధువులు అక్బరుచే జంపబడిరి ! హిందూదేవాలయముల, మందిరములు బడగొట్టబడియె; ఆయా స్థలములందు మసీదులు కట్టబడియె. అచ్చటి దేవీయొక్క నగారాలు నగలు, తలుపులు ఆగ్రాకు బంపబడియె. సజ్జనుడని విఖ్యాతిగల యక్బరు చక్రవర్తి యిట్టి రాక్షసకృత్యముచేయుట యెంతయు వింతగనున్నది. ఇది యితని చరిత్రలోని యొక గొప్పకళంకము. విక్రమశకము 1624 వ సంవత్సర చైత్రశుద్ధ ఏకాదశి యాదివారము నకు సరియైన క్రీ. శ. 1568 మే నెలలో బైనివర్ణింపబడిన యమానుషహింస చితోడ్ గడముపై జరిగెను.

కోటలో నుండి పారిపోయిన యుదయసింహుడు అరణ్యములో గొంతకాలముండి, ఆరావలీపర్వతములలో దనవాసస్థాన మేర్పరుచుకొనెను. ఆ పర్వత ప్రాంతమున నాతడుదయసాగర మను భవ్యతటాకమును నిర్మించెను. అచ్చటనే యాతడు ఉదయపుర మను గ్రామమును గట్టించెను. అది క్రమ క్రమముగ నభివృద్ధియై ప్రస్తుతము మేవాడ్ దేశపు రాజధానియగు ఉదేపూర్ పట్టణముగా బరిణ మించెను. ఈ యుదయసింహుడు పరాభవ దుఃఖముతో క్రీ. శ. 1572 లో మృతుడయ్యెను.

ప్రతాపసింహుడు

(1572 - 1597)

ఉదయసింహుని కుమారుడు ప్రతాపసింహుడు. ఇతడు సిసోదియ వంశమునకు లలామ భూతుడయిన మహాపురుషుడు. మేవాడ్ రాజ్య మత్యంత దీనావస్థలో నున్న కాలమున బుట్టి, విపత్తులపై విపత్తులు వచ్చినను అధైర్యపడక అక్బరువంటి మహాబలాఢ్యుడును, సంపన్నుడును, సార్వభౌముడును అగుశత్రుఁ డెన్ని యాశలు చూపి ననువానిని గడ్డిపొరకలవలెఁ దృణీకరించి, యిరువదియైదు సంవత్సర ములవఱకుశత్రువులతో నేకాధ్వరముగఁ బోరి శత్రుజనులచేతఁ గూడ 'ధన్యుఁ' డని పేరొందినవాడు!

క్రీ. శ. 1572 లో నీతఁడు రాజ్యారూఢుఁ డయినపు డెటు చూచినను కష్టములే కానవచ్చు చుండెను. ఏలుటకు రాజ్యము లేదు. యుద్ధము చేయుటకు సైన్యములేదు. సైన్యము సంపాదించు టకు బొక్కసములో ధనములేదు. ఇఁక శత్రువులను జూచిన నాత డసంఖ్యాక ధనమును, అపరిమిత సైన్యములును గల ఢిల్లీ సార్వ భౌముఁడు. ఇతరరాజపుత్రులు సాయమునకు వచ్చెదరని యాస పడకుండ రాజనీతి నిపుణుఁడైన యక్బరు వారిలో భేదము కల్పించి యనేకులను జీలఁదీసెను. ఇదివరకు మేవాడ్‌రాజులకు ముఖ్య సహాయకులుగా నుండిన మార్‌వాడ్ (జోధ్ పూర్), అంబేర్, బికానీర్, బుందీ మొదలయిన సంస్థానాధీశ్వరు లందరును అక్బరు పక్షమును అవలంబించిరి. ఇంతియకాదు. ప్రతాపుని తమ్ముఁడు సాగరజీ యనువాడుకూడ మోగలులలోఁ జేరెను! ఇట్లెటుచూచి నను ప్రతాపునకుఁ బ్రతికూలదైవము తప్ప మఱేమియుఁ గానరా దయ్యె. అయినను ఆపురుషుఁడు ధైర్యమును విడిచినవాడుఁకాడు. గ్రంథాదులలో వ్రాయబడియున్న తన పూర్వులయొక్క శౌర్య ప్రధానము లయిన యితిహాసములను చదువుట వలన, భాట్ అన బడు భట్రాజులచే జెప్పబడు తన పూర్వుల యశోగానమును వినుట వలనను, అతని మనస్సులోని మ్లేచ్ఛవిషయక ద్వేషమును

స్వదేశవిషయక భక్తియు, స్వవంశ విషయకాభిమానమును దిన దినము నధికాధికముగఁ బ్రజ్వలింప దొడంగెను.

ఆతఁ డరణ్యములో వాసము చేయుచున్నందున ననేకకష్టముల ననుభవించెను. ఒక్కొక్కపు డరణ్యములో బైననేమియు నాచ్ఛాదనము లేక బయల బిడ్డలతోను భార్యతోను నిదురించుచుండె ; ఒకప్పుడు భక్ష్యపదార్థము లేమియు దొరకనందున వన్యములయిన కొఱ్ఱలు రాగులు మొదలయిన క్షుద్రధాన్యములతోఁ జేయబడిన రొట్టెలు తినుచుండెను ; ఇంకొక్కప్పుడు భోజనమునకుఁ గూర్చుండిన తోడనే శత్రువులు వచ్చిరని తెలిసి దానిని అటులనే విడిచి యుద్ధమునకు బోవును ; మఱొకప్పుడు తన భార్యాపుత్రులు శత్రువుల చేత బడకుండ వారిని పర్వత గుహలలోను, గనులలోను దాచవలసిన వాడాయెను. ఇట్లొక్కటియా ? లెక్కింపరాని సంకటములనుభవించెను. ! ఈ తడిట్టి కష్టములలో వున్నాడని తెలిసి యక్బరు 'నీవునాకు శరణు జొచ్చి నీరాజ్యమంతయు నీకిచ్చి వేసెదను' అను వర్తమాన మంపెను. కాని యీ శూరాగ్రేసరుఁడు 'బాప్పారావల్ వంశమున బుట్టి శత్రువునకు లోబడి నావంశమునకు నపఖ్యాతి తెచ్చెడి కార్యము నావలన గాలత్రయమందును గాజాలదని' దానికి బ్రత్యుత్తర మంపెను ! శూరుని ధైర్య స్థైర్యాధికముల పరీక్ష సంకట సమయమునఁగదా తెలియును ? ఎన్ని కష్టముల నైనను, ఎన్ని విపత్తులనైనను ధైర్యముతో నెదిరించి భీతిజెందక, పర్వతము వలె స్థిరముగను, సముద్రునివలే గంభీరముగను వెలుంగుచున్న ప్రతాపుని కీర్తిని ఆరావలి పర్వతములోని ప్రతిగుహయు ప్రతినదియు, ప్రతిస్థలమును గీర్తించి ప్రతి ధ్వని చేయసాగెను. అందుచే గొందరు రాజపుత్రులు తాము ప్రతాపునికి సాయము చేయకుండుట తప్పుగా నెంచి, యాతనితో గలిసి శత్రువులతో బోరుటకు సంసిద్ధులైరి. అట్లు వచ్చిన వారిలో బ్రతాపుని సవతి తమ్మునికుమారులును, సాళుంబ్రాధీశుడగు టోండా వంశీయరాజును, దెల్వాడాధీశుడగు చిన్న సంస్థానికుడును ముఖ్యులు. ఇంకను చిన్న చిన్నరాజు

లనేకు లుండిరి. ఇట్టి రాజులలో దూరదర్శులును, అనుభవము గల వారును అగు కొందరిని నొక మంత్రి మండలముగా జేర్చుకొని ప్రతాపుడు మేవాడ్ రాజ్యమును సాధించుటకు సమగట్టెను,

ప్రస్తుతము తనయొద్ద సైన్యము విశేషముగ లేనందున మోగలుల సైన్యముతో నెదుటబడి పోరాడుట లాభప్రదము కాదనితలచి శత్రువుల రాజ్యమునకు నుపద్రవము కలుగజేయజొచ్చెను. తానున్న కుమళ్ నేర్ అనుస్థలమునను, గోగుండా అనుస్థలమునను. గట్టి దుర్గములను గట్టించి వానిపై దుర్గాధీశుల నేర్పరిచెను. శత్రుదేశమునందలి ప్రజలందరును గ్రామములు విడిచి పర్వతప్రాంతముల లోనికిఁ బాటిపోవునట్లు చేసెను. ఇట్లు చేసినందున ఆ ప్రదేశమంతయు నిర్మానుష్యమై, వ్యవసాయములన్నియు నడుగంటెను. పంటలుపండ వలసిన పొలములలో నిలివెడు గడ్డి పెరిగెను ! జనులతోడను, రథ వాహనములతోడను త్రొక్కుడు వడుచుండవలసిన త్రోవలన్నియు దుమ్మచెట్లతోడ నిండిపోయెను. రాజమందిరములలోను ధనిక గృహములలోను హింసకమృగములు వాసము చేయదొడగెను ! ఇట్లా ప్రదేశమంతయు జిట్టడవియైనందున మోగలులకు నచ్చటినుండి వచ్చెడి పన్నులు మొదలయినవి నష్టమగుటయేగాక యా త్రోవను పోయెడి మోగలుల సైనికులను బాధపెట్టుటకును, వస్తు సామాగ్రి యితర సరకులు మొదలయినవాని గొల్లగొట్టుటకును మిక్కిలి వీలయ్యెను. సూరత్ పట్టణమునుండి డిల్లీకి బోయెడిబాట మేవాడ్ యొక్క యీప్రాంతములోనుండియే పోవుచుండును. ఆ దినములలో దిల్లీశ్వరునికి గావలసిన మిక్కిలి వెలగల సీమసరకులన్నియు సూరత్ నుండి యీమార్గమునసే డిల్లీకి గొంపోబడుచుండెడి. అందుచే నాసరకులలో నొక్కటియైనను డిల్లీశ్వరునకు జిక్కకుండ ప్రతాపుడు త్రోవలో గొల్లగొట్టును; ఈప్రకారము ప్రతాపుడు తన ప్రబలశత్రుని బాధపెట్టు దొడగెను.

ఆకాలమందు ననేక రాజపుత్రులు మ్లేచ్ఛులతో స్నేహము చేసి హిందువులకు విరోధులగుటయేకాక తమ యాడుబిడ్డలను అక్బరునకు నతని బంధువులకు నిచ్చి యాతనివలన పదవులును, బహు

మానములును, జాగీరులను బడయుచుండిరి. కొందరు ఢిల్లీశ్వరుని యనుగ్రహము బడయుటకై స్వమతమును విడిచి మహమ్మదీయులైరి. ఈ సంగతులన్నియు జూచి యట్లు తమ స్త్రీల ప్రాతివ్రత్యమును తమ కులపావిత్రమును అమ్మి రాజ్యమును అనుభవింపదలచిన స్వదేశ స్వజాతి స్వమత స్వస్త్రీ గౌరవాభిమానశూన్యులయెడ మిక్కిలి తిరస్కార భావముకలవాడయి ప్రతాపుడు 'తురుష్కులకు బిల్లనిచ్చిన వారితో నితర రాజపుత్రులు సంబంధ బాంధవ్యములు చేసికొన గూడ'దని నిబంధన యేర్పరిచెను. అందులకు రాజపుత్రులందరును సమ్మతించిరి. అందువలన జయపూర్ జోధ్‌పూర్ రాజులు నూటు సంవత్సరములవరకు బహిష్కృతులయియుండి, తుదకు నుదయపుర రాజులను 'మమ్ము పవిత్రులను జేయుడు. మాకు మరల నుపనయనము చేసి జాతిలో గలుపుకొండు' అని ప్రార్థించి వెలిబాపుకొనిరి.

ఇట్లు మతనిబంధన యేర్పఱచినందున ప్రతాపునికి ననేక రాజపుత్రులే శత్రువులయిరి. శత్రువులయినవారిలో జయపురాధీశుడగు మానసింహుడు ముఖ్యుడు. ఈతని జనకస్థానపు చెల్లెలిని హుమాయూన్‌కు నిచ్చినందున నీతడక్బరునకు మేనమామయు, ఈతని పాలకస్థలమందలి చెల్లెలిని అక్బరున కిచ్చినందున ఈతడక్బరునకు బావమఱదియునగును. ఈ మానసింహుడు మిక్కిలి పరాక్రమవంతుడు. అక్బరునకు గలిగినవైభవములో మిక్కిలి భాగమీతనివలననే కలిగినదని అక్బరు చరిత్రలో జదువరులు చూచియుందురు. ఈ మానసింగు ఒక్కసారి దక్షిణములోని సోలాపూర్ ప్రాంతమును అక్బరునిమిత్తమై జయించి మరల ఢిల్లీకి బోవుచు కుమళ్‌నేరుకు నాతి దూరమున విడిసెను. కుమళ్‌నేరులో ప్రతాపసింహుడున్నాడని విని మానసింహుడాతనిని చూచుటకై వెళ్ళెను. ప్రతాపుడాతనికి జేయవలసిన మర్యాదలన్నియు జేసెను. కాని మానసింహుడు తురుష్కునికి బిల్లనిచ్చినవాడగుటచే నాతని పంక్తిని ప్రతాపుడు భోజనమునకు రాలేదు. అందుపై మానసింగునకు గోపమువచ్చి యాతడు భోజనము చేయకయే లేచి 'యిటు నన్ను అగౌరవపఱచినందులకు నీకు దగిన ప్రాయశ్చిత్తమగును' అని గుట్టిమెక్కెను. అందులకు ప్రతాపుడు

నవ్వి "నీవు యుద్ధమునకు వచ్చునపుడు నీ మేనల్లునిగూడ దీసుకొని రమ్ము' అని యెత్తిపొడిచెను. అందుపై 'నీ మానమును (గర్వమును) దింపి మానసింహుఁడను పేరు సార్థకపఱిచెదను' అని మానసింహుడు వెడలిపోయెను. ఈ సమాచార మాతడు అక్బరునకు దెలిపెను. అందుపై నాతఁ డాగ్రహపడి గొప్పసైన్యము నిచ్చి తన కుమారు డయినసలీమును, మానసింహుని, ప్రతాపుని మీఁదికి బంపెను. వీరికిని ప్రతాపునికిని కొన్ని సంవత్సరములవఱకు యుద్ధము జరుగుచుండెను. ఈ మహాయుద్ధములో ననేకాంతర్యుద్ధములు జరిగెను. వీనిలోని ప్రతి యుద్ధములోను ప్రతాపునికే జయముకలిగినదికాదు. పెక్కుసారులు మోగలులోడిరి. పెక్కుసారులు ప్రతాపుడోడెను. కాని యీ యుద్ధ ములో ప్రతాపుఁడు గనబరచినట్టి వర్ణనీయములగు శౌర్యము, ధైర్యము వీర్యము, సహనశీలత, యుద్ధకుశలత, ప్రసంగావధానము మొద లయిన సద్గుణములచే నాతని ఖ్యాతి యజరామరమైనది. అతని కష్టములను ప్రతాపములను వర్ణించెడి భట్రాజకృతములయిన యశో గీతములను ఇప్పటికి రాజపుత్రస్థానములో నింటింట జదివి జను లశ్రువులు రాల్చుచుందురు.

పైని పేర్కొనబడిన యుద్ధములో మొదట ప్రతాపసింహునికి గొంత జయము కలిగెను. అతడు యువరాజగు సలీమును అతని సైన్యములను ముప్పతిప్పలుపెట్టి మూడుచేరల నీళ్లు త్రాగించెను. కాని యాతని సుదినములంతటితో వచ్చినవికావు. ప్రతాపునియొద్ద నిరువదివేల సైన్యమున్నను క్రీ. శ. 1576 వ సంవత్సర శ్రావణశుద్ధ సప్తమినాడు హల్‌దీఘాట్ అనుచోట జరిగిన యుద్ధములో నీతని యసంఖ్యసైనికులును, సేనానాయకులును పడిరి. ఇరువది రెండు వేలలోఁ బండ్రెండువేల సైనికులు హతులయిరి. అందుచే నదివఱకు ప్రతాపుని రాజధానిగానున్న కుమళ్‌నేర్ కోటయు శత్రువు లాక్ర మించుకొనిరి. ఈ యుద్ధములో భాణుడను నొక భట్రాజు మృతు డయ్యెను. ఈతని వీరరస ప్రధానమైన కవిత యప్పటి రాజపుత్రులే గాక వారి శత్రువులుగూడ నాహ్లాదముతో వినుచుండిరట. ఇప్పటి

కీతడు తన కవితా మహిమచే రాజపుత్రస్థానమందు బ్రతికియే యున్నాడు !

ఇట్లు కొన్నియేండ్లవఱకు యుద్ధము జరుగుచుండెను. ఉభయ సైన్యములును ఎనిమిది నెలలు పోరాడి వర్షాకాలము మాత్రము విశ్రమించుచుండెను. కాని యాయేటి కాయేటికిని ప్రతాపుని కష్టము లును, సైన్యబలలోపమును, దారిద్ర్యమును హెచ్చెను; తినుటకు గంచమును, నిద్రించుటకు మంచమునులేని యవస్థవచ్చెను. తన కుటుంబములో స్త్రీలును, శిశువులును శత్రువులచేతిలో జిక్కకుండ నిచ్చటినుండి యచ్చటికిని, అచ్చటనుండి యిచ్చటికిని అరణ్యములో బరుగెత్తవలసివచ్చెను. ఇన్ని కష్టములకు నోర్చియు నాతడు శత్రువు నకు శరణనక వానితో బోరాడుచునేయుండెను. ఇట్టి ధైర్యమును సాహసమును చూచి ప్రతాపుని శత్రుడైన యక్బరును అతని మంత్రు లును ప్రతాపుని ధన్యుడని మెచ్చుకొనసాగిరి ! అక్బరుని ముఖ్య మంత్రియగు ఖానఖానన్ అనువాడు సద్గుణగ్రాహి, గొప్పకవి. ఈతడు ప్రతాపుని శౌర్యసద్గుణములకు మెచ్చి కొన్ని పద్యములును రచించి ప్రతాపునికంపెను. వానిభాషాంతర మిచ్చట నిచ్చుచున్నాను: "మానవుని సంపత్తియు, అధికారమును, నశ్వరములు; ఇది సృష్టి క్రమము. కాని మానవునిసద్గుణములయొక్కయు సత్కీర్తియొక్కయు బ్రశంశ లోకములో జిరకాలముండును. కావున పుత్తో ! నీవు ధన్యు డవు. ఏలయన నీవు సంకటావస్థలోనుండియు బాదుషాహకు శరణు రాక నీకీర్తియు గౌరవమును రక్షించుకొనుటకు యోగ్యమైన ప్రయ త్నముల జేయుచున్నావు. ఈ గుణములు హిందూరాజులయెడ ననా ధారణములు. కావున నీవు నీ స్వజాతియొక్క యభిమానమును వర్ణ నీయముగ రక్షించుచున్నావు. నీవు రాజ్యవైభవమును, సుఖప్రాప్తిని గడ్డిపరకలవలె జూచి నీవందనీయమగు వంశముయొక్క కీర్తి నా చంద్రార్కస్థాయిగ జేయుచున్నావు !" ఇట్లు శత్రువుచే బొగడ్తగన్న శూరుని వేయినోళ్ళ గొనియాడినను అది యతిశయోక్తియగునా ?

ఇట్లు లోకముచే బొగడ్తగన్నను దైవముమాత్ర మాతని కింకను ప్రతికూలముగానే యుండెను. ఏపనిచేసినను కలిసిరాద

య్యెను: అందుచే ప్రతాపుడు విసివి, సైన్యాధికముల జేర్చుకొనుటకు గాని మఱి యేమి చేయుటకుగాని తోచక, యుద్ధమునకు గొంత వ్యవధి యీయవలసినదని అక్బరునకు వర్తమానమంపెను. తన్ను నేటివఱకు నెంతమాత్రమును లక్ష్యముచేయని ప్రతాపునివద్ద నుండి యింతమాత్రము వర్తమానమురాగానే యక్బరెంతయో నుప్పొంగి ప్రతాపుడు నాకు శరణురానే వచ్చెనని భ్రమపడి తన యుద్యోగస్థుల నందఱిని పిలిపించి ప్రతాపుడు నాకు లొంగెనని యానందవార్త చెప్పెను. అందు బృథ్వీరాజను నొక రాజపుత్రుడుండెను. ఈతఁడు బికానీర్ రాజుయొక్క తమ్ముడును, సేనాధిపతియు. ఈతఁడక్బరు స్నేహితుడును, అతనియొద్ద నొకసరదారుడునుఅయినను, మనసులోఁ ప్రతాపునియెడ మిక్కిలి పూజ్యభావము కలవాఁడుకావున, నావార్త యసత్యమని తలఁచి 'ప్రతాపుడు మీకు శరణు వచ్చెడిమాట యసత్యము. ప్రతాపసింగుయొక్క శత్రువుడెవడో యీవార్త మీకు దెల్పి యుండును. ప్రతాపునకు డిల్లీపట్టము కట్టినను ఇట్టిపనికి నొప్పుకొనడని నా నమ్మకము. కావున నెను నా విశ్వాస పాత్రుడయిన సేవకుని బంపి నిజమైన వర్తమానము గనుగొనియెద'నని చెప్పి, ప్రతాపునకు నీక్రింది కవితాబద్ధమైన యుత్తరము వ్రాసెను. ఈ యుత్తరములోని యంశములు పరాక్రమశీలునకు మిక్కిలి ప్రోత్సాహకరములు. ఈ కవితాబద్ధమైన యుత్తర మిప్పటికిని రాజస్థానములోని జనులు మిక్కిలి ప్రేమతోఁ బాడుచుండెదరు. మాతృకనున్న యుత్తరమత్యంతశౌర్య ప్రోత్సాహకరము. అంతరస మీక్రింది భాషాంతరమునందు లేనియెడల నది మాదోషమనియే యెంచవలసినది ;

"రాణా ప్రతాపసింగజీ ! హిందువులగు మేమందఱమును మీవంటి పరాక్రమశాలులగు హిందూరాజపదధారులనే నమ్మియున్నాము. ఇతర రాజులవలన మా యాశలు నిరాశలు చేయబడినను, ప్రతాపసింగు రాణావలన నట్టి పనిజరిగి యాతడు అక్బరునకు శరణువచ్చుట యత్యంత దుఃఖాస్పదము. మేమైతే దైవోపహతులమై మా పరాక్రమమును, మాస్త్రీల పావిత్ర్యమును గోలుపోయితిమి. మాయభిమానమును మాస్త్రీల పావిత్ర్యమును మేమక్బరున కమ్మి

తిమి; వానిని వాఁడు కొనెను. కాని యుదేసింగుపుత్రులయిన మీరు మాత్రము రాజపుత్రులలజ్జయు, స్త్రీల పావిత్ర్యమును మీవంశములో నిదివఱకు రక్షించినారు. వానిని నట్లే యికముందుగూడ రక్షింపుడు. రాజా ! ఏమి చెప్పుదు ? నౌరోజాఉర్స్, అను తిరునాళ్ళలోనే రాజపుత్ర స్త్రీయొక్క మర్యాద దక్కినది ? ఎవరి మర్యాదయు దక్క లేదు. కాపున సుప్రసిద్ధులును, మానధనులును అగుసిసోదియాకులము యొక్క మర్యాదను ఈ 'నౌరోజా' ఉర్సులో నమ్మాటకుఁ దేవలదని నాప్రార్థన. అంతయు బోగొట్టుకొని దరిద్రుడనైతినని యనుకొను చున్నారేమో. కాని యట్లనుకొనవలదు. మీరు పోగొట్టుకొన్నార "మన్నదంతయు యశోభివృద్ధిచే మీకున్నట్లే యెంచుఁడి. నిరాశచే క్షత్రియకులోద్భవు లనేకు లవమానజన్య దుఃఖముల ననుభవించిరి. కాని యట్టియవమానమును అపకీర్తియు హమ్మీరవంశజులయిన మీపాలిట నిదివఱకుఁ బడలేదు. లోకమంతయు నాశతో మీవైపు చూచుచున్నది. హిందువుల పౌరుషము వెలువడుటయు, హిందువుల మర్యాదను గాపాడుటయు మీవలననే జరుగునని లోకులు నమ్మి యున్నారు. మీ కులమునకును, రాజవంశమునకును నేఁటివఱకుఁ గలుగని యపకీర్తి యెన్నటికిని గలుగఁగూడదని మాకోరిక. ఆత్మ గౌరవపూరితమగు మీ యంతరాత్మయు, జయశాలియగు మీ ఖడ్గ మును మీకు ముఖ్య సహాయకర్తలు. వాని సాయముఁగొని మీరు క్షత్రియుల పౌరుషమును రక్షింపవలయును.....బాదుషాహకు శరణనినందున లాభమేమియులేదు. మీపౌరుషమునకును, యశస్సం పాదనకును ఈశ్వరుడు తోడ్పడునుగాక."

పైయుత్తరముఁ జూచి ప్రతాపునకుఁ బదివేల సైన్యముల బలము వచ్చి యాతఁడు మరలఁ బోరాడ సాగెను. కాని యాతనికి నిందును జయము కలిగినదికాదు. అందులకు నాతఁడత్యంత విషా దమగ్నుఁడై దేశత్యాగము చేసి సింధునది యొడ్డునకు బోవలయు నని తలఁచి యారావలి పర్వతముదాఁటి తన భార్యాపుత్రులతోను పరిమిత సేవకులతోను నొక యరణ్యములో విడిసెను. కాని యచ్చట నాతనికి 'నాపూర్వుల రక్తధారలచే రక్షింపఁబడిన రాజ్యమును

నాజన్మ భూమిని వదలి వెడలుట న్యాయము కాదు' అనితోఁచి యాతఁడు ప్రయాణము మానుకొనెను. ఇదియే యాతని యభ్యుదయమునకు బ్రారంభ కాలము. ఇంతలో నాతని పూర్వ మంత్రియగు భామాసాయను వానికిఁ దన యజమానుని దురవస్థ తెలిసి యా స్వామి భక్తపరాయణుడు తనయొద్దనున్న ధనమంతయుఁ బ్రతాపునకర్పించెను. ప్రతాపుఁడు ఆ ధనము తీసుకొని 25000 సైనికుల జేర్చుకొని శత్రువులతో మరల యుద్ధముచేయ నారంభించెను. ఆత డిన్ని సంవత్సరములు కష్టపడినందుకు నిప్పుడాతనిని జయలక్ష్మి వరింప దొడగెను. ఈతడవ ప్రతాపుఁడు దయయను మాట మరచి చేజిక్కిన శత్రువుల నరకఁ జొచ్చెను. మొదట నక్బరుయొక్క సరదారుఁడగు శహబాజ్ అనువానితోఁ బోరాడి వానిని వాని సైన్యమును రూపు మాపెను. ఈ పోరాటములోనుండి తప్పించుకొనిపోయిన వారినిగూడ వెంటబడి నటీకివేసెను. ఇట్లు ప్రథమ జయము సంపాదించి ప్రతాపుఁడు కుమళనేర్ కోటను స్వాధీనపఱుచుకొనెను. అచ్చటి కిల్లేదారుడగు అబ్దుల్లా యనువానిని సైన్యములతో జెండాడెను. ఇట్లొక కోట తరువాత మరియొక కోటను గొనుచు ముప్పదిరెండు దుర్గముల స్వాధీనపఱుచుకొనెను! కొద్దికాలములోనే చితోడ్, అజమీర్, మండల్‌గడ్ ఈ మూఁడు దుర్గములు తప్ప మేవాడ్ రాజ్యమంతయుఁ బ్రతాపుఁడు స్వపరాక్రమముచే సంపాదించెను. తనశత్రుడగు మానసింహుని రాజధానియైన జయపురమునకు సేనలంపి యందలి కొంత భాగమును దోపించెను. తురుష్కుల చేతిలో నున్న యుదేపురమును గూడ సాధించెను. ఇట్లు జయశ్రీలచే రాజిల్లుచున్న ప్రతాపుఁడు అక్బరు మంత్రియగు ఖానఖానునిచే మరల గొనియాడఁబడియె. కాని చితోడ్ గడమును స్వాధీనపఱుచుకొనిన గాని తన పౌరుషము కాదని ప్రతాపుఁడు తలఁచుచుండెను. కాని యాతనికి మరణసమయము సమీపించినందునఁ దనకోరిక తీర్చుకొనకయే యాతఁడు కీర్తిశేషుఁడయ్యెను. మరణసమయమునఁ జితోడ్‌గడము గెలువలేదనిన చింతచే నాతనికి మిక్కిలి యావేదన కలుగఁగా జుట్టునున్నవారు తామా కోటను జయింతుమని ధైర్యము చెప్పినమీఁదట

నాతని ప్రాణము పోయినదట. ఇట్లు మేవాడ్ రాజ్యములోని ప్రచండ భాస్కరుఁడగు ప్రతాపుఁడు క్రీ. శ. 1592 లో నస్తమించెను.

ప్రతాపుని చరిత్రమంతయు జూడగా లోకములో నేటివరకు బుట్టిన శూరాగ్రేసరులలో నీతఁడొక్కడని చెప్పుటకు సందేహ ముండదు. దక్షిణ హిందూదేశ చరిత్రలో నీతనితో బోల్ప దగిన వారు కృష్ణరాయఁడు, శివాజి. ఈతనిని గుఱించి స్వదేశాభిమాన పూరితములగు గీతములను రాజపుత్రస్థానములో నిప్పటికిని జను లాబాల గోపాలము చదివి యశ్రువులు రాల్చుచుందురు.

అభయసింగ్

(1592 - 1621)

ప్రతాపసింహునకుఁ బదునేడుగురు పుత్రులుండిరి. అందు పెద్ద వాఁడయిన యభయసింహుఁడు రాజ్యమున కధిపతి యయ్యె. ఈతనికి ఉమరావనియు పేరుగలదు. ఈతఁడు చిన్ననాట నుండియు దండ్రితోఁ గొండలలోను గుహలలోను తిరిగి కష్టములన్నియుజూచి యుండెను. కాని తండ్రిపోయిన తోడనే యీతఁడు తండ్రి యుప దేశమును మఱచి యుదేపురములో నొక రాజమందిరము గట్టించి యందు నొక సీమ నిలువు టద్దమును తెప్పించి పెట్టి విలాసముల ననుభవించుచుండెను. కాని యీతఁడిట్లుండుటకు నాతని సరదారులు చింతించి "ప్రతాపసింగు మహారాజుగారు మరణసమయమున మీకు "మొదట దుస్సాధ్య మగు స్వాతంత్ర్యమును, చితోడ్ గడమును సాధించి తరువాతరాజ్యసుఖమునను భవింపవలసినది'యని చేసినబోధ మఱచుట మంచిదికాదు" అని పెక్కుసారులు బోధించి, యీతనిని విలాస భోగములనుండి పరాఙ్ముఖునిఁజేసి శౌర్య పరాక్రమముల జూపుటకు బురికొల్పిరి. కాని యీతఁడు విలాసముల వదలఁడయ్యె. ఇంతలో సాళుంబ్రాధిపతియగు ఠాకుర్ ఒకరోజు రాణా యొక్క మందిరములోనికి వచ్చి నిర్భయముగా నాతని నిలువుటద్దము మీఁద రాయివేసి దానిని పగులగొట్టి, సింహాసనముపై గూర్చున్న రాణా చేయి పట్టుకొని యీతని నీడ్చి క్రిందికిలాగి సరదారుల నందఱిని

చూచి "సరదారులారా ! చూచెదరేల ? గుట్టములపై నెక్కుడి. ప్రతాపసింహుని కుమారునకు లోకములో గలుగుచున్న యపకీర్తి నుండి యాతనిని రక్షింపుడి !" అని బిగ్గర నఱచెను. తన స్వామియు మిత్రుడును నగుప్రతాపసింహునకు మరణ సమయమునఁ దానిచ్చిన యభయవచనమును బూర్తిచేయుటకై తనకేమి నష్టమువచ్చినను సరియేనని సాళుంబ్రాధిపతి యిట్టి సాహసకృత్యము జేసెను. ఇందు వలన నాతనిని రాణా యేమిచేయునోయని యందఱును భయపడిరి. అభయసింహరాణాకుఁ బ్రథమమున గొంచెము కోపము వచ్చెను; కాని యాతాకూరుయొక్క సద్దుద్దేశముతెలియగనే యాతనికి బశ్చాత్తాపముగల్గి మీసములు దువ్వుచు నాతఁడిట్లనియె :–

"ఠాకూర్‌గారు ! మీరు చేసినపనికి నాకు నెంతమాత్రమును కోపములేదు. తమబోధకు నేను బద్ధుడను. మీరు నాకుపకార మొనర్చితిరి. విలాసోదధిలోనుండియు, మోహజాలములోనుండియు, నన్ను విడిపించి సత్కృత్యమునకు బ్రోత్సాహపఱచితిరి. ఇందుకు నేను కృతజ్ఞుఁడను. మనమిక్కడ దాడి వెడలుదము. మీ ప్రతాపసింగు మహారాజుల కోర్కెను గుఱించి మీరింక చింతచేయవలదు."

అంత నా వీరసమాజమక్కడ గుట్టములపైనెక్కి దినేర్‌వఱకుఁ బోయి విడిసెను. ఖానఖానన్ అనుడిల్లీశ్వరుని మంత్రియొక్క తమ్ముఁడయిన అబ్దుల్లా యనువాఁడు డిల్లీశ్వరుని సైన్యములతో నచ్చట నుండెను. అచ్చట నుభయసైన్యములకు బోరు జరిగి యందు దురుష్కులకుఁ బూర్తిగ బరాజయము ప్రాప్తించెను. ఈ యుద్ధము క్రీ. శ. 1608 లో జరిగెను. అప్పుడు జహంగీర్ బాదుషాహ డిల్లీ చక్రవర్తిగ నుండెను. ఈ యుద్ధములో రాజుయొక్క పినతండ్రి యగు కాణాయను శూరుఁ డద్భుతశౌర్యముఁ గనబఱిచినట్లు భట్రాజులు వర్ణించియున్నారు. ఈయుద్ధములో నోడిపోయినందునఁ బాదుషాహ రాణాతో కొన్నిదినములవఱకు నుండునట్టి సంధిచేసికొనెను.

కాని బాదుషాహ యాసంధిని బాటింపక సంధికాలము పూర్తి యగుటకుఁ బూర్వమే మరల నొక బ్రహ్మాండమైన సైన్యమును

మేవాడ్ మీదికి బంపెను. ఈతడవఁగూడ నబ్దుల్లాఖానుడే సైన్యాధిపతిగనుండెను. ఈ సైన్యమునకును, రాజపుత్రులకును క్రీ.శ. 1610వ సంవత్సరపు ఫాల్గుణమాసములో రాణ్‌పుర్ అనుక్షేత్రమునొద్ద ఘోరమైన యుద్ధము జరిగి యందు దురుష్కులే మరల పరాభూతులైరి. ఈ యుద్ధమున వెనుకటి యుద్ధమునఁగంటెఁ బెద్దవి రక్తనదులు ప్రవహించి యసంఖ్యజనులు హతులయిరి. ఇందు రాజపుత్ర సరదారులెందఱో మడిసిరి. వారిలో డేవగఢ్ ఠాకూర్ దుధోసాంగావత్, నారాయణదాస్, సురజ్‌మల్, యశకర్, సిసోదియావంశములోని యనేక సరదారులు, భాణునికుమారుఁడు, సూక్తావతులలో ముఖ్య సరదారుఁడగు పూర్ణమల్, హరిదాస్‌రాథోడ్, సాద్రీ వాఁడగు భోపర్‌జాలో, కహర్‌దాస్ కచ్ఛవాహ్, బేడలాధిపుఁడగు కేశవదాస్ చహ్వాణ్. ముకుందదాస్ రాథోడ్, జయమల్లుని వంశములోని పురుషులు మొదలగువారు ముఖ్యులు. ఈ దిగ్విజయమువలన మేవాడ్ క్షేత్రి హిందూదేశమందంతటను బ్రసరించెను.

ఇట్లొక పరాజయము తరువాత మఱియొక పరాజయము కలిగినందున జహాంగీరు బాదుషాహా యస్వస్థచిత్తుఁడై మేవాడ్ రాజపుత్రుల బలము తగ్గించుటకు నొక యుక్తి పన్నెను. రాజపుత్రులకుఁ జితోడ్ గడమును గుఱించిన యభిమానమువలన వారందఱును మేవాడ్ రాజునకు సాయముచేయుచున్నారు. కావున నొక రాజపుత్రునకు మనమే చితోడ్‌మీఁద రాజ్యాభిషేకము చేసినయెడల రాజపుత్రు లందఱును వానికే సహాయులై అభయసింహుని వదలివేయుదురు, అని నిశ్చయించెను. ప్రతాపసింహుని తమ్ముఁడగు సంగరాజితుఁ (సుగ్రాజి) డనువాఁడు భ్రాతృద్రోహియై యక్బరు పక్షముఁ జేరియుండెను. వానికి వేపమువేసి తురుష్కులు వానిని చితోడ్ సింహాసనముపైఁ గూర్చుండఁ బెట్టిరి, కాని యొక రాజపుత్రుఁడును వానికి సాయముచేయుటకు రాలేదు. అందఱును అభయసింహునకే సాహాయ్యము చేయుచుండిరి. తురుష్కునికి నంకితుఁడగుటచే సంగరాజితుని నందఱును అసూయతోఁ జూడసాగిరి. అందువలనను, ప్రతిదినము నెచ్చటఁజూచినను చితోడ్ గడముమీఁద ధన

పూర్వులు తురుష్కులతోఁబోరాడి స్వశరీరము లర్పించిన చిహ్నము లును, ఎటుచూచినను జయస్తంభములును, సమాధులును, వానిపై వ్రాయఁబడిన యశోవర్ణనలును జూచి, తన పూర్వుల కట్టి విపత్తు దెచ్చిన తురకలతో స్నేహము చేసి చితోడ్‌కు నిజమైన రాజును నెదురించుటకు సిగ్గుపడి, మానసంగరాజితుఁ డొకనాఁ డభయసింహునిఁ బిలిపించి యాతనికిఁ చితోడ్‌గడ మొసంగి వెడలిపోయెను! మానవు లందఱికిని స్వదేశాభిమాన మనునది సహజసద్గుణము. దేశద్రోహ మనునది బలవంతముగాఁ దెచ్చిపెట్టుకొనిన దుర్గుణము.

ఇట్లు అభయసింహునకుఁ దన పూర్వుల రాజధానియగు చితోడ్‌గడము సులభముగఁ బ్రాప్తమయ్యెను. కాని యది మిక్కిలి జీర్ణావస్థలోనున్నందునఁ గోట్లకొలఁది ధనమయినఁగాని యా కోట బాగుచేయుటకు వీలులేకపోయెను. అందుచే నా కోటను త్వరలోఁ బూర్తిగ బాగుచేయుటకు వీలులేదని తలఁచి, కోటను రక్షితముగాఁ దన చేతిలోనుండుటకుఁ గోటచుట్టునున్న ప్రాంతమంతయు జయింపఁ నిశ్చయించెను. అంతట నాతఁడు విజయయాత్రకుఁ వెడలి, చితోడు నకుఁ జుట్టుపట్టుల నున్నట్టియు, నదివఱకుఁ దన స్వాధీనమునందు లేనట్టియు నెనుఁబదిపట్టణములను, నలుబది దుర్గములను గెలిచెను. ఇట్టి దుర్గములలో నొక్కటియగు ఆంతాల్ అను దుర్గమును సాధించు టకు రాణాయొద్దిసూక్తావత్, బోండావత్ సరదారులు సోటీలువేసి కొని యొకరిని మించి యొకరు రౌద్రస్వరూపములను ధరించి శత్రువు లతోఁ బోరాడి యా కోట సాధించిరి. ఈ యుద్ధములో ననేక సూక్తావంతులును, బోండావంతులును కార్యసాధనమునఁ వీరశయ నముఁ బొందిరి. ఈ యుభయవంశజుల యతుల పరాక్రమముల వర్ణ నలు భట్రాజు లెంతయు వీరరస పరిప్లుతముగాఁ జేసియున్నారు. 'వీరి కీర్తియుండువఱకు వీరు బ్రతికియే యుండువా' రని యీ భట్టులు చెప్పినమాట యసత్యమని యెవరు చెప్పఁగలరు?

ఇట్లు రాజపుత్రుల కే యెడతెగక జయము కలుగుచున్నందున వెఱచి బాదుషా తన సైన్యము లన్నిటిని రావించి అజమీరుపట్టణ ములో నందఱిని జేర్చి, తన కుమారుఁడగు పర్వజ్ అనువానికి

సైన్యాధిపత్య మొసఁగి క్రీ. శ. 1611 లో మేవాడ్‌మీఁదికిఁ బంపెను. సముద్రమువలె మితిలేకుండఁ బ్రసరించిన యీ మోగలు సైన్యము లకును రాణా సైన్యములకును ఖామ్‌నోర్‌వద్ద ఘోర సంగ్రామము జరిగి యందు మోగలులే యోడి పాఱిపోవలసినవారైరి. ఈ యుద్ధ ములో రాజపుత్రులు చూపిన శౌర్యమును, అందువలన మేవాడ్‌కుఁ గలిగిన యశోవైభవమును, మోగలులకుఁ గలిగిన యగౌరవమును మహమ్మదీయ చరిత్రకారులుగూడ కొంతవఱకు వర్ణించియున్నారు. ఈ యుద్ధములో నసంఖ్య తురుష్కులును, రాజపుత్రులును బడిరి. రాజకుమారుఁడగు పర్వజ్, నితర సైనికులును బాఱిపోయిరి.

ఈ ప్రకార మీ మేవాడ్ రాజపుత్రులకును, మోగలులకును, పదునేడుపర్యాయములు యుద్ధములుగలిగి యన్నిసారులు రాజపుత్ర వీరులు తమ యద్వితీయ శౌర్యమును గనఁబఱిచి, యసంఖ్యవీరులు మడిసి తురుష్కులను నోడించుచువచ్చిరి.కాన దినదినము వారిబలము తగ్గఁజొచ్చెను. మోగలులు ప్రతియుద్ధములోను అసంఖ్యలుగ మడిసి నను, రక్తబీజులవలె మరలఁగ్రొత్తసైనికులువచ్చి వారికి నెప్పటిబలము స్థిరముగనుండుటయు, రాజపుత్రుల సంఖ్య మొదటనే పరిమితముగా నుండి,యందును ననేకుఁ డు మోగలులపక్షమునఁ యుండుయుఁ, బైని చెప్పిన పదునేడు యుద్ధములలో విఖ్యాత శూరులగు నాయకులును, వీరవరులును మడియుటయుఁ దటస్థించి నందున సమరసింహుని సైన్యముల బలము తగ్గఁజొచ్చెను. ఇట్టిసమయమున జయపూర్, జోధ్‌పూరు రాజులు కులద్రోహులయి మోగలులకు సాయము చేయుటకు మాఱుగా సమరసింగునకు సహాయము చేసియుందురేని రాజపుత్రస్థాన మంతయు నొక్కపెట్టున స్వతంత్రమై యుండును. కాని వారటు చేసినవారు కారు. సతత యుద్ధ పరిశ్రమ చేతను, అసంఖ్య వీరవర నాశముచేతను మేవాడురాజు డస్సియున్నాఁడని తెలిసి కసిదీర్చుకొనఁ దలచిన జహాంగీర్ బాదుషాహ మరలగొప్ప సైన్యములనిచ్చి పరాక్రమ వంతుఁడయిన కురమ్ అను తనకుమా రుని రాణా మీఁదికిఁ బంపెను. రాణాయుఁ దనకుమారుఁడగు కర్ణుని సేనానిగా నేర్పఱిచి మోగలులపైకిఁ బంపెను. కాని యీ

తడవ పైని జెప్పఁబడిన కారణములచే సమరసింహుఁడు తనమర్యాదకు లోపములేని సంధి చేయుటయే మంచిదని తలఁచెను. ఇన్ని సారులు తనసైన్యమును వివిధబాధలుఁ బెట్టిన యుదయపురాధీశుని యధమ్భత శౌర్య పౌరుషములు నెఱిగినవాఁడు గావున దిల్లీశ్వరుఁడు గూడ నెట్టులయిన మేవాడాధీశుఁడు మనకు లోఁబడెనని పేరున కైనను అనిపించు కొనినఁ జాలునని తలఁచెను. కావున మేవాడ్ రాజులు డిల్లీశ్వరుని సార్వభౌమునిగా నొప్పుకొనునట్లును, మేవాడ్ రాజులు డిల్లీకినేగ నక్కఱలేకుండునట్లును, మేనాడ్లో రాజపుత్రునకు డిల్లీశ్వరుఁడు తనకుడివైపున నందఱు సరదారులకంటె నగ్రస్థాన మొసఁగునట్లును, ఒప్పిదములతో క్రీ. శ. 1616లో సంధిచేసికొనిరి. తరువాతఁ గర్ణుడు ఖురమ్(షాహజహాన్)తోఁగలిసి డిల్లీశ్వరునిఁ జూడఁ బోయెను. అచ్చట నీతనికి డిల్లీశ్వరునిచేఁ జేయఁబడిన మర్యాదయు, నీయబడిన బహుమతులను జూడఁగా డిల్లీశ్వరునితో సంధిచేయవలయు నని మేవాడ్ రాజులకుఁ గల కోర్కె కంటె, మేవాడ్ రాజులతో నెట్లయిన సంధిచేయ వలయునని డిల్లీశ్వరునికోరికయే యధికముగా నుండెనని స్పష్టముగా గానవచ్చును. ఈ క్రిందియంశములు డిల్లీశ్వరుడగు జహంగీరు స్వయముగా వ్రాసియుంచిన దినచర్య గ్రంథములో నుండి గ్రహింపఁ బడినవి. కావున నివి మిక్కిలి విశ్వాస పాత్రములనుటకు సందేహము లేదు:

"కర్ణుఁడు నాయొద్దకు వచ్చిన రెండవనాఁడు రత్నఖచితమైన పిడిగల చిన్నకత్తి యొకటి నాతనికి నిచ్చితిని. మూఁడవనాఁడు శ్రేష్ఠమైన యశ్వమును, దానిమీఁదనున్న వెలగల వస్తువులతో నిచ్చితిని. ఆదినమున నేను ఆతనిని మహారాణి నూర్‌జహాన్ కడకుఁ దీసికొనిపోయితి. ఆమెయు నాతనికి వెలగల దుస్తులు, గుఱ్ఱము, ఏనుఁగు, వానిమీఁది వెలగలవస్తువులు, ఖడ్గము, జవాహిరి మొదలయినవి యిచ్చెను. ఆరోజుననే నేను మిక్కిలి తేజోవంతమును, మూల్యవంతమును నగు ముత్యములహారము నొసఁగితిని. నాలుగవ దినమున నొకయేనుఁగు నిచ్చితిని. మఱియు నాతనికి

స్మారక గ్రంథాలయం ప్రవేశ సంఖ్య 2004

దుర్లభములును, అపూర్వములును అగు నేక వస్తువుల నీయవలయు నని తలఁచితిని. ఒక కవచమును, తేడొండ్లు పచ్చలయుంగరములును అతనికి బహుమతి యొసఁగితిని. నెలయొక్క చివరదినమున వెలగల తివాసులును, రాజమందిరము శోభింపఁజేయునట్టి [illegible] చేయఁ బడిన దిండ్లును, అత్తరు మొదలయిన సువాసనద్రవ్యముల కుప్పె లును, కొన్ని సువర్ణపాత్రములును, బలముగల గుజరాత్ దేశపు యెద్దుజతయుఁ బంపితిని.

"నారాజ్యము యొక్క పదియవ సంవత్సరము ప్రారంభ మయ్యెను. రాజపుత్రుడఁగు కర్ణునికిఁ దనజాగీరునకుఁబోవ సెల వొసంగితి. వెడలునపుడాతనికి నొక యేనుఁగు, ఒక గుఱ్ఱము, ఏబది వేలరూపాయలు వెలగల ముత్యాలహారము నొసఁగితి. యువరాజగు కర్ణుఁడు నాయొద్దకు వచ్చినప్పటినుండి తిరిగి వెడలువఱకును నేనాత నికిఁ బదిలక్షలు వెలగలవస్తువులు బహుమతిగా నొసఁగితిని. ఇవిగాక యాతనికి నాకుమారుఁడగు కురంవలన 110 గుఱ్ఱములును, 5 ఏనుఁగు లును ముట్టియుండెను. కర్ణుఁడు వెడలునప్పు డాతనితో నాసరదారుఁ డగు ముబారిక్ ఖానుని నేనుఁగులతోను గుఱ్ఱములతోను నిచ్చి యాత నిని మిక్కిలి గౌరవముతో సాగనంపితిని."

ఇట్లుపరిమితగౌరవమును జూపుటయు వెలగల బహుమతుల నొసంగుటయుఁగాక డిల్లీశ్వరుఁడు యువరాజయిన కర్ణునకు నైదు వేల మన్ సబ్ దారియొసఁగి యిందుకై ఖైరార్, పూలియా, బేదనూర్ మాండల్ గడ్, జీరన్, నీమచ్, బాఇన్సోర్, జెవలా, డొంగర్ పూర్ మొదలయిన ప్రాంతముల నిచ్చెను. ఇంతియకాదు. మేవాడాధీశుఁ డగు రాణాఉమరావ్ సింగ్ (అమరసింహున కిది మాఱుపేరు) ను గుఱించియు, నాతని కుమారుఁడగు కర్ణునిగురించియుఁ దనకు మిక్కిలి యాదరబుద్ధి కలదని చూపుటకు వారి విగ్రహములఁజేయించి జహం గీరు తనయుద్యానవనములోనుంచి యాయంశమును తనదినచర్యలో వ్రాసియుంచెను.

ఇట్లు దేపురరాజు మనసు నొవ్వకుండుటకు డిల్లీశ్వరుఁ డెట్టి యుపాయములను బన్నినను. డిల్లీశ్వరునికి లోఁబడి యాతనిచే జాగీర్

దారుఁడనిపించుకొనవలసివచ్చినే యనినచింత యమగసింహుని వదలి నది కాదు. సర్వకుటుంబనాశనమునకైనను ఒప్పుకొని యెనిమిదివం దల సంవత్సరములనుండి తురుష్కులకు శరణనక నిలిచిన తనవంశపు కీర్తికి నీసంధిచేఁ గలంకము వచ్చెఁగనుక నిఁకమీఁద సిట్టి రాజ్యము తనకు వలదని తనకుమారునకుఁ బట్టముకట్టి తాను వానప్రస్థాశ్రమ మును స్వీకరించి, యుదేపురమునువిడిచి వెడలెను. తరువాత నాతఁ డైదుసంవత్సరములు బ్రతికి క్రీ. శ. 1621 లోఁ బరలోకగతుఁడయ్యె.

ఉమరావ్‌సింగ్ అనునామాంతరముగల యీయమరసింహుఁడు తండ్రియగు ప్రతాపసింహుని వలెనే యద్భుత పరాక్రమశాలి, మేవాడరాజు లందఱి లోను ఈతఁడు దీర్ఘకాయుఁడును అయియుం డెను. ఇతఁడు చిన్న నాఁటి నుండియుఁ బడిన కష్టముల వలనను పెద్దయయిన తరువాతఁ జేసిన సంతతయుద్ధము వలనను నల్లపడి యుండెను. ఈతఁడు సరదారులకును, ప్రజలకును అత్యంతప్రి యుఁడు. ఇందుల కితని దయాళుత్వమును న్యాయ ప్రియతయు ముఖ్య కారణము. ఈతఁడు తనరాజ్యములోఁ బన్ను వసూలుచేయు టను గుఱించియు, న్యాయ విచారణ చేయుటను గుఱించియుఁ బెక్కు చట్టములుచేసి వానిని శాసనస్తంభములపైఁ జెక్కించెను. ఆశాసనము లిప్పటికినిగానవచ్చుచున్నవి. అందువలన నీతని న్యాయ ప్రియత్వము బాగుగఁ దెలియును. ఈతఁడు తన సరదారులకుఁ దగి నట్లు జాగీరులొసఁగి, వారు తన సభకువచ్చునపుడు ధరింపవలసిన దుస్తులపద్ధతియు వారు సభలోఁ గూర్చుండవలసిన క్రమమును నిర్ణ యించెను. ఈతనిచే నేర్పఱుపఁబడిన శిరోవేష్టనమును ఇప్పటికిని 'ఉమరావ్ శాహిపగ్‌డీ' అని యాప్రాంతమున ననియెదరు.

కరణ
(1621 – 1627).

తండ్రి మరణాంతర మీతఁ డేడు సంవత్సరములు మాత్రము రాజ్యము చేసెను. ఈతఁడు ధైర్యసాహసములందుఁ దన పూర్వుల కంటెఁ దక్కువవాఁడు కాఁడు. ఇదివఱకు జరిగిన యుద్ధములచే

నితని బొక్కసములో నొకగవ్వయైనను లేదయ్యె. అందుచే నీరాజక స్మాత్తుగా సూరత్ పట్టణము మీఁదికి దండుపోయి, దానిని దోఁచు కొని యపారమైన సంపత్తినిఁ దెచ్చి తన బొక్కసము నింపెను. దిల్లీశ్వరునితోను, అతని కుమారుఁడను యువరాజునుఅయిన కుర తోడను ఈరాణాకు మిగుల స్నేహమైనందున సీతారాజ్యమునకు శాంతియు సౌఖ్యమును గలిగెను. ఇదివఱకుఁ జేసిన యుద్ధములలోఁ జెడిపోయిన కోటలనన్నిటిని ఈరాణా బాగుచేయించెను. తనరాజధాని చుట్టునొకకందకముఁ ద్రవ్వించెను. కొన్ని తటాకములును, రాజభవనములును కట్టించెను.

కర్ణుఁడు రాణాయైన తరువాత నాతని తమ్ముఁడగు భీమసింగు జహాంగీరునొద్ద మన్నబు దారుగా నుండెను. ఈతనికి యువరాజగు కురం అనువానికి మిక్కిలి స్నేహము: జహాంగీరుని కుమారుఁడయిన యీకురం రాజపుత్ర క్షేత్రమందుఁ బుట్టినవాఁడు. జహాంగీరునకు నంబేర్ (జయపూర్) కచ్చవాహ జాతి రాజపుత్ర స్త్రీ భార్యగ నుండెను. ఆమె యీ కురంయొక్క తల్లి. కుర మను శబ్దము కూర్మ శబ్దభవము. ఇట్లితని యందు హిందూరక్త మున్నందున సీతఁడు రాజపుత్రులతో మిక్కిలి స్నేహము చేయుచుండెను. ఇదియుఁగాక తనకంటెఁ బెద్దవాఁడగు పర్వజ్ అను అన్నకుఁ గాకుండఁ దానే రాజ్యమును సంపాదింప వలయునన్న కాంక్ష గలవాఁడగుటచే మేవాడ్ రాజును ఆతని తమ్ముఁడగు భీమసింగును ఆశ్రయించుచుండెను. భీమసింగు శూరుడును స్వాతంత్ర్య ప్రియుఁడును. అందుచే నాతఁడు కురముతో "నీకురాజ్యము వలయునేని లోలోపల రహస్యచర్చలు జరిపినందున లాభములేదు. బహిరంగముగా నీ యన్నతోఁ బోరాడి యాతని గెలువవలయు" నని బోధచేసెను. ఇట్లు క్షత్రియ బీజమునకుఁ దగినట్టి సలహావిని కురము తనయన్న మీఁదను, తండ్రిమీఁదను దిరుగఁబడి యన్నను జంపెను. తండ్రితోఁ బోరాడ సాగెను. ఈ యుద్ధమునందు భీమసింగు తనస్నేహితునకై యసమాన శౌర్యముఁజూపి వీరస్వర్గమునకుఁ బోయెను. అందుచేఁ కురమునకుఁ బరాభవము కలిగెను. అప్పుడాతఁడు మేవాడ్‌కుఁ బాఱి

పోయి కర్ణరాణా యెదుట మోకాళ్ళపై వంగి తనతలగుడ్డతీసి కర్ణుని యెదుట నుంచి "ఇఁకనాకు నాశ్రయమిచ్చి నామానముఁగాపాడు భారము మీది" యని చెప్పెను. కురమనువాడు మేవాడ్ యొక్క పారతంత్ర్యమునకుఁ గారకుఁడైనను తనకు మిత్రుఁడును, శరణాగతుఁడును అగుటచే వానిని రక్షింపకుండుట, స్వకుల వ్రతమునకు హానియని తఁలచి యాక్షత్రియోత్తముఁడాతనికి నభయమిచ్చి, అందుకు గుఱుతుగా నాతనిపాగా తనశిరస్సుపై నుంచుకొని, తన పాగా యాతని నెత్తిపై నుంచెను! ఆహా ! ఇట్టిశరణాగతత్రాణబిరుద మీ లోకములో మిక్కిలి యరుదుగదా. అప్పుడు కర్ణునిచే స్వీకరింపఁబడిన కురముయొక్క పాగా, డాలు ఇప్పటివఱకును ఉదేపూర్ రాజుల సంగ్రహాలయములో నున్నవి! రాజపుత్రుఁడగు కుర ముదయపురములో ననేక సంవత్సరములు సుఖముగా నుండి, యచ్చట నొక మసీదు కట్టించెను. తరువాత నాతఁడు పారసీక దేశమునకు బోయి తండ్రి మరణమునకుఁ గొన్ని దినములు పూర్వము హిందూదేశమునకు వచ్చెను. ఈతఁడు పారసీకమునకుఁ బోక గోలకొండకుఁ బోయెనని కొందఱుబ్రువాసియున్నారు. కర్ణుఁడు క్రీ. శ. 1627 లోఁ గీర్తిశేషుఁడయ్యెను"

జగత్ సింగ్

(1627 - 1654)

ఈతఁడు రాజ్యమునకు వచ్చిన కొన్ని దినములలోనే డిల్లీశ్వరుఁడగు జహంగీరు మృతిచెందెను. అప్పుడాతని కుమారుఁడగు కురము నూరతు పట్టణములో నుండఁగా జగత్ సింగు తనసైనికుల నచ్చటికిఁ బంపి యాతని రావించి, యుదేపురములోని "మేఘప్రాసాద" మునందు నాతనికి దిల్లీ పట్టాభిషేకముచేసి "షాహజహా" నని నామమిడి దిల్లీకిఁబంపెను. ఇందుచేత నాతఁడు జగత్‌సింగు నెడ మిక్కిలి కృతజ్ఞతతో మెలఁగుచుండెను. కావున జగత్ సింగుని రాజ్యకాలముకూడాఁ ప్రజలకు మిక్కిలి సుఖప్రదమయ్యె. ఎచ్చటను యుద్ధములు లేనందున నీరాజు ధనసంగ్రహముచేసి తన

రాజధానిలోని గొప్ప గొప్ప రాజమందిరములును, వినోదప్రాసాదములును, భవ్య దేవాలయములును, శృంగారవనములును, రమ్య కుంజములును, నిర్మించి రాజధానికెంతయు శోభ తెచ్చెను. వీని నన్నిటిని భట్టూజు లద్భుతముగ వర్ణించియున్నారు. అప్పుడు కట్టుబడిన కొన్ని మందిరము లిప్పటివఱకు నున్నవి; అవి శిల్పనైపుణ్యముచే నిప్పటివారికిగూడ నెంతయు నానందము కలుగఁజేయుచున్నవి.

ఈజగత్సింగ్ రాణా తన సద్గుణములచే లోకప్రియుఁడును, సర్వమాన్యుఁడును అయ్యెను. అతనికిఁగల వైభవమును లోకపూజ్యతయు సార్వభౌముఁడగు డిల్లీశ్వరునికిఁగూడ లేకుండెను. అతని సద్వర్తనము, పరోపకారబుద్ధి, రాజ్యవ్యవస్థ మొదలగువానిని గుఱించి యాతనిని చూచిన యప్పటివారందఱును వేనోళ్ళఁ బొగడియున్నారు.

చిత్తోడ్‌గడమును పూర్తిగ బాగుచేయించి దానికిఁ బూర్వవైభవమును మరల నొసఁగిన శ్రేయస్సీరాణాదియే యైయున్నది. ఈతఁడు 1654 లో మృతుడయ్యెను. అంత నీతని పెద్దకొమారుఁడగు రాజసింహుడు రాజయ్యెను.

రాజసింహుఁడు

(1654 – 1681).

ఈతఁడు సార్థకనామధేయుఁడు. ప్రతాపుని తరువాత మేవాడ్‌లో నుదయించిన ప్రచండభాస్కరుఁడు. శౌర్యమున నెన్నఁడు నితరులకు లొంగని తనవంశమువారు కాలవైపరీత్యముచే నొకరికి మాండలికులుగా నుండుట తటస్థించెఁ గదాయని మిక్కిలి చింతించి యీతఁడు నిజకులపరంపరాగతమైన క్షాత్రతేజమును గనఁబఱచి పోయిన రాజవుత్ర వైభవమును మరల సంపాదింప యత్నించెను.

రాజసింహునకును, ఔరంగజేబునకును వైరముపచ్చుటకు ముఖ్యకారణములు మూఁడు. అందు నౌరంగజేబు వివాహమాడఁ

దలఁచిన రూపనగరపు రాచకన్నియను రాజసింహుఁడు వివాహ మాడుట మొదటికారణము. ఈరాజకన్యపేరు విమలాదేవి. ఈమె తురుష్కుని వివాహమాడుటకు నిష్టములేక, రాజసింహుని ఖ్యాతి విన్నదియగుటచే నాతనియెడ బద్ధానురాగయై యుండెను. ఈమెను గొంపోవుటకు నౌరంగజేబు రెండువేల గుఱ్ఱపురౌతులను, దాసదాసీ జనములును రూపనగరమునకుఁ బంపెను. వారు వచ్చుచున్నారనిన వార్త విని యాకన్యక పూర్వపు రుక్మిణీచరిత్రమునుస్మరించి 'హంసిని కాకి వివాహమాడుట తగునా ? రాజపుత్రకుల ప్రసూతనైన నేను వీనికి భార్యనగుట న్యాయమా ?..... ఇట్లు నామీఁది సంకటమును నివారించి, నన్నుఁజేపట్టుని యెడల నేను ప్రాణములఁ ద్యజింతు' నని రాజసింహునకు లేఖనంపెను. ఈసమాచారములు దెలిసినతోడనే యాతఁడు రాజపుత్రుల స్వాతంత్ర్యమును స్త్రీల ప్రాతివ్రత్యమును గాపాడుటకు నౌరలోనుండి దూసినకత్తి జీవితాంతమువఱకును మరల నౌరలోఁ బెట్టినవాఁడు కాఁడు. తనసైన్యములతో రూపనగరమునకుఁ బోయి యౌరంగజేబుయొక్క సైనికుల వెడలఁగొట్టి యాకన్యను గొనివచ్చి వివాహమాడెను. ఈపని యాతఁడు చేసినతోడనే యాతని పారతంత్ర్యము, అనఁగా నాతఁడు డిల్లీశ్వరులకు నంకితుఁడయినమాట, పోయి యాతఁడు స్వతంత్రుఁడయ్యెను.

జోధ్‌పూర్ రాజధానిగాఁగల మార్‌వాడ్ దేశపురాజగు జస్‌వంత్‌సింగ్ డిల్లీశ్వరునకు నంకితుఁడుగా నుండెనని చదువరు లెఱింగియే యుందురు. ఈతఁడు దిల్లీశ్వరుపనిమీఁద సకుటుంబముగాఁ గాబూలునకు వెళ్ళినపుడు దుష్టుఁడగు ఔరంగజేబీతనికి విషము పెట్టించి చంపించెను; ఇతని భార్యను, అప్పుడే పుట్టిన శిశువును చెఱఁబెట్టి యత్నించెను. కాని యాశూరవనిత యామోగలు లతోఁ బోరాడుచుఁ దప్పించుకొని తనరాజ్యమునకు వచ్చిచేరెను. ఆమె కుమారునిఁ జంపి యారాజ్యమును స్వాధీనపఱచుకొనవలెనని యౌరంగజేబు ప్రయత్నింపఁగా నారాణి మేవాడ్‌వంశములోని కన్య యైనందున రాజసింహుడామె కుమారునిపక్షము నవలంబించెను. ఇట్లు మేవాడ్ మార్వాడ్‌రాణాలును, సైన్యములు కలిపి ఔరంగ

జేబుతోఁ బోరాడసాగిరి. ఔరంగజేబు రాజసింహునియెడఁ గోపము కలుగుటకు నిది రెండవకారణము.

ఔరంగజేబు హిందూమతముపై మిక్కిలి ద్వేషము కలవాఁడై హిందువుల యొద్దనుండి జుట్టుపన్ను వసూలు చేయఁదొడఁగెను. ఇందుకు రాజసింహుఁ డౌరంగజేబునకు మిక్కిలి హితబోధప్రదమగు నొక యుత్తరము వ్రాసెను. ఉత్తరములోనిభాష, యుక్తులు, ఉప లక్షణముల చేతను అన్యోక్తుల చేతను ఎత్తిపొడిచెడు కౌశలము, నిర్భయముగఁ బ్రబవహించు లేఖన పద్ధతి, కేవల లోకోపకారమునకే కనఁబఱచిన యుత్సుకత, అత్యంత వర్ణనీయములు. ఆయుత్తరమే దేశమునందును, ఏ కాలమునందును, ఎట్టివిద్వాంసుఁడు చదివినను దానినిశ్రేష్ఠతరమైన వాఙ్మయ (**Superior Literature**) మనిమెచ్చు కొనవలసియుండును. ఆయుత్తరములోని ముఖ్యాంశముల నిక్రిందఁ దెనుఁగున నిచ్చుచున్నాము.

"... ... నేను మీరాజ సభకు వచ్చుట మానివేసినను, రాజభక్తితో మీకు నెప్పుడును సహాయము చేయవలయుననియే యున్నది. కాని నేను మీకు నొనరించు సాయము, హిందూదేశము లోని యందరురాజులకును, సరదారులకును, సంస్థానికులకును, నవాబులకును ఉపయోగకారియై వారియూర్జితావస్థకుఁ, గారణము కావలయును. ఇంతియకాదు, నేను చేయు సాహాయ్యము ఈరాన్ (పర్షియా) తురాన్, రూమ్ (టర్కి ఇన్ యూరోప్), శామ్ (టర్కి ఇన్ ఏషియా) మొదలయిన జనులకును, జలస్థలమార్గముల ప్రవాసముచేయు బాటసారులకును ఉపయోగించి, వారందఱికినిభేద బుద్ధితో నావలని మేలు కలుగవలయునని నాయొక్క కోర్కె... మీ పూర్వజుడయిన మహమ్మద్ జలాలుద్దీను యొక్క కీర్తి డిండిమ మిదివఱకును లోకమునందంతటను ప్రతిధ్వను లీనుచున్నది. ఇందుకు గారణ మేమి ? ఆతఁడు సర్వజనులయెడ సమదృష్టియుంచి యేఁబది రెండుసంవత్సరములు రాజ్యముచేసి యక్షయ సుఖస్థానమునకు బోయెను. వీఁడు బ్రాహ్మణుఁడు, వీఁడు హిందువు, వీఁడు మహమ్మదీయుఁడు, వీఁడు జైనుఁడు, వీఁడు క్రైస్తవుఁడు అను భేదము

చేయక యన్ని మతముల వారికిని, అన్ని జాతుల వారికిని సౌఖ్యము కలుగునట్లు రాజ్యము జేసెను. ఆతనికిఁ బక్షపాతము లేనందుననే 'జగద్గురు' వను సార్థక నామము వచ్చెను. పక్షపాతరహిత ప్రవర్తనమును గుఱించిన పాఠమును సకలలోక మాతని యొద్దనుండి నేర్చుకొనఁదగు... ... ... ఇఁక మీ రాజ్యమును చూచినచో, మీ ప్రవర్తన వలన మీ ప్రజాజనులు, మీ స్నేహితులును మీకుఁ బ్రతికూలులై రి. ప్రతి మనుజునికి మీవలన నష్టముకలుగు చున్నది. ఎక్కడఁ చూచినను దోచుకొనుట, దాఁచుకొనుట కానవచ్చుచున్నది. మీ ప్రజలందఱును అణఁగఁ ద్రొక్కఁ బడుచున్నారు; మీ రాజ్యములోని ప్రతి ప్రాంతమును దారిద్ర్యమునందు మునిగియున్నది ! ... ... ఇఁకఁ బరాక్రమమన్ననో సున్న ! కలా కౌశలములను గుఱించియు వర్తకమును గుఱించియుఁ జెప్పవలసినదిలేదు. మీ రెవ్వరినిగుఱించిమిక్కిలి యభిమానముగా నుండెదరో యట్టి మహమ్మదీయులుకూడ సంతుష్టులయి యున్నట్లు గానరాదు. మీ రాజ్యమునం దెటు చూచినను హిందువుల రోషము, మహమ్మదీయుల యసంతోషము, వర్తకుల వినాశము, సరదారుల దారిద్ర్యము, సైన్యముల శౌర్యహీనత యివితప్ప మఱేమియుఁ గానరావు... మీ రాజ్యములోని హిందూప్రజలెవ్వరికిని సాయంకాలము భోజనము చేయునంత స్థిరతయు నుత్సాహంబును లేవు. రాజువలసఁ బ్రజలకుఁ గలుగు బాధలో నింతకంటె నెక్కుడు బాధ మఱియేది కలదు ? ఇట్టి ప్రజాపీడన కరమైన స్వైర వర్తనముచే మీ రాజ్యమును, సార్వభౌమపదవియు నెట్లునిలుచును? మీరు మీ దరిద్ర ప్రజలయొద్దనుండి బలవంతముగా ధనమును లాగుచున్నారు. అది మీ కనుకూలముగాఁ బరిణమించునా ? బీద బ్రాహ్మణులు, సన్యాసులు, బైరాగులు, మొదలయిన యసంసారికులగు జోగుల యొద్దనుండి పన్నుతీసికొని వారిని బాధపెట్టుచున్నాఁడని మీకీర్తి పూర్వ పశ్చిమ దిగ్మండల మంతయు వ్యాపించియున్నది. ఈ మాట నిజమే యైనయెడల , శౌర్య పరాక్రమౌదార్యములకు విఖ్యాతి చెందిన తైమూర్ లంగ్ వంశమున జన్మించిన మీరు వనవాసులును, ఉదాసీనులును, నిరుపద్రవులును దరిద్రులును అగు

జనులను దోచుకొనుట కంటె నధమ మైనదియు నీచమైనదియు నగు మఱియే వ్యక్తిగలదు?

'మీ రేగ్రంథమును ఈశ్వరదత్త ధర్మపుస్తకముగా నెంచెదరో యందుఁ జూచిన యెడల నీశ్వరుఁ డొకమహమ్మదీయుల దేవుఁడే కాక సమస్తమానవుల దేవుఁడని మీకుఁ దెలియఁ గలదు. ఈశ్వరునకు మహమ్మదీయులును తదితరులును సమానులు. మానవుల శరీర వర్ణములలోను, స్వరూపములలోను, భేదముండుట యీశ్వరునికి సృష్టినియమము. వాని సత్తామాత్రమునఁ నే మానవునికి అస్తిత్వము (ఉనికి) ప్రాప్తించును. మీ శూన్యమందిరములో (మసీదులలో) మీరు చేయు ప్రార్థన యాతఁడు వినును; విగ్రహములు కలగుండ్లలో గంటవాయించి చేయఁబడు పూజయు నాతఁడే గ్రహించును. ఇతరులధర్మమును గుఱించియు నాచార వ్యవహారములను గుఱించియు దురాగ్రహముఁ గల్పించుకొని వారిని బాధించుట యీశ్వరునకు నసమ్మతము. పటము వ్రాసిన చిత్రకారుని యెదుట నాపటమును ద్రొక్కించివేసిన యెడల నాతని కెట్లు కోపము వచ్చునో యట్లేయితరమతములను ద్వేషించుట, ఆ యీశ్వరక్షోభమునకు ఁగారణము. ఈశ్వరుఁడొక యద్వితీయుండును అప్రతిముఁడును అగు చిత్రలేఖకుఁడు. అతఁడీ విశ్వ మను విస్తీర్ణ పటము (బట్ట) మీఁద నానా మతాచారములు, వివిధ మనుష్య జాతులు, మొదలగు చిత్రములఁ జిత్రించినాఁడు. అందలి కొన్నిటి యెడ ద్వేషము పూనుట యాసృష్టికర్తను ద్వేషించి యాతని కోపమునకుఁ బాత్రులగుటయే. న్యాయదృష్టిచే విచారించిన యెడల మీరు హిందువులపై వేసిన పన్ను కేవల మన్యాయము. నిజమైన రాజ్య కర్తృత్వమును, నీతియు మీయందు లేనందుకు నిది నిదర్శనము.....'

రాజసింహుఁడు తనకిట్టి యుత్తరము వ్రాయుటయుఁ, దాను కోరిన స్త్రీని దీసికొనిపోయి వివాహ మాడుటయు, మార్వాడ్ బాలరాజునకు నాశ్రయ మిచ్చుటయుఁ జూచి ఔరంగజేబు మండిపడి యాతనితో యుద్ధము చేయుటకుఁ దనసైన్యములన్నిటిని సిద్ధ

పటిచెను. వేఱు వేఱు ప్రాంతములలో నున్న తన ముగ్గురు కుమారులను రావించెను.

ఇట్లు ఔరంగజేబు యుద్ధసన్నాహముఁ జేయుచున్నాఁడని తెలియఁగనే రాజసింహుఁడు సైన్యములఁ జేర్చుకొని పోరాటము ప్రారంభించెను. మోగలుల రాజ్యములోని మాల్‌పురాయను నగరమును దోఁచెను. అటుతరువాత జరిగిన యన్ని యుద్ధములలోను రాజసింహునకే జయము గలుగుచు వచ్చెను. ఆయుద్ధములో శిశోదియా వంశముయొక్క శౌర్యమును, శరణాగతరక్షణమను సద్గుణమును లోకమున కంతయు వెల్లడియై కాన్పించెను.

ఔరంగజేబు తన సైన్యములతోఁ గొంతవరకు వచ్చి తాను ఉదేసాగరము నొద్దనే విడిసియుండి తన సైన్యములును మూఁడు భాగములుగా విభజించి వారిని వేఱువేఱుమార్గముల శత్రువుల మీఁదికిఁ బంపెను. అందు నొకభాగమునకు నధిపతియైన యక్బరను రాజపుత్రుఁడు తన సైన్యములతో నుదయపురము మీఁదికిఁబోయెను. అచ్చట నాతనిని ఎవరును ఎదిరింపరైరి. నిరాటంకముగా గ్రామము ప్రవేశింపఁ గలిగినందుఁ కుదమకునాగ్రామము స్వాధీనపడినదని భ్రమపడి మోగలు లశ్రద్ధతోనుండిరి. 'వారు దోఁచుకొనవచ్చి నిదుర పోయిరి' అని యీ మోగలులను గుఱించి భట్రూజులు వ్రాసియున్నారు ! ఇటు రాజపుత్రుల యువరాజగు జయసింగు, మోగలులు ఉదేపురమునుండి వెలువడకుండఁ జుట్టునున్న మార్గముల నన్నిటిని నడ్డగించెను. అందుచే వారు బంధింపఁబడిరి. ఎటుపోవుటకును దోఁచక వారొకమార్గమునఁబడి బయలుదేరి యొకానొక పర్వతదరిలోఁ జిక్కిరి. రెండువైపుల రెండు కొండలు; నడుమ నున్న సందులో నీ మోగలులు! ఇంకేమి ? రాజపుత్రులకు సహాయులయిన భిల్లసైనికులు రెండుకొండలమీఁద నెక్కి మ్లేచ్ఛులపై శిలావర్షముఁ గురిపింప సాగిరి. ఇట్టు వేలకొలఁది మోగలసైనికులు చచ్చిరి. పారిపోయెదమనిన దరీద్వారమును రాజపుత్రులడ్డగించిరి. కావున నక్బరునకు శత్రువులకు - లొంగుట తప్ప వేరుమార్గము లేక, యాతఁడు

రాణాకు శరణు చొచ్చి యిక యుద్ధము చేయనని యొప్పుకొని యాసంకటములోనుండి రాణాకృపపలన దప్పించుకొనిపోయెను.

మోగలు సైన్యముల రెండవభాగము దిలేర్‌ఖానుఁ డనుశూర సరదారుని ఁూధిపత్యముక్రింద నుండెను. ఆతఁ డక్బరు దీనావస్థ విని యాతనికి సాయముచేయుటకై యొక కొండ ప్రోవఁబడి వెళ్ళు చుండెను. మేవాడ్ రాజు సాహయ్య కర్తలగు రూపనగరాధీశుఁడు విక్రమసోళంభీ యనువాఁడును గనోర్ సంస్థానాధీశుఁడు గోపీనాథ్ రాథోడ్ అనువాఁడు ఈదిలేర్‌ఖానుని ఎదిరించి యాతనిసైన్యమును రూపుమాపిరి. ఈతడవ మోగులులయొద్ది ధనమును అనేక వస్తువులను రాజపుత్రులకు దొరకెను.

పైని వర్ణింపఁబడిన రాజపుత్రవీరులు దిలేర్‌ఖానునితోఁబోరాడు నపుడు రాణాస్వయముగ ఔరంగజేబును, అతని కుమారుఁడయిన యజీమును ఎదిరించి వారిని పరాభవించెను. ఎటుచూచినను రాజపుత్రులఖడ్గమునకు నెదురులేదయ్యె. ఈయుద్ధములో మోగలుల వెఁటు ఫిరంగులను వానిని గాల్చి నేర్చిన పోర్చుగీజ్ వారును నుండిరి. కాని దుర్గాదాస్ అను రణశూరుండు వారిని లక్ష్యపెట్టక వారిపైఁబడి యాబుడతకీచులనంగరిని (Portuguese) నటికివేసెను. ఈతడవ రాజపుత్రులు మోగలుల సైన్యములోనుండి యసంఖ్య ధనమును యుద్ధోపకరణములును దోఁచుకొనిరి. ఇట్లు శత్రుసైన్యమును దోఁచుకొనిన శ్రేయస్సంతయు మోఖిమ్, సూక్తావత్ అను సరదారులది యని భట్రాజుల గీతములు చెప్పుచున్నవి.

ఈయుద్ధములలో నొకప్పుడౌరంగజేబు యొక్క భార్యయగు ఉదేపురి యనునామె రాజసింహుని చేతిలోఁ జిక్కెను. కాని సద్గుణసంపన్నుఁడగు నాక్షత్రియపుంగవుఁ డామెకు నెంతమాత్రమును అపాయముగాని యగౌరవముగాని చేయక తన సేవకుల వెంటనిచ్చి మర్యాదతో ఔరంగజేబు నొద్దకుఁ బంపెను !

మరియొకసారి ఔరంగజేబు తన పరిమిత సైన్యముతో నొక పర్వత దరిఁజొచ్చెను. రాజపుత్రసైనికులాగుహాముఖమును చెక్కి

తోను రాళ్ళతోను మూసివేసిరి. లోననున్న దిల్లీశ్వరున కెటుఁ బోవు టకును దారిలేదయ్యె. తినుట కన్నము లేదయ్యెను. ఇటు లాసార్వ భౌముఁడు రెండు దినముల వఱకును దనసేనతో నుపవాసము చేసెను. కాని ఈసమాచారము రాజసింహునకుఁ దెలిసి, యుద్ధముచేసి శత్రునిఁ జంపవలసినదే కాని యన్నము పెట్టక చంపుట క్షాత్రధర్మము కాదని యాదరీముఖమును దెగిపించెను! అంత నాతఁడు తన్ను విడి పించుటకు వచ్చిన తనసేనను గలిసికొనెను.

ఇట్లు పరాజయము చెందిన మోగల సైన్యము లన్నియు జితోడ్‌గడముక్రిందఁ జేరెను. వారికిఁదినుటకు నాహారపదార్థములు లేనందున వస్తుసామగ్రి పంపవలసినదిగా నౌరంగజేబు అజమీరు నకు వర్తమాన మంపెను. కాని యా సామగ్రిని త్రోవలోనే సావళ దాసుఁడను రాజపుత్రుఁడు కొల్ల గొట్టెను. అంతఁ బ్రాణములు విసివి యాయుద్ధమంతయుఁ గుమారులకు నప్పగించి యౌరంగజేబు అజ మీరుకు వెడలిపోయెను. అచ్చటికిఁ బోయిన తోడనే సైన్యముల నిమిత్తమై యెక్కు డు ధనబండారమును బంపుచు దాని సంరక్ష ణార్థమై ఖాన్ అను సరదారునకుఁ బండ్రెండు వేల సైన్యమిచ్చి పంపెను. కాని శూరవరుఁడగు సావళ దాసుఁడును మార్వాడ్ దేశపు రాథోడ్ రాజపుత్రులను ఈ తురుష్కులపైఁ బడి వారిని నోడించి యాసామగ్రియంతయు దీసికొని పోయిరి.

ఈ ప్రకారమెటు చూచినను రాజపుత్రులకే జయము కలు గుట వలన మోగలుల గౌరవము మిక్కిలి తగ్గెను. అందుచే నెటు లయిన సంధి చేయవలయునని నౌరంగజేబు తలఁచెను. సంధిని గుఱించి యుభయులకును రాయబారములు జరుగుచుండెను. ఇంతలోఁ జిన్ననాఁటి నుండియు నెడతెగకుండ యుద్ధములుచేసిన శ్రమవలన రాజసింహుఁడు క్రీ. శ. 1681 లోఁ గీర్తిశేషు డయ్యెను. అందుచే రాజపుత్రులు తమకు నష్టము లేనట్టి సంధి తురుష్కులతో వెంటనే చేసుకొనిరి.

ఇచ్చట మన మీవీరపురుషుని యోగ్యతను గుఱించి కొంచె మాలోచింప వలయును. ఈతనికి ఈతని ప్రతిస్పర్ధియగు ఔరంగ

జేబునకు గల గుణస్వభావ తారతమ్యములఁ గనుఁగొన వలయును. ఔరంగజేబు వంటి దుష్టుడునుఁ లోభియు, హింసకుఁడును, నిర్దయుఁడును, విచిత్రుఁడు నగురాజు మఱియొకఁడు లేఁడని చరిత్రకారులు వ్రాసియున్నారు. సర్వప్రాణులకును సాధారణమైన కృతజ్ఞతయను గుణము కూడ వానియందు లేదు! ఉపకారము చేసినవానికిఁ బ్రత్యుపకారము చేయుటయే యీతఁడు ధర్మమని తలఁచు చున్నట్లు గానవచ్చు చున్నది. ఇఁక రాజసింహుని వైపు చూతము. గంభీరమైన మనస్సు, ఉదారాంతఃకరణము, సదసద్వివేకాను వర్తనము, సత్యనిష్ట, అనునవి యఖిల రాజపుత్రుల సాధారణ ధర్మములు, అవి యినుమడిగా నీరాణాయందు నుండినవనుటకు సందేహములేదు. యుద్ధవిషయమునఁ దప్ప శత్రులయెడ నిర్మాత్సర్యము, సంకటముల జిక్కిన శత్రులయెడ ననుకంపయను నత్యున్నత నీతి తత్వము నీరాజు యొక్క చరిత్రలో విచ్చల విడిగఁ గానవచ్చుచున్నవి. అసామాన్య శౌర్య పరాక్రమముతో జంటగా నుండుటచే నీసద్గుణము లెక్కువగా ప్రకాశించు చుండెను. శత్రుస్వాధీనములోనున్న గుజరాత్ దేశమును తన కుమారుఁడు చెండాడు చున్నాఁడనియు నందువలన నచ్చటి ప్రజలకు మిక్కిలి బాధకలుగుచున్నదనియు వినినతోడనే యీ దయామయుఁడగు నరేశ్వరుడిఁక బరాక్రమము చాలించి యింటికి రమ్మని కుమారునకు వ్రాసెను. ఇట్టి భూతదయ మఱి యేరాజు నకు గలదు? రాజపుత్రస్త్రీల పాతివ్రత్యమును చెఱుపుటయే వ్రతము గాఁగల శత్రుని భార్య చేఁ జిక్కినపు డామెను మాతృభావముతోఁ జూచి గౌరవముఁతో బంపి వేసిన వానియొక్క దైవిక సుగుణ సంపదను వేయినోళ్ళఁ గొనియాడినను చాలునా? ఈతని శౌర్యపరాక్రమాదులకు నీతి నియమములే సాక్షి. ఈతని పాండిత్యమునకును, భాషా నైపుణ్యమునకును ఈతఁ డౌరంగజేబునకు వ్రాసిన యుత్తరమే సాక్షి. ఇట్లీతఁడు సకల సద్గుణ సంపన్నుఁడనుటకు సందేహము లేదు. కాని ఈతనియందు నొక దుర్గుణముండెను. ఔరంగజేబు యొక్క పొగరు పూర్తిగ నడఁచి రాజపుత్రస్థానమునకే కాక హిందూదేశమున కంతటికిని స్వాతంత్ర్య మొసఁగు యోగ్యత

యాతనికుండియు, నపరిమిత దయయను నొక దుర్గుణ మీతనియం దుండుటచే నీతని వలన నట్టిఘనకార్యము జరుగలేదు ! తన రాజ్య మును మాత్రము రక్షించు కొనఁగలిగెను. దుర్మార్గులును, నీతి బంధనలు, లేని వారును అగు శత్రువులు చేతఁజిక్కినపుడు వారినిఁ బూర్తిగ సంహరింపక, శరణనిన మాత్రమున విడిచిపెట్టుట మరల తనమీఁదికి యుద్ధమునకు రమ్మని వారినిబిలుచుటయే గదా? కృతోప కారమును స్మరించెడి సజ్జనుఁడు శత్రుఁడయినపుడు క్షమించినను క్షమింప వచ్చునుగాని దుర్మార్గుని వదలివేయుట రాజనీతిలో నొక గొప్ప పొరపాటుని యింగ్లీషు గ్రంథకారుఁడు టాడ్ వ్రాసి యున్నాఁడు. యిది యసత్యమని ఎవరు చెప్పఁగలరు?

మహారాష్ట్ర రాజ్య సంస్థాపకుఁడగు శివాజి యీరాజసిం హునితో సమకాలీనుఁడు. శివాజి 1680 లోను, ఈతఁడు 1681 లోను కీర్తిశేషులైరి. వీరిద్దరును నేకవంశజులు; హిందూమతమునం దభిమా నము కలవారు. ఇద్దఱికిని ఔరంగజేబు శత్రుఁడు. వీరిద్దఱును గలిసి ఔరంగజేబుతోఁ బోరాడియుండిరేని యాతనిమచ్చ పూర్తిగా మాసి యుండును. వారి కాలేకారణముచేతనో వేఱు వేఱుగనే ఔరంగ జేబుతోఁ బోరాడిరి.

ఈరాజసింహుఁడు తనప్రజలను బిడ్డలవలెఁ గాపాడుచుండెను. ఈతని రాజ్యకాలమున క్రీ. శ. 1661 లో గొప్పకఱవు తటస్థించెను. అప్పుడు బీదజనులను రక్షించుటకును, ముందట్టి కఱువులు రాకుండు టకును. అత్యంత విశాలమైనదియు, సుందరమైనదియు నగు నొక్క తటాకము త్రవ్వించి దానికి రాజసముద్రమని పేరుపెట్టెను. రాజ నగరమను నొక పట్టణమును కోటయుఁ గట్టించెను. ఈపనుల కన్ని టికిని తొంబదియాఱులక్షల రూపాయలు పట్టినవి. ఇంతచిన్న రాజ్య ముగల రాజసింహుఁడు కఱవుకాలములోఁ బ్రజలను బోషించుటకు రమారమి కోటిరూపాయలు వెచ్చించుటవలననే యాతని యద్వితీయ ప్రజావాత్సల్యము వెల్లడియగుచున్నది.

జయసింహుఁడు

(1681 - 1700)

ఇతఁడు రాజసింహుని రెండవకుమారుఁడు. ఈతనికంటెఁ గొన్నిగడియలు తొల్లఁ బుట్టినందున జ్యేష్ఠుఁడగు భీమసింహుఁ డొక డుండెను. తండ్రియాజ్ఞ ననుసరించి యీపిత్రాజ్ఞాపరిపాలన నిరతుఁడు శ్రీరామునివలెఁ దనకు రాజ్యముమీఁదఁగల హక్కంతయు వదలుకొని దేశాంతరగతుఁడయి తిరిగి వచ్చినవాఁడు కాఁడు. దిలేర్ ఖానుఁడను వానిద్వారా ఔరంగజేబునకునురాజపుత్రులకును సంధికలిగెను. అయినను రాణాయనేకపర్యాయములు మోగలులతోయుద్ధము చేయవలసినవాఁడాయెను. ఈరాజు జయసముద్ర మనుబ్రహ్మాండమయినతటాకముకట్టింగును. ఈతటాకముయొక్క వైశాల్యము పదునైదు చదరపుక్రోశములు. ఇదియెప్పుడునుజలమయమైయుండియారాజ్యములోని వ్యవసాయమునకు గొప్పయాధారమైయున్నది. ఈతని చరమావస్థయందు నీతఁడు స్త్రీలంపటుఁడగుట తటస్థించి గృహకలహములధికమయ్యెను.

అమరసింహుఁడు

(1700 - 1716).

ఈతఁడు రెండవ యమరసింహుఁడు. ఈతనికి సుమరావ్ సింగని నామాంతరము. ఈతని సమయమున జరిగిన ముఖ్యవిశేషము రాజపుత్రుల యైక్యము. జయపూర్, జోధ్‌పూర్, బుందీమొదలయిన వారందఱును ఉదేపురరాజులతో నేకీభవించి యీకముందు మహమ్మదీయులకుఁ బిల్లల నీయగూడదనియు, రాజపుత్రులందఱును నైక్యభావముతో నుండవలయు ననియు నేర్పాటు చేసికొనిరి. కాని కొన్ని దినములలోనే జోధపురరాజయిన యజితసింహుఁడు దిల్లీశ్వరుఁడగు ఫరుఖ్ సేయర్ అనువానికిఁ బిల్లనిచ్చినందున రాజపుత్రులలోఁ మరలఁ గలహములు ముదిరెను. అమరసింహుఁడు 1716 లో గతించెను. ఈతఁడు చాకచక్యముగలవాఁడు స్వకార్యదక్షుఁడు, ఉదారాంతఃకరణుఁడు

కరణము గలవాఁడు. తనరాజ్యములోని వ్యవసాయమును, కలాకౌశలములును, అభివృద్ధిచేయుటకై యీతఁడు మిక్కిలి శ్రద్ధవహించెను. మొత్తముమీఁద రాజ్యగౌరవముఁ జక్కఁగ రక్షించినవాఁడని కీర్తి వహించెను.

సంగ్రామ సింహుడు

(1716 - 1734)

ఈతడు శాంతి ప్రియుఁడు. అప్పుడు మోగలుల రాజ్యము యొక్క యవసాన కాల మయినందున నితరరాజపుత్ర రాజులు జాగ్రత పడి వీలయినపుడెల్ల మోగల రాజ్యములోని కొన్నిభాగములను స్వాధీన పఱుచుకొనుచుండిరి. కాని యీతఁడుమాత్ర మాజోలికిఁ బోక తన రాజ్యములోని ప్రజలకు హితప్రదములగు నేర్పాటులు చేయుచుండెను. న్యాయ విచారణ, పన్ను వసూలు, అను రాజ్యాంగములలోఁ దగిన సంస్కరణలు చేసి ప్రజలకు హిత మొనరించెను. ఈతని మంత్రిపేరు బిహారిదాస్ పంబోలి. ఈ యమాత్యాగ్రణి బుద్ధికుశలుఁడనియు, రాజకార్య విశారదుఁడనియు, స్వామి హితైక చిత్తుఁడనియు, సజ్జనుఁడనియు ఖ్యాతి వహించెను. సంగ్రామ సింహుఁడు 1734 లోఁ మృతుఁడయ్యెను. ఈతని తరువాత ఉదేపుర వైభవలక్ష్మి తగ్గిన దనవచ్చును.

జగత్ సింగ్

(1734 - 1752)

ఈతఁడు రెండవ జగత్ సింగ్, రెండవ యమరసింహుని కాలములో రాజపుత్రుల యైక్యమును గుఱించి జరిగిన నిబంధనలు నడుమ శిథిలములై యుండెను. కాని యీ రాణారాజ్యములో మరల రాజపుత్రు లొక్కటయిరి. ఈ సమయమునసే మరాటావారు రాజపుత్రస్థానముమీఁదికి దండెత్తి వచ్చిచౌథాయియను నాల్గవవంతు పన్ను వసూలు చేయదొడఁగిరి. రాజపుత్రులు హతవీరులయిరి; జగత్ సింగు విలాస మగ్నుఁడై 1752 లో మరణముఁ జెందెను.

ఈకాలమున మారాటావారు రాజపుత్రులతోఁ బోరాడుట చూడ మిక్కిలి యాశ్చర్యముగ నున్నది. రాజపుత్రులు హిందువులు; ఈదేశపు వారు; మిక్కిలి శూరులు; అప్పటి వఱకు మోగలులతోఁ బోరాడి పోరాడి యలసియుండిరి. అట్టి సమయమున మరాటూ వారు తమదేశ మత బంధువులకు సాయము చేసి, వారును దామును గలసి క్షీణించుచున్న డిల్లీ మోగలులవెంటఁ దగిలియుండిన యెడల నచిర కాలములోనే హిందూదేశ మంతటును హిందూ రాజ్యము, వ్యాపించి, దేశమునకు అప్పటికి నేడువందల యేండ్ల క్రిందఁ బోయిన స్వాతంత్ర్య మబ్బియుండును. వారు అట్లుచేయక తమ సోదరులయిన రాజపుత్రులను పీడించి, వారి బలమును తమ బలమును వ్యర్థపుచ్చుటయే మంచిదని తలచిరి!

ప్రతాపసింహుని మొదలు హమీరునివఱకు

(1752 - 1778)

ప్రతాపసింహుని కాలమున శిందే, హోళ్కర్, రఘునాథ్ రావ్ పేషవాయను మరాటా వీరులు రాజపుత్రస్థానమును దోఁచుకొనిరి. ఈతఁడు 1751 లోఁజచ్చెను. తరువాత నీతని కుమారుడు రెండవ రాజసింహుఁడు రాజయ్యెను. మరాటివారు మూఁడుసారులు రాజపుత్రస్థానము మీదికి దండెత్తిపోయి, యుద్ధవ్యయమంతయు నుదేపూరు బొక్కసములోనుండి తీసికొనిరి. అందుచే రాజు మిక్కిలి దరిద్రుఁడయ్యెను. తనవివాహమునకు మరాటూవారిని బతిమాలుకొని వారియొద్దనుండి యప్పుతీసికొన వలసినవాఁడాయెను! ఈతఁడ 1762 లో మృతుఁడైన తరువాత నీతని పినతండ్రి ఉర్సింహుఁ రాజ్యమునకు వచ్చెను. ఈతఁడు దుర్మార్గుఁడై తన సరదారుల మిక్కిలి బాధపెట్టెను. అందుచే నీతఁడు చంపఁబడియె. ఈ మూర్ఖతవలన మేవాడ్ రాజ్యమునకు ననేక కష్టములు సం

చెను. అమరసింహుడను మంత్రి పుంగవుని బుద్ధివిశేషము వలన గొంతపఱకు నీరాజ్యపు మర్యాద దక్కెను. ఉర్సింహుని తరువాత నాతని కుమారుడు హమీరుడు రాణాయయ్యెను. కాని 'రాణా' పదముయొక్క గౌరవము మలినమయ్యె. అంతర్ద్వేషములచే నెటు చూచినను రాజ్యమునకు శత్రువులే యుత్పన్న మైరి. ఈతడు చిన్నవాడగుటచేత నీతనితల్లి రాజ్యముఁ జూచుచుండెను. సజ్జనశ్రేష్ఠుడగు అమరచంద్రుడు మంత్రిగా నుండెను. కాని రాణి యాతని విషయమై వైషమ్యముకలదియై యాతనికి విషముపెట్టి చంపించెననియెదరు. ఈమంత్రిపుంగవుడు రాజభక్తుడనియు, స్వదేశ ప్రీతిగలవాడనియు, సత్యసంధుడనియు విఖ్యాతిఁజెందెను. నేఁటి వఱకును ఈతనినామమునకు రాజపుత్రస్థానములోని జనులు చేయి యెత్తి నమస్కారము చేసెదరు. హమీరుడు 1778 లోఁ బరలోక గతుడయ్యెను. ఈతని తమ్ముఁడగు భీమసింగు రాజ్యాధిపతియయ్యెను. అప్పుడాతఁ డెనిమిదేండ్లవాఁడు. కొంతకాలమువఱకు నీతనితల్లియే రాజ్యమును జూచుచుండెను. ఈపారతంత్ర్యమువలన నీతనియందు ననేకదుర్గుణము లంకురించెను. ఈతఁడేఁబది సంవత్సరములవఱకు రాజ్యముచేసెను. ఈతఁడు చూచినన్ని దైవదుర్విలాసములును, అనుభవించినన్ని సుఖదుఃఖములును మఱియొకరాజు పాలిటఁబడియుండవు. మరాటావా రీతనిరాజ్యమును ఎన్నియోసారులు దోచుకొని పాడు చేసిరి. ఈతనికి నతిరూపవతియగు కృష్ణాకుమారియను కూఁతురు కలదు. ఆమెనుగుఱించి రాజపుత్రులలో ననేక కలహములు పుట్టినందున, నిజరాజ్యగౌరవరక్షణార్థమై యామెకు విషమిచ్చి చంపవలసినవాఁడాయెను! ఈభీమసింహుఁడత్యంత దరిద్రుఁడయినందునఁ గొన్ని దినములవఱకుఁ గోటాసంస్థానాధీశ్వరునిఁ యొద్దనుండి ధనముఁ దీసికొని యుదరనిర్వాహము చేయవలసినవాఁడాయెను! 1817 లో నీతఁడింగ్లీషువారి సార్వభౌమత్వమును నొప్పుకొనెను. భీమసింహుడు 1829 లో మృతుఁడయ్యె. ఆతనికుమారుఁడు జవాన్‌సింహుఁడు

Prof. B. Rama Raju (Rtrd)
H No. 1-8 117/2, Chikkadpally,
HYDERABAD - 500 020.

1838 వఱకు రాజ్యము చేసెను. ఈతని పెద్దకుమారుఁడగు సరదార సింహుడు 1842 వఱకును, చిన్నకొమారుఁడు సురూపసింహుడు 1851 వఱకును, ప్రభుత్వముఁ జేసిరి. రూపసింహుఁని దత్తకుమారుఁడగు శంభుసింహుఁడు 1874 వఱకును రాణాపదవి ననుభవించెను. ఈతఁడు మిక్కిలి లోకప్రియుఁడయినందునఁ బ్రజ లీతనిమరణమునకు మిగులఁ జింతించిరి. ఈతని దత్తకుమారుఁడగు సజ్జనసింహరాణా పదిసంవత్సరములు రాజ్యముచేసి 1884 లో మృతుఁడయ్యెను. అప్పటినుండియు ఫత్తేసింహరాణాగారు రాజ్యము చేయుచున్నారు. మేవాడ్ రాజ్యము యొక్క ప్రస్తుతపు జనసంఖ్య పండ్రెండు లక్షలు. నలువదిలక్షల రూపాయలు దానియాదాయము.

